తెలుగు

కుమారభారతి

పదవ తరగతి

భారత సంవిధానము

పార్ట్ – IV A

ప్రాథమిక బాధ్యతలు

51 ఎ) ప్రాథమిక బాధ్యతలు

ప్రతి పౌరుడు ఈ క్రింది బాధ్యతలను మనసారా స్వీకరించి బాధ్యతాయుతంగా ప్రవర్తించవలెను.

ఎ) రాజ్యాంగ శాసనబద్ధుడై యుండుట. శాసనమందలి ఆశయములనూ, శాసనం స్థాపించే సంస్థలనూ, జాతీయ పతకాన్ని, జాతీయ గీతాన్ని అంకితభావంతో గౌరవించుట.

బి) స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో అన్ని రంగాలలో వ్యవహరించుట.

సి) దేశ సార్వభౌమత్వాన్ని, సమన్వయతనూ, సమగ్రతను రక్షించుట.

డి) దేశరక్షణలో అనుక్షణం సంసిద్ధుడై ఉండుట.

ఇ) ప్రజాజీవనంలో అన్యోన్యతనూ, భ్రాతృభావాన్ని పోషించుట, మత, భాష, ప్రాంతీయతత్త్వాలకు వర్గవైరుధ్యములకు అతీతముగా ఉండుట. స్త్రీలను అగౌరవపరచే ఆచారములను విడనాడుట.

ఎఫ్) అమూల్యమైన భారతీయ చారిత్రక సంపదనూ, సుసంపన్న సంస్కృతినీ పరిరక్షించుట.

జి) పర్యావరణాన్ని అడవులను, కొలనులనూ, నదులనూ రక్షించుట, అభివృద్ధి పరచుట, మృగరక్షణ జలజంతు జీవరాసులపై కరుణార్ద్రత.

హెచ్) శాస్త్రీయ మరియు మానవతా దృక్పథాలను అలవరచుకొనుట, జిజ్ఞాసను పెంపొందించు కొనుట, సంస్కరణ తత్వమును పెంపొందించుట.

ఐ) హింసను విడనాడుట, ప్రజల ఆస్తుల విధ్వంసం చర్యలను నిరోధించుట.

జె) వ్యక్తిత్వ శక్తి సామర్థ్యాల ఔన్నత్యాన్ని పెంపొందించుకొనుట ద్వారా మరియూ సమిష్టి కృషి ద్వారా అన్ని రంగాలలో గణనీయమైన స్థాయిని చేరుటకొరకు, శిఖరాగ్ర సాధనకొరకు నిరంతరం కృషి సల్పుట.

కె) రక్షకులు లేదా సంరక్షకులుగా ఉన్నవారందరూ ఆరు నుంచి 14 సంవత్సరముల లోపల పసివారికి విద్యాభ్యాసము చేయు అవకాశమును కల్పించవలెను.

ప్రభుత్వ తీర్మానం క్రమ సంఖ్య : అభ్యాస్-2116/(ప్ర.క్ర.43/16) ఎస్‌డి-4 తేదీ 25.4.2016 ప్రకారం స్థాపించబడిన సమన్వయ సమితి యొక్క తేదీ 29.12.2017 రోజు సమావేశంలో ఈ పాఠ్య పుస్తకమును 2018-19 విద్యాసంవత్సరం నుంచి నిర్దేశించుటకుగాను అనుమతి ఇవ్వబడినది.

తెలుగు

కుమారభారతి

పదవ తరగతి

మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు
పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె-411 004.

GCZA69

మీ స్మార్ట్‌ఫోన్‌తో DIKSHA App నుపయోగించి పాఠ్యపుస్తకం మొదటి పుటలోని QR CODE ను స్కాన్ చేసిన డిజిటల్ పాఠ్యపుస్తకం మరియు ప్రతి పాఠంలోని QR CODE ను స్కాన్ చేసిన ఆ పాఠానికి సంబంధించిన అధ్యయన-అధ్యాపనలకు ఉపయుక్తమగు దృశ్య-శ్రవణ సాహిత్యం లభిస్తుంది.

First Edition : 2018 / ప్రథమ ప్రచురణ : 2018
Reprint : 2022 / పునర్ముద్రణ : 2022

© మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె-411004

ఈ పుస్తకమునకు సంబంధించిన సర్వహక్కులు మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థవి. మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్య ప్రణాళిక పరిశోధన సంస్థ సంచాలకుల లిఖితపూర్వక అనుమతి లేనిదే ఈ పుస్తకమునందలి ఏభాగమును ఉటంకించుటగాని లేదా పునర్ముద్రించుటగాని చేయరాదు.

Telugu Langauge Committee
Smt. B. Sarada, Chair Person
Smt. T. Sushela, Member
Smt. M. Vidya Benerji, Member
Smt. K. Anuradha, Memebr
Sri B. Vijaybhaskar Reddy, Memebr
Dr. Smt. Thulasi Bharat Bhushan, Member-Secretary

తెలుగు భాషా సమితి
శ్రీమతి భమిడిపాటి శారద, అధ్యక్షులు
శ్రీమతి టి. సుశీల, సభ్యులు
శ్రీమతి ఎమ్. విద్యా బెనర్జీ, సభ్యులు
శ్రీమతి కె. అనురాధ, సభ్యులు
శ్రీ భూమనపల్లి విజయభాస్కర్‌రెడ్డి, సభ్యులు
డా॥ శ్రీమతి తులసీ భారత్ భూషణ్, సభ్య-కార్యదర్శి

Co-ordination
Dr. Smt. Thulasi Bharat Bhushan
Special Officer, Telugu

ప్రధాన సమన్వయకులు
డా॥ శ్రీమతి తులసీ భారత్ భూషణ్
విశేషాధికారిణి, తెలుగు
మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి
మరియు పాఠ్యప్రణాళిక
పరిశోధన సంస్థ, పుణె

Telugu Langauge Panel
Smt. V. Rajeshwari
Sri K. Y. Kondanna
Smt. A. S. Yadav
Smt. Laxmi Prasad Chalasani
Sri Rajkumar Mutyalvar
Sri Mallesham Krishnahari Bethi

తెలుగు భాషా అధ్యయన మండలి
శ్రీమతి వి. రాజేశ్వరి
శ్రీ కె. వై. కొండన్న
శ్రీమతి ఎ. ఎస్. యాదవ్
శ్రీమతి లక్ష్మీ ప్రసాద్ చలసాని
శ్రీ రాజ్‌కుమార్ ముత్యాల్‌వార్
శ్రీ మల్లేశం కృష్ణహరి బేతి

Cover:
Smt. Dhanashri Mokashi
Sri Ganduri Srinivas

ముఖచిత్రం:
శ్రీమతి ధనశ్రీ మొకాశి
శ్రీ గండూరి శ్రీనివాస్

Publisher
Sri Vivek Uttam Gosavi
Controller

ప్రకాశకులు
శ్రీ వివేక్ ఉత్తం గోసావి
నియంత్రకులు
మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి
మరియు పాఠ్యప్రణాళిక
పరిశోధన సంస్థ, ప్రభాదేవి,
ముంబయి-25.

Typesetting
M/s.Vijay Art Printers,
Pune

అక్షరకూర్పు
మె. విజయ్ ఆర్ట్ ప్రింటర్స్,
పుణె

Production
Sri Sachchidanand Aphale
Chief Production Officer
Sri Rajendra Chindarkar
Production Officer
Sri Rajendra Pandloskar
Asst. Production Officer

నిర్మితి
శ్రీ సచ్చిదానంద అఫ్లే
ముఖ్య నిర్మితి అధికారి
శ్రీ రాజేంద్ర చిందర్కర్
నిర్మితి అధికారి
శ్రీ రాజేంద్ర పాండ్లోస్కర్
సహాయ నిర్మితి అధికారి

Paper: 70 GSM Creamwove
కాగితము :
Print Order No :
ముద్రణాదేశము :
Printer:
ముద్రణ :

భారత సంవిధానము

ప్రస్తావన

భారతదేశ ప్రజలమగు మేము, భారతదేశమును **సార్వభౌమ్య**
సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణరాజ్యముగ
నెలకొల్పుటకు మరియు అందరి పౌరులెల్లరకు
సామాజిక, ఆర్థిక, రాజకీయ **న్యాయమును**,
భావము, భావప్రకటన, విశ్వాసము,
ధర్మము, ఆరాధన -- వీటి **స్వాతంత్ర్యమును**,
అంతస్తులోను, అవకాశములోను **సమానత్వమును**
చేకూర్చుటకు; మరియు వారందరిలో
వ్యక్తి గౌరవమును, జాత్యైక్యతను,
అఖండతను తప్పక ఒనగూర్చు **సౌభ్రాత్రమును**,
పెంపొందించుటకు; సత్యనిష్ఠా పూర్వకముగ తీర్మానించుకొని,
ఈ 1949వ సంవత్సరము నవంబరు ఇరువది యారవ
దినమున **మా సంవిధాన సభయందు ఇందుమూలముగ,**
ఈ సంవిధానమును అంగీకరించి, అధిశాసనము చేసి
మాకు మేము ఇచ్చుకొన్నవారమైతిమి.

జాతీయ గీతము

జనగణమన – అధినాయక జయ హే
భారత – భాగ్యవిధాతా
పంజాబ, సింధు, గుజరాత, మరాఠా,
ద్రావిడ, ఉత్కల, బంగ,
వింధ్య, హిమాచల, యమునా, గంగా,
ఉచ్ఛల జలధితరంగ,
తవ శుభ నామే జాగే, తవ శుభ ఆశిస మాగే,
గాహే తవ జయగాథా,
జనగణ మంగలదాయక జయ హే,
భారత – భాగ్యవిధాతా
జయ హే, జయ హే, జయ హే,
జయ జయ జయ, జయ హే

ప్రతిజ్ఞ

భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరు నా సహోదరులు.

నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం. దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషిచేస్తాను.

నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్ని గౌరవిస్తాను. ప్రతివారితోను మర్యాదగా నడుచుకొంటాను.

నా దేశంపట్ల, నా ప్రజలపట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

ప్రస్తావన

ప్రియమైన విద్యార్థి మిత్రులారా!

మిమ్ములందరిని పదవతరగతిలోకి ఆహ్వానిస్తున్నాను. అలాగే ఈ పదవ తరగతి ''కుమార భారతి'' అనే నేస్తం, వివిధ శైలుల వర్ణచిత్రాలు మరియు ఛాయాచిత్రాలతో ఆకర్షణీయమైన హంగులు సంతరించుకొని మీకు హృదయ పూర్వకంగా స్వాగతం పలుకుచున్నది.

ఈ పాఠ్యపుస్తక నేస్తాన్ని మీ కందించుచున్నందులకు మిక్కిలి ఆనందించుచున్నాను.

విని-చూసినదానికన్నా మనమే స్వయంగా చేసినది మనస్సులో స్థిరంగా నిలుస్తుంది. అందుకే ఈ పుస్తకంలో కృత్యాలు ఇవ్వబడినవి. అధ్యయన విషయంలో ఉపాధ్యాయులే కాక పెద్దల సహాయం కూడా తీసుకోండి. ఈ పుస్తకంలోని గద్య, పద్య, ఉపవాచకములు, వాటికి సంబంధించిన అభ్యాసాలు, కృత్యాలు, పఠనము, అదనపు సమాచారం చాలా వరకు మీరు స్వయంగా ఆలోచించి ఉత్సాహంతో అభ్యసించుటకు వీలుగా ఉన్నాయి. వాటన్నింటిని బాగుగా అభ్యసించిన యెడల మీరు చక్కని భాషాజ్ఞానాన్ని పొందుతారు.

భాషాకౌశల్యాలను చక్కగా నేర్చుకొని ప్రతిభావంతంగా ఉపయోగించుటకు తోడ్పాటుగా లేఖన, మౌఖిక భాషా కౌశల్యాలు పొందుపరచబడ్డాయి. అంతేగాక ప్రస్తుతకాలానికి ఆవశ్యకమైన సమాచార ప్రసార సాంకేతిక పరిజ్ఞానం మీలో పెంపొందించేలా కూడా చేయబడింది.

అవగాహన, ఆలోచన, పరిశోధనాద్వారా జ్ఞానసముపార్జన, ఆ జ్ఞానాన్ని విశ్లేషించుట, అన్వయించుట మీరు నేర్చుకోవాలి. అంతేగాక నియతవిద్యకు ఆవల గ్రంథాలయం, అంతర్జాలం, ప్రసారమాధ్యమాల ద్వారా సముచితజ్ఞానాన్ని సంప్రదింపు (రిఫరెన్స్) సాహిత్యంగా ఉపయోగించుకొనే రిఫరెన్స్ స్కిల్స్ మీలో పెంపొందించే ప్రయత్నం చేయబడింది. పాఠశాల విద్య జీవితాంతము ఉపయోగపడుటకు ప్రాధాన్యత ఇవ్వబడింది. 'నేర్చుకోవడం ఎలా?' అనేది నేర్పే సాధనం ఈ పుస్తకం.

దీనిని ఆనందంగా అభ్యసించండి. ఈ పుస్తకాన్ని గురించిన మీ భావనలు, అభిప్రాయాలను మాకు తప్పక తెలియజేయండి. మీ అందరికీ శుభాభినందనలు.

(డా. సునిల్ మగర్)
సంచాలకులు
మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్య పుస్తక నిర్మితి మరియు
పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె-411004.

పుణె
తేది : జనవరి 01, 2018.
భారతీయ సౌరమాన తేది : 11 పుష్యం 1939.

10వ తరగతి - తెలుగు (ప్రథమభాష) - భాషాధ్యయన సామర్థ్యాలు

1. శ్రవణం

- సంభాషణలు ప్రసంగాలు, ఉపన్యాసాలు, వక్తృత్వాలు, ముఖాముఖీ, చర్చలు, పాఠశాలలోని ప్రకటనలు మొదలగునవి అవగాహనలతో విని ప్రతిస్పందిస్తారు.
- ప్రసార మాధ్యమాలలోని అంశాలపై తార్కికంగా ప్రతిస్పందిస్తారు.
- పాఠ్య, పాఠ్యేతర గద్యము, పద్యము, ద్విపద, జానపద సాహిత్యం మొదలగు ప్రక్రియలను విని వానిలోని పాత్రల మనోభావాలను గ్రహించి తారతమ్యాలు గుర్తిస్తారు.
- స్థానిక ప్రదర్శనలు, కళారూపాలను, చూసి, విని అర్థం చేసుకుంటారు.
- తమకు కావలసిన సమాచారాన్ని, 'అంతర్జాలం'లో అన్వేషించి విని అధ్యయనానికి ఉపయోగించుకుంటారు.
- E-learning ద్వారా విని నేర్చుకున్న సమాచారాన్ని వినియోగించుకుంటారు.

2. భాషణం/సంభాషణం

- పద్యాలు, గేయాలు భావాను గుణంగా పాడతారు.
- నాటకాలను పాత్రో చితంగా నాటకీ కరణ చేస్తారు.
- పాఠ్య, పాఠ్యేతర అంశాలను చదివి వారి భావాలను సొంతమాటల్లో అభివ్యక్తీకరిస్తారు.
- వార్తలు, సందేశాలు, సూచనలు మొదలగు వానిలోని ముఖ్యాంశాలను స్పష్టంగా చెప్తారు.
- చర్చలు, సంవాదాలలో పాల్గొంటారు. ఇచ్చిన అంశంపై అప్పటికప్పుడు ఆసక్తితో ఉపన్యసిస్తారు.
- వివిధ రంగాలకు చెందిన వ్యక్తులతో ముఖాముఖి సంభాషించి విషయసేకరణ చేస్తారు.
- విహారయాత్ర, మాతలదినోత్సవం (మదర్స్‌డే) మొదలగు వాటిని చర్చించి ఎలా నిర్వహించాలో ప్రణాళిక ఏర్పాటుచేస్తారు. చర్చలలో పాల్గొంటారు.
- తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సహాధ్యాయులు మొదలగువారిని అడిగి తెలియని అంశాలను తెలుసుకుంటారు.
- ఉపన్యాసం, వక్తృత్వపోటీలలో సమర్థవంతంగా ఉపన్యసిస్తారు.
- దిన పత్రికలు చదివి ఏరోజు సమాచారం ఆరోజు విద్యార్థులకు తెలియజేస్తారు.

3. పఠనం

- వివిధ సాహిత్య ప్రక్రియలను అవగాహనతో చదువుతారు.
- వివిధ అంశాలకు చెందిన నియత/అనియత లేఖలను చదివి అర్థం చేసుకుంటారు.
- స్థానిక వార్తలతో పాటు ప్రాచుర్యం పొందిన సంఘటనలకు చెందిన వార్తలను అవగాహనతో చదువుతారు.
- విహారయాత్రా స్థలాలలో, పరిసరాలలోని బోర్డులపై గల వివరాలను అర్థవంతంగా, అవగాహనతో చదువుతారు.
- వివిధ నివేదికలను చదివి అర్థం చేసుకుంటారు.
- వివిధ పత్రికలను చదివి అందలి కథలు అర్థం చేసుకుంటారు.
- బాల సాహిత్యాన్ని ప్రకాశపఠనం చేస్తారు. పఠనపోటీలలో పాల్గొంటారు.
- వివిధ సామెతలను, జాతీయాలను చదివి అర్థం చేసుకుంటారు.
- ఇచ్చిన ప్రశ్నలకు సమాధానం తెలిసికొనుటకు మౌనపఠనం చేస్తారు.
- వివిధ వ్యాసాలను చదివి అందలి విషయాన్ని గ్రహిస్తారు.
- 'అంతర్జాలం'లో వికీపీడియా మొ॥ విషయాల గురించి చదివి ఆ పరిజ్ఞానాన్ని అవసరమైన చోట్ల ఉపయోగిస్తారు.
- వ్యావహారికభాషకు వ్రాసే భాషకు ఉన్న తేడాను గ్రహించగలుగుతారు. వివిధ మాండలికాలు తెలుసుకుంటారు.
- పాఠ్య, పాఠ్యేతర అదనపు సాహిత్యాన్ని చదివి వాటి ద్వారా నైతిక, సాంఘిక విలువలు, జీవన కౌశల్యాలను గ్రహిస్తారు.
- పరిచిత, అపరిచిత గద్య పరిచ్ఛేదాలను చదివి అర్థం చేసుకుంటారు.

4. లేఖనం

- వివిధ ప్రసార మాధ్యమాలలోని కార్యక్రమాలపై అభిప్రాయాలను సొంతమాటల్లో లిఖిత రూపంలో వ్యక్త పరుస్తారు.
- అతిథుల ప్రసంగాలు, కార్యక్రమాలు వింటూ, ముఖ్యాంశాలను నోటుపుస్తకంలో నమోదు చేసుకుంటారు.
- దిన పత్రికల్లోని ముఖ్యమైన వార్తలు, దినవిశేషాలు మొదలగువానిని పాఠశాలలోని సూచనాఫలకంపై రాస్తారు.
- పరిచిత, అపరిచిత గద్య పరిచ్ఛేదాలపై అడిగిన ప్రశ్నలకు జవాబులను కనుగొని సొంతంగా రాస్తారు.
- అపరిచిత పరిచ్ఛేదంపై ప్రశ్నలను తయారు చేస్తారు.
- ఉపవాచక పరిచ్ఛేదాలపై అడిగిన ప్రశ్నలకు సొంత వాక్యాలలో సమాధానం రాస్తారు.
- తార్కికంగా ఆలోచించి అడిగిన ప్రశ్నలకు స్వయంగా స్పందిస్తారు.
- అంశ విభజన, ప్రారంభం-ముగింపులు దృష్టిలో పెట్టుకొని, అలంకారాలు, జాతీయాలు మొదలగు వాటిని ఉపయోగిస్తూ తగిన విధంగా వ్యాసరచన చేస్తారు.
- అధికార, అనధికార లేఖలను క్రమపద్ధతిలో రాస్తారు.
- వివిధ పరిచ్ఛేదాలను చదివి మూడవ వంతుకు సంక్షిప్తీకరణ చేసి రాస్తారు.
- అంశాల ఆధారంగా కథలు రాస్తారు.
- సామెతలను, జాతీయాలను వివరిస్తూ రాస్తారు. సందర్భాను సారంగా వ్యాసాలలో ఉపయోగిస్తారు.
- పవర్‌పాయింట్ గురించి తెలుసుకొని ఉపయోగిస్తారు.
- వివిధరకాల తెలుగు ఫాంట్లను, టైపింగ్ విధానాన్ని తెలుసుకుంటారు, E-mail రాస్తారు.

5. భాషావగాహన

- **తొమ్మిదవ తరగతి వ్యాకరణం పునర్విమర్శ.**
- స్వీయ అధ్యయనం ద్వారా సందర్భాన్ని బట్టి నిఘంటువులను చూచి పదాల అర్థాన్ని గ్రహిస్తారు.
- చదువుతున్న, చదివిన అంశాల్లోని జాతీయాలను, సామెతలను గుర్తించి అవగాహనతో నిత్యవ్యవహారంలో తిరిగి సందర్భోచితంగా ప్రయోగిస్తారు.
- వివిధ భాషాక్రీడల ద్వారా పదజాలాన్ని పెంపొందించుకుంటారు.
- సంధి, సమాసపదాల్ని గుర్తించి సందర్భోచితంగా ప్రయోగిస్తారు. అకార, ఇకార, ఉకార సంధులను గుర్తిస్తారు. ద్వంద్వ, ద్విగు,

తత్పురుష, కర్మధారయ సమాసాలను గుర్తిస్తారు. శబ్దాలంకారాలను గుర్తించి వాక్యరచనలో ప్రయోగిస్తారు. ఉత్పలమాల, చంపకమాల, మత్తేభము, శార్దూల పద్యలక్షణాలను తెలుసుకొని గణవిభజన చేస్తారు. అర్థాలంకారంలోని అర్థాంతరన్యాస, అతిశయోక్తి, స్వభావోక్తి గుర్తిస్తారు.

6. అధ్యయన నైపుణ్యాలు

- విభిన్న సాహితీ ప్రక్రియలను చదివి రసాస్వాదన చేస్తారు.
- భిన్నత్వంలో ఏకత్వం ప్రతిబింబించే విధంగా విభిన్న సంస్కృతుల కార్యక్రమాల్లో పాల్గొని వాటిని అర్థం చేసుకొని ప్రశంసిస్తారు.
- తనకు లభించిన ప్రామాణిక అంశాలను వికీపీడియా, బ్లాగులకు సమర్పిస్తారు.
- దివ్యాంగులు, వృద్ధులు, ప్రాణుల యెడ సమానుభూతిని గలిగి తగిన సహాయ సహకారాలు అందిస్తారు.
- చదివిన, విన్న తమకు తెలిసిన అంశాలను వర్ణిస్తారు.
- వివిధ ప్రకటనలు, ఆహ్వాన పత్రికలు, శుభాకాంక్షలు తెలిపే పత్రికలు సొంతంగా రాస్తారు.
- మిత్రులకు లేఖలు, నియత లేఖలు, అనియతలేఖలు వివిధ సందర్భాలకు సంబంధించిన దరఖాస్తులు రాస్తారు.
- చిన్న చిన్న సంభాషణలు, కథలు, గేయాలు రాస్తారు.
- అంతర్జాలాన్ని తగిన విధంగా ఉపయోగించు కుంటారు. తమ దగ్గరనున్న ప్రామాణికమైన అంశాలను బ్లాగులకు అందిస్తారు.
- వివిధ ఆకృతులు, అల్లిక (వెబ్)లలోని అంశాల ఆధారంగా నివేదిక రాస్తారు.
- తగిన జాతీయాలనుపయోగించి అలంకారికంగా కథలు, వ్యాసాలు రాస్తారు.
- సామెతలను వివరణాత్మకంగా వివరిస్తారు.
- ఇచ్చిన పరిచ్ఛేదాన్ని మూడోవంతుకు సంక్షిప్తీకరిస్తారు.
- చర్చలలో పాల్గొంటారు.
- ఇచ్చిన విషయానికి అనుగుణంగా సమర్థవంతంగా ఉపన్యసిస్తారు.
- పద్య, గద్యాలను, ప్రాచీన, ఆధునిక సాహిత్యాన్ని చదివి రసాస్వాదన చేస్తారు. కావ్యసౌందర్యాన్ని గుర్తిస్తారు. వాటిలోని భావాన్ని వివరిస్తూ సందేశాన్ని అందిస్తారు. పరిసరాలలోను, విహార యాత్రా స్థలాలలో ఉన్న బోర్డులపైఉన్న వివరాలను అర్థవంతంగా, అవగాహనతో చదువుతారు.
- వివిధ నివేదికలను చదివి అర్థం చేసుకుంటారు.
- విజువల్ ప్రెజెంటేషన్ గురించి తెలుసుకొని ఉపయోగిస్తారు.
- వివిధరకాల తెలుగు ఫాంట్లను, టైపింగ్ విధానాన్ని తెలుసుకుంటారు.

ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు...

1. ఈ పాఠ్యపుస్తకం జ్ఞాననిర్మితి సిద్ధాంతాన్ని అనుసరించి కృత్య ప్రధానంగా రూపొందించబడినది. కనుక విద్యార్థులే స్వయంగా కృత్యాలు చేస్తూ భాషాధ్యయనం చేసే విధంగా అధ్యాపనం నిర్వహించాలి. విని నేర్చుకోవడం చూసి నేర్చుకోవడం-చేసి-నేర్చుకోవడం ఉత్తరోత్తర ప్రభావంతాలు.
2. పాఠ్యాంశాలతో అనుసంధానం కలిగిన అంశాలను చర్చించి, తెలుసుకొని ఆ పిదప పాఠంలోకి ప్రవేశించుట ద్వారా విద్యార్థులు ఇనుమడించిన ఉత్సాహంతో, ఉత్కంఠతో పాఠాన్ని నేర్చుకోవడం జరుగుతుంది. అందుకుగాను నేపథ్యాలు ఇవ్వబడ్డాయి.
3. కొత్త, పాత మేలు కలయికగా కూర్చబడిన పాఠ్యాంశాలను ప్రాచీన-ప్రస్తుత పరిచయ విషయాలతో అనుసంధానం చేస్తూ, ఇతర విషయాలతో సహ సంబంధాన్ని కూరుస్తూ బోధించినచో పాఠశాల విద్య విద్యార్థులకు మనస్సులో హత్తుకుంటుంది. నిజజీవితంలోనేకాక జీవితాంతం ఉపయోగపడుతుంది.
4. ఈ తరగతికి కేటాయించిన భాషాధ్యయన సామర్థ్యాలను సాధించుటకు అలాగే విద్యార్థులకు గరపవలసిన నైతిక, మానసీయ విలువలు, జీవన కౌశల్యాలు, శాస్త్రీయ దృక్పథం మొదలగు వాటినన్నింటిని సందర్భానుసారంగా, పాఠ్యాంశాల ఆధారంగా నేర్పుటకు తగిన బోధనా వ్యూహాలను ఎంపిక చేసుకోవాలి. ప్రతి విద్యార్థి అధ్యయన, అధ్యాపన ప్రక్రియలో భాగస్వాములయ్యేలా శ్రద్ధ వహించాలి.
5. జ్ఞాపకశక్తిని పరీక్షించుటకు గాక అవగాహన, ఆలోచన, పరిశోధన, అనువర్తన (అప్లికేషన్), విశ్లేషణలకు ప్రాధాన్యతనివ్వాలనునది మీకు తెలిసిన విషయమే. అంతేగాక గ్రంథాలయం, అంతర్జాలం, ప్రసార మాధ్యమాలను జ్ఞానార్జనకు ఉపయోగించుకొనే రెఫరెన్స్ స్కిల్స్, 'మౌఖిక, లేఖన కౌశల్యాలు పెంపొందించుట మిక్కిలి ఆవశ్యకము.
6. విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెంపొందించే రీతిలో స్వీయాభిప్రాయాలను, సృజనాత్మకతలను ప్రకటించే అవకాశం కల్పించాలి. వారి భావనలను కించపరచడం, ఖండించడం ఎట్టి పరిస్థితులలో చేయరాదు.
7. 'భాష-గమ్మత్తు', 'భాష-సౌందర్యం' మొదలగునవి పరీక్షించుటకు కాదు. కేవలం పఠనాసక్తిని పెంపొందించుటకు, భాషామాధుర్యాన్ని ఆస్వాదించుటకు మాత్రమే ఉద్దేశింపబడినవి. అటులనే 'అనువదిద్దాం - ఆనందిద్దాం' కూడ.
8. విద్యార్థులలో సంఘీభావం పెంపొందించుట ఆవశ్యకము. అందుకు 'జట్టుపని' ఎంతయో సహాయపడును. కావున 'జట్టుపని'ని ప్రోత్సహించండి.

లేఖన కౌశల్యములు పుస్తకము చివర వివరముగా ఇవ్వబడినవి. విద్యార్థులు వాటిని అవగాహన చేసికొని, పుస్తకములోని కృత్యములు సాధించుటకు అవసరమైన మార్గదర్శకమును చేయవలెను.

విషయసూచిక

క్రమ సంఖ్య	పాఠం/గేయం	కవి/రచయిత	పుట సంఖ్య
	పద్య భాగం		
*1	భారత జనని	శ్రీ గురజాడ రాఘవశర్మ	01
*2	పరివర్తన	శ్రీ గండూరి లక్ష్మీనారాయణ	05
3	ఆతిథ్యము	అల్లసాని పెద్దన	12
*4	నా తెలుగు	శ్రీ చల్లారాధాకృష్ణ శర్మ	19
5	భగీరథ ప్రయత్నం	గోనబుద్ధారెడ్డి	23
6	రాయబారం	తిక్కన	31
*7	ప్రపంచపదులు	డా॥ సి. నారాయణ రెడ్డి	38
8	కృషీవలుడు	దువ్వూరి రామిరెడ్డి	44
	గద్య భాగం		
1	కీర్తిచక్ర - జగదీష్ చంద్	డా॥ వెన్నా వల్లభరావు	49
2	కలలు కను	డా॥ ఎ.పి.జె. అబ్దుల్‌కలాం	57
	కళా ప్రశంస (పఠనం)		63
3	తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టినట్లు	శ్రీమతి పద్మాపార్థసారథి	64
	కారుణ్యం (ఉపవాచకం)	శ్రీమతి డా॥ మాలతీ చందూర్	69
*4	అద్భుతాలు చేయాలంటే...	డా॥ బి.వి. పట్టాభిరామ్	74
5	కసురుకాయలు	శ్రీ బెలగాం భీమేశ్వరరావు	80
	తల్లికడుపు చల్లగా.... (ఉపవాచకం)	శ్రీ శంకరమంచి సత్యం	87
6	మిత్రలాభము	పరవస్తు చిన్నయసూరి	90
*7	చతురోక్తులు		96
*8	అమ్మమ్మ చదువు	శ్రీమతి సుధామూర్తి	102
	సంకల్పం దృఢంగా ఉంటే సాధించలేనిదేది? (ఉపవాచకం)		108
	నాటి నుండి నేటివరకు (పఠనం)		113
*9	బయలు బతుకు	శ్రీ అంబల్ల జనార్ధన్	114
	బళ్లారిలో గాంధీజీ (ఉపవాచకం)	కీ.శే. తిరుమల రామచంద్ర	121
	వ్యాకరణం : 124-128	లేఖన కౌశల్యాలు	129-136

గమనిక : ప్రథమభాషకు విషయ సూచికలోని పాఠములన్నియు ఉద్దేశింపబడినవి. '*' గుర్తుగల పద్య గద్య పాఠ్యాంశాలు, ఉపవాచకం పాఠ్యాంశాలు ద్వితీయ భాషకు కేటాయించబడినవి.

పద్యభాగం

1 భారత జనని

నేపథ్యం

జోన్‌టీ రోడెస్ కుమార్తె నామకరణం

మునుపటి సౌత్ ఆఫ్రికా క్రికెట్ క్రీడాకారుడు, ముంబై ఇండియన్స్ ఫీల్డింగ్ కోచ్ అయిన జోన్‌టీ రోడెస్ తన భార్య మెలనీ ముంబైలో ఒక ఆడపిల్లకు జన్మనిచ్చిందని, పాపకు 'ఇండియా' అని నామకరణం చేశాననే వార్తను రోడెస్ స్వయంగా ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

'నేను ఇండియాలో చాలాకాలం గడిపాను. ఇండియాలోని భిన్న సంస్కృతుల మేళవింపు, వారసత్వం, సంప్రదాయాలు నాకు చాలా ఇష్టం. ఆధ్యాత్మికత, ముందు ఆలోచనలు గల దేశం ఇండియా. ఈ మేలుకలయిక అంటే నాకు మక్కువ. అందుకే మా చిన్నారికి 'ఇండియా' అని పేరు పెట్టాను' – అంటున్నారు రోడెస్.

మరి విదేశీయులే సమ్మోహితులవుతున్నట్టి భారత జననిని కవి గురజాడ రాఘవశర్మగారు ఏమని వర్ణించారో చూద్దామా!



పల్లవి : జయ జయ భారత జననీ, పావని
అనుపల్లవి : జయ జయ సకలానంద దాయినీ

హిమాలయోన్నత సమాదర్శిని
తమోదళన విద్యా స్వరూపిణి ॥ జయ జయ ॥

సంతత సస్య శ్యామల రూపిణి
సంచిత సకలైశ్వర్య దాయిని ॥ జయ జయ ॥

పావన గంగా జీవన శోభిని
పతితోద్ధారిణి పాప విదారిణి ॥ జయ జయ ॥

మధుర కుసుమ ఫల మంద సుహాసిని
మంజుల శుక పిక మధుర సుభాషిణి ॥ జయ జయ ॥

వీర ధీర నర-నారీ రూపిణి
వైరి-వర్గ సంహారిణి, తారిణి ॥ జయ జయ ॥

సార్థక ధర్మ-చక్ర పతాకిని
సకల సౌఖ్య రాజ్య ప్రదాయిని ॥జయ జయ ॥

విశ్వలోక హిత-విజయ కిరీటిని
శాశ్వత మంగళ-శాంతి దాయిని ॥జయ జయ ॥

కవి పరిచయం : గురజాడ రాఘవశర్మ గారు కృష్ణాజిల్లా ఉయ్యూరు సమీపంలోనున్న గురజాడ గ్రామంలో ఫిబ్రవరి 11, 1899 లో జన్మించారు. వీరి తల్లిదండ్రులు వెంకమ్మ మరియు త్రయంబకం. గురజాడ అప్పారావు గారి వంశీకులు. వీరు ఎందరో ప్రముఖుల వద్ద వివిధ శాస్త్రాలలో విద్యాభ్యాసం సాగించి మంచి పాండిత్యాన్ని సంపాదించారు. బమ్మెర పోతన తనకు ఉత్తేజాన్ని కలిగించినట్లుగా స్వయంగా చెప్పుకున్నారు. 1921లో మహాత్మాగాంధీ పిలుపుతో జాతీయోద్యమంలో ప్రవేశించారు. వీరి ఇతర రచనలు ముకుందమాల, వాసుదేవశతకము, స్వాతంత్ర్యపథము, జాతీయగీతాలు మొదలైనవి. 1964లో ప్రముఖ స్వాతంత్ర్యయోధునిగా రాష్ట్రపతితో సన్మానించబడ్డారు.

I చదవండి - ఆలోచించండి - రాయండి.

పదజాలాన్ని పెంపొందించుకుందాం - భావం తెలుసుకుందాం.

పావని = పవిత్రము చేయునది; ఆనందదాయిని = ఆనందమును కలిగించునది; హిమాలయ+ఉన్నత = హిమాలయ పర్వతముల వలె ఉన్నతమైన; సమాదర్శిని = సమదృష్టి కలదానవు; తమోదళన = చీకటిని పరిమార్చి; విద్యాస్వరూపిణి = జ్ఞానమే స్వరూపముగా కలదానవు; సంతత = ఎల్లప్పుడు; సస్యశ్యామల రూపిణి = పైరు పంటలే రూపముగా కలదానవు. సంచిత = కూడబెట్టిన; ఐశ్వర్యదాయిని = సంపదలను ఇచ్చునటువంటి దానివి; పావన = పవిత్రమైన; శోభిని = ప్రకాశించు దానవు; పతిత+ఉద్ధారిణి = పాపాత్ములను ఉద్ధరించుదానవు; పాపవిదారిణి = పాపములను పోగొట్టు దానవు; మధుర = తీయనైన; కుసుమ = పుష్పములతో; సుహాసిని = చిరునవ్వు కలదానవు; మంజుల = మనోహరమైన; సుభాషిణి = చక్కని వాక్కులు గల దానవు; వీర ధీర = పరాక్రమవంతులైన, ధైర్యముకలిగిన, నర = పురుష; నారీ = స్త్రీ; వైరి వర్గ సంహారిణి = శత్రువులను నాశమొనర్చు దానవు; తారిణి = తరింపజేయుదానవు.

భావము : ఓ భరత భూమీ! పావనీ! జయము జయము. అందరికీ ఆనందము కూర్చుదానవు! నీకు జయము. ఉన్నతమైన హిమాలయ పర్వతములవలె సమదృష్టి కలదానవు. అజ్ఞానమను చీకటిని పోగొట్టు విజ్ఞానమే స్వరూపముగా గలదానవు. ఎల్లప్పుడూ పైరుపంటలతో తులతూగెడి దానవు. సకలఐశ్వర్య ప్రదాయినివి. పవిత్రమైన జీవనదియైన గంగతో ప్రకాశించుదానవు. పాపములను పోగొట్టి పాపాత్ములను ఉద్ధరించుదానవు. మధురమైన ఫల పుష్పములతో కూడిన దానవు. చిలుకల, కోకిల పలుకుల వంటి వాక్కులు గలదానవు. వీర, ధీర స్త్రీ పురుష రూపిణివి. శత్రువులను సంహరించుదానవు. మోక్షమొసగు దానవు. సార్థకమైన ధర్మచక్రము పతాకమునందు కలదానవు. సకల సౌఖ్యములను ఇచ్చుదానవు. సమస్తలోకములకు మేలును చేయు విజయమనే కిరీటము గల దానవు. శాశ్వతముగా శుభములను, శాంతిని చేకూర్చుదానవు. అట్టి నీకు జయము జయము.

కృత్యం

పాఠ్యభాగంలోని కింది గేయచరణాలను చదివి, సూచనానుసారంగా కృత్యాలు చేయండి.

అ) తగిన పదాలతో ఖాళీలను పూరించండి.

1) తమోదళన .... స్వరూపిణి. 2) సంతత .... రూపిణి.

3) .... సకలైశ్వర్య దాయిని. 4) పతితోద్ధారిణి .... విదారిణి.

పుట సంఖ్య 1 లోని 1 నుంచి 10 వరుసల వరకు

ఆ) కింది వాక్యాల అర్థాన్నిచ్చే సమానమైన పద్యపాదాలను పాఠ్యభాగం నుండి రాయండి.

1) హిమాలయ పర్వతము వలె ఉన్నతమైన సమదృష్టి కలదానవు.

2) పవిత్రమైన గంగానదితో ప్రకాశించు దానవు.

ఇ) i) కింది పదాలకు వ్యతిరేకపదాలు రాయండి.

1) అపజయము × ____ 2) పాపము × ____

ii) స్వీయ స్పందన :

'భరతమాత' విశిష్టతను మీ సొంత వాక్యాలలో రాయండి.

II వినండి - చర్చించండి - రాయండి.

అ) జవాబులు రాయండి.

1. భరతమాత వాక్కులెటువంటివి?
2. భరతమాత పవిత్రత గురించి తెలియజేయండి.

ఆ) అల్లిక పూరించండి.

భరతమాత విశిష్టతలు

III పద్య/గేయ రసాస్వాదన:

కింది గేయ చరణాలను చదివి భావాన్ని వివరణాత్మకంగా రాయండి.

"హిమాలయోన్నత .... విదారిణి"

IV భాషావగాహన

అ) వ్యతిరేక పదాలు రాయండి.

1)	పాపము × ____		2)	____ ×	భీరువు
3)	అధర్మము × ____		4)	____ ×	సౌఖ్యము
5)	అపజయము × ____		6)	____ ×	అవిద్య

ఆ) సంధులను జతపరచండి.

'క' వర్గము	'చ' వర్గము
1) సకల + ఆనంద	వృద్ధిసంధి
2) సకల + ఐశ్వర్య	గుణసంధి
3) హిమాలయ + ఉన్నత	సవర్ణదీర్ఘసంధి

ఇ) విగ్రహ వాక్యం రాసి ఏ సమాసమో రాయండి.

1) పతితోద్ధారిణి ____ — ____

2) సముదర్శిని ____ — ____

3) వైరివర్గము ____ — ____

4) లోకహిత ____ — ____

ఋ) పర్యాయ పదాలు రాయండి.

1) జనని : ____________, ____________, ____________, ____________.

2) కుసుమము : ____________, ____________, ____________, ____________.

3) ఫలము : ____________, ____________, ____________, ____________.

ఎ) గీతగీసిన పదాలు ఏ భాషాభాగాలో గుర్తించండి.

1) జయ జయ <u>భారత జననీ</u>

2) <u>మధుర</u> కుసుమ ఫల మంద సుహాసిని.

3) వైరి వర్గ <u>సంహారిణి</u>

ఏ) కింది పద్యపాదాల్లోని అలంకారాన్ని గుర్తించండి.

1) వీర ధీర నరనారీ రూపిణి
   వైరి వర్గ సంహారిణి తారిణి

2) సార్థక ధర్మచక్ర పతాకిని
   సకల సౌఖ్య రాజ్య ప్రదాయిని.

అనువదిద్దాం - ఆనందిద్దాం.

మరాఠీ భాషలోని ఈ దేశభక్తి గేయచరణాన్ని తెలుగులోకి అనువదించండి.

झेंडा आमुचा प्रिया देशाचा
फडकत वरी महान
करितो आम्ही प्रणाम याला
करितो आम्ही प्रणाम

V సృజనాత్మకత :

1) అంతర్జాలంలో మరికొన్ని దేశభక్తి గేయాలను సేకరించి తులనాత్మకంగా పరిశీలించండి.

2) స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ప్రధానమంత్రి ఉపన్యాసం విని, దానిలోని ముఖ్యాంశాలను డైరీలో నమోదు చేయండి.

VI లేఖన నైపుణ్యాలు : వ్యాసరచన - ఆత్మకథ

కింది అంశముల ఆధారంగా 40-50 పదాలతో ''వార్తాపత్రిక'' ఆత్మకథను రాయండి.

తెలుగులో వచ్చిన మొదటి వార్తాపత్రిక → వివిధ వార్తలు → ప్రజలలో వచ్చిన చైతన్యం → దేశాభివృద్ధి పట్ల బాధ్యత

వివిధ భాషలలో → నా వలన ప్రయోజనం → విజ్ఞానాభివృద్ధి → ముగింపు

నేనివి నేర్చుకున్నా :

1. దిన, వార, మాస పత్రికలలోని గేయాలను చదివి అవగాహన చేసుకోవటం.
2. అంతర్జాలం నుండి విషయాన్ని సేకరించి ఉపయోగించుకోవటం.
3. తగిన సామెతలతో, నుడికారాలతో వ్యాసం రాయుటం.

ఉ.సూ.:
- దేశభక్తి గేయాలను సేకరించి, అలాగే కొన్ని గేయాలను స్వయంగా రాసి వాటిని పాడేలా విద్యార్థులను ప్రోత్సహించాలి.
- జాతీయపండుగల గూర్చి సమాచారాన్ని అంతర్జాలంలో సేకరించి విద్యార్థులకు తెలుపండి.

GD967H

2 పరివర్తన

నేపథ్యం

- పరివర్తన — మార్పు / రూపాంతరము
- మీలో పరివర్తన తెచ్చిన సంఘటన ఏదైనా ఉన్నదా!
- 'ఇంటికో చెట్టు - ఊరికో వనం' - అంశంపై తరగతిలో ఉపన్యసించుము.

ఇప్పుడు ప్రాణులకు ప్రాణవాయువును, ఆహారాన్ని అందిస్తూ అనేక రకాలుగా ఉపయోగపడే చెట్లను కాపాడటం అవసరమనే విషయాన్ని మానవుడు ఎవరి ద్వారా గ్రహించాడో తెలుసుకుందామా!

ఉ. ఏ నొక నాడరణ్యమున కేగితి కట్టెలు గొట్ట కూలికిన్
సానువులోన నున్న నొక సాలమునుం గని గొడ్డ లెత్తగా
హీన గళంబుచే నను మహీరుహ మడ్డగ సాగె నిట్లు, నే
నా నగ మాడు మాటలు కడబ్బుర పాటున నాలకించితిన్. **(1)**

చ. "అడవిని పుట్టి పెర్గితిమయా! సుడిగాలుల పిడ్గువానకున్
జడియక, జన్మమిచ్చిన సుసాగరమేఖల కోర్కె తీర్చగన్
పుడమిని జంతు జాతులకు మోదము మేలును గూర్చుచున్ సదా
నడిచెడి మమ్ములన్ నరుడ! నాశమొనర్చకు నిర్దయుండవై. **(2)**

ఉ. మా తరు శాఖ ఛాయలను మంజరిలోనను నిత్యమాడుచున్
గౌతుకమొప్ప పాడుచును కాలము హాయిగ గడ్పు పక్షులున్
కోతుల జాతి కొమ్మలను గుల్మములన్ నివసించు జంతువుల్
భూతలమందు నెక్కడికి పోవును? మమ్ముల గూల్చివేసినన్. **(3)**

చ. మలమల యెండ వేడిమికి మాడుచు నడ్చుచు పోవు వారికిన్
నిలబడి దారు లందునను నిత్యము చల్లని నీడ నిత్తుమే
విలువగు ప్రాణవాయువును పేర్మిని మీ కిడుచున్న మమ్ములన్
కలియుగ మానవా! తగదు ఖండన జేయకు కీడు నీకగున్. (4)

ఉ. తీయని పండ్లు కాయలతి తీయని మేలిమి తేనె తెట్టెలన్
కాయము గాయమైన వెనుకాడక నిత్తుము కోరినప్పుడున్
న్యాయమ! చంప వచ్చితివి నష్టము కల్గును మీకె ధాత్రిపై
తోయము నిచ్చు మేఘములు తూలును వర్షము రాదు మానవా! (5)

ఉ. ప్రార్థన నాలకించు మము పంపకుమీ! యమలోక సీమకున్
స్వార్థము లేదు మాకు మిము సాకుటకై జనియించినాము ని
స్వార్థపు జీవనం బొకటె సర్వ జనాళికి నిచ్చు శాంతియున్
సార్థకమొందు నీ జనువు సన్మతి! త్రుంచకు చెట్ల బెంచుమా! (6)

కం. తరులే ప్రాణము నిల్పును
తరులే కురిపించు వాన ధారుణి పైనన్
తరులే వరమౌ నరులకు
తరియించుము మొక్కనాటి తప్పక మిత్రా! (7)

చ. హృదయ గుహాంతరాళమున వృక్షము పల్కిన సత్య వాక్కులున్
గదులుచునుండ గొడ్డలిని కంపిత హస్తమునుండి వీడి నే
సదమదమొందు చిత్తమున సాగితి నింటికి, నాటినుండియున్
గుదురుగ నాటి మొక్కలను గోముగ సాకుచు పెంచసాగితిన్ (8)

కవి పరిచయం : 'పరివర్తన' అను పాఠ్యభాగం శ్రీ గండూరి లక్ష్మీనారాయణ గారు రచించిన ''చీకటి వెలుగులు'' అనే పద్యసంపుటి నుండి గ్రహింపబడినది. శ్రీ లక్ష్మీనారాయణ గారు ప్రధానోపాధ్యాయులుగా పదవీ విరమణ పొందిరి. వీరి జన్మదాతలు రాములు రంగస్వామి, కనకమ్మ రాములు గారు. ప్రస్తుతం వీరు మహారాష్ట్రలోని భీవండి పట్టణంలో నివసించుచున్నారు.

శ్రీ లక్ష్మీనారాయణగారు మహితోక్తశతక మంజరి, నేటి భారతం (శతకం), స్పందన (కవితా సంపుటి), మార్కండేయ మహర్షి (బతకమ్మ పాట) మొ॥ వాటిని రచించారు. వీరికి ఉత్తమ ఉపాధ్యాయ (పు.పా.సం., భీవండి), విశిష్ట ఉపాధ్యాయ (రోటరీ క్లబ్ సౌత్, భీవండి) పురస్కారాలు లభించాయి.

I వినండి - సంభాషించండి.

1. ''నేనే చెట్టునైతే''
2. ''చెట్ల ఆవశ్యకత.''

II చదవండి - ఆలోచించండి - రాయండి.

పదజాలాన్ని పెంపొందించుకొందాం - భావాలు తెలుసుకుందాం.

1. ఏగితి = వెళ్ళితి; సానువు = అడవి; సాలము = వృక్షము; గళము = గొంతు; మహీరుహము = చెట్టు/వృక్షము; నగము = వృక్షము; అబ్బురము = ఆశ్చర్యము.

భావము : నేను ఒకనాడు కట్టెలు కొట్టుటకై అరణ్యమునకు వెళ్ళితిని. అచ్చట ఒక వృక్షమును చూచి గొడ్డలిని ఎత్తగా అది నీరసించిన కంఠముతో నన్ను ఇట్లు అడగసాగెను. నేను ఆశ్చర్యపడుచు దాని మాటలు వినుచుంటిని.

2. జడియక = భయపడక; సాగరమేఖల = సముద్రపు మొలనూలు; పుడమి = భూమి; మోదము = సంతోషము; మేలు = మంచి; నిర్దయ = దయలేకుండుట.

   భావము : అడవిలో పుట్టిపెరిగాము. సుడిగాలులకు, జడి వానలకు భయపడక, జన్మనిచ్చిన భూదేవి కోర్కె తీర్చుటకు ప్రయత్నించుచున్నాము. భూమిపైనున్న జంతు జాలములకు ఆనందమును, మేలును చేకూర్చుచున్నాము. మమ్ములను నిర్దయుడవై నాశనము చేయకుము.

3. ఛాయ = నీడ; మంజరి = పూలగుత్తులు; నిత్యము = ఎల్లప్పుడు; కౌతుకము = కుతూహలము; గుల్మములు = పొదలు; భూతలము = భూమిపై.

   భావము: పక్షులు మాకొమ్మల నీడల్లో ఎల్లప్పుడు ఉత్సాహముతో ఆడుచు, పాడుచు హాయిగా కాలము గడుపును. కొమ్మలలో నివసించు కోతులు మొదలగు జంతువులు మమ్ములను కూల్చివేసిన ఎచటికి వెళ్ళును?

4. పేర్మిని = ప్రేమతో; ఖండన = కొట్టివేయుట; తగదు = మంచిదికాదు; కీడు = అపకారము.

   భావము : ఎండలకు మలమల మాడుచు దారులలో నడచుచు పోవువారికి మేము నిలచి చల్లని నీడ నిచ్చెదము; మీకు ప్రేమతో ప్రాణవాయువును (ఆక్సిజన్‌ను) అందించెదము. కావున మమ్ము నరకుట తగదు. నీకు కీడు జరుగును.

5. మేలిమి = శ్రేష్ఠమైన; కాయము = శరీరము; తోయము = నీరు

   భావము : తీయని పండ్లు, కాయలు, మేలిమి తేనె తెట్టెలను మా శరీరములు గాయమైనా మీరు కోరినపుడల్లా వెనుకాడక ఇచ్చెదము. అటువంటి మమ్ములను చంపుటకై వచ్చుట న్యాయమా! మీకే నష్టము కలుగును. వర్షమునిచ్చు మేఘములు తొలగిపోయి, వర్షము కురియదు.

6. ఆలకించు = విను; స్వార్థము = నాది అనుభావము; సాకుట = పోషించుట; జనియించుట = పుట్టుట; జనాళి = ప్రజాసమూహము.

   భావము : మా ప్రార్థన వినుము. మమ్ములను చంపకుము. మాకు స్వార్థమన్నది లేదు. మిమ్ములను బ్రతికించుటకే మేము పుట్టినాము. నిస్వార్థ జీవనమే సర్వజనులకు శాంతినిచ్చును. నీ జన్మము కూడా సార్థకమగును. చెట్లను నశింపజేయక వాటిని పెంచుము.

7. తరులు = చెట్లు; ధారుణి = భూమి; నరులు = మానవులు.

   భావము : వృక్షములే ప్రాణములను నిలుపునవి. వృక్షములే భూమిపై వర్షమును కురిపించును. తరులే నరులకు వరము కావున మొక్కలను నాటుము.

8. కంపిత = వణకుచున్న; హస్తము = చెయ్యి; వాక్కు = మాట; గోముగ = ప్రేమతో

   భావము : వృక్షము పలికిన వాక్కులు మనస్సున మెదలుచుండగా కంపించుచున్న చేతులతో గొడ్డలిని వదలివేసితిని. ఆనాటి నుండి కుదురుగ మొక్కలు నాటి ప్రేమతో పెంచసాగితిని.

III వినండి - చర్చించండి - రాయండి.

అ) జవాబులు రాయండి.

1. 'వృక్షములు' మానవులకు ఉపయోగపడుచున్న విధము.
2. కట్టెలుకొట్టు వానిలో వచ్చిన పరివర్తన.

ఆ) ఎవరు, ఎవరితో పలికిరి.

1. ''అబ్బుర పాటున ఆలకించితిన్''
2. ''నాశమొనర్చకు నిర్దయుండవై''
3. ''తగదు ఖండన జేయకు కీడు నీకగున్''
4. ''మొక్కలను గోముగ సాకుచు పెంచసాగితిన్''

ఇ) ఖాళీలను కుండలీకరణములోని సరియగు పదాలతో పూరించండి.

(వర్షము, నీడ, ధారుణి, మహీరుహము, వరము)

1. హీనగళంబుచే నను ________________ అడ్డగసాగె.
2. నిత్యము చల్లని ________________ నిత్తుమే.
3. మేఘములు తూలును ________________ రాదు మానవా!
4. తరులే కురిపించు వాన ________________ పైనన్.

ఈ) కింది వాక్యములలోని తప్పొప్పులను గుర్తించండి.

1. అడవిని పుట్టి పెర్గితిమి. ( )
2. దారులందు నిత్యము వేడి నిత్తుము ( )
3. మిము సాకుటకై జనియించినాము ( )
4. తరులే శాపము నరులకు ( )

ఉ) అల్లిక :

తరుల వలన కలుగు లాభములను కింది అల్లికలో పూరించండి.



IV స్వీయస్పందన :

1. ''వృక్షముల వలన వర్షములు కురియును'' నీ సొంతమాటల్లో వివరించు.
2. మానవులకు చెట్ల వలన కలుగు లాభములు.

V అభిప్రాయవ్యక్తీకరణ :

1. వృక్షములను కొట్టివేయుట ఎంతవరకు సమంజసము.
2. తరువులు నిస్వార్థ జీవులు – సమర్థించుము.
3. మానవుల్లో పరివర్తన అవసరమన్న కవిభావన పట్ల నీఅభిప్రాయం.

VI పద్య/గేయ రసాస్వాదన:

కింది పద్యాన్ని చదివి మీరు గ్రహించిన భావాన్ని వివరణాత్మకంగా రాయండి.

ఉ. తీయని పండ్లు కాయలతి తీయని మేలిమి తేనె తెట్టెలన్
కాయము గాయమైన వెనుకాడక నిత్తుము కోరినప్పుడున్
న్యాయము! చంప వచ్చితివి నష్టము కల్గును మీకె ధాత్రిపై
తోయము నిచ్చు మేఘములు తూలును వర్షము రాదు మానవా!

VII భాషావగాహన :

అ) వ్యతిరేక పదాలు రాయండి.

1) ఖేదము × __________ 2) కీడు × __________

3) న్యాయము × __________ 4) నష్టము × __________

5) స్వార్థము × __________ 6) శాంతి × __________

7) వరము × __________ 8) సత్యము × __________

ఆ) వచనము మార్చి రాయండి.

1) గొడ్డలి [ ] 2) తరువు [ ]

3) జంతువులు [ ] 4) పండ్లు [ ]

ఇ) ప్రకృతి - వికృతులను రాయండి.

1) అబ్బురము – [ ] 2) ఛాయ – [ ]

3) పుడమి – [ ] 4) ప్రాణము – [ ]

ఈ) పర్యాయ పదాలు రాయండి.

1) పుడమి = __________ , __________ , __________

2) కాయము = __________ , __________ , __________

3) తరులు = __________ , __________ , __________

4) అడవి = __________ , __________ , __________

5) చిత్తము = __________ , __________ , __________

ఉ) కింది సంధులను జతపరచండి.

'క' వర్గము		'చ' వర్గము
1) అరణ్యమునకు + ఏగితి		అ) గసడదవాదేశసంధి
2) జన + ఆళి		ఆ) ఇకారసంధి
3) గొడ్డలి + ఎత్తగా		ఇ) ఉకారసంధి
4) కట్టెలు + కొట్టు		ఈ) సవర్ణ దీర్ఘసంధి

ఊ) కింది సమాసములకు విగ్రహవాక్యాలు రాయండి.

1) హీనగళము = __________ 2) సుడిగాలి = __________

3) నిర్దయుడు = __________ 4) తరుశాఖ = __________

5) సత్యవాక్కు = __________

ఋ) కింది పద్యమందలి అలంకారము గుర్తించుము.

తరులే ప్రాణము నిల్పును
తరులే కురిపించువాన ధారుణిపైనన్
తరులే వరమౌ నరులకు
తలియించుము మొక్కనాటి తప్పక మిత్రా!

ఋూ) కింది పద్యపాదములు గణ విభజన చేసి యతిస్థానమును గుర్తించి ఏ పద్యపాదమో తెలుపుము.

1) నడిచెడి మమ్ములన్ నరుడ! నాశమొనర్చకు నిర్దయుండవై

2) తోయము నిచ్చు మేఘములు తూలును వర్షము రాదు మానవా!

ఎ) కింది వాక్యములలోని భాషాభాగాలను గుర్తించండి.

1. తోయము నిచ్చు మేఘములు.

2. హీనగళంబుచే నను మహీరుహ మడిగెను.

3. నష్టము కల్గును మీకె ధాత్రిపై

4. పంపకుమీ యమలోక సీమకున్

VIII సృజనాత్మకత :

చెట్లే లేకపోతే ఏమవుతుంది.

- పశుపక్ష్యాదులు
- మానవులు
- పర్యావరణము.

IX లేఖనసైపుణ్యాలు : లేఖారచన-అధికార, అనధికార లేఖలు.

- కింది అంశాల ఆధారంగా అధికార, అనధికార లేఖలు నూతన పద్ధతిలో రాయండి.

విషయం : పఠనదినోత్సవ కార్యక్రమం సందర్భంగా పుస్తక ప్రదర్శన

సంచాలకులు, తెలుగు అకాడమీ, హైదరాబాద్, తెలంగాణ.

తేది : 15-10-2018

సమయం : ఉ॥ 8.00 గం. - సా॥ 6.00 గం॥

స్థలం : మున్సిపల్ పాఠశాల మైదానం, అంబర్‌నాథ్, ఠాణే జిల్లా.

- ప్రదర్శన కొరకు పుస్తకములు సమకూర్చవలసినదిగా అభ్యర్థిస్తూ లేఖ.
- కార్యక్రమానికి రావలసినదిగా కోరుతూ అమ్మమ్మ, తాతయ్యలకు ఆహ్వాన లేఖ.

అర్థాంతరన్యాసాలంకారం

సామాన్యాన్ని విశేషం చేతగాని, విశేషాన్ని సామాన్యం చేతగాని సమర్థించడం అర్థాంతరన్యాసాలంకారం.

సామాన్యం – లోకోక్తి లేక ప్రసిద్ధ ధర్మం.

విశేషం – ప్రత్యేకమైన సంఘటన

ఉదా: (1) హనుమంతుడు సముద్రాన్ని దాటాడు.

మహాత్ములకు సాధ్యంకాని కార్యం ఉంటుందా?

ఇందులో మొదటి వాక్యం విశేషం. రెండోవాక్యం సామాన్యం. ఇలా విశేషాన్ని చెప్పి సామాన్యాన్ని చెప్పడం వల్ల ఇది అర్థాంతరన్యాసం. ఇక్కడ విశేషం సామాన్యం చేత సమర్థించబడింది.

(2) పండితులతో కలిసి వుండుటచే సామాన్యుడు కూడా గౌరవము పొందును. పూలతో కూడి వుండుట వలన దారముకూడా శిరస్సున ధరింపబడుచున్నది కదా. ఇందు మొదటి వాక్యం సామాన్యం. రెండోవాక్యం విశేషం. ఇక్కడ సామాన్యవాక్యం విశేషం చేత సమర్థింపబడినది.

సమాచార ప్రసార సాంకేతిక పరిజ్ఞానము (ICT)

- కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌ల సహాయంతో సులభంగా స్లైడ్‌షో తయారు చేయవచ్చు.

ఈ స్లైడ్‌షోతో ప్రేక్షకులను ఆకట్టుకొనే విధంగా ప్రజంటేషన్ చేయవచ్చు.

శృతం కన్నా దృశ్యం మనస్సున బాగా నిలుస్తుంది. అందుకే పిక్చర్ 'స్పీక్స్ వాల్యూమ్స్' అంటారు. ఒకదాని తరువాత ఒకటిగా ఆకర్షణీయము, విషయానుగుణ్యము అయిన స్లైడ్స్‌ను ప్రదర్శిస్తూ తగినవిధంగా వివరించడాన్ని విజువల్ ప్రజంటేషన్ అంటారు.

ఇప్పుడు మీరు మీ ఉపాధ్యాయులు మరియు పెద్దల సహాయంతో **"వృక్షాల ఆవశ్యకత"** గురించి చిత్రాలు, వీడియోలతో కూడిన ఒక చక్కని స్లైడ్‌షో ప్రజంటేషన్ తయారు చేయండి. దానిని మీ పాఠశాలలో మరియు పరిసరాలలో ప్రదర్శించండి. జనజాగృతిని కల్గించండి.

నేనివినేర్చుకున్నా :

1. పద్యాలు, గేయాలు మొదలగు సాహిత్యాన్ని చదివి రసాస్వాదన చేయుటం.
2. ఆహ్వానపత్రిక తయారు చేయుటం.
3. అధికారలేఖ రాయుటం.
4. అంతర్జాలం ద్వారా విషయాన్ని సేకరించి వినియోగించుకోవడం.

ఉ.సూ.: వృక్షసంపదను గూర్చి విద్యార్థులకు అంతర్జాలం ద్వారా తెలియజేయండి.

వి.సూ.: పర్యావరణానికి సంబంధించిన వివిధవార్తలను దిన, వార, మాస పత్రికలయందు సేకరించి తులనాత్మకంగా పరిశీలన చేయండి.

GDI29J

3. ఆతిథ్యము

నేపథ్యం

- **'అతిథి' – 'అభ్యాగతులు'** అను మాటలు విన్నారా?
  అతిథి: ఫలానా తిథియందు/రోజు వస్తానని ముందుగా తెలుపక ఆకస్మికముగా వచ్చు వ్యక్తి.
  అభ్యాగతుడు : భోజన సమయమునకు వచ్చు వ్యక్తి.
- మీ ఇంటికి వచ్చిన అతిథులతో మీరెలా ప్రవర్తిస్తారు?
- పూర్వం గృహమునకు వచ్చిన అతిథుల నెట్లు సత్కరించేవారు?
- ప్రస్తుత పాఠంలో ప్రవరుడు అతిథికి ఏ విధంగా సేవలందించి ధన్యతను పొందాడో చూద్దాం.

సీ. తీర్థసంవాసు లేఁ తెంచినా రని విన్న
నెదురుగా నేఁగు దవ్వెంతయైన
నేఁగి తత్పదముల కెఱఁగి యింటికిఁ దెచ్చుఁ
దెచ్చి సద్భక్తినాతిథ్య మిచ్చు
నిచ్చి యిష్టాన్న సంతృప్తులఁగాఁ జేయుఁ
జేసి కూర్చున్నచోఁ జేరవచ్చు
వచ్చి యిద్ధరఁ గల్గు వనధి పర్వత సరి
త్తీర్థ మాహాత్మ్యముల్ దెలియ నడుగు

గీ. నడిగి యోజన పరిమాణ మరయు నరసి
పోవలయు జూడ ననుచు నూర్పులు నిగుడ్చు
ననుదినము తీర్థ సందర్శ నాభిలాష
మాత్మ నుప్పొంగ న త్తరుణాగ్ని హోత్రి. ..... (1)

క. ఈ విధమున నభ్యాగత
సేవాపరతంత్ర సకల జీవనుఁడై భూ
దేవకుమారకుఁ డుండం
గా విను మొకనాఁడు కుతప కాలమునందున్ ..... (2)



సీ. ముడిచిన యొంటి కెంజడ మూయ మువ్వన్నె
మొగముతోలు కిరీటముగ ధరించి
కకపాల కేదార కటక ముద్రిత పాణి
గుఱుచలాతాముతోఁ గూర్చిపట్టి
యైణేయమైన యొడ్డాణంబు లవణిచే
నక్కళించిన పొట్ట మక్కళించి
యారకూటచ్ఛాయ నవఘళింపగఁజాలు
బడుగు దేహంబున భస్మ మలఁది

గీ. మిట్టయురమున నిడుయోగ పట్టె మెఱయఁ
జెవుల రుద్రాక్షపోఁగులు చవుకళింపఁ
గావికుబుసంబు జలకుండికయును బూని
చేరె దద్గేహ మౌషధసిద్ధుఁ డొకఁడు. ..... (3)

తే. ఇట్లు చనుదెంచు పరమ యోగీంద్రుఁ గాంచి,
భక్తి సంయుక్తి నెదురేఁగి ప్రణతుఁడగుచు,
నర్ఘ్యపాద్యాది పూజనం బాచరించి
యిష్టమృష్టాన్న కలన సంతుష్టుఁ జేసి. ..... (4)

క. ఎందుండి యెందు బోవుచు
నిందుల కేఁతెంచినార లిప్పుడు? విద్వ
ద్వందిత! నేఁడుగదా మ
న్మందిరము పవిత్రమయ్యె, మాన్యుఁడ నైతిన్! ..... (5)

ఉ. వానిది భాగ్యవైభవము, వానిది పుణ్య విశేష మెమ్మెయిన్
వాని దవంధ్యజీవనము వానిది జన్మము వేఱుసేయ కె
వ్వాని గృహాంతరంబున భవాదృశ యోగిజనంబు పావన
స్నానవిధాన్న పానముల సంతస మందుచుఁ బోవు నిచ్చలున్. (6)

క. నా విని ముని యిట్లను వ
త్సా! మావంటి తైర్థికావళి కెల్లన్
మీవంటి గృహస్థుల సుఖ
జీవనముగాదె తీర్థ సేవయుఁ దలఁపన్? ..... (7)

శా. ఏ యే దేశములన్ జరించితిరి, మీ రే యే గిరుల్ చూచినా,
రే యే తీర్థములందుఁ గ్రుంకిడితి, రే యే ద్వీపముల్ మెట్టినా,
రే యే పుణ్యవనాళిఁ ద్రిమ్మరితి, రే యే తోయధుల్ డాసినా
రాయాచోటులఁ గల్గు వింతలు మహాత్మా! నా కెఱింగింపరే. (8)

శా. కేదారేశు భజించితిన్ శిరమునన్ గీలించితిన్ హింగుళా
పాదాంభోరుహముల్ ప్రయాగనిలయుం బద్మాక్షు సేవించితిన్
యాదోనాథసుతాకళత్రు బదరీ నారాయణుం గంటి నీ
యా దేశం బన నేల? చూచితి సమస్తాశావకాశంబులన్ (9)

కవి పరిచయం : ఆంధ్ర కవితాపితామహుడని కీర్తినొందిన అల్లసాని పెద్దన క్రీ.శ. 1509 నుండి 1530 వరకు విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజ కవులలో ప్రముఖుడు. అసామాన్య ప్రతిభా విశేషాలుగల ఈ కవిని రాయలు 'చతురవచోనిధి' యని ప్రశంసించెను, 'శిరీషకుసుమ పేశల సుధామయోక్తులన్' గృతి రచింపుమని రాయలు కోరగా 'స్వారోచిష మనుసంభవ' మను ప్రబంధమును పెద్దన రచించెను. ఇది మనుచరిత్రగా ప్రసిద్ధిగాంచినది. 'అల్లసాని వారి అల్లిక జిగిబిగి అని' వీరిశైలి కొనియాడబడెను. ప్రస్తుత పాఠ్యభాగము 'మనుచరిత్ర' నుండి గ్రహింపబడినది.

వివిధ యాత్రలుగావించి, తన ఇంటికి వచ్చిన సిద్ధునికి ప్రవరుడు ఆతిథ్యమొసంగుట ఈ పాఠ్యభాగసారాంశము.

I చదవండి - ఆలోచించండి - రాయండి.

పదజాలాన్ని పెంపొందించుకుందాం - భావాలు తెలుసుకుందాం.

1. అనుదినము = ప్రతిరోజు; ఆ + తరుణ + అగ్నిహోత్రి = పిన్నవయస్సుననే అగ్నిహోత్రములు సేవించువాడు; తీర్థము = పుణ్యనదులు; సందర్శన + అభిలాష = చూడవలెనను కోరిక; ఆత్మన్ = మనస్సున; ఉప్పొంగ = అధిక మగుచుండగా; తీర్థసంవాసులు = పుణ్య తీర్థములందు కొంతకాలము ఉండి తిరిగి వచ్చువారు. ఏతెంచు = వచ్చు; దవ్వు = దూరము; ఏగు = వెళ్ళును; సద్భక్తి = మంచిభక్తి; ఇష్టాన్న = నచ్చిన భోజనము; ఈ + ధరన్ = ఈ భూమిపై; వనధి = సముద్రము యొక్క; పర్వత=కొండల యొక్క; సరిత=నదులయొక్క; మహాత్మ్యముల్=ప్రభావములను; అరయన్=తెలిసికొనును.

   భావము : ప్రవరుడు సకల పుణ్య తీర్థములను సేవింపవలెనను కోరిక కలవాడు. అందువలన తీర్థయాత్రలు చేసి వచ్చుచున్నారని వార్త వినగానే వారికి ఎదురుగా వెళ్ళును. వారికి నమస్కరించి తన ఇంటికి తెచ్చును. భోజన తాంబూలాదులచే వారిని తృప్తిపరచును. విశ్రాంతి తీసుకున్న పిదప వారిని సమీపించి ఈ భూమిలో గల క్షేత్ర ప్రభావములను అడిగి తెలుసుకొనును అచటికి వెళ్ళుటకు ఎంత దూరమో వివరముగా తెలిసికొనును. 'గృహము వదలి వెళ్ళ లేకుంటినని' దీర్ఘముగా నిట్టూర్పు విడుచును.

2. అభ్యాగత = అతిథుల; పరతంత్ర=పరాధీన; భూదేవ కుమారుడు = బ్రాహ్మణ కుమారుడు (ప్రవరుడు); కుతప కాలమందు = మధ్యాహ్నాంతర కాలమందు.

   భావము: ప్రవరుడు అతిథుల సేవ కొరకే తన జీవిత కాలమంతయు వినియోగించుచుండెను. ఒకానొక రోజున అతడు అతిథిసేవకు మిట్టమధ్యాహ్న కాలమున ఎదురు చూచుచుండెను.

3. కెంజడ = ఎఱ్ఱని జడను; మూయన్ = క్రమ్ముకొనునట్లుగా; మెగము తోలు = పెద్దపులి చర్మము; కిరీటముగా=కుళ్ళాయిగా; కకపాల = సంచిని; కేదారకటక = పంచలోహములతో చేసిన కడియము; అలది = పూసికొని; ఏగెను = చేరుకొనెను.

   భావము: తలకు అతడు పులి తోలుతో చేయబడిన కుళ్ళాయము, పంచలోహములు కరిగించి చేసిన చేతి కడియమును పెట్టుకొనెను. కక్షపాలయును, యోగ దండమును, ఆడులేడి తోలుతో చేసిన నడుము కట్టును, యోగపట్టమును ధరించెను. దేహమంతటను విభూది పూసుకొని, చెవులందు రుద్రాక్ష పోగులు ధరించి కావిరంగు చొక్కా తొడిగికొనెను. జలమున్న కమండలమును చేతబట్టుకొనినవాడై ఓషధుల ప్రయోగము తెలిసిన వాడు ఐన, ఒక సిద్ధపురుషుడా ప్రవరుని ఇంటికి వచ్చెను.

4. చనుదెంచు = వచ్చు; కాంచి = చూచి; ప్రణతుడు = మొక్కినవాడు; మృష్ట = పరిశుద్ధమైనట్టిది.

   భావము : ఈ రీతిగా వచ్చుచున్న యోగీశ్వరుని చూసి ప్రవరుడు భక్తితో నెదురేగి నమస్కరించెను. అర్ఘ్య పాద్యములచే పూజించి యోగికి ఎటువంటి ఆహారము ఇష్టమో యట్టి పరిశుద్ధమైన ఆహారమును పెట్టెను.

5. విద్వత్ + వందిత = పండితులచే నమస్కరింపబడిన వాడా! మన్మందిరము = నా యిల్లు; పవిత్రము = పావనము; మాన్యుడన్ = అందఱకు పూజనీయుడను.

   భావము : ఓ యోగీంద్రా! మీరెక్కడి నుండి యెక్కడకు బోవుచు ఇచ్చటకు వచ్చినారు? యోగ్యులైన మీ రాక చేత మా యిల్లు పావనమైనది. మీ దర్శనము చేత నేను పూజ్యుడనైతిని.

6. భవాదృశ యోగి జనంబు = మీ వంటి యోగుల సముదాయం; నిచ్చలున్ = ఎల్లప్పుడున్; ఏ+మెయిన్=ఏ విధము చేతను; జన్మము = పుట్టుక.

భావము : యోగీంద్రా! మీ వంటి పూజ్యులు ఎవరి యింట గలసి మెలసి చుట్టముల వలెనే స్నానము, భోజనము, పానము చేసి తృప్తినొంది పోవుచుందురో ఆ గృహస్థుడే అదృష్ట వంతుడు, ధన్యజీవి. ఆ గృహస్థునిదే సార్థకమైన జన్మము.

7. నాన్ = ఇట్లు; వత్సా = ఓ చిన్నవాడా; తైర్థిక+ఆవళికిన్ = తీర్థయాత్ర చేయువారి సముదాయం; తీర్థసేవయున్ = పుణ్య తీర్థముల యొక్క సేవసైతము.

భావము : ప్రవరుడిట్లు పలుకగా ఆ ముని ఈ విధముగా పలికెను. ఓ చిన్నవాడా! మీ వంటి గృహస్థులు సుఖముగా జీవించుట వలననే కదా, మా వంటి తీర్థయాత్రా పరులు మీ వలన నాతిథ్యమును బొందుచు తీర్థయాత్రలు చేసుకొనగల్గుచున్నారు. మీ వంటి గృహస్థులే మా వంటి తీర్థయాత్రికులకు ముఖ్యమగు ఆలంబనములు.

8. మహాత్మా = గొప్పదగు ఆత్మకలవాడా, వసించితిరి = ఉంటిరి; క్రుంకు + ఇడితిరి = స్నానమొనర్చితిరి; త్రిమ్మరితిరి = సంచరించితిరి; డాసినారు = సమీపించినారు, కల్గువింతలు = ఉన్నట్టి చిత్రములను, ఎఱింగింపరే=తెలుపండి.

భావము: ఓ మహానుభావా! మీరు ఏఏ దేశములను చూచితిరి. మీరు చూచిన కొండలను, స్నానమొనర్చిన తీర్థములను, చొచ్చిన దీవులను, విహరించిన పుణ్యారణ్యములను, స్నానము చేయుటకు వెళ్ళిన సముద్రములను, వానివాని యందుగల వింతలను నాకు వివరముగా చెప్పండి.

9. భజించితిన్ = సేవించితిని; కీలించితిన్ = చేర్చితిని; పద్మాక్షున్ = తామరపూవులాంటి కన్నులు గల వానిని; కళత్రున్ = భార్యగా కలవాడు; కంటిన్ = చూచితిని.

భావము : కేదారక్షేత్రమునందలి శివుని సేవించితిని. హింగుళయను మహాదేవికి సాష్టాంగనమస్కారం చేసితిని. ప్రయాగ క్షేత్రములో నివాసమున్న మాధవ స్వామిని సేవించితిని. సముద్రుని కూతురైన లక్ష్మీదేవిని భార్యగా గల బదరికాశ్రమము నందలి నారాయణుని చూసితిని. ఈ, ఆ ప్రదేశములు అననేల అన్ని దిక్కుల నడుమ నుండే ప్రదేశముల నెన్నింటినో చూచితిని.

కృత్యం:

పాఠ్యభాగంలోని కింది పద్యాలను చదివి, సూచనాను సారంగా కృత్యాలు చేయండి.

అ) పద్యపాదములను జతపరుచుము.

	'క' వర్గము		'చ' వర్గము
1.	ఏయే దేశములన్	అ)	మెట్టినారు
2.	ఏయే ద్వీపముల్	ఆ)	గ్రుంకిడితిరి
3.	ఏయే పుణ్యవనాళి	ఇ)	జరించితిరి
4.	ఏయే తీర్థములందు	ఈ)	ద్రిమ్మరితిరి

పుట సంఖ్య 13లోని 8, 9 పద్యాలు

ఆ) సిద్ధుడు దర్శించిన క్షేత్రములు

ఇ) i) కింది పదాలకు సమానార్థక పదాలు రాయండి.

1) త్రిమ్మరితిరి = ________ 2) భజించితిన్ = ________

ii) స్వీయస్పందన

ప్రవరుడు సిద్ధుని ప్రశ్నించిన విధము నీ సొంత మాటల్లో రాయుము.

II వినండి - సంభాషించండి.

1. నీవు చూచిన తీర్థయాత్రా స్థలమును గురించి మిత్రునితో చర్చించండి.
2. తీర్థయాత్రలు చేయటం వలన కలుగు ప్రయోజనాలు
3. 'అతిథి దేవోభవ'
4. అతిథి అని ఎవరిని సంబోధిస్తారు.

III వినండి - చర్చించండి - రాయండి.

అ) జవాబులు రాయండి.

1. ప్రవరుడు తీర్థ సంవాసుల గౌరవించు విధం.
2. విశ్రాంతి గొనుచున్న సిద్ధుని జేరి ప్రవరుడు ప్రశ్నించిన విధము.
3. సిద్ధుడు దర్శించిన ప్రదేశములు.

ఆ) క్రింది భావానికి తగిన పద్యపాదం రాయండి.

1. ఇంటికి తెచ్చి భక్తితో ఆతిథ్యమిచ్చును.
2. ఎక్కడ నుంచి ఎక్కడికి వెళ్ళుచు ఇక్కడకు వచ్చారు?
3. ఆయా స్థలములలో గల వింతలు నాకు తెలుపండి.
4. బదరికాశ్రమ మందలి నారాయణుని చూచితిని.

ఇ) ఎవరు, ఎవరితో అనిరి.

1. మన్మందిరము పవిత్రమయ్యె.
2. గృహస్థుల సుఖజీవనమున గాదె తీర్థ సేవయుదలపన్.
3. వింతలు మహాత్మానా కెఱింగింపరే.
4. చూచితి సమస్తాశావకాశంబులన్

ఈ) అర్థవంతమైన పదాలతో ఖాళీలను పూరించి రాయండి.

(మన్మందిరము, పుణ్యవిశేష, పద్మాక్షు, తీర్థ, ద్వీపముల్, నారాయణుని)

1. అనుదినము __________ సందర్శనాభిలాష మాత్మనుప్పొంగ.
2. నేడు గదా __________ పవిత్రమయ్యె.
3. వానిది __________ మెమ్మెయిన్.
4. ఏయే __________ మెట్టినారు.
5. ప్రయాగ నిలయుం __________ సేవించితిన్.

IV స్వీయస్పందన :

1. మీ ఇంటికి వచ్చిన అతిథులను ఏ విధంగా ఆదరిస్తారో మీ సొంతవాక్యాల్లో రాయండి.
2. ప్రవరునికి, సిద్ధునికి మధ్య జరిగిన సంభాషణ మీ సొంతమాటల్లో రాయండి.

V అభిప్రాయవ్యక్తీకరణ :

1. కవిత్వ వృత్తాంతాన్ని తెల్పండి.
2. కావ్యవిలువలు రాయండి.

VI పద్య/గేయ రసాస్వాదన :

కింది పద్యాన్ని చదివి మీరు గ్రహించిన భావాన్ని వివరణాత్మకంగా రాయండి.

వానిది భాగ్యవైభవము, వానిది పుణ్య విశేష మెమ్మెయిన్
వాని దవంధ్యజీవనము వానిది జన్మము వేఱుసేయ కె
వ్వాని గృహాంతరంబున భవాదృశ యోగిజనంబు పావన
స్నానవిధాన్న పానముల సంతస మందుచుఁ బోవు నిచ్చలున్

VII భాషావగాహన :

అ) విగ్రహవాక్యం రాసి సమాసనామం గుర్తించండి.

1. దర్శనాభిలాష = __________, __________
2. మువ్వన్నె = __________, __________
3. బడుగుదేహంబు = __________, __________
4. అర్ఘ్యపాద్యములు = __________, __________

ఆ) సంధులను జతపరచండి.

'క' వర్గము	'చ' వర్గము
1) ఈ + ధరన్	అ) ఉకారసంధి
2) యోగి + ఇంద్రుడు	ఆ) సరళాదేశ సంధి
3) ఎదురు + ఏగి	ఇ) యడాగమసంధి
4) నారాయణున్ + కంటి	ఈ) త్రికసంధి
5) ముని + ఇట్లను	ఉ) సవర్ణదీర్ఘ సంధి

ఇ) కింది పద్యపాదములందలి అలంకారమును గుర్తించండి.

1. ఏగితత్పదముల కెఱిగి యింటికి దెచ్చు.
దెచ్చి సద్భక్తి నాతిథ్యమిచ్చు
ఇచ్చి యిష్టాన్న సంతృప్తులగా జేయు.
జేసి కూర్చున్నచో చేరవచ్చు.

2. ఐణేయమైన యొడ్డాణంబు లవణిచే
నక్కళించిన పొట్ట మక్కళించి
యారకూటచ్ఛాయ నవఘళింవగ జాలు
బడుగు దేహంబున భస్మమలది

ఈ) కింది పద్యపాదములను గణవిభజన చేసి యతి స్థానమును గుర్తించి ఏ పద్యపాదమో తెల్పండి.

1. స్నాన విధాన్న పానముల సంతస మందుచు పోవు నిచ్చలున్.
2. ఆయా చోటులగల్గు వింతలు మహాత్మానాకెఱింగింపరే.

ఉ) కింద గుర్తించబడిన పదాలు ఏభాషాభాగాలో రాయండి.

1. ఎదురుగా <u>నేగు</u> దవ్వొంతయైన.
2. చేరె దద్గేహ మౌషధ <u>సిద్ధుడొకడు</u>.
3. <u>వాని</u>ది భాగ్య వైభవము.
4. బదరీ <u>నారాయణు</u>ంగంటి.
5. <u>బడుగు</u> దేహంబున భస్మమలది.

VIII లేఖననైపుణ్యాలు : ఆహ్వాన పత్రిక లేఖనం.

కింది సమాచారాన్ని చదివి ఆహ్వాన పత్రికను తయారు చేయండి.

ఆహ్వాన పత్రిక

- తేది, చిరునామా
- సంబోధన
- నేతాజీ వస్తు సంగ్రహాలయం, ముంబయి

తేది : 25-07-2018 ఉదయం 10:00 గం॥

ప్రారంభకులు/ముఖ్యఅతిథి : **నగరమేయర్ శ్రీ సుమిత్ పాటిల్‌గారు.**

- ఈ వస్తుసంగ్రహాలయం భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన వస్తుసంగ్రహాలయాలలో ఒకటి, దీని రూప కల్పన ప్రసిద్ధశిల్పి జక్కన.
- అందమైన శిఖరము, మూడు ప్రధానవిభాగాలు, కళలు, వస్తు శాస్త్రము, స్వాభావిక చరిత్ర.
- **సందర్శించు కాలము** : అక్టోబరు నుండి ఏప్రిల్ వరకు.
సమయం : ఉదయం 10:00 గం॥ నుండి సాయంత్రము 6 గం॥ వరకు (సోమవారాలు తప్ప).

వ్యాకరణము

సీసము: ఇందు నాలుగు పాదములుండును. ఒక్కొక్క పాదము నందు వరుసగా 6 ఇంద్రగణములు, 2 సూర్యగణములు ఉండును. ఈ యెనిమిది గణములు గల పాదమును పెద్ద పాదమందురు. దీనిని రెండు చిన్న పాదములుగా విభజింతురు. ఒక్కొక్క చిన్న పాదమునందు 4 గణములుండును. ప్రాస నియమము లేదు. యతి ప్రతి చిన్న పాదము నందును మొదటి అక్షరమునకును 3వ గణము యొక్క మొదటి అక్షరమునకును చెల్లును. 8 చిన్న పాదముల తరువాత ఒక తేటగీతి గాని లేక ఒక ఆటవెలదిగాని వ్రాయవలయును.

ఉదా.

U I U	U I U	U I U	I I U I
తీర్థసం	వాసులే	తెంచినా	రనివిన్న
ర	ర	ర	స
I I I U	U I U	U I	U I
నెదురుగా	నేగుద	వ్వెంత	యైన
న గ	ర	గ ల	గ ల

ఇంద్రగణములు :

న ల	- I I I I
న గ	- I I I U
స ల	- I I U I
భ	- U I I
ర	- U I U
త	- U U I

సూర్యగణములు :

గ ల	- U I
నగణము	- I I I

తేటగీతి : దీనిలో 4 పాదములుండును. 1 సూర్యగణము, 2 ఇంద్రగణములు, 2 సూర్యగణములు వచ్చును. ప్రాసనియమము లేదు. 1, 4 గణముల మొదటి యక్షరమునకు యతి చెల్లును.

I I I	U I I	I I U I	I I I	I I I
నడిగి	యోజన	పరిమాణ	మరయు	నరసె
న	భ	సల	న	న

అలంకారము స్వభావోక్తి :

జాతి గుణాదుల యందున్న స్వభావమును వర్ణించుట స్వభావోక్తి.

ఉదా: 1) చంచల నయనములతో స్తబ్ధ కర్ణములతో జింకలు చూచుచుండెను.

2) వలదరుణ తరుణ కిసలయ
విలసత్ఫల భరిత విపిన వీధి విచర
త్కల కంఠ శారి కాశుక
కల కంఠధ్వనులు చెవులకుం జవు లొసగెన్

- మొదటి ఉదాహరణమున జింకలు చూచునప్పటి స్థితి స్వాభావికముగా వర్ణింపబడినది.
- రెండవదాని యందు వసంత ఋతువు హృదయంగమముగా వర్ణింపబడినది.

నేనివినేర్చుకున్నా :

1. గణవిభజన చేసి వృత్త పద్యములను గుర్తించుట.
2. ప్రాచీన పద్యకవిత్వాన్ని చదివి రసాస్వాదన చేయుట.
3. పద్యములందలి అలంకారములను గుర్తించుట.
4. ఇంటికి వచ్చిన అతిథిని సత్కరించుట.

ఉ.సూ.:
- అతిథి ప్రాముఖ్యత గూర్చి, అతిథులను ఎలా సత్కరించాలో విద్యార్థులకు కథల ద్వారా తెలియజేయండి.
- సాహిత్యంలోని వివిధ ఛందస్సులను గురించి, వాటి ప్రాముఖ్యతను గురించి వివరించండి.

వి.సూ.: భారత, భాగవత, రామాయణాది గ్రంథాలు చదివి మన సంస్కృతి సాంప్రదాయాలను తెలుసుకోండి.

GPHAD4

4. నా తెలుగు

నేపథ్యం

మానవుడు తన అవసరాలు, భావాలు, అనుభవాలు, ఆలోచనలు మొదలగువాటిని ఇతరులకు తెలుపడానికి, ఇతరులవి తాను తెలుసుకోవడానికి ఉపయోగించే మాధ్యమమే భాష. భారతదేశంలో వేలకొలది భాషలు మాట్లాడే వారున్నారు.

ప్రతిభాషకు తనదైన సౌందర్యం, ప్రత్యేకత ఉంటుంది. కానీ చాలావరకు ప్రతివారు తమ భావనలను మాతృభాషలో వెల్లడించినంత సూటిగా సునాయాసంగా సంపూర్ణంగా వేరొకభాషలో ఎంతటి నిష్ణాతులైనా వెల్లడించలేరేమో. అందుకే మాతృభాషంటే మక్కువ కొంచం మిక్కుటంగానే ఉంటుంది.

మరి రచయిత ఏమంటున్నారో గమనిద్దామా!



ఏమున్నదో తెలుగను మాటలో
నామది పరవశించు విన్నంతనే
కమ్మ తెమ్మెరలు కదలి వచ్చినట్లుండు
శరశ్చంద్ర చంద్రికలు విరిసినట్లుండు
ములముల మొల్లలు విచ్చినట్లుండు
గల గల తేనెసోనలు స్రవించి నట్లుండు
ఆనందాబ్ధి నా మ్రోల నిలిచినట్లుండు
తేనె లొలుకు తేట తెనుగు
వీనుల రవళించు నపుడు
మారు మ్రోగినట్లుండు
వేణు వీణా నిస్వనములు.
ద్వేషభావ మెరుగని భాష నాది
బహు పురాతనమైన భాష నాది
నాల్గుకోట్ల హృత్సీమల నర్తించుచు
పరిణతి చెందే సజీవ భాష నాది.

అయినా
నా తెలుగు పలుకులలో
గుబాళించవలె
కన్నడ కస్తురి ఘుమఘుమలు
కలిసిపోవలె
కమ్మని తమిళపు తేట తేనెలు
లీనము కావలె
సుందర కైరళి సొగసులు.
ప్రతిఫలించవలె
ప్రతి భాషలోని నిగనిగలు
కనిపించవలె నా తెలుగు
నిత్య నూతనంగా
వినిపించవలె నా తెలుగు
విశ్వ విపంచి మీద.

కవి పరిచయం : చల్లా రాధాకృష్ణ శర్మగారు కృష్ణా జిల్లాలోని సోమవరప్పాడు గ్రామంలో 1929న జన్మించారు. ఉన్నత విద్యాభ్యాసం అనంతరం మధురై కామరాజ్ విశ్వవిద్యాలయంలో చాలాకాలం ఆచార్యులుగా పనిచేసి పదవీ విరమణ చేశారు. 'జయించిన జనత', 'ఆర్తి గీతాలు', 'శ్రమలో స్వర్గం' మొదలైన కవితా సంకలనాలు చేశారు. 'మదరాసు తెలుగు', 'సి.పి.బ్రౌన్ సాహిత్యసేవ', 'తెలుగు విందు' సాహిత్య విమర్శ గ్రంథాలలో కొన్ని, త్రిభాషా నిఘంటువు సంకలన కర్తలలో ఒకరు.

I వినండి - సంభాషించండి.

1. మాతృభాష అని దేనినంటారు?
2. శ్రీ కృష్ణదేవరాయల వారికి తెలుగు భాషపైగల అభిమానం.

II చదవండి - ఆలోచించండి - రాయండి.

పదజాలాన్ని పెంపొందించుకుందాం - భావము తెలుసుకుందాం.

తెమ్మెరలు=చల్లగాలులు; ములముల=వికసించడాన్ని సూచించేపదం; మొల్ల = బొడ్డు మల్లె పువ్వు; అబ్ధి =సముద్రం; మ్రోల =ఎదుట; రవళించు=ధ్వనించు; నిస్వనములు=మోతలు, ధ్వనులు; నర్తించుట=ఆడుట; గుబాళించుట=సువాసనవచ్చుట; ద్వేషము=పగ; నిగనిగలు=మెరవడం, విశేషమైన కాంతులు; విపంచి=వీణ; ఘుమఘుమ=సువాసన; సొగసు=అందము; ప్రతిఫలించు=ప్రతిబింబించు; కమ్మని=ఇంపైన; నూతనంగా=క్రొత్తగా.

భావము: తెలుగను మాటలో ఏమున్నదో కాని, ఆ మాట విన్నంతనే నా మనస్సు పరవశించిపోవును.

తెలుగుమాట విన్నంతనే తియ్యని చల్లగాలులు కదలి వచ్చినట్లుండును. శరత్కాలమందలి వెన్నెలలు విరబూసినట్లుండును. బొడ్డుమల్లె పువ్వులు వికసించినట్లుండును. తేనెసొనలు గలగలమని స్రవించినట్లుండును. ఆనందమనెడి సముద్రము నా ముందు నిలిచి నట్లుండును.

తేనెవలె తియ్యనైన స్వచ్ఛమైన 'తెలుగు' చెవులయందు ధ్వనించినపుడు వేణువు యొక్క, వీణ యొక్క ధ్వనులు మారుమ్రోగినట్లుండును.

ద్వేషభావము తెలియని భాష నాది. నా భాష చాలా ప్రాచీనమైనది. నాలుగు కోట్ల తెలుగు ప్రజల హృదయసీమలందు నాట్యము చేయుచు పరిణతి చెందిన సజీవభాష నాది.

అయినా నా తెలుగు మాటలలో కన్నడ భాష కస్తూరి సువాసనలు అధికముగా పరిమళించవలెను.

ఇంపైన స్వచ్ఛమైన తమిళపు తియ్యని మాటలు తెలుగుభాషలో కలిసిపోవలెను. కేరళ భాషలోని అందాలు తెలుగు భాషలో లీనముకావలెను.

ప్రతి భాషలోని విశేషమైన కాంతులు, నా తెలుగుభాషలో ప్రతిఫలించవలెను. నా తెలుగుభాష ఎల్లప్పుడు క్రొత్తగా కనిపించవలెను. అంతేగాక నా తెలుగుభాష ప్రపంచమనెడి వీణ మీద వినిపించవలెను.

III వినండి - చర్చించండి - రాయండి.

అ) జవాబులు రాయండి.

1. తెలుగు మాటను విన్నంతనే కవి ఎట్లు పరవశించును?
2. తెలుగు భాష ఎట్టిదని కవి పలుకుచున్నాడు?
3. ఇతర భాషలలోని ఏఏ గుణములు తెలుగుభాషలో ఉండవలెనని కవి ఆశించాడు?

ఆ) జతపరచండి.

'క' వర్గము		'చ' వర్గము
1. కమ్మ తెమ్మెరలు	అ)	నిలిచినట్లుండు
2. ఆనందాబ్ధి నా మ్రోల	ఆ)	భాషనాది
3. తేనెలొలుకు	ఇ)	విరిసినట్లుండు
4. బహుపురాతనమైన	ఈ)	కదిలి వచ్చినట్లుండు
	ఉ)	తేటతెనుగు

ఇ) కింది పదాలకు సమాన అర్థాలు రాయండి.

1. తెమ్మెరలు = 2. అబ్ధి = 3. విపంచి = 4. ద్వేషము =

IV భాషావగాహన:

అ) కింది పదాలను మీ సొంతవాక్యాల్లో ఉపయోగించి రాయండి.

1. పురాతనము 2. పరవశించుట 3. గుబాళించుట 4. నిగనిగలు

ఆ) కింది పదాలకు వ్యతిరేక పదాలు రాయండి.

1. పురాతనము × ______________ 2. ద్వేషము × ______________

3. సజీవము × ______________ 4. సుందరము × ______________

ఇ) కింది పదాలకు విగ్రహవాక్యములు రాసి, సమాసనామం రాయండి.

1. సజీవభాష = [ ] → [ ]
2. నాల్గుకోట్లు = [ ] → [ ]
3. తెలుగు పలుకులు = [ ] → [ ]

ఈ) కింది గేయపాదాలందలి అలంకారాన్ని గుర్తించండి.

1. కమ్మతెమ్మెరలు కదలి వచ్చినట్లుండు
శరశ్చంద్ర చంద్రికలు విరిసినట్లుండు.

2. గలగల తేనెసోనలు స్రవించినట్లుండు
ఆనందాబ్ధినామ్రోల నిలిచినట్లుండు.

అదనపు సమాచారం చదువుదాం - తెలుసుకుందాం :

తెలుగు భాషాదినోత్సవం :

వ్యావహారిక భాషోద్యమ పితామహుడు కీ.శే. గిడుగు రామమూర్తి పంతులుగారు. ఆయన జయంతి ఆగష్టు 29వ తేది. ప్రజాకవి కాళోజీగారి జయంతి సెప్టెంబరు 9వ తేది. ఈ రెండు రోజులు మనం తెలుగు భాషా దినోత్సవాలుగా జరుపుకుంటాము.

V సృజనాత్మకత :

1. తెలుగు అను పదము ఏ విధంగా ఏర్పడింది? అంతర్జాలం ద్వారా తెలుసుకోండి.
2. తెలుగు భాషాదినోత్సవ విశేషాలను వార్తాపత్రికల నుండి సేకరించి ఆల్బమ్ తయారు చేయండి. తరగతిలో చర్చించండి.

భాష-గమ్మత్తు

కింది సీసపద్యాన్ని శ్రద్ధగా చదవండి.

"రాముడెవ్వానితో రావణు మర్దించె?
పర వాసుదేవుని పట్నమేది?
రాజమన్నారు అనే రాజు చేతిలో బాణం ఏమిటి?
వెలయ నిమ్మ పండు విత్తునేది?
అల రంభ కొప్పులో అలరు పూదండేది?
సభవారి నవ్వించు జాణ యెవడు?
సీత పెండ్లికి ఒలిచేసిన విల్లేది?
శ్రీ కృష్ణుడేయింట చెలగు చుండు?
అన్నిటను జూడ ఐదేసి యక్షరములు
ఈవ లావాల జూచిన నేక విధము
చదువు నాతడు "భావజ్ఞ చక్రవర్తి"
లక్ష్మణోపేంద్ర ప్రౌఢరాయ క్షితీంద్ర!" (వివరణ)

పైపద్యంలో మొదటి ఎనిమిది ప్రశ్నలు, తదుపరి రెండు పాదాలు వాటి జవాబులు తెలిపే సూచికలు (క్లూస్). మూడవ పాదం ఎవరైతే జవాబులు చెపుతారో వారిని ''భావజ్ఞ చక్రవర్తి'' అని పిలవాలని, నాల్గవ పాదం ప్రౌఢరాయల సంబోధన.

జవాబుల సూచికలు : ప్రతి జవాబుకి ఐదు అక్షరాలు ఉంటాయి, ముందునుంచి లేదా వెనుక నుంచి ఎలా చదివినా ఒకేలా ఉంటాయి. ఇప్పుడు పద్యంలోని పొడుపులకి విడుపులు చెప్పగలరేమో ప్రయత్నించండి. లేనిచో క్రింది జవాబులు చూడండి.

1. తోకమూకతో! (వానరాలకి ఇంకొక పేరు)
2. రంగనగరం! (శ్రీరంగం)
3. లకోల కోల! (కోల = బాణం)
4. జంబీర బీజం! (జంబీరం = నిమ్మపండు. బీజం = విత్తనం)
5. మందార దామం! (దామం అంటే దండ)
6. వికటకవి! (హాస్యకవి తెనాలి రామ కృష్ణుడు)
7. పంచాస్య చాపం! (శివుని విల్లు)
8. నంద సదనం! (నందుని ఇల్లు)

నేనిదినేర్చుకున్నా:
వివిధ రకాల సాహిత్యాలలోని రుచిని, వాటిలోని పదాలు, సామెతలు, వాక్య ప్రయోగాలు.
భాషలోని సూక్ష్మభేదాలు, నియమాలు.

ఉ.సూ.: తెలుగు భాషా సౌందర్యాన్ని – తెలుగు సాహితీ ఘనతను గూర్చి విద్యార్థులకు తెలియజేయండి.

G066RR

5. భగీరథ ప్రయత్నం

నేపథ్యం

* మీరెప్పుడైనా మీకు చాలా కఠినం అనిపించిన పనిని చేశారా! ఎలా చేయగలిగారు?

కష్టసాధ్యమైన పనిని సాధించుటకు కావలసినవి

- దృఢసంకల్పం
- అచంచలమైన పట్టుదల
- ఎడతెగని పరిశ్రమ

* 'భగీరథ ప్రయత్నం' – అనే జాతీయాన్ని విన్నారా! మిక్కిలి కష్టసాధ్యమైన పనిని చేయడానికి పూనుకోవడాన్ని 'భగీరథ ప్రయత్నం' అంటారు. ఇదే అర్థంలో ఆంగ్లంలో Herculean task/effort అనే నానుడులు వాడుకలో ఉన్నాయి.

మరి భగీరథుడు సాధించిన అనితర సాధ్యమైన పనిని గూర్చి తెలుసుకుందామా!

అపరిమిత ప్రీతి నా భగీరథుని
తపమిచ్చ మెచ్చి కందర్పసంహరుండు
లోలత దన మౌళిలో నున్న గంగ
'భూలోకమున కింకఁ బొ'మ్మని యనుప
వలనొప్ప జూటంబు వాకిలి వెడలి
కలకల ధ్వనులతో గంగ యేతేర
నోలి పంకజముల నుండ రాకున్న
దూలి యాకసమునఁ దుమ్మెదల్ ప్రోయ;
భూతాధిపతి జూటమున నుండి ధరణి
కేతెంచు గంగకు నెండగాకుండ
గొడుగులు వట్టిన కొమరున నంచ
లుడు వీధిఁ జనుదెంచి యొప్పారు చుండఁ;
నెలసి భూతలమెల్ల నిండ నేతెంచు
పటువున నురువులు పరగంగ గంగ
చనుదెంచి బిందువన్ సరసిలోఁ జొచ్చి
యెనయఁ బ్రవాహంబు లేడయిపాఱె;
ననఘాత్మ పావని, హ్రాదిని, నలిని
యను ప్రవాహములు మూఁడరిగెఁ దూర్పునకు
సీత, సుచక్షువు, సింధువు నాఁగ
భాతిగా మూఁడేఁగెఁ బడమటి దెసకు;

నడరుచు నిబ్బంగి నందులో నొకటి
కడఁగి భగీరథ క్ష్మాపాలు పిఱుద
ఘనతర విశదోదక ప్రవాహంబు
వినువీధి శరదభ్ర విభ్రమం బొలయ
దివికేఁగ మదిలోనఁ దివుజు భూజనుల
కవిరళ నిశ్శ్రేణు లమరుచందమున
నిలయు నింగియు బ్రోయునెడఁ బ్రవాహంబు
గలయ నానా మాలికావీచు లమర
'నీ భంగిఁ ద్రిప్పుదు, నెల్లపాపముల
నా భంగిఁ జూడుఁడు' నా నుడు లమర
కేలి నన్యాపగా కీర్తుల నవ్వ
లీల డిండీర మాలిక లుల్లసిల్ల
ఆ నదిలోపల నవగాహ మంది
ఆనందమును బొంది యాడి రచ్చరలు;
సమర మునీంద్రాదు లాత్మ సంతోష
మమరఁగాఁ బువ్వుల నర్చించి రెలమి;
నా పుణ్యనదిలోన నతిపాపరతులు
శాప దగ్ధులు గృత స్నానులై దివికిఁ
జనుచుండ సురలు నచ్చరలు గంధర్వ
దనుజ పన్నగ యక్షదైత్యరాక్షసులు

కిన్నరాదులు నా భగీరథు రథము
వెన్నాడి కనుగొంచు వేడ్క నేతేరఁ
బెరిగి పర్వతములు భేదించుకొనుచు
నరుగ; జహ్నుఁడు యాగ మా త్రోవఁ జేయ
యాగోపకరణంబు లవి వెల్లివోయి
యాగ విఘ్నంబైవ నమ్మునీశ్వరుఁడు
నింగికి నుప్పొంగి నెటి నేగుదెంచు
గంగ నాకర్షించి కలుషించి క్రోలె;
ననిమిషుల్ మునివరు లా భగీరథుఁడు
వినుతించి జహ్నుని వేఁడినఁ జూచి
యుమిసి యెంగిలి సేయ నొల్లక యతఁడు
రమణమైఁ దన కర్ణ రంధ్రంబులందు
వెడలింప నెప్పటి విధమున గంగ
యడరుచు జాహ్నవి యను పేరఁ బరగెఁ
బురుష పురాకృత పుణ్యంబు వలన
దొరకొన్న విఘ్నంబుఁ ద్రోచి యే తెంచు
వెరవున నారాజు వెనుకనేతెంచి
శరనిధిఁ జొచ్చి యా జాహ్నవీ దేవి
దిగి రసాతలమునఁ దిరిగి యందున్న
సగరుల భస్మముల్ సరినిండఁ బాటె;
నంత నంబుజ గర్భుఁడా భగీరథుని

సంతోషమునఁ జూచి-- ''జననాథ! వినుము;
అడరంగ నిదిమొద లనఘ! నీ పేర
నడచు 'భాగీరథీ' నామ మీ నదికిఁ;
ద్రిపథగ యనంగ, సరిద్వర యనఁగ
నృప! జాహ్నవి యనగ నెగడు నీ గంగ
అనఘ! మీ సగరుండు, నంశుమంతుండు
ఘనుఁడు దిలీపుండుం గైకొన్న ప్రతిన
నెఱపఁజాలరు; నీవు నెఱపగం దివిఁటి
తెఱఁగొప్ప నీ గంగఁ దెచ్చితి కాన
గంగా తరంగ రంగ దభంగ తుంగ
మంగళ చిరకీర్తి మహితుండ వగుము;
వెలయఁ దీర్థ స్నాన విధి సల్పి పుణ్య
ఫలముఁ గైకొను'' మంచుఁ బద్మ సంభవుఁడు
తన లోకమునకేఁగెఁ; దదనంతరంబ
తనర నా గంగఁ గృతస్నానుఁ డగుచు
నఱువది వేపుర కా భగీరథుఁడు
నెఱిఁ దిలోదకములు నిష్ఠతో నిచ్చె
నా తిలోదకముల నమరులై సగరు
లాతని దీవించి యరిగిరి దివికిఁ;
ననఘుఁడై మఱి యయోధ్యా పురంబునకుఁ
జని భగీరథుఁడు రాజ్యము సేయుచుండె.

కవి పరిచయం : తెలుగులో వెలసిన మొట్టమొదటి రామకథాకావ్యం రంగనాథ రామాయణం. ఇది ద్విపదఛందస్సులో రచించబడినది. ఈకావ్యం రచించిన గోనబుద్ధారెడ్డి క్రీ.శ. 13వ శతాబ్ది పూర్వ భాగమునకు చెందినవాడు. వీరి కవిత సరళంగా, పండితపామర జన రంజకంగా ఉంటుంది. కథ చెప్పే విధానంలో వివిధ పాత్రల స్వభావ చిత్రణలో, ప్రకృతి వర్ణనలో బుద్ధారెడ్డి మిక్కిలి నేర్పరి.

ప్రస్తుత పాఠ్యభాగం రంగనాథ రామాయణం బాలకాండ నుంచి గ్రహించబడినది.

I వినండి - సంభాషించండి.

1. ఎలాంటి పనికి పూనుకోవడాన్ని 'భగీరథ ప్రయత్నం' అంటారు?
2. కష్టమైన పనిని మీరే విధంగా సాధించగలరు.

II చదవండి - ఆలోచించండి - రాయండి.

పదజాలాన్ని పెంపొందించుకుందాం - భావం తెలుసుకుందాం.

కందర్పహరుడు = మన్మథుని సంహరించినవాడు (శివుడు); జూటము = జడలగుంపు; భూత + అధిపతి = భూతములకు ప్రభువు; కొమరు = అందము; ఉడువీధి = నక్షత్ర మార్గం (ఆకాశం); విశద + ఉదక = స్వచ్ఛమైన నీరు; శరత్ + అభ్ర + విభ్రమంబు = శరదృతువులోని మబ్బుల అందం; తివుట = ప్రయత్నించు; అవిరళనిశ్రేణులు = ఎడతెగని నిచ్చెనలు; నానా = అనేక విధాలయిన; మాలికావీచులు = వరుసలు గట్టిన తరంగాలు; అన్య + ఆపగా + కీర్తులు = ఇతరమయిన నదుల పేరు ప్రతిష్టలు; డిండీర మాలికలు = నీటి నురుగుబుడగల వరుసలు; అవగాహము = మునక; కలుషించి=కలతనొంది; అనిమిషులు = దేవతలు; రసాతలము = పాతాళం; తీర్థం = పుణ్యజలం.

భావము : భగీరథుని తపస్సుని మెచ్చుకొని మన్మథుని సంహరించిన శివుడు తన శిరస్సుననున్న గంగను భూలోకమునకు వెళ్ళమని పంపెను. శివుని జటాజూటము నుండి బయల్వెడలిన గంగ భూమినంతటిని ఆక్రమించుచున్నట్లు తోచెను. ఆ గంగానది బిందువను సరస్సులో ప్రవేశించెను. అచటనుండి ఏడుపాయలుగా విడిపోయి పావని, హ్రాదిని, నళిని అను మూడు ప్రవాహములు తూర్పు దిశగా ప్రవహించెను. సీత, సుచక్షువు, సింధువు అను మూడు ప్రవాహములు పడమటి దిక్కునకు ప్రవహించెను. ఒకటి భగీరథుని వెంట ప్రవహించుచు వెళ్ళెను. అట్లు వెళ్ళుచున్న గంగ భూమి నుండి స్వర్గలోకము చేరవలెనని కోరువారికి నిచ్చెనలు అమర్చినట్లుండెను. మీ పాపములను ఈ విధముగా త్రిప్పి కడిగి వేయుదును అనునట్లు గంగనీరు సుడులు తిరుగుచుండెను. ఆ నదిలో అప్సరసలు స్నానమాడి ఆనందించిరి. పాపములు చేసినవారు, శాపమును పొందిన వారు ఆ పుణ్యనదిలో స్నానమాచరించి పుణ్యలోకము చేరిరి. దేవతలు, అప్సరసలు, గంధర్వులు, యక్షులు, కిన్నరులు భగీరథుని రథము వెన్నంటి వచ్చుచున్న గంగను వేడుకగా చూచుచు అనుసరించిరి.

పర్వతములను సైతము భేదించుకొనుచు ఉరకలు వేయుచు వచ్చుచున్న గంగానదిలో జహ్ను మహర్షి యాగోపకరణములు కొట్టుకొని పోయెను. తన యాగము విఫలమైనందున కోపించిన జహ్నుమహర్షి గంగను త్రాగివేసెను. దేవతలు, మునులు, భగీరథుడు జహ్నుమునిని ప్రార్థించగా నోటి నుండి గంగను వదలిన ఎంగిలి అగునని భావించి మునీశ్వరుడు తన కర్ణరంధ్రము నుండి గంగను విడిచెను. 'జహ్నుని' కర్ణరంధ్రము నుండి వెడలిన గంగ నాటి నుండి 'జాహ్నవి' అను పేర పిలువబడెను. భగీరథుని రథము వెంట పాతాళలోకము ప్రవేశించిన గంగ సగరపుత్రుల భస్మరాశులపై ప్రవహించి వారికి పుణ్యగతుల నొసగెను. అంతట బ్రహ్మప్రత్యక్షమై భగీరథునితో నేటినుండి గంగ 'భాగీరథి' అను పేరుతో పిలువబడును. త్రిపథ, సరిద్వర అనియు పిలువబడును. నీ పూర్వీకులు సగరుడు, అంశుమంతుడు, దిలీపుడు చేయలేకపోయిన కార్యమును నీవు సాధించితివి. నీవు చిరకీర్తిని పొందుదువు అని పలికెను. భగీరథుడు గంగ యందు స్నానము చేసి అరవై వేల సగరపుత్రులకు తిలోదకముల నొసగెను. అంత ఆ సగరపుత్రులు అమరులై భగీరథుని దీవించి స్వర్గమున కేగిరి. భగీరథుడును అయోధ్యాపురికేగి రాజ్యమేలెను.

కృత్యం

అ) ఖాళీలను సరియగు పదాలతో పూరించండి.

(భస్మముల్, కలుషించి, భాగీరథి, శరనిధి, సగరులు)

1. గంగ నాకర్షించి ______________ క్రోలె.
2. ______________ జొచ్చి ఆ జాహ్నవీ దేవి
3. సగరుల ______________ సరినిండ బాటె.
4. నడచు ______________ నామమీ నదికి.

పుట సంఖ్య 24 లోని ''నింగికి నుప్పొంగి .... జాహ్నవి యనంగనెగడు నీ గంగ'' వరకు

ఆ) అల్లికను పూరించండి.

గంగకు గల పేర్లు

ఇ) i) కింది పదములకు వచనములు మార్చి రాయండి.

1) మునివరులు = ______ 2) రంధ్రము = ______

ii) స్వీయస్పందన

గంగకు 'భాగీరథి' అనునామ మేర్పడుటకు గల కారణమును తెలుపుము.

III వినండి - చర్చించండి - రాయండి.

అ) 1. గంగకు జాహ్నవి అనుపేరు వచ్చుటకు కారణము.

2. గంగ సగరపుత్రులకు పుణ్యగతులు ప్రసాదించిన విధము.

ఆ) ఎవరు, ఎవరితో అనిరి.

1. ''నీ భంగి ద్రిప్పుదు నెల్ల పాపముల నా భంగి జూడుము.

2. ''అనఘా! నీ పేర నడచు భాగీరథీ నామమీ నదికి''

3. 'తీర్థస్నాన విధి సల్పిపుణ్య ఫలము గైకొనుము.''

ఇ) కుండలీకరణములోని అర్థవంతమైన పదాలతో ఖాళీలను పూరించండి.

(భూజనులకు, అచ్చరలు, జాహ్నవి, జూటంబు, భగీరథ)

1. భూతాధిపతి ________________ నుండి ధరణి కేతెంచు గంగ.
2. దివికేగ మదిలోన దివుటు ______________
   అవిరళనిశ్రేణులమరు చందమును.
3. ఆ నదిలోపల నవగాహమంది
   ఆనందమును బొంది యాడిరి ______________
4. గంగ యడరుచు ______________ అను పేర బరగె.

ఈ) అల్లికను పూర్తి చేయండి.

తూర్పు దెసకు వెళ్లిన గంగప్రవాహములు

IV స్వీయస్పందన :

1. నదీ జలాల వలన ప్రయోజనం.
2. నదులలోని నీరు కలుషితం కాకుండా తీసుకుంటున్న జాగ్రత్తలు.

V అభిప్రాయ వ్యక్తీకరణ:

1. నదీ జలాలు కలుషితమగుటకు కారణాలు.
2. పద్యాభాగం ఆధారంగా రసాస్వాదన రాయండి.

VI పద్య/గేయ రసాస్వాదన :

కింది పద్యాలను చదివి మీరు గ్రహించిన భావాన్ని వివరణాత్మకంగా రాయండి.

1. భూతాధిపతి జూటమునునుండి ధరణి
కేతెంచు గంగకు నెండగాకుండ
గొడుగులు వట్టిన కొమరున నంచ
లుడు వీధి జనుదెంచి యొప్పారు చుండ

2. యాగోపకరణంబులవి వెల్లివోయి
యాగ విఘ్నంబైన నమ్మునీశ్వరుడు
నింగికి నుప్పొంగి నెఱినేగుదెంచు
గంగ నాకర్షించి కలుషించి క్రోలె.

VII భాషావగాహన:

అ) పదాలను విడదీసి సంధి కార్యాలు రాయండి.

1. భూతాధిపతి = ________ + ___________ = _________
2. భూతల మెల్ల = ________ + ___________ = _________

ఆ) కింది సమాసములను జతపరచండి.

'క' వర్గము	'చ' వర్గము
1) క్ష్మాపాలుడు	అ) తృతీయా తత్పురుష సమాసం
2) అంబుజగర్భుడు	ఆ) ద్వితీయా తత్పురుష సమాసం
3) అనఘుడు	ఇ) సంభావనా పూర్వ పదకర్మధారయ సమాసం
4) శాపదగ్ధులు	ఈ) బహువ్రీహి సమాసం
5) అయోధ్యాపురము	ఉ) నఞ్ తత్పురుష సమాసం.

ఇ) ప్రకృతులకు, వికృతులను రాయండి.

1) అప్సర = __________
2) ఆకాశము = __________
3) హంస = __________
4) రథము = __________

ఈ) కింది పదాలు ఏ భాషాభాగాలో గుర్తించండి.

1. **పంకజం** — సర్వనామము / నామవాచకము / విశేషణము — [ ]

2. **ఏతెంచు** — క్రియా విశేషణము / విశేషణము / క్రియ — [ ]

ఉ) కింది పద్యపాదాల్లోని అలంకారాన్ని గుర్తించి రాయండి.

1. గొడుగులు వట్టిన కొమరున నంచ
లుడు వీధి జనుదెంచి యొప్పారుచుండ

2. గంగా తరంగ రంగ దభంగ తుంగ
మంగళ చిరకీర్తి మహితుండవగుము.

VIII సృజనాత్మకత :

1. అంతర్జాలంలో 'భర్తృహరి సుభాషితములలోని' ఆకాశంబున నుండి శంభుని'' .... అన్న పద్యాన్ని వెదకి రాసి, దాని భావం రాయండి.
2. మానచిత్ర పటంలో గంగానది ఏఏ ప్రాంతాలలో ప్రవహించుచున్నదో చూసి రాయండి.

IX లేఖన కౌశల్యాలు : ప్రకటన లేఖనం

కింది ప్రకటనను చదివి అడిగినవిధంగా కృత్యాలు చేయండి.

మంచితరుణం - మించినదొరకదు!!

డా॥ ఏ.పి.జె. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా

విద్యార్థులకు ఉపయుక్తమైన

కొత్త మరియు పాత పుస్తకాల

భవ్య ప్రదర్శన

తేది: 15-10-2018 స్థలం : మునిసిపల్ స్కూల్ గ్రౌండ్, నాందేడ్ సమయం: ఉ॥ 10.00 నుండి సా॥ 5.30 వరకు

1) ఈ ప్రకటన ఏ విషయంపై తయారుచేయబడింది.
2) ప్రదర్శన ఏ సందర్భంగా ఏర్పాటు చేయబడినది.
3) ప్రదర్శన ఎప్పుడు, ఎక్కడ ఏర్పాటు చేయబడినది.
4) ప్రదర్శన సమయం ఏమిటి?
5) ప్రదర్శనలో ఏవేవి ప్రదర్శింపబడతాయి.

X విశేషాంశాలు :

భగీరథుడు : ఇక్ష్వాకు వంశంలో ప్రసిద్ధుడయిన ఒక చక్రవర్తి సగరుడు. ఆయన అశ్వమేధయాగం చేసినాడు. సగరుని మనుమడు అంశుమంతుడు. అతని కుమారుడు దిలీపుడు. వీరంతా గంగను నేలకు తెచ్చేందుకు ప్రయత్నించిన వారే, ఆ దిలీపుని కుమారుడే భగీరథుడు.

కపిలమహర్షి కోపాగ్నిలో దగ్ధులైన తన తాతలకు ఉత్తమగతులు కల్పించటం కోసం భగీరథుడు బ్రహ్మను గూర్చి తపస్సు-చేయమనగా భగీరథుని తపస్సుకు మెచ్చిన శివుడందుల కంగీకరించును. శివుడు దర్పముతో నున్న గంగను జటా జూటమున బంధించగా మరలా భగీరథుడు శివుని ప్రార్థించి గంగను పాతాళలోకమునకు తీసికొని వెళ్ళుటకు విడవ వలసినదిగా ప్రార్థించి శివుని ప్రసన్నుని చేసికొనును. శివుని జటాజూటము నుండి వెడలిన గంగ సగర పుత్రులకు మోక్షప్రాప్తిని కలిగించింది.

సాగరము : సగరుని కుమారులచే త్రవ్వబడింది - సముద్రం.

వ్యుత్పత్త్యర్థాలు :

దనుజులు = దనువు అనేవాని వంశంలో జన్మించినవారు = రాక్షసులు;

దైత్యులు = కశ్యప ప్రజాపతి పెద్ద భార్య అయిన దితికి పుత్రులు = రాక్షసులు

త్రిపథగ = మూడు (స్వర్గ, మర్త్య, పాతాళ) మార్గాలలో వెళ్ళునట్టిది - గంగ

భాగీరథి = భగీరథునికి సంబంధించింది (భగీరథునిచే కొనిరాబడినది) - గంగ

జాహ్నవి = జహ్నువు అనే ఋషి సంబంధం గలది. (ఆ ఋషిచే త్రాగబడి, విడువ బడింది) - గంగ.

ఛందస్సు

ద్విపద : 'ద్విపద' పద్యానికి రెండే పాదాలుంటాయి. ప్రతి పాదంలోనూ వరుసగా మూడు ఇంద్రగణాలు ఒక సూర్యగణం మొత్తం నాలుగు గణాలుంటాయి. ప్రాస నియమం ఉన్నది. మూడవ గణం మొదటి అక్షరం యతి చెల్లుతుంది.

	IIII	UII	IIII	UI
ఉదా.	గొడుగులు	పట్టిన	కొమరున	నంచ
	న ల	భ	న ల	గ ల
	IIUI	IIUI	U U I	UI
	ఉడు వీధి	జనుదెంచి	యొప్పారు	చుండ
	స ల	స ల	త	గ ల

సూచన : అక్షరం పైననే గుర్తు వుండాలి 'ం' పైన 'న్' పైన గుర్తులు పెట్టరాదు.

అతిశయోక్తి అలంకారము:

ఒక వస్తువును గురించి మిక్కిలి గొప్పగా వర్ణించి, చెప్పుట అతిశయోక్తి అలంకారము.

ఉదా: **ఆ పట్టణమందలి మేడలు ఆకాశమును** తాకుచున్నవి. ఇచ్చట మేడలు చాలా ఎత్తుగానున్నవని చెప్పుటకు బదులుగా, ఆకాశమునే తాకుచున్నవని గొప్పగా వర్ణించి చెప్పుటచే ఇది **అతిశయోక్తి అలంకారము.**

భాష సౌందర్యం

"రవి గాననిచో కవి గాంచునెయ్యెడన్" అనగా సూర్యుడు చూడ లేనివి కూడా కవి చూడగలడని అర్థం. కేవలం చూడగలగడమే గాదు, ఆ సన్నివేశాన్ని కళ్ళకు కట్టినట్లు ఒక దృశ్యంలాగా చిత్రించగలరు. అట్టి కవిత్వాన్ని 'చిత్ర కవిత్వమంటారు.' ఈ విధమైన కవిత్వంలో పోతన, తిక్కన, కవయిత్రి మొల్ల మొదలగువారు పేర్కొనదగినవారు. ఆ కోవకు చెందినవాడే పాల్కురికి సోమనాథుడు. ఆయన వ్రాసిన కింది పద్యాన్ని చదువుతు దృశ్యాన్ని ఊహించుకొని చూడండి.

తొలికోడి కనువిచ్చి నిలిచిమైవెంచి
జలజల రెక్కలు సడలించి నీగి
గ్రక్కున కాలార్చి కంఠంబు విచ్చి
ముక్కున నీకెలు చక్కొల్పి కడుపు
నిక్కించి మెడసాచి నిక్కి మిన్నూచి
కొక్కొరో కుఱ్ఱని కూయకుమున్న!

కాలం విలువ తెలుపుతూ వేకువననే తానులేచి మనల్ని నిద్రలేపే రంగురంగుల కోడిపుంజు మనస్సులో ప్రత్యక్షమైంది కదూ! ఈ పద్యంలోని అలంకారము 'స్వభావోక్తి'..

నేనిదినేర్చుకున్నా/తెలుసుకున్నా :

'భగీరథ ప్రయత్నం' – అన్న నానుడి ఎట్లు ఏర్పడినది.

6. రాయబారం

నేపథ్యం

- సంధి చేయుట, రాయబారము నడుపుట, దౌత్యము నిర్వహించుట వంటి పదాలు మీరెప్పుడైనా విన్నారా! వాటి అర్థం, ఉపయోగం గురించి చర్చించండి.
- వ్యక్తులు, జట్లు, తెగలు, రాజ్యాలు, దేశాలమధ్య వాగ్వివాదాలు జరిగినపుడు ఇరువైపులవారిని సమాధానపరచి ఒప్పందానికి వచ్చునట్లు చేయు వ్యక్తులు ఉంటారు.
- ఆధునిక కాలంలో వారిని Ambassadors అని, ఆ ప్రక్రియను Embassy అని అంటారు.
- నీ వెప్పుడైనా ఎవరినైనా సమాధాన పరచావా!
- మన పురాణేతిహాసాల్లో ఆంజనేయుడు, సంజయుడు ఎవరెవరి మధ్య సంధిచేయడానికి రాయబారం వహించారు?

ప్రస్తుత పాఠ్యభాగంలో ఎవరు, ఎవరికి రాయబారిగా వెళ్ళారు! ఏమని సమాధానపరిచారు? చదివి, తెలుసుకుందామా!

క. జలదస్వనగంభీరత,
నెలుఁ గొప్పఁగ దంతదీప్తు లెసఁగ ముకుందుం
డలరుచెవుల నఖిలజనం,
బులు విన ధృతరాష్ట్రభూవిభున కిట్లనియెన్ 1

క. జననాథ నీయెఱుంగని,
పనులు గలవె యైనఁ దగవుఁ బరమహితంబుం
దనవారికిఁ జెప్పన తగు
నని వచ్చితి భారతాన్వయము ప్రియ మొందన్. 2



క. క్షీరోదకగతిఁ బాండవ,
కౌరవు లొడఁగూడి మనికి కార్యం బది నీ
వారసి నడపుము వారన,
వీరన గురుముఖ్య నీకు వేఱుం గలదే 3

చ. భరతకులంబు ధర్మమును బాడియు సత్యముఁ బొత్తుఁ బెంపునుం
గరుణయుఁ గల్గి యుండు ననఁగా నుతిఁ గన్నది యందు సద్గుణో
త్తరులరు నీవు నీయనుఁగుఁదమ్ముఁడు నీతనయుల్ యశోధురం
ధరశుభశీలు రీసుచరితక్రమ మిప్పుడు దప్ప నేటికిన్ 4

శా. ఈవంశంబున కెల్ల నీవు కుదురిం దెవ్వారిచందంబు లె
ట్లై వర్తిల్లినఁగీడు మేలుఁ దుది నీయం దొందెడుం గాన స
ద్భావం బారసి లోనిపొత్తు వెలివృత్తంబుల్ జనస్తుత్యముల్
గావింపం దగు నీక యెవ్విధమునం గౌరవ్యవంశాగ్రణీ 5

చ. వినుము సుయోధనాదు లగు వీరు సధర్ములు గాక కార్యము
ల్గొనక మహార్థసిద్ధి యెడలం దమ కిట్లన కన్వయంబు వ
ర్తన మిది గాదు నాక బెడిదం పుదనంబున బంధుకోటికి
న్మనసులు నొవ్వఁగా నవగుణంబులకుం బుయిలోడ రేమియున్. 6

ఉ. కౌరవపాండవుల్ తెఱఁగు గైకొని శాంతతఁ బొంది యున్కి మే
లారయ నాకు నీకుఁ గుల మంతకు నీన్నృపకోటి కుర్వికిం
బోరిత మైన నింతకును బుట్టు మహాపద గావునఁ ధరి
త్రీ రమణాగ్రగణ్య గణుతించి యవశ్యముఁ బొందొనర్పవే 7

తే. నీకు వీరలఁ దీర్పంగ నేర వచ్చు,
నధిప తెఱఁగు నీవశమున యదియ కాన
నీకు వీరలఁ దేర్చుట నెఱియ కాదె,
సిద్ధ మెవ్వారిఁ దెలివొందఁ జేయనేర్తు. 8

ఉ. అందు వృకోదరార్జునుల నాహవరంగమునందు మీఱువా
రెందఱొ యెన్నుమా? యిచట నీగురుభీష్ములఁ గ్రేణి సేయు వా
రెందఱొ? వారు వీరు నని నీల్గుటకంటె భవద్బలంబు లై
యందఱుఁ గూడు టొప్పదె జనాధిప! శాంతి యొనర్పు మెమ్మెయిన్. 9

తే. జగతిఁ గల జనపతులు నీ చరణపీఠ,
మర్థిఁ గొలువ సముద్ర వేలావృతోర్వి
యెల్ల నేలుట యొప్పదే! తల్లి ప్రజల,
కిల విరోధంబు వాటించు టెంతమేలు! 10

క. నరనాథ! నీవుపేక్షా,
పరుఁడ వయినఁ గౌరవులకు పాండవులకు కా
దరయఁగ భూప్రజ కెల్లను,
దురితం బొనరించినట్ల తుదిఁ గీడు సుమీ! 11

క. కౌరవపాండవులం దె,
వ్వారలకుం జావు నొవ్వు వచ్చిన మేలు
ర్వీరమణ! చిత్తమున నె,
ట్లారయుమా! నీకు దుఃఖ మగు నెట్లయినన్. 12

ఉ. వీరును వారుఁ బండితులు, విక్రమవంతులు, బాహుగర్వదు
ర్వారులు లోని రిత్తబవరంబున నాఱడిఁ జావఁ బోవ నె
ట్లూరక యుండ వచ్చుఁ గడునొప్పెడు మేనులు వాఁడికైదువుల్
గూరఁగ నాటినం బుడమిఁ గూలుట కక్కట యోర్వ వచ్చునే! 13

ఆ. ఇట్లు గాక యుండ, నీ రెండు దెఱఁగుల,
వారిఁ గాచికొనుము వసుమతీశ!
నీదు ప్రాభవంబు నీతియు శాంతియు,
నఖిలజనులుఁ బొగడునట్లు గాఁగ. 14

కవి పరిచయం : సంస్కృతంలో వ్యాసమహర్షి రచించిన శ్రీమదాంధ్ర మహాభారతమును తెనుగున నన్నయ, ఎఱ్ఱాప్రగడ, తిక్కన అనుమువ్వురు కవులు రచించిరి. వీరిని కవిత్రయము అందురు. తిక్కన యజ్ఞము చేసి సోమయాజియయ్యెను. ఈయన 13వ శతాబ్దివాడు. తిక్కన విరాటపర్వము మొదలు స్వర్గారోహణ పర్వము వరకు పదునైదు పర్వములు ఆంధ్రీకరించెను. ఈయనకు 'కవిబ్రహ్మ', 'ఉభయకవి మిత్రుడు' అను బిరుదులు కలవు. తిక్కన నిర్వచనోత్తర రామాయణము అనుగ్రంథమును రచించి మనుమసిద్ధికి అంకితమిచ్చెను.

ప్రస్తుత పాఠ్యభాగము తిక్కన అనువదించిన ఉద్యోగ పర్వ మూడవ ఆశ్వాసము నుండి గ్రహింపబడినది. పాండవుల వద్దనుంచి రాయబారిగా వచ్చి ధృతరాష్ట్రునకు, దుర్యోధనాదులకు హితమునుపదేశించుట ఇచ్చట చక్కగా వివరించబడినది.

I వినండి - సంభాషించండి.

1. రాయబారి అని ఎవరిని అంటారు?
2. ఎలాంటి సందర్భాలలో రాయబారము అవసరమవుతుంది?
3. యుద్ధాల వల్ల ఎలాంటి పరిణామాలు ఏర్పడతాయి?

II చదవండి - ఆలోచించండి - రాయండి.

పదజాలాన్ని పెంపొందించుకుందాం - భావాలు తెలుసుకుందాం.

1. జలదస్వన = మేఘగర్జనవంటి; ఎలుగు = కంఠధ్వని; దంతదీప్తులు = దంతముల యొక్క కాంతులు; ఎసగ = ప్రకాశింపగా; ముకుందుండు = శ్రీకృష్ణుడు; అలరు చెవుల = చెవులకు ఇంపు కలిగించునట్లు; భూవిభునకు = రాజునకు.

భావము : శ్రీకృష్ణుడు మేఘగర్జన వంటి గంభీర స్వరముతో, దంతకాంతులు ప్రకాశించుచుండగా, చెవుల కింపు కలిగించునట్లుగా జనులందరు వినుచుండగా ధృతరాష్ట్రునితో ఇట్లనెను.

2. తగవు = న్యాయము; పరమ హితంబు = శ్రేష్ఠమైన మంచి మాటలు; భారత + అన్వయము = భారతవంశము.

భావము : ఓ రాజా! నీకు తెలియని విషయములు (పనులు) ఏవైనా కలవా. ఐనను భరతవంశము ప్రీతి పొందునట్లుగా తనవారికి న్యాయమును, పరమ శ్రేష్ఠమైన మేలును చెప్పుట మంచిదని తలచి వచ్చితిని.

3. మనికి = కలిసిఉండుట, ఒడగూడి=కలిసిమెలిసి, ఆరసి=తెలిసికొని.

భావము : పాలు, నీరు వలె పాండవులు, కౌరవులు ఐకమత్యముతో ఒక్కటిగా ఉండుట చేయదగిన పని. ఓ కురుశ్రేష్ఠుడా! నీకు వారు, వీరను భేదము గలదా. బాగుగా ఆలోచించి కార్యము నెరవేర్చుము.

4. పాడియు = న్యాయమును; నుతి = కీర్తి; సత్+గుణ = మంచి గుణములు; ఉత్తరులు = శ్రేష్ఠులు; యశః+దురంధరులు = మిక్కిలి కీర్తికెక్కినవారు.

భావము : భరతవంశం ధర్మము, న్యాయము, సత్యము, ఐకమత్యము, అభివృద్ధి, కరుణ కలిగియుండును అని ప్రసిద్ధికెక్కినది. వారిలో నీవు, నీ తమ్ముడైన పాండురాజు, నీ కుమారులు కీర్తి గడించిన వారిలో శ్రేష్ఠులు. ఆ మంచి చరితను ఇప్పుడు ఎందుకు తప్పవలెను.

5. కుదురు = మూలము; ఒందెడు = కలుగును; సత్+భావంబు = మంచి ఆలోచన; ఆరసి = చేసి; వెలివృత్తంబు = బయటి ప్రవర్తన; జనస్తుత్యముల్ = జనులచే పొగడబడునట్లుగా; కావింపన్ + తగు = చేయుట తగినదని; కౌరవ్యవంశ + అగ్రణీ = ఓ కురువంశ శ్రేష్ఠుడా.

భావము : ఓ కురువంశశ్రేష్ఠుడా! ఈ వంశమునకు నీవే మూలము. ఎవరు ఏ విధముగా ప్రవర్తించినను ఆమేలు, కీడులు నీకే కలుగును. కావున మనసులోని ఆలోచన, బయటి ప్రవర్తన ప్రజలందరిచే పొగడబడునట్లుగా నీవే ఏ విధముగనైనను చేయవలయును.

6. సుయోధనాదులు = దుర్యోధనుడు మొదలుగా గల కౌరవులు; సధర్ములు కాక = ధర్మమార్గమును అనుసరించక; కార్యము = పని; కొనక = చేయక; అన్వయవర్తనము = ప్రవర్తనా విధానము; బెడిదంపుదనము = కఠినత్వము; నొవ్వగా = నొచ్చునట్లుగా; అవగుణంబులకు = చెడు ప్రవర్తనకు; వుయిలోడరు = వెనుకంజవేయరు.

భావము : ఓ రాజా వినుము! సుయోధనుడు మొదలుగా గల ఈ కౌరవులు ధర్మ మార్గమును అనుసరించుట లేదు. మంచి కార్యములు చేయుట లేదు. ప్రవర్తించు విధమును పాటించక, కఠినమైన మాటలతో బంధువుల మనస్సు నొచ్చునట్లుగా, చెడు కార్యములు చేయుచున్నారు.

7. తెఱగు = తగిన మార్గమును; కైకొని = స్వీకరించి; ఉన్కి = ఉండుట; ఆరయ = ఆలోచించి చూడగా; నృపకోటికి = ఈ రాజుల సమూహమునకు; ఉర్వికిం = ఈ (ప్రపంచమునకు) భూమికి; పోరితము + ఐన = యుద్ధము సంభవించిన; మహా+ఆపద = పెద్ద ఆపద; ధరిత్రీరమణ + అగ్రగణ్య = రాజులలో శ్రేష్ఠుడా; గణుతించి = లెక్కింపగా; అవశ్యము = వెంటనే; పొందు = సఖ్యత; ఒనర్పవే = కూర్చవే, చేయవే.

భావము : ఆలోచించి చూడగా కౌరవపాండవులు తగిన మార్గమును స్వీకరించి శాంతితో యుండుట నీకు, నాకు, ఈ వంశమునకు మేలు. ఈ రాజులందరకు యుద్ధమైనచో పెద్ద ఆపద సంభవించును. ఓ రాజశ్రేష్ఠుడా! ఆలోచించి వెంటనే సంధి చేయుము.

8. తీర్పంగ = న్యాయము చేయుటకు; తెఱగు = విధము; నీ వశము = నీ అధీనము; నెఱి = ధర్మము/న్యాయము.

భావము : ఓ రాజా! నీవు చేయదలచినచో న్యాయము చేయగలవు. ఆ పని నీ చేతియందే ఉన్నది. కావున వారికి న్యాయము చేయుట తగిన పని కదా! ఇరుపక్షముల వారిలో ఎవరికి చెప్పవలెనో నీకు తెలియును.

9. వృకోదరుడు = తోడేలు పొట్టవంటి పొట్టకలవాడు (భీముడు); ఆహవరంగము = యుద్ధరంగము; మీఱుట = ఓడించుట; ఎన్నుము = లెక్కించుము; క్రేణిసేయు = తక్కువ చేయు; అనిన్ = యుద్ధరంగమందు; ఈల్గుట = మరణించుట; కూడియుండుట = సఖ్యముగా ఉండుట.

భావము : ఆ పక్షములోని భీమార్జునులను యుద్ధరంగములో ఎదిరించగలవారెవరో చెప్పుము. ఇక్కడ భీష్మద్రోణులను ఎదిరించగలవారెవరు. యుద్ధ రంగమున వారును, వీరును మరణించుటకంటే నీ బలముగా అందరూ కలిసియుండుట మేలు కాదా. ఓ రాజా! ఏ విధముగనైనను శాంతి చేకూరునట్లు చేయుము.

10. అర్థిన్ = ప్రీతితో; సముద్ర = సముద్రము చేత; వేలావృత = చుట్టబడిన; ఉర్విన్=భూమిని.

భావము : ఓ రాజా! భూమిపైగల రాజులందరూ నీ చరణములను సేవించుచుండగా సముద్రముచేత చుట్టబడిన ఈ భూమిని పాలించుట మంచిది కాదా! తల్లి ప్రజలపై కోపించుట ఎంత వరకు సమంజసము?

11. దురితంబు = ఆపద, కష్టము.

భావము : ఓ రాజా! నీవు అశ్రద్ధ చేసిన (నిర్లక్ష్యము) కౌరవ పాండవులకే కాదు, ప్రజలందరకు చెడు చేసిన వాడవగుదువు. చివరకు అది కీడును కలిగించును.

12. నొవ్వు = బాధ, దుఃఖము; చిత్తము = మనస్సు; అరయుము = ఆలోచించుము.

భావము : ఓ రాజా! కౌరవపాండవులలో ఎవరకు చావు, దుఃఖము వచ్చినను మంచిదా? నీవే ఆలోచించుము. ఏ విధముగనైనను నీకే దుఃఖము కలుగును.

13. బాహుగర్వ = భుజబల గర్వముచే; దుర్వారులు = వారింపశక్యము కానివారు; రిత్త = వ్యర్థము, ఊరకనే, బవరము = యుద్ధము; ఆఱడి = హాని; కైదువులు = కత్తులు, ఆయుధములు.

భావము : కౌరవ పాండవులిద్దరును విద్యావంతులు, పరాక్రమవంతులు, బాహుబలములో జయింపశక్యము కానివారు. అట్టివారు వ్యర్థముగా యుద్ధమున మరణించుచుండగా ఎట్లు ఊర్కొనవచ్చును. అయ్యో! ఎంతో అందమైన శరీరములు వాడి బాణములు గ్రుచ్చుకొని నేలబడుచుండగా ఎట్లు సహించవచ్చును?

14. రెండు తెఱగుల వారిని = ఇరుపక్షముల వారిని; వసుమతి = భూమి.

భావము : ఓ రాజా! నీ గొప్పదనము, నీతి, శాంతి సమస్త జనులు పొగడునట్లుగా ఇరుపక్షములవారిని రక్షించుము.

III వినండి - చర్చించండి - రాయండి.

అ) జవాబులు రాయండి.

1) కృష్ణుడు ధృతరాష్ట్రుని వద్దకు రాయబారిగా వచ్చుటకు కారణము.
2) కృష్ణుడు గావించిన హితబోధ
3) భరతవంశ గొప్పతనము
4) ధృతరాష్ట్రుడు చేయదగిన కార్యము

ఆ) ఖాళీలు పూరించండి.

1) సుచరిత్ర క్రమము _______________ తప్ప నేటికన్. (ఇప్పుడు, అప్పుడు)
2) శాంతత పొంది యున్కి _____________ అరయ నాకు, నీకు. (మేలు, కీడు)

ఇ) తప్పొప్పులు గుర్తించి రాయండి.

1) అందు దుర్యోధనోత్తరులరు నీవు నీ యనుగు తమ్ముడు ( )
2) ఈ వంశంబునకు నీవు కుదురు ( )
3) యుద్ధము వలన నీకు మేలు కలుగును ( )
4) క్షీరోదకగతి బాండవ కౌరవలొడగూడి మనికి కార్యము ( )
5) వీరును వారు పండితులు ( )

IV స్వీయ స్పందన :

1) కౌరవ పాండవుల మధ్య దూతగా వెళ్తే నీవు ఏ విధంగా రాయబారం జరుపుతావు?
2) భారతంలో మీకు నచ్చిన ఒక పాత్రను గురించి సొంత మాటల్లో రాయండి.

V అభిప్రాయ వ్యక్తీకరణ :

1) పద్యభాగ వృత్తాంతాన్ని రాయండి.

2) పద్యభాగమాధారంగా గ్రహించిన విలువలు పట్టికగా రాయండి.

VI పద్య/గేయ రసాస్వాదన:

కింది పద్యాన్ని చదివి మీరు గ్రహించిన భావాన్ని వివరణాత్మకంగా రాయండి.

క. **క్షీరోదకగతిఁ బాండవ,**
కౌరవు లొడఁగూడి మనికి కార్యం బది నీ
వారసి నడపుము వారన,
వీరన గురుముఖ్య నీకు వేఁటుం గలదే.

VII భాషావగాహన

అ) ''రాజు'' ''భూమి'' అను పదములకు **పాఠ్యభాగంలో** వచ్చిన పర్యాయపదాలు రాయండి.

రాజు

భూమి

ఆ) కింది పదాలకు పర్యాయపదాలు రాయండి.

క్షీరము – ______

తల్లి – ______

మేను – ______

ఇ) ప్రకృతి, వికృతులు రాయండి.

గుణము – ______

పీఠము – ______

కర్జము – ______

ఈ) సంధులను జతపరచండి.

'క' వర్గము	'చ' వర్గము
1) వసుమతి + ఈశ	అ) సరళాదేశసంధి.
2) ఏ + వారు	ఆ) గుణసంధి
3) వీరలన్ + తీర్పంగ	ఇ) సవర్ణ దీర్ఘసంధి
4) వారు + ఎందరో	ఈ) త్రికసంధి
5) వేలాపృత + ఉర్వి	ఉ) ఉకారసంధి

ఉ) సమాసాన్ని ఎన్నుకొని రాయండి.

1) అనుగుందమ్ముడు ______

(i) విశేషణ పూర్వపద కర్మధారయ సమాసము (ii) ద్వంద్వ సమాసము

(iii) రూపక సమాసము (iv) ద్విగు సమాసము

2) కౌరవపాండవులు – ______

(i) ద్విగుసమాసము (ii) ద్వంద్వ సమాసము

(iii) రూపక సమాసము (iv) తృతీయా తత్పురుష సమాసము

ఊ) గణ విభజన చేసి, యతిస్థానమును గుర్తించి, ఏ పద్యపాదమో తెల్పండి.

1) భరతకులంబు ధర్మమును బాడియు సత్యము బొత్తు పెంపునుం
2) కావింపందగు నీకయెవ్విధమునం గౌరవ్యవంశాగ్రణీ
3) కౌరవపాండవుల్ తెఱగుగ్గైకొని శాంతతబొంది యున్కిమే
4) జగతిగల జనపతులు నీ చరణ పీఠ
5) ఇట్లు గాక యుండ నీ రెండు దెఱగుల వారి గాచికొనుము వసుమతీశ

VIII సృజనాత్మకత :

1) రాయబార ఘట్టాన్ని సంభాషణ రూపంలో రాసి, నాటకీకరణ చేసి, పాఠశాల వార్షికోత్సవంలో ప్రదర్శించండి.
2) భారతంలో ఏదేని పాత్రను ఏకపాత్రాభినయం చేయండి.
3) 'తింటే గారెలు తినాలి, వింటే భారతం వినాలి' అనే నానుడి ఏ విధంగా వచ్చిందో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
4) భారత – పాకిస్తాన్‌ల మధ్య సంధి చేయడానికి లాల్‌బహద్దూర్ శాస్త్రి తాష్కంట్ వెళ్ళిన సంఘటనను గురించి తెలుసుకోండి.

IX లేఖన కౌశల్యాలు : వ్యాసరచన : ఆలోచనాత్మక వ్యాసం.

'కాలుష్యం - నివారణోపాయాలు' – గురించి ఆలోచించి వ్యాసం రాయండి.

ఆటవెలది :

ఇందు నాలుగు పాదములుండును. 1, 3 పాదములలో వరుసగా 3 సూర్యగణములు, 2 ఇంద్రగణములు ఉండును. 2, 4 పాదములలో 5 సూర్యగణములు ఉండును. పాదములోని మొదటి అక్షరమునకు నాల్గవ గణము యొక్క మొదటి అక్షరమునకు యతి చెల్లును. ప్రాస నియమము లేదు.

ఉదా.

గల	గల	గల	త	నల
U I	U I	U I	U U I	I I I I
ఇట్లు	గాక	యుండ	నీ రెండు	దెఱఁగుల

గల	గల	న	న	గల
U I	U I	I I I	I I I	U I
వారిc	గాచి	కొనుము	వసుమ	తీశ

అంతర్జాలం :

అంతర్జాలంలో తెలుగు. **'ఈ'-పుస్తకాలు; బ్లాగులు** మొదలగు వాటిలో మరిన్ని భారత కథల గురించి చదవండి.

నేనిది నేర్చుకున్నా:

కథలు, కవితలలోని వివిధ శైలులు.

ఉ.సూ. భారతము, రామాయణము, భాగవతాలలోని పద్యాలను చదివి వినిపించండి.

వి.సూ. ప్రాచీన సాహిత్యంలోని పద్యాలను చదివి రసాస్వాదన చేయండి. పద్యరచనకు ప్రయత్నించండి.

7. ప్రపంచపదులు

నేపథ్యం

కింది పదాలను, వాక్యాలను గమనించండి. ఇవేంటి? ఇందులో ఏది ఏ ప్రపంచపదికి అన్వయిస్తుందో పాఠం చదివి జతచేయండి చూద్దాం.

సార్థకత	*కృషితో నాస్తి దుర్భిక్షమ్*	*కష్టేఫలి*
శ్రమనుకాదు పొందినవృద్ధిని లెక్కించాలి.		*కొరతను తెలుసుకొని గురిపెట్టు*
	నీలో చేవ ఉంటే ఆకాశమే హద్దు! అడ్డుకోలేరెవరు.	

ఎన్ని మెట్లు ఎక్కావని కాదు ఎంత యెత్తుకెదిగావనీ
ఎన్ని మునకలేశావని కాదు ఎంత లోతు చూశావనీ
గమనం సార్థకమవుతుంది నీ గమ్యాన్ని చేరినప్పుడే...
ఎన్ని సభలు తిరిగావని కాదు ఎంత బుద్ధి పెంచావనీ
ఎన్ని కృతులు చదివావని కాదు ఎంత సిద్ధిపొందావనీ. 1



ఏ రాపిడి లేకుండా వజ్రం ఎలా మెరుస్తుంది?
ఏ అలజడి లేకుండా సంద్రం ఎలా నిలుస్తుంది?
నడిపించే చైతన్యం లేనిది నడవదు ఈ సృష్టి ---
ఏ ప్రేరణ లేకుండా నాదం ఎలా పలుకుతుంది?
ఏ స్పందన లేకుండా హృదయం ఎలా బతుకుతుంది? 2

కలిమికి సాఫల్యం అది నలుగురికీ దక్కినప్పుడే
పదవికి సాఫల్యం అది ప్రజల మనసుకెక్కినప్పుడే
వ్యక్తి చుట్టు తిరిగే ఆ శక్తి ఉండిలేనట్టేలే --
తెలివికి సాఫల్యం అది తెరలు చీల్చుకొచ్చినప్పుడే
బలిమికి సాఫల్యం అది బలహీనులు మెచ్చినప్పుడే. 3

కరగనిదే కొవ్వొత్తికి కాంతి ఎలా పుడుతుంది?
చెక్కనిదే శిలకడుపున శిల్పమెలా పుడుతుంది?
ఫలితం అందేది తీవ్ర పరిణామంలోనే సుమా --
మరగనిదే నీరు ఎలా మబ్బు రూపుకడుతుంది?
నలగనిదే అడుగు ఎలా నటన రక్తి కడుతుంది? 4

బురదలోన వుంటున్నా తరగదు పద్మం విలువ
తాటాకున పడివున్నా తగ్గదు పద్యం విలువ.
అసలు సిసలు పసవుంటే అవరోధించేదెవరు --
అరసికులే మంటున్నా చెరగదు గానంవిలువ
మూర్ఖులు ముంచేస్తున్నా మునగదు జ్ఞానం విలువ. 5

చేతగాని తనముంటే జాతకాన్ని నిందించకు
నమ్మలేని సరకుంటే అమ్మకాన్ని నిందించకు.
ఎందుకైన మేలు లోపమెక్కడుందో తెలుసుకుంటె --
చేయిజారిపోతుంటే జీవితాన్ని నిందించకు.
కలం రాయలేకుంటే కాగితాన్ని నిందించకు. 6

కవి పరిచయం : డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి గారు 1931లో జన్మించారు. ప్రముఖ ఆధునిక గేయకవి. • వక్త • వ్యాఖ్యాత • పరిశోధకులు • బహుభాషావేత్త • ప్రామాణికమైన వీరి పరిశోధన గ్రంథం ''ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు, ప్రయోగములు''.

వీరు చాలాకాలం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖలో ఆచార్యులుగా ఉన్నారు. తరువాత అధికార భాషా సంఘం అధ్యక్షులుగాను, అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి, తెలుగు విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్స్‌లర్‌గా పని చేశారు.

నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, మధ్యతరగతి మందహాసం, విశ్వంభర మొదలైన కావ్యాలు నలభైకి పైగా వ్రాశారు. ప్రతిష్ఠాకరమైన జ్ఞానపీఠ బహుమతి అందుకున్నారు. పద్మభూషణ్ బిరుదు పొందారు.

ఈ పాఠ్యాంశం వీరి 'ప్రపంచపదులు' కావ్యం నుంచి గ్రహించబడింది. ఈ ప్రపంచపదుల్లో మనిషిని - అతని సాధక బాధకాలను చిత్రించడమే కాకుండా మనిషి జీవితం సాఫీగా సాగటానికి తగిన పరిష్కారాలు, సూచనలు కూడా ఉన్నాయి.

I వినండి - సంభాషించండి.

1. 'శతకము' అని దేనిని అంటారు.
2. శతక పద్యలక్షణాలు ఏంటి?
3. మీకు వచ్చిన సుమతి, వేమన, తెలుగుబాల పద్యాలను చెప్పండి.

II చదవండి - ఆలోచించండి - రాయండి.

పదజాలాన్ని పెంపొందించుకుందాం - భావాలు తెలుసుకుందాం.

మునక = నీటిలో మునిగి తేలుట; సార్థకము = సఫలము, ప్రయోజనం; గమ్యము = చేరవలసిన స్థానము; కృతులు = కావ్యములు; రాపిడి = ఒరుసుకొను; అలజడి = కల్లోలము; నడిపించే చైతన్యము = నడిపించే తెలివి; ప్రేరణ = పురికొల్పుట; నాదం = శబ్దం; స్పందన = ఇంచుక కదలుట; సిద్ధి = పూర్తి, వాంఛితప్రాప్తి; ఎత్తు = ఉన్నతము; సంద్రం = సముద్రము; సాఫల్యం = ఫలితము; పరిణామం = మార్పు; మరుగుట = కాగుట; రక్తి = రాగము, అనురాగము; అవరోధించు = అడ్డుకొను.

1. ఎన్నిమెట్లు (అడుగులు) పైకి ఎక్కావని, ఎంత ఉన్నతికి చేరు కున్నావనీ కాదు, బావిలో ఎన్ని మునకలేశావని, ఆ బావి ఎంతలోతు చూశావనీ కాదు, ఎన్నో సభలు తిరగటం ముఖ్యంకాదు; నీవెంత బుద్ధి (తెలివితేటలు) పెంచావన్నది ముఖ్యం. ఎన్ని కావ్యాలు చదివినది ముఖ్యం కాదు. దానినుండి నీ వెంత జ్ఞానాన్ని పొందావన్నది ముఖ్యం. చేరవలసిన స్థానం చేరుకున్నపుడే నీ గమనం సఫలమవుతుంది.
2. ఏ రాపిడి లేకుండా వజ్రం మెరవదు. అలలతో శబ్దం చేయకుండా సముద్రం నిలకడగా ఉండదు. ఏ ప్రేరణ లేకుండా వీణ పలుకదు. హృదయం స్పందించకుండా ఉంటే మనిషి జీవించలేడు. అలాగే ఈ సృష్టిని నడిపించే చైతన్యం లేనిదే నడవదు.
3. సంపద నలుగురికి లభించినపుడే దానికి ప్రయోజనం కలుగుతుంది. ప్రజలు ఇష్టపడినప్పుడే ఆ పదవికి ప్రయోజనం కలుగుతుంది. తెలివి వ్యాపించినప్పుడే దానికి ఫలితం దక్కుతుంది. బలహీనులు మెచ్చుకొన్నప్పుడే బలమునకు సార్థకత చేకూరుతుంది. మనిషికి ఎంత శక్తి సామర్థ్యాలున్ననూ, నలుగురికీ ఉపయోగపడనపుడు అవి వ్యర్థమే.
4. కొవ్వొత్తి కరగకుండా కాంతిని ఇవ్వలేదు. శిలను కూడా చెక్కక పోతే శిల్పముగా రూపుదాల్చదు. నీరు మరగకుండా మబ్బులు ఏర్పడవు? పాదాలు కందేటట్లు అడుగులు వేయకుండా నాట్యం రక్తి కట్టదు. తీవ్రమైన పరిణామం జరిగినపుడే సత్ఫలితం కలుగుతుంది.
5. తామరపువ్వు బురదలో పెరుగుతున్నా దాని విలువ తగ్గదు. పద్యం తాటాకుల్లో రాయబడినప్పటికి దాని విలువ తగ్గదు. అరసికులు ఏమంటున్నా గానం విలువ చెరిగిపోదు. మూర్ఖులు (తెలివిలేనివారు) మనల్ని ముంచేస్తున్నా మనకున్న జ్ఞానం తగ్గిపోదు. నిజమైన శక్తి మనలో వుంటే ఎవరు అడ్డు పడలేరు.
6. మనకు చేతగాని తనముంటే మన జాతకాన్ని నిందించకూడదు. చెడిపోయిన సరకున్నపుడు అమ్మకాన్ని నిందించకూడదు. మన చేయి జారిపోతున్నపుడు జీవితాన్ని నిందించకూడదు. కలం రాయలేదని కాగితాన్ని నిందించకూడదు. మనలో లోపమెక్కడుందో తెలుసుకుంటే మంచిది.

తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలు ఉన్నాయి. ఉదా.: **పద్యం, గద్యం, నాటకం, నవల, ప్రబంధం, కావ్యం** మొదలగునవి. పద్యాలలో కూడా రెండు పాదాలు (ద్విపద), నాలుగు పాదాలు (ఉత్పల-చంపక మాలలు, శార్దూల-మత్తేభాదులు) గల పద్యరకాలు ఉన్నాయి. పార్శీలోని 'రుబాయి'లో నాలుగు పాదాలుంటాయి. డా.సి. నారాయణరెడ్డి గారు వాటిని ఐదు పాదాలకు పెంచి '**ప్ర'పంచపదులు** అను నూతన ఛందస్సును ఆవిష్కరించారు.

కృత్యం :

పాఠ్యభాగంలోని కింది పద్యాలను చదివి, సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ) కింది వాక్యాల తప్పొప్పులను గుర్తించి రాయండి.

1) బలిమికి సాఫల్యం అది బలవంతులు మెచ్చినప్పుడే ( )

2) నలగని అడుగుతో నటన రక్తి కడుతుంది. ( )

3) ఫలితం అందేది తీవ్రపరిణామంలోనే ( )

4) పదవికి సాఫల్యం అది ప్రజల మనసుకెక్కినప్పుడే ( )

పుట సంఖ్య 38, 39 లోని 3, 4 పంచపదులు

ఆ) కింది పద్యపాదాలను జతపరచండి.

'క' వర్గము	'చ' వర్గము
1) కలిమికి సాఫల్యం	అ) ఉండి లేనట్టేలే
2) వ్యక్తిచుట్టు తిరిగే ఆ శక్తి	ఆ) ఎలా మబ్బు రూపుకడుతుంది?
3) కరగనిదే కొవ్వొత్తికి	ఇ) అది నలుగురికి దక్కినప్పుడే
4) మరగనిదే నీరు	ఈ) ఎలానటన రక్తి కడుతుంది?
	ఉ) కాంతి ఎలాపుడుతుంది?

ఇ) i) కింది పదాలకు సమానార్థక పదాలు రాయండి.

1) కలిమి = 2) పరిమాణాము =

ii) స్వీయస్పందన

తీవ్ర పరిణామమున్నపుడు ప్రయోజనముండునని ఎట్లు చెప్పగలవో నీ సొంత మాటల్లో రాయుము.

III వినండి - చర్చించండి - రాయండి.

అ) జవాబులు రాయండి.

1) గమనం ఎప్పుడు సార్థకమగునో వివరించండి.

2) బలిమికి సాఫల్యం కలుగుతీరు.

3) తీవ్ర పరిణామమున్నపుడు కలుగు ప్రయోజనము.

4) అసలైన సామర్థ్యాన్ని గురించి కవి అభిప్రాయము.

5) ఫలితం సాధించలేకపోయినప్పుడు చేయరానిది.

ఆ) ఖాళీలను అర్థవంతమైన పదాలతో పూరించి, పద్యపాదాల్ని తిరిగి రాయండి.

1) ఎన్ని _______________ చదవాలని కాదు ఎంత సిద్ధిపొందావని.

2) ఏ _______________ లేకుండా సంద్రం ఎలా నిలుస్తుంది?

IV స్వీయస్పందన

''నడిపించే శక్తి లేనిదే సృష్టి నడవదు'' -- వివరించండి.

V భాషావగాహన :

అ) వ్యతిరేక పదాలు రాయండి.

1) చీకటి × ______ 2) మంచి × ______

3) దూరము × ______ 4) బలహీనులు × ______

5) అరసికులు × ______ 6) జ్ఞానం × ______

7) దయ × ______ 8) మేలు × ______

ఆ) కింది పదాలకు వచనాలు మార్చి రాయండి.

1) వజ్రాలు = ______ 2) వ్యక్తి = ______

3) బలహీనులు = ______ 4) కొవ్వొత్తి = ______

5) పద్యాలు = ______ 6) జాతకాలు = ______

ఇ) కింది పదాలను విడదీసి, సంధిపేరు రాయండి.

1) చేరినప్పుడు = ______, ______

2) తలకెక్కుట = ______, ______

3) అవరోధించేదెవరు = ______, ______

4) రాయలేకుంటే = ______, ______

ఈ) కింది విగ్రహవాక్యములు ఏ సమాసములకు చెందినవో రాయండి.

1) తీవ్రమైన పరిణామం
- విశేషణ పూర్వపద కర్మధారయ సమాసము
- ద్విగు సమాసము
- ద్వంద్వ సమాసము

______

2) రెండు సంఖ్యగల మూరలు
- బహువ్రీహిసమాసము
- ద్విగు సమాసము
- అవ్యయీభావ సమాసము

______

3) రసికులు కానివారు
- నఞ్‌తత్పురుష సమాసము
- షష్ఠీ తత్పురుష సమాసము
- బహువ్రీహి సమాసము

______

4) ధర యొక్క గుణము
- షష్ఠీ తత్పురుష సమాసము
- ద్వంద్వ సమాసము
- ద్విగు సమాసము

______

5) తాడును, బొంగరమును
- ద్విగుసమాసము
- విశేషణ పూర్వపద కర్మధారయ సమాసము
- ద్వంద్వ సమాసము

______

VI సృజనాత్మకత :

1) నీ విద్యాభ్యాసానికి 'ప్రేరణ' ఎవరు? ఏ విధంగా? సొంత వాక్యాల్లో రాయండి.

2) సంపద, శక్తి ఈ రెంటిని మానవుడు ఏవిధంగా ఉపయోగించుకోవాలో సొంతమాటల్లో తెలియజేయండి.

అనువదిద్దాం - ఆనందిద్దాం

* కింది ఆంగ్ల అంశాలను తెలుగులోనికి, తెలుగు అంశాలను ఆంగ్లంలోనికి అనువదించండి.

- తగ్గించండి — R ....
- పునరుపయోగించండి — R ....
- మార్చి ఉపయోగించండి — R ....

పొడి చెత్త	....
....	WET WASTE

....
SAVE THE ENVIRONMENT

నేనిదినేర్చుకున్నా :
భాషలోని సూక్ష్మ భేదాలు, నియమాలు లేఖనంలో ఉపయోగించడం.

ఉ.సూ. నారాయణరెడ్డి గారి ఇతర రచనలను విద్యార్థులకు పరిచయం చేయండి.

వి.సూ.: జ్ఞానపీఠ అవార్డును గురించి తెలుసుకొని, అది పొందిన రచయితలను గురించిన సమాచారాన్ని సేకరించండి.

8. కృషీవలుడు

నేపథ్యం

మా తాతగారు అనేవారు ''జీవితంలో డాక్టరు, లాయరు, పోలీసు, ప్రవచనకారుల అవసరం అరుదుగా వస్తుంది. కాని రైతు అవసరం ప్రతిరోజు మూడుపూటలా ఉంటుంది.'' అని వ్యవసాయదారిణి మరియు పశు సంక్షేమంలో కెనడా దేశపు ప్రథమ మహిళ అయన్ బ్రెండా స్కోప్ అంటారు.

మనదేశం వ్యవసాయ ప్రధానమైన దేశం. రైతును మనం అన్నదాతగా ఆరాధిస్తాం. ఈ ప్రాముఖ్యతను గుర్తించే శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రిగారు దేశ రక్షణకు ప్రాణాలర్పించే సైనికులతో సమానంగా ప్రాణాధారమైన రైతును నిలిపి ''జై జవాన్, జై కిసాన్'' అని నినదించారు. అట్టి కృషీవలుని విశిష్టత గురించి తెలుసుకుందామా!



చ. సమయమమూల్య, మొక్క నిమిషంబు వృథా చన గ్రమ్మఱింప నే
రము; మనయాయువాత్రుటి పరంపర యౌట నెఱింగి, నిద్రమాం
ద్యమును దొలంగి మీ పనుల నారయుడో జనులారయంచు డం
బముగ మెడన్నిగిడ్చి కృకవాకము గూసెడి నింటి కొప్పునన్. **(1)**

తే. సైరికా, నీవు భారతక్ష్మాతలాత్మ
గౌరవ పవిత్రమూర్తివి! శూరమణివి!
ధారుణీపతి పాలన దండమెపుడు
నీహలంబు కన్నను బ్రార్థనీయమగునె? **(2)**

తే. ప్రొద్దు వొడిచిన దాదిగా ప్రొద్దుగ్రుంకు
వఱకు కష్టింతువే గాని యిరుగు పొరుగు
వారి సంపదకై యీసు గూర బోవ
వెంత నిర్మల మోయి, నీ హృదయ కళిక. **(3)**

తే. ఉండి తిన్నను లేక పస్తున్న గాని
యాస చేయవు పరుల కష్టార్జితంబు!
నాకలెత్తగ నీ పంచ కరుగు నతిథి
తినక, త్రావక పోయిన దినము లేదు. **(4)**

తే. కృషి సకల పరిశ్రమలకు కీలుచీల
సత్పరిశ్రమ వాణిజ్య సాధనంబు;
అఖిల వాణిజ్యములు సిరికాట పట్లు
సిరియె భోగోపలబ్ధికి జీవగఱ్ఱ. **(5)**

తే. కడ మొదలు లేని నీదేహకష్టములకు
ప్రతిఫలంబగు సస్య సంపత్తి గాంచి
కవివి గాకున్న వాగ్మిత గలుగకున్న
ప్రణుతి వర్ణింపు మొకసారి భాగ్యగరిమ **(6)**

కవి పరిచయం : దువ్వూరి రామిరెడ్డి ఆంధ్రప్రదేశ్, నెల్లూరు జిల్లాలోని పెమ్మారెడ్డి పాలెంలో జన్మించారు. లక్ష్మీదేవమ్మ, సుబ్బారెడ్డి వీరి తల్లిదండ్రులు. ఈయన కవికోకిల బిరుదాంకితుడు. కృషీవలుడు, పానశాల, పలితకేశము మొ॥ కావ్యాలు, మాధవ విజయం. కాంగ్రెస్ వాలా మొ॥ నాటకాలు కూడా రచించారు.

ప్రస్తుత పాఠ్యభాగం 'కృషీవలుడు' అనుగ్రంథము నుండి గ్రహించబడినది. పల్లె జీవితాన్ని ఇందులో కవి చక్కగా వర్ణించారు. ''కష్ట జీవులైన కర్షకుల శ్రమను గౌరవించటాన్ని, కాలం విలువను ఈ పాఠ్యభాగంలో చక్కగా వర్ణించారు.

I వినండి - సంభాషించండి.

1. ఆహారం - ఆరోగ్యం.
2. రైతు దేశానికి వెన్నెముక.

II చదవండి - ఆలోచించండి - రాయండి.

పదజాలాన్ని పెంపొందించుకుందాం - భావం తెలుసుకుందాం.

1. అమూల్యం = విలువ కట్టలేనటువంటిది; క్రమ్మరింప నేరము = వెనుకకు మరల్చలేము; ఆయువు = ప్రాణము; త్రుటి = క్షణము; కృకవాకము = కోడి.

   భావము: కాలం విలువకట్టలేనిది. ఒక్క నిమిషము వృథాయైన దానిని తిరిగి పొందలేము. ప్రాణము క్షణికము అని తెలుసుకొని నిద్రమత్తువదిలి మీ పనులను చేసి కొమ్మని ఒక కోడి డంబంగా ఇంటి కప్పుపై నుండి కూసింది.

2. సైరికా = వ్యవసాయ దారుడా, కర్షకుడా.

   భావము: కర్షకుడా! నువ్వు భారత భూమిలో గౌరవింపదగిన పవిత్ర మూర్తివి. వీరశ్రేష్ఠుడవు. రాజదండము నీ నాగలి కంటే ప్రార్థనీయముకాదు.

3. ఈసు = ఈర్ష్య; ప్రొద్దు పొడచుట = సూర్యోదయమగుట; ప్రొద్దుగ్రుంకుట = సూర్యాస్తమయమగుట; కళిక = మొగ్గ

   భావము: సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు కష్టపడి పని చేస్తావే గాని ఇరుగు పొరుగు వారి సంపదల్ని చూసి అసూయ చెందవు. నీ హృదయమనే మొగ్గ ఎంతో నిర్మలమైనది.

4. **భావం:** ఉండి తిన్నా, లేక తినకపోయినా పరుల సొమ్ముకు ఆశపడవు. ఆకలితో నీ ఇంటి ముందుకు వచ్చిన వానికి ఆతిథ్యమిచ్చి పంపుతావు. నీ ఆతిథ్యాన్ని స్వీకరించకుండా ఎవరూ వెళ్ళరు.

5. కృషి = వ్యవసాయము; కీలుచీల = ఆధారము

   భావం: వ్యవసాయమే అన్ని పరిశ్రమలకు ఆధారము. మంచి పరిశ్రమ వాణిజ్యానికి సాధనము. వ్యాపారాలన్నీ సంపదలకు నిలయాలు. సంపదలే సుఖములు కల్గించుటకు మూలాధారం.,

6. కడ=చివర; సంపత్తి=సంపద; వాగ్మిత=చతురత; ప్రణుతి=నమస్కారం; గరిమ=గొప్పదనము.

   భావం: నీ శారీరక కష్టమునకు మొదలు, తుది అన్నది లేదు. నీ కష్టము సస్యసంపత్తిలో ప్రతి ఫలిస్తుంది. నీవు కవివి కాకపోయినా, వాక్చాతుర్యము లేకున్నా, సస్యలక్ష్మికి నమస్కరించుము.

III వినండి - చర్చించండి - రాయండి.

అ) జవాబులు రాయండి.

1. కోడి కూతలోని అంతరార్థము.
2. కర్షకుని హృదయం నిర్మలం
3. కర్షకుని హలం రాజదండం కంటే గొప్పది
4. కృషి గురించి కవి భావన

ఆ) సరైన సమాధానం గుర్తించి రాయండి.

1. ధారుణీ పతి పాలన దండమెపుడు __________ ప్రార్థనీయమగునె?
   అ) నీ హలముకన్నను ఆ) నీ పొలము కన్నను ఇ) నీ కలముకన్నను

2. ఇరుగుపొరుగు వారి సంపదకై __________ గూరబోవ
   అ) లోభము ఆ) ఈసు ఇ) మాత్సర్యము

3. కృషి సకల __________ కీలుచీల
   అ) సంపదలకు ఆ) భోగోపలబ్ధికి ఇ) పరిశ్రమలకు

ఇ) కింది జాతీయాలకు అర్థంరాసి సొంత వాక్యాలలో ఉపయోగించండి.

1. ఆటపట్టు 2. కీలు చీల 3. జీవగఱ్ఱ

ఊ) కింది పద్యపాదాల ద్వారా కృషీవలుడిలోని ఏ గుణం తెలియుచున్నది.

1. ప్రొద్దు పొడిచిన దాదిగా ప్రొద్దుగ్రుంకు వఱకు కష్టింతువు.

2. ఇరుగుపొరుగు వారి సంపదకై ఈసుగోరబోవు.

ఉ) అల్లికను పూరించండి.

కృషీవలుడు ఇటువంటి వాడు

IV స్వీయ స్పందన

''వ్యవసాయం – వాణిజ్యాల'' – పరస్పర సంబంధాన్ని రాయండి.

V అభిప్రాయవ్యక్తీకరణ

కృషీవలుడి గొప్పతనాన్ని మీ సొంత మాటల్లో రాయండి.

VI పద్య/గేయ రసాస్వాదన:

కింది పద్యాన్ని చదివి మీరు గ్రహించిన భావాన్ని వివరణాత్మకంగా రాయండి.

తే. **ఉండి తిన్నను లేక పస్తున్న గాని**
యాస చేయవు పరుల కష్టార్జితంబు!
నాకలెత్తగ నీ పంచ కరుగు నతిథి
తినక, త్రావక పోయిన దినము లేదు.

VII భాషావగాహన

అ) జతపరచండి.

'క' వర్గము		'చ' వర్గము
1. పవిత్రమూర్తివి	అ)	షష్ఠీ తత్పురుష సమాసము
2. శూరమణివి	ఆ)	రూపక సమాసము
3. హృదయ కళిక	ఇ)	విశేషణ పూర్వపద కర్మధారయ సమాసము

ఆ) గణవిభజన చేసి, యతి స్థానమును గుర్తించి, ఏ పద్యపాదమో రాయండి.

1. సమయమమూల్య, మొక్క నిమిషంబు వృథాచన గ్రమ్మఱింపనే

2. ఉండి తిన్నను లేక పస్తున్నగాని

3. వారి సంపదకై యీసు గూరబోవ

ఇ) కింది అలంకారాల లక్షణాలను రాయండి.

1. అతిశయోక్తి 2. స్వభావోక్తి

VIII సృజనాత్మకత

1. అంతర్జాలం ద్వారా ''కృషీవలుని'' గురించి రచించిన ఇతర కవుల రచనలను సేకరించి చదవండి. తారతమ్యతను పరిశీలించండి. మీ అభిప్రాయాన్ని రాయండి.
2. ''కృషితో నాస్తి దుర్భిక్షం'' అనే అంశంపై తరగతిలో వక్తృత్వ పోటీని నిర్వహించండి.
3. వివిధరకాల పంటలు - అవి ఏ రాష్ట్రంలో ఎక్కువగా పండుతాయో పట్టికను తయారు చేయండి.
4. వ్యవసాయానికి సంబంధించిన నినాదాలు తయారు చేయండి.

IX లేఖన కౌశల్యాలు

1. ప్రకటన లేఖనం:

కింది అంశాల ఆధారంగా, సేంద్రియ ఎరువుల గురించి ప్రకటన తయారు చేయండి.

అగ్రోఫార్మింగ్ ప్రోడక్ట్స్

భూసారాన్ని కాపాడటం

లభించుస్థలం

దూరధ్వని సంఖ్య

తగ్గింపుధర రాయితీ

సేంద్రియ ఎరువులు, కీటకనాశకాలు

2. సంక్షిప్తలేఖనము

దిగువనీయబడిన గద్యభాగమును చదివి పరిచ్ఛేదమును మూడవవంతుకు తగ్గించి రాయండి.

ఒక అడవిలో ఒక నక్కఉండేది. ఆ అడవిలోని చెఱువులో ఒక తాబేలు వుండేది. నక్కను చూసి భయపడి అది ఎప్పుడూ బయటకు వచ్చేది కాదు. ఒకనాడు సాయం వేళలో సరదాగా అది బయటకు వచ్చింది. ఆ సమీపంలోనే తిరుగుతున్న నక్క ఈ రోజు నాకు మంచి ఆహారం లభించింది అనుకుంటూ ఒక్క దూకున వచ్చి తాబేలును పట్టుకొంది. కాని కవచంలా గట్టిగా వున్న ఆ శరీరం ఏ విధంగా తినాలో బోధపడలేదు. దాని కవచం లాంటి శరీరంపై గీరటం మొదలుపెట్టింది.

తాబేలుకు మెరుపు లాంటి ఆలోచన వచ్చింది. నక్కతో అది ఈ విధంగా పలికింది. నక్క బావా! నన్ను తినాలని నీకుంది కదా! కానీ నా శరీరం గాలి తగలగానే గట్టి పడుతుంది. నీవు నన్ను నీటిలో కాసేపు నానబెటితే మెత్తపడుతాను. నీవు నన్ను తేలికగా తినచ్చు అని చెప్పింది. ఆ మాటలు నిజమని నమ్మి నక్క దానిని చెఱువు నీటి వద్దకు తీసుకొని వెళ్ళింది. నీటిలో ప్రవేశించగానే తాబేలు నక్క నుండి తప్పించుకొని ప్రాణాలు కాపాడుకుంది.

నేనివి నేర్చుకున్నా/తెలుసుకున్నా :

1. రైతే దేశానికి వెన్నెముక. 2. వ్యవసాయము - వాణిజ్యముల పరస్పర సంబంధం.

ఉ.సూ.: రబీ, ఖరీఫ్, మొ॥ పంటలను ఎప్పుడు ఏఏ రకాల భూములలో పండించెదరో వివరించండి.

వి.సూ.: కృషీవలుని గూర్చి ఇతర కవుల రచనలను చదివి తులనాత్మక పరిశీలన గావించండి.

GR7PYC

1 కీర్తిచక్ర - జగదీష్ చంద్

నేపథ్యం

- 'స్వాతంత్ర్యదినోత్సవం', 'గణతంత్ర దినోత్సవం' వచ్చిందంటే ఎక్కడచూచినా మువ్వన్నెలు, పతాకాలు, మైకుల్లో

  'ఏ వతన్..... ఏ వతన్.... హమ్ కోతేరీ కసమ్'....

  'దేశమును ప్రేమించుమన్నా, మంచి అన్నది పెంచుమన్నా'- వంటి ఒళ్ళు గగుర్పొడిపించే దేశభక్తి గీతాలు, అమరవీరుల గాథలు, చిత్రాలు ఇవేగదా వినబడతాయి, కనబడతాయి. మనం ఈ విధంగా పండుగ చేసుకోవడానికి కారకులు 'మన అమరవీరులు'. అట్టి వారి కోవకు చెందినవాడే మన జగదీష్‌చంద్. ఆయన సాహసగాథ చదువుదాం. ఆయనకు 'సలాం' చేద్దాం.

భారత వైమానిక స్థావరాల్లో పంజాబ్‌లోని పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్‌కు చాలా ప్రాధాన్యత ఉంది. ఉగ్రవాద కార్యకలాపాలను అణిచివెయ్యటంలో ఇది ఎంతో కాలంగా కీలకమైన పాత్ర పోషిస్తోంది. పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలు పంజాబ్‌లోని వివిధ ప్రదేశాలపై గడచిన దశాబ్దంన్నర కాలంలో 7 పర్యాయాలు పంజా విసిరాయి. ఇటీవల 2016, జనవరి 2వ తేదీ అర్ధరాత్రి పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్‌పై ఉగ్రవాదులు జరిపిన దాడి మనదేశాన్ని తీవ్రంగా కలవరపరచింది. ఏడాదికంటే తక్కువ వ్యవధిలో పంజాబ్‌లో జరిగిన రెండో అతిపెద్ద ఉగ్రవాద ఘటన ఇది. ఈ దాడి జరిగినప్పుడు హవల్దార్ జగదీష్ చంద్ ప్రదర్శించిన ధైర్యసాహసాలు, సమయస్ఫూర్తి ఆశ్చర్యానికి గురిచేస్తాయి. ఆ సమయంలో తాను నిరాయుధుడై ఉండి కూడా, ప్రాణాలకు తెగించి ఉగ్రవాదులతో వీరోచితంగా పోరాడిన ధైర్యశాలి, సైనికోత్తముడు, వీరశ్రేష్ఠుడు జగదీష్ చంద్.

జగదీష్‌చంద్ మిలటరీలో హవల్దార్. సైనికుల వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న వ్యక్తి. అతని తండ్రి భారతీయ సైన్యంలో పనిచేశారు. అన్నగారు బుద్ధిసింగ్ సుబేదారు. అతని సన్నిహిత బంధువులు కూడా సైన్యంలో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని చంబా జిల్లాలో బాసా అనే గ్రామం జగదీష్ చంద్ పుట్టి పెరిగిన ఊరు. తాత-ముత్తాతల కాలం నుంచి అదే వారి స్వగ్రామం. జగదీష్ తన 19వ ఏట 1985లో సైన్యంలో జవానుగా చేరాడు. డోగ్రా రెజిమెంట్‌లో 25 సంవత్సరాలు ఎంతో క్రమశిక్షణ, అంకిత భావంతో దేశసేవ చేశాడు. హవల్దారుగా 2009లో పదవీ విరమణ చేశాడు.

సాధారణంగా పదవీ విరమణ చేసిన జవాన్లు, సైనికోద్యోగులు తమ సర్వీసు ఆధారంగా ఏదైనా సివిల్ ఉద్యోగం చేసుకుంటూ హాయిగా కాలక్షేపం చేస్తారు. కానీ జగదీష్ చంద్‌కు మాత్రం అలాంటి జీవితం గడపాలనిపించలేదు. కొద్ది నెలలు భార్యాపిల్లలతో స్వగ్రామంలో విశ్రాంత జీవితం గడిపిన పిమ్మట హవల్దార్ జగదీష్ చంద్ 2010లో డిఫెన్స్ సెక్యూరిటి కోర్‌లో చేరాడు. తనకు అవకాశం ఉన్నంత వరకు దేశసేవ చేస్తునే బ్రతకాలనేది జగదీష్ ఆశయం. సర్వీసులో మంచి రికార్డ్ కలిగిన మాజీ సైనికుల సేవల్ని వినియోగించుకునే డిఫెన్స్ సెక్యూరిటి కార్ప్స్ (డి.యస్.సి.) భారత వైమానిక దళ స్థావరాల రక్షణ బాధ్యతలు నిర్వహిస్తుంది.

జగదీష్ చంద్‌ను 2015 డిసెంబర్‌లో లేహ్ నుండి పంజాబ్‌లోని పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. పఠాన్‌కోట్ వెళ్ళి డ్యూటీలో చేరే ముందు జగదీష్ చంద్ 10 రోజులు సెలవు తీసుకుని, స్వగ్రామం వెళ్ళి భార్యా-పిల్లలతో ఆనందంగా గడిపాడు. పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్‌పై ఉగ్రవాద దాడి జరగటానికి ఒక్క రోజు ముందే, జనవరి 1వ తేదీన ఆ వైమానిక స్థావరంలో బాధ్యతలు చేపట్టాడు.

పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్ భారత వైమానిక స్థావరాలన్నిటికి తలమానికం వంటిది. పాకిస్తాన్ సరిహద్దుకు కేవలం 35 కి.మీ. దూరంలో ఉన్న ఆ వైమానిక స్థావరం భారత్‌కు వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైనది. అది ఆసియాలోనే చాలా పెద్ద ఎయిర్‌బేస్, సుమారు 2000 ఎకరాల్లో, 24 కి.మీ. చుట్టుకొలత కలిగిన అత్యంత ఆధునికమైన ఫార్వర్డ్ బేస్ అది. ఆ స్థావరంలో 8 కి.మీ. పైగా పొడవున్న 'రన్‌వే' పై మన యుద్ధవిమానం ఏదైనా ల్యాండ్ కాగలదు. టేకాఫ్ తీసుకోగలదు. ఆ ఎయిర్‌బేస్ నుంచే పాక్ సరిహద్దు వెంబడి ఎయిర్ పెట్రోలింగ్ నిర్వహించబడుతుంది. పాక్ చొరబాటుదార్లను నిలువరించటంలో ఎయిర్ పెట్రోలింగ్‌దే కీలక పాత్ర. ఒకవేళ పాక్ సరిహద్దులో ఏదైనా ప్రమాదం ముంచుకొస్తే, పఠాన్‌కోట్ వైమానిక స్థావరం నుంచి బయలుదేరిన మెయిన్ బాంబర్ కేవలం ఒక నిమిషంలోనే సరిహద్దు ప్రాంతానికి చేరుకోగలుగుతుంది.

పఠాన్‌కోట్ వైమానిక స్థావరం అత్యంత కీలకమైన సాంకేతిక సామగ్రి ఉంచే ప్రదేశం కూడా. అందులో మిగ్ 21 జెట్ ఫైటర్స్, ఎం.ఐ.-35 యుద్ధ హెలికాప్టర్లు, బాంబర్లు యుద్ధసంబంధమైన ఆధునిక సాంకేతిక పరికరాలు ఉంటాయి. అంతే కాకుండా అదే ప్రాంగణంలో 3, 000 క్వార్టర్లలో సైనికుల కుటుంబాలు కూడా నివసిస్తూ ఉంటాయి. భారత వైమానిక దళంలోని కీలకమైన బాధ్యతలు నిర్వహించే అధికారులు ఆ ప్రాంగణంలోనే ఉంటారు.

పఠాన్‌కోట్ వైమానిక స్థావరంలో తీవ్రమైన విధ్వంసం సృష్టించి, రక్షణపరంగా మన దేశాన్ని చావు దెబ్బ తియ్యాలనే లక్ష్యంతో వ్యూహాత్మకంగా జరిపిన భయంకరమైన ఉగ్రవాద దాడి ఇది. గణతంత్ర దినోత్సవాన్ని వైభవంగా జరుపుకొనే భారత్‌లో భయోత్పాతాన్ని సృష్టించాలనే కుయుక్తి దీనికి తోడైంది. నూతన సంవత్సరారంభాన్ని ఈ దాడికి ముహుర్తంగా నిర్ణయించింది. ఫలితంగా సుశిక్షితులైన ఆరుగురు ఉగ్రవాదులు చాకచక్యంగా పాక్ సరిహద్దును దాటుకుని, ఎ.కె. 47 తుపాకులు, మోర్టార్లు, గ్రెనేడ్ లాంచర్లు మొదలైన అత్యాధునిక ఆయుధాలు; గ్లోబల్ పొజిషన్ సిస్టమ్‌లాంటి సాంకేతిక పరికరాలతో జనవరి 2వ తేదీ రాత్రి పఠాన్‌కోట్ వైమానిక స్థావరంలోకి చొరబడ్డారు. మన మిగ్-21

యుద్ధ విమానాల్ని ధ్వంసం చెయ్యటానికి పెద్ద ఎత్తున ఆర్డియక్స్ కూడా మోసుకొచ్చారు. వాళ్ళు ఆత్మాహుతి దాడులకు సిద్ధపడి వచ్చారు.

ఈ దాడి జరిగినప్పుడు హవల్దార్ జగదీష్‌చంద్ ఉగ్రవాదులతో హోరాహోరీగా పోరాడిన తీరు వింటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. జనవరి 1వ తేదీన పఠాన్‌కోట్‌లో డ్యూటీకి రిపోర్ట్ చేశాడు హవల్దార్ జగదీష్ చంద్. 3వ తేదీ తెల్లవారుఝామున ఎయిర్‌ఫోర్స్ సిబ్బందికి అల్పాహారం సిద్ధం చేయించే పనిలో నిమగ్నమై ఉన్నాడు. సుమారు 3.30 గం॥ల సమయంలో అకస్మాత్తుగా భోజనశాల బయట తుపాకీ పేలుళ్ళు వినిపించాయి. కిటికీలోంచి తొంగిచూస్తే మసక చీకట్లో మన సైనిక దుస్తుల్లో ఎ.కె. 47లు చేతపట్టుకొని, లైట్లు వెలుగుతున్న మెస్‌వైపు గుళ్ళవర్షం కురిపిస్తున్న వ్యక్తి, జగదీష్ కంటపడ్డాడు. అతడు పేలుస్తున్న రైఫిల్లో నుంచి గుళ్ళు మెస్‌వైపు దూసుకు వస్తున్నాయి. 'వైమానిక స్థావరంపై ఉగ్రవాద దాడి జరిగే ప్రమాదం పొంచి ఉంది' అని నిఘావర్గాలు చేసిన హెచ్చరికలు జగదీష్‌కు జ్ఞాపకమొచ్చాయి. అనుమానం లేదు. వాడు తీవ్రవాదేనని గ్రహించాడు. ఆ సమయంలో ఆయనవద్ద ఏ ఆయుధమూ లేదు. దొరికే అవకాశమూ లేదు. ఆయుధం కోసం ఆలోచించే వ్యవధిలో ఆ తీవ్రవాది ఏ వినాశానికైనా ఒడికట్టవచ్చు. ఆ ముష్కరుణ్ణి యుద్ధవిమానాలు, హెలికాప్టర్లు ఉండేవైపు వెళ్ళనిచ్చినా, సైనికుల క్వార్టర్లవైపు పోనిచ్చినా పెనుప్రమాదం తప్పదు. అప్పుడు జగదీష్ చంద్ సాహసమే ఆయుధంగా, దేశభక్తే చేదకశక్తిగా సాయుధుడైన ఆ శత్రువును నిరోధించటానికి పూనుకున్నాడు. నిజానికి వీరుడికి ఆయుధంకంటే గుండె ధైర్యమే ప్రధానం.

క్షణం ఆలస్యం చెయ్యకుండా, జగదీష్ మెస్ వెనుకగుండా వెళ్ళి, నిప్పులు కురిపిస్తున్న తీవ్రవాదివైపు చప్పుడు కాకుండా శరవేగంగా దూసుకువెళ్ళాడు. రెప్పపాటు కాలంలో వెనుకవైపుగా వెళ్ళి, ఆ ముష్కరుణ్ణి ఎంతో చాకచక్యంగా ఒడిసి పట్టుకున్నాడు. అతనితో కలియబడ్డాడు. జగదీష్ చేసిన మెరుపు దాడికి ఆగంతకుడు ఖంగుతిన్నాడు. యువకుడు, సుశిక్షితుడు అయిన ముష్కరుడితో పోరాటమంటే మామూలు సైనికుడికైతే మృత్యువుతో చెలగాటమే. ఇద్దరి మధ్య చాలాసేపు పెనుగులాట జరిగింది. విడిపించుకోవటానికి వాడు శతవిధాల ప్రయత్నించాడు. కాని, జగదీష్‌చంద్ ఉక్కు పిడికిలి నుంచి వాడు తప్పించుకోలేకపోయాడు. వాడు తన చేతిలో ఉన్న ఎ.కె. 47 జగదీష్‌వైపు గురిపెట్టే ప్రయత్నం చేశాడు. వాడికి ఆ అవకాశం ఇవ్వకుండా, తనను తాను రక్షించుకుంటూనే జగదీష్ శత్రువును మట్టుపెట్టే ఎత్తుగడ వేశాడు. చేతికి చిక్కిన శత్రువుని తప్పించుకోనివ్వకుండా,

అతనితో పెనుగులాడుతూనే, ఎంతో లాఘవంగా అతని చేతిలోని రైఫిల్ లాక్కుని దానితోనే వాణ్ణి కాల్చిపారేశాడు. మొదటి ఉగ్రవాది వెనుకే వచ్చిన అతని ఇద్దరు సహచరులు జగదీష్ ధైర్యానికి నివ్వెరపోయారు. పెనుగులాట జరుగుతున్నప్పుడు విరోధికి తుపాకి గురిపెడితే ఆ గుండు తనవాడినే బలితీసుకోవచ్చని, ఏమీ చెయ్యలేక వాళ్ళు అశక్తులై చూస్తూ ఉండిపోయారు. తమ దోస్తు చనిపోయాడని తెలియగానే జగదీష్‌పై వాళ్ళు సవాలు విసిరారు. శత్రువుపైనే లక్ష్యం పెట్టిన జగదీష్ అప్పటివరకు వాళ్ళని గమనించలేదు. గమనించాక క్షణం ఊరుకోలేదు. శత్రువు ఒక్కడు కాదు. ఇంకా ఉన్నారని అతనికి అర్థమైంది. వాళ్ళ చేతుల్లో ఏ ఆయుధాలున్నాయి అని ఇక తాను ఆలోచించలేదు. ఆ దుర్మార్గుల అంతు చూడటం కోసం వాళ్ళని వెంబడించాడు. మొదటి తీవ్రవాదితో పోరాడి పోరాడి ఉన్న జగదీష్‌పై వాళ్ళు కసిగా గుళ్ళ వర్షం కురిపించారు. ఆ గుళ్ళు ధీశాలి జగదీష్ చంద్ శరీరాన్ని ఛిద్రం చేశాయి. 'భారత్‌మాతాకీ జై' అనే నినాదం చేస్తూ ఆ మహావీరుడు నేలకొరిగిపోయాడు. వీర మరణం పొందాడు.

తాను చనిపోయే ముందు ఒక్క శత్రువునైనా మట్టుపెట్టాలన్న సైనిక స్ఫూర్తిని అమలు పరచి భరతమాతకు ఎనలేని కీర్తిని చేకూర్చి పెట్టి తాను వీరస్వర్గాన్ని అలంకరించాడు. తాను నిరాయుధుడై ఉండి కూడా, ఉగ్రవాదులతో తలపడి వీరోచితంగా పోరాడి, మొదటి చొరబాటుదారుణ్ణి వాడి తుపాకీతోనే హతమార్చిన ధైర్యశాలి, సైనికోత్తముడు. దాడి చేసిన ఆరుగురు ఉగ్రవాదుల్లో మొదటివాణ్ణి మట్టుపెట్టిన జగదీష్ చంద్, మిగతా అయిదుగురుని అంతం చేసే ఆపరేషన్ విజయానికి నాంది పలికాడు.

ఆ తర్వాత అప్రమత్తమైన వైమానిక దళానికి చెందిన గరుడ సిబ్బంది. ఎన్.ఎస్.జి. కమేండోలు, జవాన్లు సమన్వయంతో వ్యూహాత్మకంగా వ్యవహరించి, దుండగుల్ని స్థావరంలో కీలకమైన ప్రదేశంవైపు వెళ్ళనీయకుండా చేసి, పెనుప్రమాదాన్ని తప్పించగలిగారు. ముష్కరుల దాడిలో హవల్దార్ జగదీష్ చంద్‌తో సహా ఏడుగురు కమెండోలు వీరమణం పొందారు. పదిహేను మంది గాయపడ్డారు. కానీ ఈ ఆపరేషన్ భారతదేశ శక్తి సామర్థ్యాలను, జవాన్ల దేశభక్తిని, యుద్ధనైపుణ్యాన్ని, కర్తవ్య పరాయణతని లోకానికి చాటిచెప్పింది. తన ప్రాణాలకు తెగించి వీరోచితంగా పోరాడి, వీరస్వర్గాన్ని అలంకరించాడని సైనికాధికారులు, దేశ నాయకులు వేనోళ్ళ జగదీష్‌చంద్‌ని ప్రశంసించారు. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రప్రజలు అతని కారణంగా తమ రాష్ట్రమే గౌరవాన్వితమైందని భావించారు.

భారత ప్రభుత్వం 2016, జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా అమర వీరుడు హవల్దార్ జగదీష్ చంద్‌కు 'కీర్తిచక్ర' బిరుదు ప్రదానం చేసింది. 2016 మార్చి 22వ తేదీన ఢిల్లీలో రాష్ట్రపతిభవన్‌లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ గారి చేతుల మీదుగా అమర వీరుడు జగదీష్ చంద్ పక్షాన ఆయన భార్య శ్రీమతి స్నేహలత ఆ అరుదైన గౌరవాన్ని అందుకున్నారు.

రచయిత పరిచయం : డా. వెన్నా వల్లభరావు గారు 09-05-1956న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణాజిల్లా, గుడివాడ తాలూకా బేతవోలు గ్రామములో జన్మించారు. వీరి తల్లిదండ్రులు లక్ష్మీనాగేశ్వరమ్మ, హనుమంతరావు గార్లు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి హిందీలో ఎం.ఏ; పి.హెచ్.డి. చేశారు. ఆంధ్ర లయోల కళాశాల, విజయవాడలో హిందీ శాఖాధ్యక్షులుగా పదవీ విరమణ పొందారు.

డా. వల్లభరావుగారు హిందీలోను, తెలుగులోను అనేక రచనలు చేశారు. వాటిలో పేర్కొనదగినవి సాహిత్యావారధి, కవితాభారతి, జాతీయపతాక రూపశిల్పి పింగళి వెంకయ్య, 35 రేడియో నాటకాల అనువాదం మొదలగునవి. వీరికి ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడెమీచే 'ఉత్తమ అనువాద పురస్కారం' 'బోయపాటి నాగేశ్వరరావు పురస్కారం' మొదలగు పురస్కారాలు, 'అనువాద సాహిత్యరత్న' బిరుదు, అంతేగాక ఇటీవల వీరి అనువాద రచనలకు గాను కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం కూడా లభించింది.

ప్రస్తుత పాఠ్యభాగం 'మిసిమి' మాస పత్రికనుండి గ్రహింపబడినది.

I **వినండి – సంభాషించండి.**

1. ప్రతిభ కనబరచిన సైనికోద్యోగులకిచ్చే బిరుదులను పేర్కొనండి.
2. ఉగ్రవాదులతో పోరాడి వీరమరణమొందిన కొందరి సైనికుల పేర్లను చెప్పండి.

II **చదవండి – ఆలోచించండి – రాయండి.**

పదజాలాన్ని పెంపొందించుకుందాం –

పంజా=గోళ్ళతో కూడిన జంతువు పాదం; ఘటన=కలగడం; సమయస్ఫూర్తి=సమయానికి తగిన ఆలోచన; స్థావరం=చోటు; తలమానిక=శ్రేష్టమైన; ప్రాంగణం=ఆవరణ; చాకచక్యం=చురుకుదనం; నేర్పు; నిమగ్నము=ఒక పనిలోపూర్తిగా మునిగిపోవు; ముష్కరుడు=దుష్టుడు; లాఘవం=నేర్పు; నివ్వెరపోవుట=ఆశ్చర్యపోవుట; ఛిద్రం=రంధ్రం; గౌరవాన్వితం=గౌరవంతో కూడుకొన్న.

కృత్యం :

కింది పరిచ్ఛేదాన్ని చదివి, సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ) కింది అల్లికను పూరించండి :

ముష్కరుల నెదిరించుటలో లోకానికి చాట బడినవి.

పరిచ్ఛేదం : పుట సంఖ్య 52 లోని ''తాను చనిపోయేముందు ......నుండి గౌరవాన్ని అందుకున్నారు'' – వరకు

ఆ) కింది వాక్యాల తప్పొప్పులను గుర్తించి రాయండి.

1) జగదీష్‌చంద్‌కు 'అశోక చక్ర' బిరుదు ఇవ్వబడింది. ( )
2) ముష్కరుల దాడిలో జగదీష్ చంద్‌తో సహా ఏడుగురు కమెండోలు వీరమరణం పొందారు. ( )
3) జగదీష్‌చంద్ భరతమాతకు ఎనలేని అపకీర్తిని చేకూర్చిపెట్టి తాను వీరస్వర్గాన్ని పొందాడు. ( )
4) హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రప్రజలు జగదీష్‌చంద్ కారణంగా తమ రాష్ట్రమే గౌరవాన్వితమైందని భావించారు. ( )

ఇ) కింది పదాలకు వ్యతిరేకార్థములు రాయండి.

1) గౌరవం × ______ 2) శత్రువు × ______
3) ఆయుధుడు × ______ 4) జయము × ______

ఈ) స్వీయస్పందన

దేశం కొరకు పోరాడి ముష్కరుల దాడిలో వీరమరణమొందిన జగదీష్‌చంద్‌ను గూర్చి మీ సొంత మాటల్లో రాయండి.

III **వినండి – చర్చించండి – రాయండి.**

అ) జవాబులు రాయండి.

1) భారతవైమానిక స్థావరాల్లో ముఖ్యమైన ప్రదేశము.
2) జగదీష్‌చంద్ ఆశయం.
3) పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్ ప్రాధాన్యత
4) జగదీష్‌చంద్‌కు భారత ప్రభుత్వం ఎప్పుడు, ఏ బిరుదాన్ని ప్రదానం చేసిందో రాయండి.

ఆ) కింది ఖాళీలను కుండలీకరణంలోని సరైన పదాలతో పూరించండి.

(నినాదం, సాంకేతిక సామాగ్రి, హవల్దారు, తలమానికం, ఆయుధం, గుమాస్తా)

1) జగదీష్ ______________ గా 2009 లో పదవీ విరమణ చేశాడు.
2) పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్ భారతవైమానిక స్థావరాలన్నిటికీ ______________ వంటిది.
3) పఠాన్‌కోట్ వైమానిక స్థావరం అత్యంతకీలకమైన ______________ ఉంచే ప్రదేశం కూడా.
4) నిజానికి వీరుడికి ______________ కంటే గుండె ధైర్యమే ప్రధానం.
5) 'భారత్‌మాతాకి జై' అనే ______________ చేస్తూ ఆ మహావీరుడు నేలకొరిగి పోయాడు.

ఇ) కింది వాక్యాల తప్పొప్పులను గుర్తించి రాయండి.:

1) జగదీష్‌చంద్‌ను పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. ( )
2) ముష్కరులు ఆత్మాహుతి దాడులకు సిద్ధపడలేదు. ( )
3) జగదీష్‌చంద్ ఆ దుర్మార్గుల అంతుచూడటం కోసం వాళ్ళని వెంబడించాడు. ( )
4) శత్రువుపైనే లక్ష్యం పెట్టిన జగదీష్ వాళ్ళని గమనించాడు. ( )

ఈ) కింది వాటిని జతపరచండి :

'క' వర్గము	'చ' వర్గము
1) పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్‌పై దాడి	అ) డిసెంబరు, 2015
2) జగదీష్‌చంద్ ట్రాన్స్‌ఫర్	ఆ) 2009
3) జగదీష్‌చంద్ సైన్యంలో జవానుగా చేరిన సంవత్సరం.	ఇ) జనవరి 2, 2016
4) జగదీష్‌చంద్ హవల్దారుగా పదవీ విరమణ	ఈ) 1985
	ఉ) 2010

IV స్వీయస్పందన :

1) ఉగ్రవాదాన్ని ఏ విధంగా నిర్మూలించాలో మీ సొంతమాటల్లో రాయండి.
2) "దేశం కొరకు పోరాడి వీరమరణం పొందడం ఉత్తమం". అను దానిపై మీ అభిప్రాయాన్ని రాయండి.

V భాషావగాహన :

అ) కింది పదాలకు పాఠ్యభాగమాధారంగా వ్యతిరేక పదాలు రాయండి.

1) ఆయుధుడు × ______________ 2) ఉచితము × ______________
3) నిర్భయం × ______________ 4) అనల్పము × ______________

ఆ) కింది పదాలకు వచనం మార్చి రాయండి.

1) నాయకుడు = ______________ 2) ఆయుధము = ______________
3) జవాన్లు = ______________ 4) బాధ్యతలు = ______________

ఇ) కింద పదములు ఏ వాచకములకు చెందినవో రాయండి.

1) సైనికుడు = ______________ 2) స్నేహలత = ______________
3) భార్య = ______________ 4) విమానము = ______________

ఈ) కింది పదాలకు ప్రకృతి-వికృతులు రాయండి.

1) నిముషము = ________________ 2) ఆహారము = ________________

3) కీరితి = ________________ 4) బత్తి = ________________

ఉ) కింది పట్టికను పూరించండి :

	పదము	విడదీయుట	సంధిపేరు
1)	దశాబ్దము	________________	________________
2)	________________	వీర + ఉచితము	________________
3)	సైనికోద్యోగులు	________________	________________
4)	________________	అతి + అంత	________________

ఊ) కింది విగ్రహవాక్యాలను వాటి సమాసనామములతో జతపరచండి.

'క' వర్గము	'చ' వర్గము
1) సైనికులలో ఉత్తముడు	అ) విశేషణ పూర్వపద కర్మధారయ సమాసము
2) భార్యను, పిల్లలును	ఆ) ద్విగు సమాసము
3) మూడు సంఖ్యగల సంవత్సరాలు	ఇ) ద్వంద్వ సమాసము
4) అల్పమైన ఆహారం	ఈ) బహువ్రీహి సమాసము
	ఉ) షష్ఠీ తత్పురుష సమాసము

ఋ) కింది వాక్యాలు సామాన్య/సంశ్లిష్ట/సంయుక్తములలో ఏరకమునకు చెందినవో రాయండి.

1) జగదీష్ చంద్ ప్రదర్శించిన ధైర్యసాహసాలు, సమయస్ఫూర్తి ఆశ్చర్యానికి గురిచేస్తాయి. [ ]

2) జగదీష్ 10 రోజులు సెలవు తీసుకుని, స్వగ్రామం వెళ్ళి భార్యాపిల్లలతో ఆనందంగా గడిపాడు. [ ]

3) ఆ సమయంలో ఆయన వద్ద ఏ ఆయుధము లేదు. [ ]

ౠ) గుర్తించబడిన పదములు ఏ వాక్యాంగములో రాయండి.

1) <u>జగదీష్‌చంద్</u> రైఫిల్ లాక్కుని దానితోనే <u>వాణ్ణి</u> కాల్చి పారేశాడు.

2) జగదీష్‌పై వాళ్ళు కసిగా గుళ్ళ వర్షం <u>కురిపించారు</u>.

ఎ) కింది వాక్యములోని గుర్తింపబడిన పదాలు ఏ భాషాభాగాలో రాయండి.

<u>జగదీష్‌చంద్</u>, <u>అతని</u> <u>సన్నిహిత</u> బంధువులు కూడా సైన్యంలో బాధ్యతలు <u>నిర్వర్తిస్తున్నారు</u>.

[ ] [ ] [ ] [ ]

ఏ) కింది పదాలను మీ సొంత వాక్యాల్లో ఉపయోగించి రాయండి.

1) తలమానికం : ________________ 2) నివ్వెర పోవుట : ________________

3) కాలక్షేపం : ________________ 4) నిమగ్నము : ________________

VI సృజనాత్మకత :

1) స్వరాజ్యం కొరకు పోరాడి వీరమరణ మొందిన వ్యక్తుల చరిత్రలను గూర్చి అంతర్జాలం ద్వారా తెలుసుకోండి.

2) పరమవీరచక్ర, కీర్తిచక్ర అనుబిరుదులు ఏ సందర్భంలో ఎవరికిస్తారో అంతర్జాలం ద్వారా తెలుసుకోండి.

VII లేఖన కౌశల్యాలు -

1. వ్యాసరచన : (వర్ణనాత్మకం)

నీకు నచ్చిన ఆటను గూర్చి కింది అంశాల ఆధారంగా వ్యాసం రాయండి.

నచ్చిన ఆట | నచ్చుటకు కారణం | ఆట ఆడు విధానం | ముగింపు

2. గద్య అవగాహన :

కింది అపరిచిత గద్య పరిచ్ఛేదాన్ని చదివి, సూచనానుసారం కృత్యాలు చేయండి.

అ) కింది ఆకృతులను పూరించండి.

మాడపాటి హనుమంతరావు గారి జననతేది | జిల్లా | తాలూకా | గ్రామం

హైదరాబాదుసంస్థానంలో తెలంగాణాప్రాంతం నిద్రాణమై ఉన్న రోజుల్లో తెలుగుజాతిని మేల్కొలిపిన మహనీయుల్లో మాడపాటి హనుమంతరావుగారు అగ్రగణ్యులు. తెలుగుభాషాభివృద్ధికీ, సంస్కృతీ వికాసానికీ ఆయనచేసినకృషి శ్లాఘనీయం.

హనుమంతరావుగారు 1885 జనవరి 22వ తేదీన కృష్ణాజిల్లా, నందిగామతాలూకా, పోకునూరుగ్రామంలో జన్మించినారు. ఐదేండ్ల పిన్నవయస్సులోనే తండ్రిని కోల్పోయినారు. ఆ కారణం చేత ఆయన స్వగ్రామం వదిలి అప్పటి నిజాం రాష్ట్రంలోని సూర్యాపేటకు రావలసి వచ్చింది. అక్కడ తనమేనమామ జమలాపురం వేంకటరావు గారింట్లో విద్యాభ్యాసం మొదలయింది. వేంకటరావుగారు జమలాపురం తహసీల్ కార్యాలయంలో పేష్కారు ఉద్యోగంలో ఉండేవారు. ఆయన ఉద్యోగరీత్యా ఊరూరూ మారుతుండడం వల్ల హనుమంతరావు గారి విద్యాభ్యాసం ఒక్క చోటకాక సూర్యాపేట, జడ్చర్ల, నల్లగొండల్లో సాగింది. 1898 నాటికి ఉర్దూ మిడిల్ పరీక్షలో ఉత్తీర్ణులయినారు. ఆ రోజుల్లో అదే పెద్ద విద్యాయోగ్యత. తర్వాత ఇంగ్లీషుమిడిలు, మెట్రిక్‌పరీక్షల్లో కూడా ఉత్తీర్ణులయినారు. ఉర్దూ, ఇంగ్లీషులతోపాటు పార్సీ, తెలుగు, సంస్కృతభాషల్లో కూడా మంచిపరిజ్ఞానం సంపాదించినారు.

తొందరలోనే జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఆయనకు "మీర్ మున్షీ" ఉద్యోగం లభించింది. ఆ ఉద్యోగాన్ని ఎనిమిదేండ్లు నిర్వహించినారు. సహజంగా దాస్య నిర్బంధాలకు తలఒగ్గని వ్యక్తిత్వంకావడంవల్ల ఆ ఉద్యోగానికి స్వస్తి చెప్పినారు. వరంగల్లును వదిలి ఇప్పటి ఆంధ్రప్రదేశ్ రాజధాని అయిన హైదరాబాదుకు చేరుకున్నారు. అక్కడ తన స్వయం కృషితో మొదటి తరగతి న్యాయవాదవృత్తిలో ఉత్తీర్ణులైనారు; వెంటనే రాజబహదూర్ రాయె విశ్వేశ్వరనాథుగారి వద్ద శిక్షణపొంది న్యాయవాదవృత్తిని స్వీకరించినారు. వాద పటిమ, సమయ స్ఫూర్తి, నిర్భయత కలిగిన హనుమంతరావుగారు మంచి వకీలుగా ఖ్యాతి పొందినారు.

ఆ) కింది అల్లికను పూరించండి.

హనుమంతరావు గారికి పరిజ్ఞానం గల భాషలు

ఇ) కింది పదాలను మీ సొంత వాక్యాల్లో ఉపయోగించి రాయండి.

1) అగ్రగణ్యులు : ____________ 2) సమయస్ఫూర్తి : ____________

ఈ) స్వీయస్పందన :

మాడపాటి హనుమంతరావుగారిని గురించి మీ సొంతమాటల్లో 8-10 వాక్యాల్లో రాయండి.

GRGKZZ

2 కలలు కను

నేపథ్యం





- పై చిత్రాలను గమనించండి. చర్చించండి.
- మీ భవిష్యత్తు గురించి మీరేవైనా కలలుగన్నారా!

ఇప్పుడు ఈ పాఠంద్వారా ఎలాంటి కలలుకనాలి? వాటిని ఎలా సాధించాలి? ఒక ఆదర్శమూర్తిని ఎలా అనుసరించాలో నేర్చుకుందామా!

ఈ మధ్య కాలమంతా నేను పాఠశాలలు సందర్శిస్తూనే ఉన్నాను. ఎన్నో రాష్ట్రాల్లో చేపట్టిన నా పర్యటనల్లో భాగంగా ముఖ్యంగా ఈశాన్యరాష్ట్రాలయిన అస్సాం, త్రిపుర, జార్ఖండ్‌కూ అలాగే తమిళనాడులోని కొన్ని ప్రాంతాలకు వెళ్ళినప్పుడూ వేలాదిమంది విద్యార్థులతో మాట్లాడాను.

బాలలతో అటువంటి నా మొదటి సమావేశం త్రిపురలో ఒక హైస్కూల్లో తటస్థించింది. 500 మంది విద్యార్థులతో అధ్యాపకులతో సమావేశం అది. భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా రూపొందించడం గురించి వారితో ముచ్చటించగానే ఎన్నో ప్రశ్నలు నన్ను ముంచెత్తాయి. వాటిలో రెండింటిని ఇక్కడ చర్చిస్తాను. మొదటి ప్రశ్న ఏమంటే 'ఒక ఆదర్శ మూర్తిని మేమెక్కడ చూడగలం? ఆ ఆదర్శ మూర్తిని మేమెట్లా పొందగలం?'

మనం గుర్తించినా గుర్తించకపోయినా చిన్నప్పటినుంచీ మన జీవితంలో వివిధదశల్లో మనం కొందరు ఆదర్శ మూర్తుల్ని అనుసరిస్తాం. నేనన్నాను. 'మీరు పెరిగి పెద్దవాళ్ళవుతున్నప్పుడు అంటే దాదాపు పదిహేనేళ్ళు వచ్చిందాకా మీకు లభించగల గొప్ప ఆదర్శమూర్తులు మీ అమ్మ, నాన్న, పాఠశాల ఉపాధ్యాయులూను'. ఆ కాలానికి తగిన దిశానిర్దేశమివ్వగలిగింది వాళ్ళే. అక్కడున్న ఉపాధ్యాయుల వైపూ, తల్లిదండ్రుల వైపూ తిరిగి వాళ్ళదెంత గొప్ప బాధ్యతో చెప్పాన్నేను. శిశువుకి విలువలతో కూడిన పరిపూర్ణ అభివృద్ధి వారి ద్వారానే వస్తుందని నమ్ముతున్నాన్నేను.

ఆదర్శమూర్తులని ఎవరిని అంటారు?

ఉపాధ్యాయుడు పిల్లలకి కిటికీ లాంటి వాడు. పిల్లల అభ్యసనానికీ, పరిజ్ఞానానికి అతడే ఆధారం. వాళ్ళలో సృజనాత్మకత మేలుకొల్పే ఆదర్శమూర్తి పాత్ర పోషించవలసింది అతడే. తల్లి, తండ్రి, ఉపాధ్యాయుడు– ఈ ముగ్గురూ కలిసిన స్వరూపమే నాకు తెలిసిన గొప్ప ఆదర్శమూర్తి. ఉపాధ్యాయులూ, తల్లితండ్రులూ తగినంత అంకిత భావంతో తమ చిన్నారుల జీవితాల్ని తీర్చి దిద్దగలిగితే భారతదేశానికి నవ్య జీవితం సిద్ధిస్తుందనగలను. ఎవరో ఎంత బాగా అన్నారు 'తల్లిదండ్రుల కృషి వెనుక పాఠశాల ఉంటుంది'. ఉపాధ్యాయుడి కృషి వెనుక విద్యార్థి గృహం ఉంటుంది అని. విద్యనీ, ఉపాధ్యాయ విద్యార్థి సంబంధాన్నీ

కలలు కందాం, కలలు కందాం. కలలు భావాలుగా పరివర్తన చెందుతాయి. భావాలు ఆచరణగా పర్యవసిస్తాయి' అని.

ఆ మీదట వాళ్ళకి చెప్పాను. 'మిత్రులారా, కలలే లేకపోతే విప్లవాత్మక భావాలుండవు. ఆలోచనలే లేకపోతే ఆచరణ ఉత్పత్తి కాదు. అందుకనే తల్లిదండ్రులూ, ఉపాధ్యాయులూ తమ పిల్లల్ని స్వప్నించడానికి ప్రోత్సహించాలి. స్వప్నాలు సాకారమయితేనే విజయాలు సిద్ధించేది. అయితే ఆ మార్గంలో కొన్ని ఆశాభంగాలూ కొంత ఆలస్యమూ తప్పవనుకోండి'.

మరొక విద్యార్థి అడిగిన ప్రశ్నకి కూడా నా దగ్గర సమాధానం సిద్ధంగా లేదు. అతనన్నాడు. 'సార్, పెద్ద పెద్ద వాళ్ళెందుకు మాతో మాట్లాడటానికి రారు? మన ప్రధాన మంత్రి కలకత్తా, చెన్నై, లక్నో లాంటి ఎన్నో పట్టణాలకు వెళుతుంటారు గాని, ఇక్కడి కెప్పుడూ రారు. మాకాయన కావాలి. ఆయన మాతో మాట్లాడాలని మేము కోరుకుంటున్నాం' తమ దేశ నాయకులతో తమ భావాల్ని పంచుకోవాలనుకునే ఆ గాఢమైన కోరిక నన్ను ముగ్ధుణ్ణి చేసింది. ''నేను ఢిల్లీ వెళ్ళినప్పుడు మన నాయకులతో మీ కోరికని వెల్లడిస్తాను. మీ కల నిజమయ్యే రోజు రాకపోదు' అని చెప్పాను.

చూడవలసింది జాతి ఎదుగుదలని దృష్టిలో పెట్టుకుని తప్ప, వ్యాపార ప్రయోజనాల్ని దృష్టిలో పెట్టుకుని కాదు. సక్రమమైన విద్య మన యువతలో ఆత్మగౌరవాన్నీ, మర్యాద భావననీ పెంచి పోషించడానికి సహకరిస్తుంది. ఈ లక్షణాలు ఏ చట్టమూ అమలు చెయ్యగలిగేవి కావు. అవి మనకు మనమే పెంపొందించుకోవాల్సినవి.

మరొక సందర్భంలో తమిళనాడునందలి దిండిగల్‌లోని సెయింట్ మేరీస్ స్కూల్ వారి డెబ్భై అయిదవ వార్షికోత్సవంలో చాలామంది విద్యార్థుల్ని ఉద్దేశించి ప్రసంగించాన్నేను. అక్కడ నన్ను కలవాలని ఉత్సాహపడుతున్న విద్యార్థుల్లో ఇద్దరు నా నుంచి తమ ప్రశ్నలకి జవాబు రాబట్టుకునే తొందరలో ఉన్నారు. ఒక విద్యార్థి అడిగాడు. నేను మీ ''వింగ్స్ ఆఫ్ ఫైర్'' తమిళ అనువాదం చదివాను. మీరెప్పుడూ కలలు కనమంటూ సందేశమిస్తారు. చెప్పండి సార్, కలలెందుకు?'

నేను అక్కడున్న విద్యార్థి సమూహమంతటినీ ఈ కింది విధంగా పైకి జపించమన్నాను. 'కలలు కందాం,

రాజస్థాన్‌లో ఎడారి ఉండటానికి కారణాలు.

తరువాత నేను దీన్ని ప్రధాన మంత్రికి చెప్పినప్పుడు ఆయన విద్యార్థుల కోరికలోని సమంజసత్వాన్ని గుర్తించారు.

బొకారోలోని శ్రీ రామకృష్ణ ఉన్నతపాఠశాలలో సుమారు మూడువేల మంది విద్యార్థుల్ని ఉద్దేశించి నేను ప్రసంగించినప్పుడు ఆ విద్యార్థులు ఏర్పరిచిన చిత్రప్రదర్శనని కూడా చూసాను. అక్కడ వాళ్ళు ప్రదర్శించిన బొమ్మలూ,

చిత్రలేఖనాలూ ఆ విద్యార్థుల సృజనాత్మకతకి అద్దం పడుతున్నాయి. వాళ్ళతో నేను జరిపిన సంభాషణలో ఒక విద్యార్థి నన్నో ప్రశ్న అడిగాడు. 'ఈ జార్ఖండ్‌లో ఎక్కడ చూసినా పచ్చదనం కనిపిస్తుంది. మాకు అడవులున్నాయి, కొండలున్నాయి, వాగులున్నాయి. మరి రాజస్థాన్‌లో ఎడారి మాత్రమే ఎందుకు ఉంది?'

నదీజల అనుసంధానం అంటే ఏమిటి? దీనికి ప్రభుత్వం చేస్తున్న కృషి ఏంటి?

ఆ ప్రశ్న నాకు అటువంటిదే అస్సాంలో విన్న మరొక ప్రశ్నని గుర్తుచేసింది. బ్రహ్మపుత్ర జలాల్ని తమిళనాడుకే గానీ రాజస్థాన్‌కి ఎందుకు తీసుకుపోలేం అన్నదా ప్రశ్న.

వాళ్ళకి చెప్పాను నేను 'మీకు తెలుసా? ఇరవయేళ్ళ క్రిందట రాజస్థాన్‌లో మీరిప్పుడు చూస్తున్నంత సేద్యంకూడా ఉండేది కాదు. కానీ, ఒకసారంటూ ఇందిరాగాంధీ జాతీయ సేద్యపుకాలువ తవ్వడంతో అక్కడ చాలాచోట్ల వ్యవసాయం మొదలైంది. మనిషి తలచుకుంటే ఎడారిని కూడా సస్యశ్యామలం చేస్తాడు.' నేను అస్సాంలో విద్యార్థికి ఏం చెప్పానో ఇక్కడా అదే చెప్పాను 'నదీ జలాలను అనుసంధించడం, నీటికోసం పరితపిస్తున్న రాష్ట్రాలకు నీళ్ళివ్వడం జాతి ముందున్న ఒక మహాధ్యేయం. దానికి చాలా ముందు చూపూ, సాహసవంతమైన ఆచరణా కావాలి. మీరు పెద్ద వాళ్ళై జాతీయ పునర్నిర్మాణం చేసేటప్పుడు ఈ ఆలోచనలకు కూడా రూపాన్నివ్వగలరు.

గుజరాత్‌లోని ఆనంద్‌లో పాఠశాల విద్యార్థుల్ని ఉద్దేశించి చేసిన ప్రసంగ సందర్భంగా చురుకైన పిల్లవాడొకడు నన్నో తెలివైన ప్రశ్న వేసాడు. 'మన శత్రువు ఎవరు?' అని. నాకా ప్రశ్న నచ్చి తక్కిన విద్యార్థుల ముందు పెట్టి వారి అభిప్రాయాలడిగాను. అప్పుడొచ్చింది జవాబు. 'పేదరికమే మన శత్రువ'ని. ఎంత వివేకవంతమైన ప్రతిస్పందన!

దేన్నయినా సాధించాలన్న తృష్ణ అత్యంత బలమైందే కాదు, దీర్ఘపరిణామం మీద రూపొందింది కూడా అనిచరిత్ర చెప్తున్నది. మనం దాన్ని మరిచినా కూడా అది మన అనుభవంలో అంతర్లీనంగా ఉండి మనని ముందుకు నడిపిస్తుంది. ఆ తృష్ణే లేకపోతే మనకి నేర్చుకోవాలన్న, ఎదగాలన్న, పరిపూర్ణులం కావాలన్న కోరిక ఎక్కణ్ణుంచి వస్తుంది?

విక్రమ సారాభాయి ఊహించిన అటువంటి క్రాంతదర్శిత్వం మూడు దశాబ్దాల పాటు పెంచి పోషింపబడి, సమన్వయించబడి నిలదొక్కు కోవడం చూసాన్నేను. కార్యక్షేత్రంలో గానీ, లేదా చేపట్టిన ఏ పనిలో గానీ ఈ ఆకాంక్షే మన పరిమితుల్ని అధిగమించడానికి మనల్ని ప్రోత్సహిస్తుంది. మనమా విధంగా ప్రయత్నించడానికి, ముందుకు పోవడానికి రోల్ మోడల్స్ తగిన మార్గ నిర్దేశం చేస్తారు. మీకు కూడ అటువంటి ఆరాధ్యనీయుడైన ఆదర్శమూర్తి ఒక క్రీడాకారుడో, ఒక అధ్యాపకుడో, ఒక వ్యాపారవేత్తనో ఉండిఉండవచ్చు, అతన్ని అన్వేషించాలి మీరు.



రచయిత పరిచయం : డా॥ ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారు 'ఇగ్నైటెడ్‌మైండ్స్' అన్న పేరుతో రాసిన పుస్తకాన్ని శ్రీ వాడ్రేవు చిన వీరభద్రుడు గారు ''నా దేశయువజనులారా'' అన్న పేరుతో తెలుగులోనికి స్వేచ్ఛానువాదం చేశారు.

'నా ప్రజలు తాము ఏది కలగంటున్నారో దాన్ని సాధించగలరని వాళ్ళకి చెప్పబోవడం కన్నా మహత్తరమైన కార్యక్రమం నాముందు మరేది ఉండగలదు? నూరు కోట్ల జాతి జనులు విదేశాలకు ముడి సరుకుల్నీ చౌక ధరలకు కూలి వాళ్ళనీ అమ్ముకుంటూ ఉండి పోగూడదనీ, ఇతర జాతులు తయారు చేసిన సరుకులకు మనం అంగడిగా మారిపోకూడదనీ కోరుకుంటూ రాసిన పుస్తకం ఇది.

I చదవండి - ఆలోచించండి - రాయండి.

పదజాలాన్ని పెంపొందించుకుందాం.

సందర్శించుట = చూచుట; ముంచెత్తుట = వ్యాపించు, ఆక్రమించు; అంకితభావము = ఒక లక్ష్యం కోసం దీక్షతో పనిచేయుట; ఎదుగుదల=అభివృద్ధి; ప్రసంగించుట=మాట్లాడుట; పరివర్తన=మార్పు; పర్యవసానం=ముగింపు; వెల్లడించెను=తెలియజేసెను; తృష్ణ=కోరిక; పరితపించు=ఆరాటపడు.

II వినండి - చర్చించండి - రాయండి.

అ) జవాబులు రాయండి.

1) ఆదర్శమూర్తులని ఎవరిని అంటారు?

2) రచయిత ఉపాధ్యాయుని 'కిటికి'తో పోల్చటంలోని ఔచిత్యం.

3) కలలు కనటం వలన కలుగు ఫలితం.

ఆ) ఎవరు ఎవరితో పలికిరి.

1) ఉపాధ్యాయుడి కృషివెనుక విద్యార్థి గ్రహం వుంటుంది.

2) మీరెప్పుడూ కలలు కనమంటూ సందేశమిస్తారు.

3) స్వప్నాలు సాకారమయితేనే విజయాలు సిద్ధించేది.

4) ''పెద్దపెద్ద వాళ్ళెందుకు మాతో మాట్లడటానికి రారు?''

ఇ) సరియైన పదాన్ని ఎంపిక చేసి ఖాళీలను పూరించండి.

1) మనిషి తలచుకుంటే ____________ ని కూడా సస్యశ్యామలం చేస్తాడు.

అ) బంజరు భూమి ఆ) ఎడారి ఇ) బీడు భూమి ఈ) మెట్టభూమి

2) ____________ మన పరిమితులను అధిగమించడానికి ప్రోత్సహిస్తుంది.

అ) సంకల్పం ఆ) పట్టుదల ఇ) ఆకాంక్ష ఈ) స్వప్నం

ఈ) అల్లిక

i) శిశువుకు విలువలతో కూడిన అభివృద్ధి వీరి వలన ఏర్పడుతుంది.

ii) సక్రమమైన విద్య వీటి అభివృద్ధికి తోడ్పడుతుంది.

iii) ఈ ముగ్గురు కలసిన స్వరూపమే ఆదర్శమూర్తి.

iv) విద్యార్థుల సృజనాత్మకతకు ఈ రెండూ అడ్డం పడుతున్నాయి. → ------- / -------

v) జాతిముందున్న ప్రముఖ ధ్యేయాలు → ☐ / ☐

ఉ) కింది వాక్యాలలోని తప్పొప్పులను గుర్తించండి.

1) కాలానికి తగిన దిశానిర్దేశం చేయగలవారు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే. (   )

2) ఉపాధ్యాయుడు పిల్లలకు వెలుగు. (   )

3) ఉపాధ్యాయుడి కృషివెనుక విద్యార్థి గృహం ఉంటుంది. (   )

4) కలలే లేకపోతే విప్లవాత్మక భావాలుండవు (   )

III స్వీయ స్పందన :

1) మన ప్రధానమంత్రి ప్రారంభించిన 'మన్‌కి బాత్' కార్యక్రమం ఆకాశవాణిలో విని నీవు గ్రహించిన విషయాలు తెలియజేయి.

2) 'మానవుడు తలుచుకుంటే అసాధ్యమైనది లేదు', సోదాహరణంగా వివరించు.

IV భాషావగాహన :

అ) సరియైన సంధి నామం గుర్తించండి.

1) ముంచి + ఎత్తాయి → అకారసంధి / ఇకారసంధి / ఉకారసంధి → ☐

2) వార్షిక + ఉత్సవము → వృద్ధిసంధి / యణాదేశసంధి / గుణసంధి → ☐

3) అతి + అంతము → వృద్ధిసంధి / గుణసంధి / యణాదేశసంధి → ☐

ఆ) సమాసనామాలను జత చేయండి.

'అ' వర్గము	'క' వర్గము
1) ఇరవై ఏళ్ళు	అ) విశేషణ పూర్వపద కర్మధారయ సమాసము
2) తల్లి దండ్రులు	ఆ) షష్ఠీ తత్పురుష సమాసము
3) నవ్య జీవితం	ఇ) ద్వంద్వ సమాసము
4) విద్యార్థి గృహం	ఈ) ద్విగు సమాసము

ఇ) కింది వాక్యములు సామాన్య/సంశ్లిష్ట/సంయుక్తములలో ఏ రకమునకు చెందినవో తెలపండి.

1) తల్లిదండ్రుల కృషి వెనుక పాఠశాల ఉంటుంది.
2) విద్య యువతలో ఆత్మ గౌరవాన్ని, మర్యాద భావనను పెంచి పోషించడానికి సహకరిస్తుంది.
3) నన్ను కలవాలని, ఇద్దరు విద్యార్థులు ఉత్సాహపడుతున్నారు.
4) పేదరికమే మన శత్రువు.

ఈ) కింది పదాలకు వ్యతిరేక పదాలు రాయండి.

1) జ్ఞానము × ____________ 2) మర్యాద × ____________

3) ఉత్సాహము × ____________ 3) ఆలోచన × ____________

5) సమంజసము × ____________

ఉ) కింది పదాలను సొంత వాక్యాల్లో ఉపయోగించండి.

1) సందర్శించుట 2) ముంచెత్తుట 3) అంకిత భావము

4) ఆశాభంగము 5) అద్దం పట్టుట.

V సృజనాత్మకత :

1) విక్రమ్‌సారాభాయి గురించి అంతర్జాలములో విషయాన్ని సేకరించి రాయండి.
2) 'దేశ నాయకులతో తమ భావాల్ని పంచుకోవాలన్న విద్యార్థి కోరిక సమంజసమా' – చర్చించండి.
3) నీవు ఆదర్శమూర్తిగా ఎంచుకున్న వ్యక్తుల గురించి 5 వాక్యాలు రాయుము.
4) మానవునికి 'తృష్ణ' అవసరం – సమర్థించు.

నేనివి నేర్చుకున్నా :
తృష్ణ వుంటేనే దేనినైనా సాధించగలం.



ఒక విజేత ఆత్మకథ, భారతదేశపు శక్తి, నా జీవనగమనం (కలల సాకారం) మొదలగు పుస్తకాలను చదవండి. స్ఫూర్తిని పొందండి.

ఉ.సూ.: 'ఇస్రో' ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేయండి.
వి.సూ.: దినపత్రికల్లో వచ్చే ఇస్రోప్రయోగాల గురించి, శ్రీహరికోట ప్రయోగించుచున్న రాకెట్ల గురించి తెలుసుకోండి.

GRQH2M

కళా ప్రశంస

పఠనం

చిత్రకళ అనునది లలితకళలలో పేర్కొన దగిన ఒక ప్రధాన కళ. ఇది ఆదిమ మానవుల గుహాచిత్రాల నుండి ఇప్పటి వరకు ఎన్నో రకాలుగా ఎదుగుతూ వివిధ పుంతలు తొక్కుతూ రకరకాల శైలులలో విస్తరిస్తూ ఉన్నది. ఈ కళ కొందరికి వ్యాసంగం (హాబీ) అయితే మరికొందరికి వృత్తి లేదా ఉద్యోగం. ఈ కళను వ్యాసంగంగా మలచుకున్నా లేదా కనీసం ప్రశంసించటం నేర్చుకున్నా జీవితం ఆనందంగా సాగుతుందనటంలో సందేహం లేదు.

అందుకే ఈ పాఠ్యపుస్తకం ద్వారా వీలైనన్ని చిత్రకళా శైలులను పరిచయం చేయడం జరిగింది. వాటి గురించి కొంచెం తెలుసుకుందామా!

మధుబని చిత్రశైలి : (పరివర్తన) మధు అంటే తేనె. బన్ అంటే అడవి. దీనినే మిథిల చిత్రకళ అనికూడా అంటారు. ఇది మధుబని మరియు మిథిల ప్రాంతాలలో ప్రాచుర్యం పొందినది. పూర్వం అచటి స్త్రీలు చేతివేళ్ళు, కుంచెలు, అగ్గిపుల్లలు మొదలైన వాటినుపయోగించి ప్రకృతి సిద్ధంగా లభించే వర్ణకాలతో ముఖద్వారం, గోడలపై చిత్రించేవారు. ప్రస్తుతం పురుషులు కూడా చిత్రిస్తున్నారు. ఈ కళకుగాను శ్రీమతి జగదంబాదేవి, సీతాదేవులు 'పద్మశ్రీ' పురస్కారాన్ని అందుకున్నారు.

కేరీకేచర్ (Caricature): (చతురోక్తులు) చిత్రించదలచుకున్న వ్యక్తి, ప్రాణి మొదలగు వానిలో ప్రత్యేకంగా కనబడే పోలికలను (డిస్టిన్క్టివ్ ఫీచర్స్) చిత్రకారుడు సూక్ష్మీకరించి, లేదా అతిశయించి అతి తక్కువ గీతలతో చూపు విధానం.

లఘుమ చిత్రశైలి (Mininature Painting): (ఆతిథ్యము) ఈ చిత్రశైలిలో మొఘల్, రాజస్థాన్, కంగ్రా మొదలగు విధానాలున్నాయి. ఇవన్నీ చూడటానికి ఒకే విధంగా అనిపించిన సూక్ష్మదృష్టికి అందులోని భేదాలు గోచరమౌతాయి. ఇందులో ప్రధానంగా యుద్ధ సన్ని వేశాలు, రాజులు, రాణులు, రాధాకృష్ణులు ఇతివృత్తాలుగా వుంటాయి. ఇల్లు, మానవాకృతులు, పక్షులు, పండ్లు మొదలగు చిత్రాలు సమతలంగా, చిన్న ఆకారంలో, వాటిపై అతి సూక్ష్మమైన పనితనంతో చిత్రింపబడతాయి. వీటిని ఖనిజలవణాలు, మొక్కలు, శంఖువులు ఖరీదైన రాళ్ళు మొదలగు వాటితో తయారుచేసిన అనేక రకాల చక్కని రంగులతో జీవకళ ఉట్టిపడే విధంగా చిత్రిస్తారు. వీటిలో ప్రధాన ఆకర్షణ బంగారు రంగులో చిత్రించిన రాజులు, రాణుల ఆభరణాలు దుస్తులపైన జరీ నగిషీలు, కిరీటాలు.

ఇలస్ట్రేటివ్ (Illustrative): (కారుణ్యం మొ॥ వి) ఇలస్ట్రేటివ్ పద్ధతిలో పెక్కు విధానాలు ఉన్నాయి. పెన్సిల్‌షేడింగ్ బాల్‌పెన్‌ను, స్కెచ్‌పెన్, క్రేయాన్స్‌ను-పయోగించి గీసే విధానాలు. ఇలా ఒక్కొక్క రకం ప్రత్యేకంగాకాక అన్ని రకాల వర్ణక మాధ్యమాలను కలగలిపి గీసే విధానాన్ని మిశ్రమ వర్ణ మాధ్యమం (Mix media) ఇలస్ట్రేషన్ అంటారు.

మండల్ ఆర్ట్ (Mandal Art): (అద్భుతాలు చేయాలంటే) సాధారణంగా ఆకర్షణీయమైన రంగులతో ఈడిజైన్‌లు ముగ్గులుగా లేదా ఆక్రలిక్ రంగులతో పెయింటిగ్‌లా వేస్తుంటారు.

రియలిస్టిక్ డ్రాయింగ్ : (రాయబారం, అమ్మమ్మచదువు) : ఈ పద్ధతిలో చిత్రకారుడు వీలైనంత వాస్తవానికి దగ్గరగా ఉండేటట్లు చిత్రాలను గీయడానికి ప్రయత్నిస్తాడు. తగిన రంగులు, గీతలద్వారా సందర్భానుసారం భావనలు, ముఖకవళికలు చిత్రిస్తాడు.

సిల్హౌట్ (Silhouts): (కీర్తిచక్ర, బయలుబతుకు) సిల్హౌట్ అనునది బహిర్రేఖానుసారం ఒకే రంగును (నలుపు) నింపి అంతర్భాగాలు కనిపించకుండా గీయబడే చిత్రాలు.

వార్లీ చిత్రకళ: (మొదటి పుట, శీర్షికలు) ప్రకృతిని తల్లిగా భావించే ప్రజలైన వార్లీల చిత్రాలు రేఖాత్మకంగా, వృత్తము, త్రిభుజము మరియు చతురస్రము వంటి మూలాకృతులు కలిగి ఉంటాయి. ఈ ఆకృతులు వారి సూర్య చంద్రులు, కొండలు, చెట్లు మొదలుగాగల ప్రకృతి పరిశీలన ద్వారా సంభవించాయి. పూర్వం కేవలం గుడిసెల గోడలు, అరుగులు మొదలగు వాటిని మాత్రమే అలంకరించిన ఈ చిత్రకళలు ఆధునిక యుగంలో వస్త్రాలు, సంచులు, పెన్‌స్టాండులు, ఫైళ్ళు మొదలగు వాటికెన్నింటికో ఎక్కి ప్రచారాన్ని పొందుతున్నాయి. కళాకారులకు ప్రోత్సాహాన్ని, జీవికను అందిస్తున్నాయి. మనం కూడా వారికి మద్దతునిద్దామా!

3 తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టినట్లు

నేపథ్యం

> నీ వైఫల్యాలను ఉపేక్షించేవారు
> నీ సాఫల్యాలను అపేక్షించేవారు
> నిజమైన స్నేహితులు

- కింది వాక్యాన్ని తెలుగులోకి అనువదించండి.
  My best friend is the one who brings out the best in me.

పూర్వం రామచంద్రపురంలో ప్రభాకర్, శశిధర్ అనే బాల్యస్నేహితులు ప్రక్కపక్క ఇళ్ళలో ఉండేవారు. ప్రభాకర్‌కు ధనవ్యామోహం ఎక్కువ. శశిధర్ చాలామంచివాడు. కొంత కాలం గడిచాక ప్రభాకర్ తన ఇంటిని శశిధర్‌కి అమ్మివేసి పట్నం వెళ్లిపోయాడు. అక్కడ అనేక వ్యాపారాలు చేసాడు. ఏదీ కలిసి రాలేదు. తిరిగి తన స్వంత ఊరికి చేరాడు. అక్కడ బంధువులెవరూ లేనందున శశిధర్ ఇంటికి వెళ్ళాడు.

ఈలోగా శశిధర్ తన పొలాలను, తోటలను మరింత వృద్ధిచేసి మంచి రైతుగా పేరు పొందాడు. అంతేగాక ప్రభాకర్ వద్ద కొన్న ఇంటిని, తన ఇంటిని కలిసి ఒక పెద్ద భవనంగా తీర్చిదిద్దాడు.

తన ఇంటికి వచ్చిన ప్రభాకర్‌ని సాదరంగా ఆహ్వానించాడు. స్నేహితుని కష్టసుఖాలు విచారించాడు. అతని దుస్థితికి ఎంతో విచారించాడు. కొన్నిరోజులు తన ఇంట వుండమని కోరాడు.

[మిత్రులంటే ఎలా ఉండాలి?]

శశిధర్ పొలానికి వెళ్ళిపోగానే ప్రభాకర్ ఇంటి వసారాలో కూర్చుని తాను పోగొట్టుకున్న ఇంటిని చూస్తూవుండేవాడు. అది శశిధర్ ఇంటితో కలిసిపోవడం అతనికి ఎంతో అసూయ కలిగించింది. తన ఇంటిని తిరిగి ఏ విధంగానైనా పొందాలనే దురాశ కలిగింది.

అందుకు తగిన విధంగా పథకాన్ని తయారు చేసుకున్నాడు. రోజు శశిధర్ పొలానికి వెళ్ళిపోగానే ఆ ఇంటికి ఉన్న కిటికీలు, ద్వారబంధాలు, కిటికీలకు ఉన్న ఊచలు, పైకప్పుకి ఉన్న వాసాలు లెక్కించి రాసుకునేవాడు. ఆ ఇంటికోసం ఎవరెవరు పనిచేసారు, ఇటుకలు, రాళ్ళు, ఇసుక వంటివి ఎక్కడినుండి ఎంతెంత తెప్పించారు మొదలైన వివరాలు అడిగి తెలుసుకొన్నాడు.

[ఈర్ష్య, అసూయల గురించి మీ అభిప్రాయం ఏంటి?]

ఇంటికి సంబంధించిన వివరాలన్ని లభ్యమయ్యాక నకిలీ ఇంటిపత్రాలు తయారుచేయించి గ్రామాధికారి వద్దకు వెళ్ళాడు. తన ఇంటిని శశిధర్ ఆక్రమించుకున్నాడని తన ఇల్లు తనకు ఇప్పించ వలసినదిగా కోరాడు. గ్రామాధికారి శశిధర్‌కు కబురు పెట్టాడు. విషయం తెలిసి శశిధర్ నిర్ఘాంత పోయాడు. మిత్రుడు చేసిన మోసానికి ఎంతో విచారించాడు. తన వద్దగల పత్రాలు తీసుకొచ్చి చూపాడు. ఇరువురి మాటలు విని గ్రామాధికారి అన్ని పత్రాలను పరిశీలించాడు. ఇరువురు చెప్పిన విషయాలు ఒకేలావున్నాయి. ఎవరు నిజం చెబుతున్నారో, ఎవరు అబద్ధం చెబుతున్నారో తెలియడం లేదు. కనుక మీరు మర్యాదరామన్న వద్దకు వెళ్ళండి. తగిన న్యాయం దొరుకుతుంది అని పలికాడు.

[ఇతరులచే నీవు మోసగింపబడినపుడు నీవు తీసుకునే చర్యలేమిటి?]

ప్రభాకర్, శశిధర్ ఇరువురు తమ తగవును రామన్నకు వినిపించారు. రామన్న ఆ కాగితాలన్నీ పరిశీలించి ఇంటికి సంబంధించి ఇతర ఆధారాలేవైనా మీలో ఎవరైనా చూపగలరా? అని ప్రశ్నించాడు. అందుకు ప్రభాకర్ ''నా ఇల్లు నాకెంతో ప్రాణం. ఇంటికి చెందిన ప్రతి విషయం నేను చెప్పగలను. కాని స్నేహితుడు కాబట్టి ఆ అవకాశాన్ని శశిధర్‌కి ఇస్తున్నాను. ఆ ఇంటికి ఎన్ని గుమ్మాలు, కిటికీలు, వాసాలు ఉన్నాయో చెప్పమనండి అన్నాడు. శశిధర్ జవాబు చెప్పలేక పోయాడు. అప్పుడు ప్రభాకర్ ఆ వివరాలు మాత్రమేకాక

ఎవరెవరు ఇల్లు కట్టారో, ఆ ఇల్లు కట్టడం కోసం ఇటుకలు, రాళ్ళు, ఇసుక ఎంత అవసరమైందో కూడా చెప్పాడు. వివరాలన్నీ విన్న రామన్న తీర్పుని మర్నాటికి వాయిదా వేసారు.

మర్నాడు రామన్న వస్తూనే ప్రభాకర్‌ని, శశిధర్‌ని పిలిచి ప్రభాకర్! నిన్న నువ్వు ఒక సంగతి చెప్పడం మరిచి పోయావు. మా మనుష్యులు నిన్న వెళ్ళి ఆ ఇంటిని పరిశీలించారు. అక్కడి వంటగదిలో ఒకనేల మాళిగ వున్నట్లు గుర్తించారు. నీకేమైనా ఆ విషయం తెలుసా! అని ప్రశ్నించాడు. ఇల్లు దక్కించుకోవాలనే తొందర్లో ప్రభాకర్ ఔను! నాకు తెలుసు! మాతాతల కాలం నుంచి ఆ మాళిగ వుందని మానాన్న చెప్పారు అన్నారు. రామన్న చిన్నగా నవ్వి అంతే కాదు అక్కడ మా వాళ్ళకి ఒక ధనం మూట కూడా దొరికింది. దాని గురించి మీనాన్న చెప్పలేదా! అన్నాడు. వెంటనే ప్రభాకర్ అయ్యా క్షమించాలి! స్వశక్తితో జీవించాలనే కోరికతో ఆ ఇంటిని, మాళిగలో ఉన్నధనాన్ని శశిధర్‌కి అప్పగించి, జాగ్రత్తగా చూడమని చెప్పి పట్నం వెళ్ళిపోయాను.

నేను తిరిగివచ్చి అడిగితే నామిత్రుడు నాకు ద్రోహం చేసి ఆ ఇంటిని, ధనాన్ని దక్కించు కోవాలనుకున్నాడు. కాబట్టి మీరు నాకు న్యాయం చేయవలసినది అని కోరాడు. అందుకు రామన్న ప్రభాకర్ నువ్వెంతో తెలివైన వాడివి. నీ తెలివితేటలకు నేనిచ్చే బహుమతి వందకొరడాదెబ్బలు అని ప్రకటించాడు.

దురాశ వల్ల కలిగే నష్టాలేమిటి?

ఆశ్చర్యంగా చూస్తున్న సభికులతో ''ఇతను వాసాలతో సహా సరిగ్గా చెప్పినపుడే నాకు ఇతనిపై అనుమానం కలిగింది. ఒక ఇంటి యజమానిగా నేను సైతం నా ఇంటి వాసాలెన్నో చెప్పలేను. నేలమాళిగలో ధనం మూట ఉండడం అన్నది నేను కల్పించిన విషయం. ఆ ఇంట్లో నేల మాళిగన్నదే లేదు. ఈ మిత్రద్రోహి దురాశతో తన మోసాన్ని తాను బయట పెట్టుకున్నాడు'' అని ఇంటిని శశిధర్ పరం చేసాడు. సభికులంతా రామన్న తీర్పును ఎంతో కొనియాడారు.

రచయిత్రి పరిచయం : శ్రీమతి పద్మా పార్థసారథిగారు 1957 వ సం॥ మే 1 తేదీన బళ్ళారి జిల్లాలో హంపి విజయనగరంలో జన్మించారు. బొబ్బిలిలోని సి.బి.ఎం. గర్ల్స్ హైస్కూల్, రాజా ఆర్.ఎస్.ఆర్. రంగారావు కాలేజీలలో విద్యాభ్యాసం కొనసాగించారు. ఈమె వెల్లిమర్లలోని జిల్లా పరిషత్ గర్ల్స్ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీషు) గా పని చేయుచున్నారు. ''అక్షరసరాలు-బాలస్వరాలు గేయాలు, సామెతల కథావల్లరి మొదలగు పుస్తకములు రచించారు. ప్రస్తుత పాఠ్యభాగము వీరు రచించిన 'సామెతల కథావల్లరి' అను పుస్తకము లోనిది.

I వినండి - సంభాషించండి :

1) 'సామెత' అంటే ఏంటి?
2) మీకు తెలిసిన కొన్ని సామెతలను మీ మిత్రునితో చర్చించండి.

II వినండి - చర్చించండి - రాయండి.

అ) జవాబులు రాయండి.

1) శశిధర్ ప్రభాకర్‌ను ఆదరించిన విధము.
2) ప్రభాకర్‌కి శశిధర్ ఇంటిని తిరిగి పొందాలనే దురాశ కలిగింది.
3) ప్రభాకర్ ఫిర్యాదు విన్న గ్రామాధికారి చెప్పిన సలహా.
4) మర్యాదరామన్న చెప్పిన తీర్పు.

ఆ) ఎవరు ఎవరితో అనిరి :

1) ''ఇతర ఆధారాలేవైనా మీలో ఎవరైనా చూపగలరా?''
2) ''నా ఇల్లు నాకెంతో ప్రాణం.''
3) ''నిన్న నువ్వు ఒక సంగతి చెప్పటం మరచిపోయావు.''
4) ''అయ్యా! క్షమించాలి.''

ఇ) సరైన సమాధానం గుర్తించి ఖాళీలు పూరించండి.

1) ప్రభాకర్ తన ______________ అమ్మివేసి పట్నం వెళ్లిపోయాడు.
   అ) ఇంటిని ఆ) నగలను ఇ) తోటలను ఈ) పొలాన్ని
2) శశిధర్ మంచి రైతుగా పేరుపొందాడు ______________
   అ) సంఘసేవా కార్యక్రమాలు చేసి ఆ) దానధర్మాలు చేసి
   ఇ) పొలాలను, తోటలను మరింత వృద్ధిచేసి ఈ) పూజాపునస్కారాలు చేసి
3) ప్రభాకర్‌కి శశిధర్‌పై అసూయ కలగటానికి కారణం ______________
   అ) తన ఇల్లు శశిధర్ ఇంటిలో కలిసిపోవటం.
   ఆ) శశిధర్ ఆనందంగా ఉండటం.
   ఇ) శశిధర్ మంచి రైతుగా పేరుపొందటం.
   ఈ) శశిధర్ తనను ఆదరించటం.
4) ప్రభాకర్ ఇంటిని తిరిగి పొందాలని మొట్టమొదటగా ఈయన వద్దకు వెళ్ళాడు ______________
   అ) మర్యాదరామన్న ఆ) గ్రామాధికారి ఇ) గ్రామ సర్పంచ్ ఈ) గ్రామ పంచాయితీ

ఈ) i) వాక్యాలను జతపరచండి.

1) ప్రభాకర్, శశిధర్	అ) అన్నిపత్రాలు పరిశీలించాడు.
2) శశిధర్ స్నేహితుని	ఆ) బాల్యస్నేహితులు
3) మిత్రుడు చేసిన మోసానికి	ఇ) కష్టసుఖాలు విచారించాడు.
4) గ్రామాధికారి	ఈ) ఎంతో విచారించాడు.

ii) అర్థాలు జతపరచండి.

1) మిత్రుడు	అ) భూమిలో దాచిపెట్టిన ధనమున్న స్థలము.
2) నిర్ఘాంతపోవుట	ఆ) స్నేహితుడు
3) ఆక్రమించుట	ఇ) ఆశ్చర్యపడుట
4) నేలమాళిగ	ఈ) స్వాధీన పరచుకొనుట

ఉ) అల్లిక పూరించండి :

ప్రభాకర్ సేకరించిన వివరాలు → ____________

→ ____________

→ ____________

→ ____________

III స్వీయస్పందన:

1) ప్రభాకర్ మాటలు విన్న గ్రామాధికారి ఏం చేశాడో మీ సొంత మాటల్లో రాయండి.

2) మర్యాదరామన్న ఏవిధంగా తీర్పునిచ్చాడో మీ సొంతమాటల్లో తెలియచేయండి.

3) 'ప్రభాకర్ తన స్నేహితుడిని మోసం చేయాలనుకోవడం సమంజసమేనా' – మీ అభిప్రాయం రాయండి.

IV భాషావగాహన :

అ) వ్యతిరేకపదాలు రాయండి.

1) జాగ్రత్త × ____ 2) అన్యాయము × ____

3) నిజం × ____ 4) ఆధారము × ____

ఆ) గీతగీసిన పదాలకు వచనాన్ని మార్చి రాయండి.

1) తగిన విధంగా <u>పథకమును</u> తయారు చేశాడు. ____

2) రామన్న <u>కాగితాలు</u> పరిశీలించాడు. ____

3) శశిధర్ <u>జవాబు</u> చెప్పలేకపోయాడు. ____

4) ఎవరు <u>అబద్ధాలు</u> చెబుతున్నారో తెలియలేదు. ____

ఇ) కాలాన్ని గుర్తించి రాయండి.

1) ప్రభాకర్ శశిధర్ ఇంటికి వెళ్ళాడు. ____________

2) ప్రభాకర్ పోగొట్టుకున్న తన ఇంటిని చూస్తున్నాడు ____________

3) ప్రభాకర్ అవకాశాన్ని శశిధర్‌కు ఇవ్వబోయాడు ____________

4) శశిధర్ వివరాలు చెప్పలేక పోయాడు ____________

ఈ) పర్యాయపదాలు రాయండి.

1) ఇల్లు 2) తోట 3) స్నేహితుడు

4) మనుష్యులు 5) ధనం 6) నాన్న

ఉ) పదాలను విడదీసి సంధిపేరు రాయండి.

పదము	విడదీసి రాయుట		సంధిపేరు
1) పొందాలనే	+	→	
2) ఎంతెంత	+	→	
3) నువ్వెంతో	+	→	
4) నేల మాళిగన్నదే	+	→	
5) గ్రామాధికారి	+	→	

ఊ) విగ్రహ వాక్యం రాసి, సమాసనామం రాయండి.

1) కష్టసుఖాలు →

2) ఇంటి పత్రాలు →

3) వంద కొరడాదెబ్బలు →

4) రామన్న తీర్పు →

ఋ) కింది వాక్యాలు సామాన్య/సంశ్లిష్ట/సంయుక్తములలో ఏ తరగతికి చెందినవో రాయండి.

1) ప్రభాకర్ ఇంటికి సంబంధించిన అన్ని వివరాలు తెలుసుకున్నాడు.

2) శశిధర్ నా స్నేహితుడు కాబట్టి ఆ అవకాశాన్ని చూపాడు.

3) రామన్న కాగితాలన్నీ పరిశీలించి, ఇతర ఆధారాలేమైనా చూపించగలరా అని అడిగాడు.

ౠ) గీతగీసిన పదాలు ఏభాషాభాగాలో గుర్తించండి.

1) శశిధర్ మంచి రైతుగా పేరుపొందాడు.

2) అందుకు ప్రభాకర్ నా ఇల్లు నాకు ఎంతోప్రాణం అన్నాడు.

V సృజనాత్మకత :

1) పంచతంత్రకథలను అంతర్జాలంలో చదివి, మీకు నచ్చిన రెండు కథలను సొంత వాక్యాల్లో రాయండి.

2) ప్రసారమాధ్యమం (దూరదర్శిని)లో వచ్చే కార్యక్రమాలను చూసి, మీకునచ్చిన కార్యక్రమం గురించి ఒక పరిచ్ఛేదం రాయండి.

3) నుడి కారాలు, సామెతలు సేకరించి ఆల్బమ్ తయారుచేయండి.

4) దిన, వారపత్రికల్లో వచ్చే నుడికారాలు, జాతీయాలను చదివి, వాటిని గురించి తరగతిలో చర్చించండి.

VI లేఖన కౌశల్యాలు :

1. సామెత వివరణ లేఖనం : కింది సామెతలను వివరించండి.

1) "ఐకమత్యమే మహాబలము" 2) "మొక్కై వంగనిది మ్రానై వంగునా". 3) "దురాశ దుఃఖమునకు చేటు"

2. నివేదిక లేఖనం : కింది అంశాల ఆధారంగా సంక్రాంతి పండుగ గురించి నివేదిక రాయండి.

- తేది : 16-1-2018
- మాసం-పుష్యమాసం
- మూడు రోజుల పండుగ
- భోగి, సంక్రాంతి, కనుమ
- భోగి మంటలు-భోగి పళ్ళు
- రంగురంగుల ముగ్గులు
- గంగిరెద్దులు, హరిదాసులు
- బొమ్మల కొలువులు.
- పశువులకు అలంకారము.

నేనివి నేర్చుకున్నా :

1) నిత్యవ్యవహారంలో సామెతలను అర్థవంతంగా ప్రయోగించడం.

2. సామెతలు - వాటి పుట్టు పూర్వోత్తరాలు.

GRZD4A

కారుణ్యం

ఆరోజు ఆదివారం. స్కూలు లేదు కాబట్టి సుమతి తీరిగ్గా కూచుని పేపరు చదువుకుంటున్నది.

ఆ వేళప్పుడు సహజంగా వాసు కంటికి కనబడడు. ఎందుకంటే, ఆదివారం వాళ్ళమ్మ వాడిని బలవంతాన పట్టుకుని వంటికి నూనెరాసి తలంటు పోస్తుంది. వాడి పదేళ్ళ జీవితంలో తలంటు పోసుకోవడం అన్నది పెద్ద గండం.

అటువంటి తలస్నానం తప్పించుకోకుండా ఇటూ, అటూ తిరుగుతూండడం సుమతికి ఆశ్చర్యంగా ఉంది. పేపరు మధ్య నుంచి వాడిని గమనిస్తూ ఉంది. ఒకవేళ ఏదన్నా సినిమాకి డబ్బులు అడిగే ప్రయత్నంలో ఉన్నాడా అన్న అనుమానంతో.

''అత్తా'' అన్నాడు వాసు. సుమతి బదులు చెప్పలేదు. 'అత్తా' అంటూ పిలిచి అసలు విషయం చెప్పకపోవడం వాడికి అలవాటే.

''అత్తా! పోలీసులకి మనం ఫోను చేస్తే వస్తారా!'' అని అడిగాడు.

సుమతి ఉలిక్కిపడింది. సర్దుకుని ''నీకు పోలీసుల్తో పనేమిట్రా? ఎవరిని పట్టిస్తావ్?'' అడిగింది సుమతి.

''అదికాదు అత్తా – నూరు నంబరుకి ఫోన్ చేస్తే పోలీసులు వస్తారట కదా!''

''ఎందుకు? ఫైర్‌గాని, యాక్సిడెంట్‌గాని అయితే వస్తారు'' అంది సుమతి.

''అది నిజమే అనుకో, నాకిప్పుడు పోలీసు సహాయం కావాలి'' అన్నాడు వాసు, చాలా సీరియస్‌గా మొహం పెట్టి.

''ఏం? ఎవరన్నా దొంగతనం చేశారా?'' అడిగింది సుమతి.

''పోలీసులు అంటే ఒక్క దొంగల్ని పట్టుకోవటానికేనా? అన్యాయం జరుగుతూంటే మనకి సహాయం చేయరా? రక్షకభటులు అంటే అర్థం ఏమిటి? కష్టంలో వున్న వాళ్ళని రక్షించేవారని? నువ్వే కదా చెప్పావు'' అడిగాడు. అత్తచెప్పిన పాఠాలు అబద్ధమా అన్న సవాల్ చేస్తూ.

''కాదని అనటం లేదు. ఎవరికి సహాయం చెయ్యాలి. అసలు కారణం ఏమిటి చెప్పు''.

''సహాయం అంటే ఒక్క మనుషులకేనా? జంతువులకి సహాయం చెయ్యకూడదా? అడిగాడు వాసు.

సుమతికి విషయం కొద్ది కొద్దిగా బోధపడుతోంది. ఈ వాసుగాడు ఏ జంతువునో, కుక్కనో , పిల్లినో రక్షించటానికి బద్ధకంకణం కట్టుకున్నాడు. వాడు ఎవరు చెప్పినా వినడు. సరాసరి పోలీస్ స్టేషన్‌కి వెళ్ళిపోతాడు.

''వాళ్ల టామీ గురించేనా?'' అడిగింది సుమతి.

''అవునత్తా, పాపం! అది ఆ మురుగేశన్ గేటు వదలి రాదు. కుయ్యో, కుయ్యో అంటూ అరుస్తూ కూచుంటుంది. వాళ్ళేమో గేటు తెరవరు. పైగా రాళ్ళేసి కొడుతున్నారు.''

''పోనీ నీవు మనింటికి తీసుకురా'' అంది సుమతి.

''అమ్మ ఒప్పుకోదు. మనింట్లో చుట్టూ స్థలం లేదుగా?''

''మరి ఏం చేస్తావ్?'' అడిగింది సుమతి కుతూహలంగా.

''నోరులేని ఒక ప్రాణిని యిన్నాళ్ళు పెంచి యివ్వాళ తరిమేస్తున్నారని పోలీసులకి అప్పజెబుతాను'' అన్నాడు వాసు ఉద్రేకంగా.

సుమతికి తన మేనల్లుడి మీద కొండంత ప్రేమ పెల్లుబికింది. మురుగేశన్ వాళ్ళ టామీ గురించి వారం రోజులుగా, రకరకాల కథలు వింటున్నది సుమతి. టామీ తెల్లగా, పొట్టిగా ఉండే బొచ్చుకుక్క. దానికి తోక ఎటువుందో, ముఖం ఎటువుందో కూడా తెలియనంతటి బొచ్చుతో పూల బంతిలాగా రోడ్డుమీద గర్వంగా నడుస్తూ పోతూండేది కొంతకాలం క్రితం. మురుగేశన్ పొద్దుట, సాయంత్రం గొలుసుకట్టి షికారుకి తీసుకెళుతుంటే టామీని చూస్తే చాలు తన జన్మ ధన్యం అవుతుందని ఆశగా రెప్పవెయ్యకుండా చూసేవాడు వాసు. ఆ కుక్క, దాని యజమాని యిద్దరూ అతి గర్వంగా షికారుకి వెళుతుండేవారు ఆ వీధిలో. వాసుకి యీ టామీతో ఆడుకోవాలని – దానికి ట్రిక్స్ నేర్పాలని చాలా ఆశగా ఉండేది. కాని మురుగేశన్ టామీని ఎవరితోను ఆడుకోనిచ్చేవాడు కాదు.

మురుగేశన్‌కి పెద్ద యిల్లూ, చుట్టూ విశాలమైన ఆవరణా, ఇనపగేటు వున్నాయి. అతడు బిల్డింగ్ కాంట్రాక్టరు. ఆవరణలో ఇనుపసామానూ, ఇటుకలు, చెడిపోయిన లారీ, ఇళ్ళు కట్టడానికి కావలసిన సామాను చాలా పడి వుండేది. ముఖ్యంగా ఆ సామాను కాపలా కోసం కుక్కని పెంచుతున్నాడు. రాత్రిళ్ళు ఈ టామీ ఆవరణ అంతా తిరిగి కాపలా కాయాలని అతని వుద్దేశం.

అయితే కుక్కల్లో కాపలా కుక్కలు, లాప్‌డాగ్సు – అని రకాలుంటాయి. కాపలాకుక్కలు – అల్సేషియన్స్ – గుర్రాల్లాగా వుండి బాగా తిని ఇంట్లోకి ఈగని కూడా చొరనివ్వకుండా కాపలా కాస్తాయి. ఈ బొచ్చు కుక్కలు ముద్దుగా ఇంట్లో అంతా తిరిగి సోఫాలు, కుర్చీలు ఎక్కి ఆట వస్తువుల్లాగా వుండే ప్రాణులు, పామేరియన్ జాతి కాపలాకి అంతగా పనికిరావు. ఈ విషయం వివరంగా తెలియని మురుగేశన్ అందంగా, ముద్దుగా వున్న బొచ్చు కుక్కపిల్లని తెచ్చి దాన్ని ఎంతో గారాబంగా పెంచి రాత్రిళ్ళు కాపలాకి అని వీధి వరండాలో కట్టేశాడు.

ఆ కుక్క వరండాలో పడుకుని ఉండగానే రాత్రిళ్ళు వెనకచాటుగా ఇనుపకడ్డీలు ఎవరో ఎత్తుకుపోతున్నారట. ముందువైపుకి కుక్కను కట్టేశారు, కాబట్టి వెనక సామాన్లు పోతున్నాయని వెనుకవైపుగా టామీని కట్టాడు. ముందువైపు బల్బ్సు, కొబ్బరికాయలే పోయాయి. ఈ కుక్క వుండీ దొంగలు పడుతున్నారు. కాబట్టి దీనికి దొంగలు వస్తే మొరిగే తెలివిలేదు. ఇది కాపలాకి పనికిరాదు. దీనికి తిండి దండుగ అని మురుగేశన్ టామీని వీధిలోకి తరిమేశాడు. గేట్లు మూసేసి, లోపలికి రానివ్వకూడదని, పాలూ, తిండీ పెట్టకూడదని కట్టుదిట్టం చేశాడు.

నోరూ వాయీలేని ఈ జీవికి నిన్న మొన్నటిదాకా తనని అందలం ఎక్కించిన యజమాని లోపలికి ఎందుకు రానివ్వటం లేదో అర్థం కాలేదు. దానికి అర్థించగల కళ్ళు ఉన్నాయి. అరవగల నోరూవుంది. అప్పటిదాకా భోగభాగ్యాలు అనుభవించిన టామీ ఆ యింటి గేటు ముందు కూచుని ఆగకుండా అరుస్తోంది. విశ్వాసంతో యజమాని యింటివైపు చూస్తున్నది. ''నేను చేసిన తప్పేమిటి? నన్ను ఎందుకు లోపలికి రానివ్వరు?'' అని.

దీని అరుపులు మొదట్లో బలంగా, ఆరోగ్యంగా వుండేవి. తర్వాత క్షీణించి కుయ్ కుయ్‌మని జాలిగా వుండేది. తెల్లని టామీ బొచ్చు మట్టికొట్టుకుని పోయింది. దానికి అన్ని కుక్కల్లాగా ఆహారం కోసం చెత్తాచెదారము వెతుక్కోవటం చాతకాదు. వీధి కుక్కల్తో పోరాడటమూ తెలియదు. అందంగా – పూలబంతి లాగా వుండేటామీ చిక్కిపోయి, అలా గేటు దగ్గర పడివుంది. తన జాతికి సహజమైన విశ్వాసంతో.

ఆ వీధిలోని చిన్నపిల్ల – వాసుతో సహా కలిసి టామీకి అన్నం, బిస్కట్లు పెడదామని చాలా చూశారు. టామీ ఎవరు ఏం పెట్టినా తినేది కాదు. యజమాని గేటు వైపు చూసి, మూలుగుతూ కుయ్‌కుయ్‌మని హృదయ విదారకంగా ఏడ్చేది. ఈ టామీ దీనగాథ వారం రోజులనుంచీ అందరి చెవుల పడుతోంది. ఎవరికి వారు ''పాపం నోరులేని ప్రాణి – యిలాంటి పని చెయ్యొచ్చా?'' అనుకునేవారే గాని మురుగేశన్ ఎదుటపడి ఎవరూ ఏమి అడగలేదు.

రోడ్డుమీద కళేబరం పడివుంటే మన కెందుకని ముక్కు మూసుకుపోయే మనస్తత్వం సగటు మనిషిది.

రోడ్డుమీద యాక్సిడెంట్ అయితే సాక్ష్యం యివ్వాల్సి వస్తుందేమోననీ, పోలీస్ స్టేషన్ చుట్టూ తిరగాలేమోనని భయపడి వూరుకునే 'సివిక్‌సెన్స్' మనది. మురుగేశన్ డబ్బున్నవాడు. అతనికి పెద్ద యిల్లుంది. పెద్ద బిజినెస్ ఉంది. అతనికి యిష్టమయింది కుక్కను పెంచుకున్నాడు. అది కాపలా కాయలేదు కాబట్టి తిండి దండుగ అని తరిమేశాడు. ఇది మనకి సంబంధించినది కాదు అని ఆ వీధిలోని పెద్దలు సరిపెట్టుకున్నారు.

కాని, లోకపు తీరు తెలియని మనుషులూ, ఈ సంఘం ఎటువంటి శిలా సదృశ్యమైనదో తెలియని వాసు లాంటి పిల్లలు ఆ టామీని చూసి జాలిపడుతున్నారు. మురుగేశన్ చేత ఆ టామీని మళ్లీ యింట్లో ఉంచుకునేటట్లు చెయ్యాలని పిల్లల అభిలాష. దీనికి వాసు నాయకుడు.

''అత్తా, పోలీసులకి చెబితే వాళ్ళు మురుగేశన్‌కి బుద్ధి చెప్పరా? పోలీసులు మనుషులని తప్ప – కుక్కలని రక్షించరా?'' అని వాసు అడిగాడు సుమతిని.

పదేళ్ళు నిండని వాసు దృష్టిలో అన్ని ప్రాణులూ ఒకటే. భగవంతుని దృష్టిలో అన్ని ప్రాణులూ సమానము అయినట్లే పసిపిల్లల దృష్టిలో పిల్లి ప్రాణానికి, మనిషి ప్రాణానికి మధ్య తేడా లేదు. అన్యాయమన్నది మనిషికి జరిగినా, జంతువుకి జరిగినా ఒకటే, అయితే మనిషి చేసిన ఈ న్యాయ సూత్రాల్లో మనిషికి వున్న విలువ, జంతువుకి లేదు. రోడ్డుమీద ఒక గొడ్డుని చావబాదుతుంటే, పోలీసువారు పట్టించుకోరు. పట్టించుకోనక్కరలేదు. అది వారి రక్షణ విధులలో లేదు కాబట్టి.

''పోలీసులని తీసుకొచ్చి ఏం చేస్తావ్? అది మురుగేశన్ పెంచుతున్న కుక్క. అతనికి ఇష్టంలేదు. తరిమేశారు. ఇది పోలీసుకేసు కింద రాదు'' అంది సుమతి.

''అంతేనా? మరి కాపలా కాయలేదని ఉపయోగం లేదని వీధిలోకి తరిమాడుకదా – రేపు మురుగేశన్ ముసలివాడు అయితే – అతన్ని కూడా పనికిరాని వాడని తరిమేయొచ్చా? మనింట్లో మామ్మ ఉంది. ఎప్పుడూ మంచం మీదే వుంటుంది. అందుకని....'

''నోర్ముయ్ – అలాంటి మాటలు అనకూడదు. ఆ టామీకి, మామ్మకీ పోలిక తెస్తావా?''

''పోనీలే మామ్మనంటే నీకు కోపం వస్తుంది. రేపు నా కాలు విరిగిపోతుందనుకో – స్కూలు కెళ్ళి చదువుకోలేననుకో....' ఆగిపోయాడు వాసు – అత్త ముఖం చూసి బాధపడుతూ.

''వాసూ యిట్లాంటి చెడ్డమాటలు నీకు ఎవరు నేర్పుతున్నారా?'' అడిగింది సుమతి నిదానంగా. వాడి వాదనలోని బలాన్ని వొప్పుకోలేకుండా వుంది. అలాగని కొట్టి పారేయ్యలేకుండాను వుంది.

''ఇవి చెడ్డమాటలు కావు. పాపం ఆ టామీకి, వీధిలో తిరిగి బతకడం చేతకాదు. దాన్ని అలా తిండి పెట్టకుండా తరిమేయడం అన్యాయం''

''అయితే నన్నేం చెయ్యమంటావ్?'' విసుగ్గా అడిగింది సుమతి.

''పోలీసులకి ఫోన్‌చేస్తే వస్తారా రారా?''

''వాళ్ళు రాకపోవచ్చు. నువ్వు, మీ స్నేహితులూ కలిసి పోలీసు స్టేషనుకెళ్ళి అసలు విషయం అక్కడున్న సబ్ ఇనస్పెక్టరుకి చెప్పండి''

''చెపితే ఆయన సాయం చేస్తారా'' అడిగాడు వాసు ఆదుర్దాగా.

''ఆయన సాయం చెయ్యకపోయినా యస్.పి.సి.కి చెపుతారు.''

''అత్తా యిటువంటి నోరులేని ప్రాణులని – ముఖ్యంగా కుక్కలని రక్షించేందుకు సొసైటీ వుందని చెప్పావు. ఆ మధ్య వాళ్ళెవరో కుక్కని ఇంట్లో కట్టేసి వారం రోజులు వూరు వెళ్ళిపోయారని.''

''అప్పుడు కూడా యస్.పి.సి.వాళ్ళే ఆ కుక్కని రక్షించారు'' అంది సుమతి.

''అయితే వాళ్ళ నంబరు టెలిఫోన్ డైరెక్టరీలో వుంటుందా?'' అంటూ వాసు ఉత్సాహంగా డైరెక్టరీ వెతకడం ప్రారంభించాడు.

ఆ తరువాత అరగంటకి, వాసు సుమతిని బతిమాలి, విసిగించి, రెండు రూపాయలు పుచ్చుకుని 'సొసైటీ ఫర్ ప్రివెన్సిస్ ఆఫ్ క్రూయాలటీ టు ద యానిమల్స్' జీవకారుణ్య సంఘం ఆఫీసుకి సరాసరి వెళ్ళి కథంతా వివరంగా చెప్పాడు.

ఆ రోజు ఆదివారం, యస్.పి.సి.ఏ వారు రారేమో అనుకుంది సుమతి. కానీ జీవకారుణ్యానికి సెలవలూ.... తిథివార నక్షత్రాలూ అక్కరలేదని మరోసారి నిరూపించబడింది. మనుషులలో మానవత పూర్తిగా నశించి పోలేదు.

పి.సి.ఏ ఇన్‌స్పెక్టరుని వెంటబెట్టుకుని వాసూ, వాడి స్నేహితులు విజయగర్వంతో, ఆ వీధిలోకి వచ్చి, మురుగేశన్ ఇంటిముందు ఆగారు. కొత్త వ్యక్తి గేటు తెరుస్తుంటే – టామీ నీరసంగా అరుస్తోంది. ''అది నా యజమాని గేటు మీరు వెళ్ళకూడదు'' అన్నట్లు.

ఆ దృశ్యం చూస్తున్న ఇన్‌స్పెక్టర్ కళ్ళలో కన్నీళ్లు తిరిగాయి.

''వీటికున్న విశ్వాసంలో మనిషికి నూరోవంతు కూడా లేదు. తిండి పెట్టకపోయినా రాళ్ళు రువ్వినా అది చూడండి ఎలా కాపలా కాస్తున్నదో? సరి అయిన శిక్షణ యిస్తే – ఏ కుక్క అయినా ఇల్లు కాపలా కాస్తుంది'' అంటూ టామీ అరుపుల మధ్యనుంచి లోనికెళ్ళారు ఇన్‌స్పెక్టరు.

''సృష్టిలో ఏ ప్రాణిని హింసించినా , అందుకు జరిమానా, శిక్షా రెండూ వుంటాయి. కొన్నాళ్ళు పెంచిన కుక్కకి తిండి పెట్టక వీధిలోకి తరిమే హక్కు ఎవరికీ లేదు. కావాలంటే వంద రూపాయిలు నెలకి ఇవ్వండి – బ్లూక్రాస్ వారు మీ తరపున టామీని పోషిస్తారు'' అన్నారు ఇన్‌స్పెక్టరు.

దాంతో మురుగేశన్ చెట్టు దిగాడు. అతను ఇన్‌స్పెక్టరు ఎదురుగానే గేటు తెరిచాడు. మట్టి కొట్టుకునున్న టామీ ఒక్క ఉదుటున యజమాని కాళ్ళను నాకడం ఆరంభించింది. దాని తోక వింజామరం లాగా గాలిలో ఎగురుతోంది. వారం రోజులకి టామీ మొదటిసారి పాలు తాగింది. దాని కళ్ళలోని విశ్వాసాన్ని, ప్రేమనుచూసి – మురుగేశన్ తొలిసారి తాను మనిషై పుట్టినందుకు సిగ్గుపడ్డాడు. టామీ కంఠంలో దైన్యంలేదు. దాని మొరుగులో ఆనందం!

''అత్తా! మనకంటే యస్.పి.సి.ఏ వాళ్ళు చాలా మంచివాళ్ళు. ఈ వీధిలోని వాళ్లు చెయ్యలేని పని ఒక్క అరగంటలో వాళ్ళు చేసేశారు. మీ కెవ్వరికీ రూల్సు, రెగ్యులేషన్స్ తెలియవు'' అన్నాడు పదేళ్ళ వాసు.

''తెలియకపోవడం'' కాదు, వాటిని ఆచరణలో పెట్టగల తెగువా, ఉత్సాహమూ లేదు. మా హృదయాలు బండబారి పోయినాయి అనుకుంది సుమతి తనలో తాను.

I వినండి - చర్చించండి - రాయండి.

అవగాహనా కృత్యాలు:

అ) ఎవరు ఎవరితో అనిరి.

1) ''నాకిప్పుడు పోలీసు సహాయం కావాలి.''

2) ''అయితే నన్నేం చెయ్యమంటావ్.''

3) ''వీటికున్న విశ్వాసంలో మనిషికి నూరోవంతు కూడాలేదు.''

4) ''బ్లూక్రాస్ వారు మీతరపున టామీని పోషిస్తారు.''

ఆ) ఖాళీలు పూరించండి.

1) సామాను ________________ కోసం కుక్కని పెంచు తున్నాడు.
2) వాసు దృష్టిలో అన్ని ________________ ఒకటే.
3) మనుషులతో ________________ పూర్తిగా నశించి పోలేదు.

ఇ) అడిగిన వాటికి ఒక్క పదంలో జవాబు రాయండి.

1) రక్షక భటులు అంటే ________________
2) టామీని పెంచినది ________________
3) వాసు బద్ధకంకణం కట్టుకున్నది ________________
4) మురుగేశన్ వృత్తి ________________

ఈ) కింది అల్లికలను పూరించండి.

1) మురుగేశన్ ఇంట్లో పోయిన వస్తువులు.



2) కుక్కల్లో రకాలు



II అభిప్రాయవ్యక్తీకరణ :

1) పాఠ్యభాగమాధారంగా విలువలు గుర్తించి రాయండి.
2) "వాసు, టామీని రక్షించడానికి పూనుకున్నాడు" దీనికి సంబంధించిన జీవనకౌశల్యాన్ని గుర్తించి రాయండి.

III స్వీయస్పందన :

1) జీవకారుణ్యం అంటే ఏమిటో మీసొంత మాటల్లో రాయండి.
2) మీ వద్దవున్న పెంపుడు జంతువుల గురించి మీ స్నేహితునితో సంభాషించండి.
3) మీకు నచ్చిన సంఘసంస్కర్త గురించి వ్యాసం రాయండి.

IV లఘుటీక రాయండి :

1) వాసు-సుమతిల మధ్య జరిగిన సంభాషణ.
2) మురుగేశన్ టామీని తరిమి వేయుటకు కారణం.
3) టామీని గూర్చి రాయండి.

నేనివి నేర్చుకున్నా:

1. జీవహింస పనికిరాదు. 2. మంచి ప్రవర్తన, అందరితో మర్యాదగా సంభాషించుట.

వి.సూ. "బ్లూ క్రాస్", "రెడ్ క్రాస్" వారి విధులను తెలుసుకోండి.

4 అద్భుతాలు చేయాలంటే...

నేపథ్యం

ఈ మెట్లను గమనించండి. పాటించండి:

- విజయం సాధిస్తాం.
- పడినా లేవాలి కెరటంలా
- కొన్ని పొరపాట్లు - అపజయాలు - అవహేళనలు సహజం. వాటిని లెక్క చేయకూడదు.
- లక్ష్యంపైనే గురి నిలిపి ముందుకు సాగాలి.
- మన లక్ష్యాన్ని ఎంచుకోవాలి.
- మనలోని సామర్థ్యాలను గుర్తించాలి.

వీటినే ఇప్పుడు శ్రీ బి.వి. పట్టాభిరాంగారు సులభమైన మాటల్లో ఎలా వివరించారో చదివి తెలుసుకుందామా.

అద్భుతాలు చేయాలంటే ఆత్మబలమే ఇంధనం.

బాగా చదవడానికి అవసరమయ్యే ఇంధనం ఒక్కటే. అదే ఆత్మబలం. విజయం సాధించాలంటే ఆత్మబలం అవసరం. దానిని పెంచుకోవడానికి కింది మార్గాలలో పయనించాలి.

ఆత్మవిశ్వాసం ఎందుకు ఉపయోగపడుతుంది!

మీ గురించి మీరు తెలుసుకోవాలి :

ఒక పేపరు మీద మీ లక్ష్యం (Goal) రాసుకోవాలి. మీ బలాలను, బలహీనతలను తెలుసుకోవాలి. బలాల సంగతి సరే. బలహీనతలైన బద్ధకం, అతినిద్ర, నిర్లక్ష్యం, టీవీలు, ఇతర ఆకర్షణలు, చెడు స్నేహాలు, వాయిదాలు వేసే అలవాట్లను వీలైనంత త్వరగా, ఒకటి తరువాత ఒకటి విడిచిపెట్టాలి. మీ లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఈ అడ్డంకులను తొలగించుకోవాలి.

సమయ నిర్వహణ:

మీకున్న పనులన్నీ ఒక పేపరు మీద రాయాలి. గది తుడుచుకోవటం నుండి గైడ్‌ని కలిసేదాకా అన్ని పనులు రాయాలి. అందులోనే సినిమాలు, కబుర్లు, క్లాసులు అన్నీ వస్తాయి. ఇప్పుడు వాటి ఎదురుగా ప్రాధాన్యాలను బట్టి 1, 2, 3 అని నంబర్లు వేయాలి. 1 అంటే అతి ముఖ్యమైనవి. 2 అంటే ముఖ్యమైనవే కానీ వెంటనే చేయనవసరం లేదు. 3 అంటే చెయ్యక పోయినా ఫరవాలేదు. సినిమాలు, తిరుగుళ్ళు, కబుర్లు ఈ 3 లోకి వస్తాయి.

జ్ఞాపకశక్తి సాధన :

ఈ మధ్య నాకు జ్ఞాపకశక్తి పెరుగుతుంది, పెరుగుతూంది అని సెల్ఫ్ సజెషన్ ఇచ్చుకోవాలి. చదువు విషయం కొస్తే పాఠాలను రివిజన్ చేస్తూండాలి. ఒంటరిగా కూర్చున్నపుడు ఆ పాఠాలను నెమరు వేసుకోవాలి.

నైపుణ్యాలు పెంచుకోవాలి :

స్టూడెంట్స్ చదువుతోపాటు చక్కటి కమ్యూనికేషన్స్, న్యూస్ పేపరు చదవటం వంటివి అలవాటు చేసుకోవాలి. అలా చేయటం వల్ల భవిష్యత్తులో ఎటువంటి ఇంటర్వ్యూలోనైన నెగ్గుకు రాగలరు.

చురుకుగా రాయాలి:

చదవటం ఎంత ముఖ్యమో, రాయటం కూడా అంతే ముఖ్యం అది కూడా అందంగా రాయటం మరీ ముఖ్యం. పాఠాన్ని ఉన్నదున్నట్లు రాస్తే వచ్చే మార్కులకన్నా, పాఠం సారాన్ని అర్థం చేసుకుని, పద్ధతి ప్రకారం విశ్లేషించి అందమైన ముగింపు ఇస్తే, వచ్చే మార్కులు అధికంగా ఉంటాయి. అంటే కాన్సెప్ట్ (concept) అర్థం కావాలి.

శ్రద్ధగా వినాలి :

వినటం వేరు, శ్రద్ధగా వినటం వేరు, Preview-Listen Review. ప్రివ్యూ అంటే పాఠాన్ని ముందుగా ఒకసారి చదువుకోవాలి. తరువాత తరగతిలో శ్రద్ధగా వినాలి. ఆపైన ఇంటికొచ్చాక రివ్యూ అంటే పునశ్చరణ చేసుకోవాలి. అలా చేసినందువల్ల పాఠం బాగా గుర్తుండిపోతుంది.

సర్దుబాటు ఎందుకు చేసుకోవాలి?

సర్దుబాటు అలవాటు చేసుకోవాలి:

చదివేటప్పుడు కొంతమందికి కొన్ని అలవాట్లుంటాయి. కొందరు ఒంటరిగా చదువుతారు, మరికొందరు జంటగా చదువుతారు. కొందరు గట్టిగా పైకి చదువుతారు. మరికొందరు లోపలే చదువుకుంటారు. అలవాటు ఎలా ఉన్నా సందర్భాన్ని బట్టి సర్దుకు పోయేతత్త్వం అలవాటు చేసుకోవాలి.

క్రమశిక్షణ జీవనం సాగించాలి :

సంతోషంగా ఉండాలంటే జీవితం బావుండాలి. జీవితం బావుండాలంటే మనం నిర్ణయాలు జాగ్రత్తగా తీసుకోవాలి. క్రమశిక్షణతో జీవనం సాగించినవారు సర్వకాల సర్వావస్థల యందు సుఖంగా ఉండగలరు.

నీవు నిర్ణయం తీసుకునేటప్పుడు ఎటువంటి ప్రణాళిక వేసుకుంటావు.

నిర్ణయాలు తీసుకోవటం ఓ కళ

నిర్ణయం తీసుకోవటమంటే అనిశ్చిత పరిస్థితికి, అయోమయానికి అంతం పలికే ఒక పరిష్కారాన్ని కనుగొనటం. రెండు, మూడు ప్రత్యామ్నాయాల్లో (చాయిస్) ఒకదానిని ఎంపిక చేసుకోవటమే నిర్ణయం తీసుకోవటం. ప్రణాళిక వేసుకోవటమనేది నిర్ణయం తీసుకునే ప్రక్రియలో కీలకపాత్ర వహిస్తుంది.

నిర్ణయ ప్రణాళిక :

ఒక నిశ్చితమైన పరిపూర్ణమైన ప్రణాళిక లేనిదే నిర్ణయం తీసుకోవటం కుదరదు. ఒక వేళ నిర్ణయం తీసుకున్నా దాని పరిణామం సజావుగా వుండదు. ప్రణాళికలేని నిర్ణయం తీసుకోవటం మంచిది కాదు. మొదటగా ప్రణాళిక వల్ల గుణదోషాల ననుసరించి ఒక ప్రామాణికమైన కొలత లభిస్తుంది. ఇక రెండవది డబ్బు, సమయం, సామాజిక మద్దతు వంటి వనరులను, భవిష్యవనరులను ఒక క్రమపద్ధతిలో అత్యుత్తమంగా వినియోగించుకునేందుకు ప్రణాళిక దోహదం చేస్తుంది.

చక్కని నిర్ణయం తీసుకోవటం కోసం ఆరు సోపానాలున్నాయి. ఈ సోపానాలు లేక దశలు, నిర్ణయం తీసుకునే ప్రక్రియ ప్రారంభం చేయటంలో ఎంతో ముఖ్యమైనవి. వీటికి నేను ABCDEF దశలుగా పేరు పెట్టాను.

A – Analyze the issue or the Problem.

విషయాన్ని లేక సమస్యను విశ్లేషించండి.

B - Bring out the contributing factors.

సమస్యకు దారితీసిన కారణాలను వెలికి తీయండి.

C - Consequences of the decision.

నిర్ణయ పరిణామాలు ఎలా వుంటాయి?

D - Discuss the Potential alternatives.

అవకాశమున్న ప్రత్యామ్నాయాలు చర్చించండి.

E - Explore these alternatives.

ఆ ప్రత్యామ్నాయాల గురించి కూలంకషంగా పరిశీలించండి.

F - Focus on the final decision.

అంతిమ నిర్ణయం మీద దృష్టి పెట్టండి.

అనిశ్చితత్వం ఎందుకు ఉండకూడదు?

ఎటూ తేల్చుకోలేని కంచర గాడిద కథ :

ప్రత్యామ్నాయాలను విశ్లేషించిన మీదట ఒకే ఒక్క నిర్ణయాన్ని మీరు అమితమైన నిబద్ధతతో అనుసరించాలి. నిర్ణయం తీసుకున్న తర్వాత ఇది చాలాముఖ్యమైన విషయం. ఎట్టి పరిస్థితుల్లోను ఒకే సమయంలో రెండు లక్ష్యాలు పెట్టుకుని కంచరగాడిద మాదిరిగా ఎటూ తేల్చుకోలేని స్థితి తెచ్చుకోకూడదు. ఒక కంచరగాడిదను రెండు గడ్డికట్టల మధ్య నిలిపారు. రెండూ దేనికవి బాగానే వున్నాయి. రెండూ ఆకర్షణీయంగా కనిపించటంతో ఏ కట్టలోని గడ్డిని తినాలో కంచరగాడిద తేల్చుకోలేక పోయింది --- ఒకటేమో చూడటానికి సొంపుగా వుంది. మరొకదాని పరిమళం ఇంపుగా వుంది. ఏది తినాలో తేల్చుకోలేక ఆ కంచర గాడిద చివరకు అనిశ్చిత భావం కారణంగా ఆకలితో బాధపడి నీరసించింది.

కాబట్టి రెండు లేక అంతకు మించి సమాన ఆకర్షణ గల ప్రత్యామ్నాయాలు ఎదురుగా వున్నప్పుడు వాటిలోని లోపాల పట్ల గుడ్డిగా వ్యవహరించక సరియైన నిర్ణయాన్ని తీసుకొని తీరాలి. లేకుంటే అనిశ్చితతత్వం సమస్యలు సృష్టిస్తుంది.

రచయిత పరిచయం : డా. బి.వి. పట్టాభిరామ్ అంతర్జాతీయంగా పేరు పొందిన హిప్నాటిస్టు, మెజీషియన్ మరియు ఫిలాసఫీలో నిష్ణాతులు. డా. పట్టాభిరామ్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ''యోగహిప్నాటిజమ్'' అనే అంశంపై పి.హెచ్‌డి. పొందారు. హిప్నాటిజమ్‌పై భారతదేశంలో డాక్టరేట్ పొందిన మొట్టమొదటి పరిశోధకులు డా. పట్టాభిరామ్. ప్రస్తుత పాఠ్యభాగం ఈయన గారి ''గుడ్‌స్టూడెంట్'' అను పుస్తకం నుండి స్వీకరించబడింది.

I వినండి - సంభాషించండి :

1) మీ లక్ష్యసాధనకు మీరేం చేస్తారు? 2) ''కాలం వెనుక మనం నడవాలా - కాలం మన వెనుకనడవాలా''

II వినండి - చర్చించండి - రాయండి.

అ) జవాబులు రాయండి.

1) నిర్ణయం తీసుకోవడం అంటే ఏంటి?

2) మీరు ఏ విషయంలోనైనా స్వయంగా నిర్ణయం తీసుకున్నారా? ఎప్పుడు అటువంటి నిర్ణయం తీసుకున్నారు?

3) ''పరిపూర్ణమైన ప్రణాళిక లేనిదే నిర్ణయం తీసుకోవడం కుదరదు'' - వివరించండి.

4) ''అనిశ్చితతత్వం సమస్యలు సృష్టిస్తుంది'' -- ఉదాహరణతో విశ్లేషించండి.

ఆ) సరైన సమాధానం గుర్తించి ఖాళీలు పూరించండి :

1) రెండు, మూడు ప్రత్యామ్నాయాల్లో ____________ ఎంపిక చేసుకోవటమే నిర్ణయం తీసుకోవటం.

అ) ఒకదాన్ని ఆ) రెండింటిని ఇ) మూడింటిని

2) చక్కని నిర్ణయం తీసుకోవడానికి ____________ సోపానాలున్నాయి.

అ) నాలుగు ఆ) ఆరు ఇ) ఎనిమిది

3) అనిశ్చితత్వం ____________ సృష్టిస్తుంది.

అ) సమస్యలు ఆ) కష్టాలు ఇ) సుఖాలు.

4) విజయం సాధించాలంటే ____________ అవసరం.

అ) ధనబలం ఆ) ఆత్మబలం ఇ) కండబలం

ఇ) తప్పొప్పులను గుర్తించి రాయండి.

1) ప్రణాళిక లేనిదే నిర్ణయం తీసుకోవడం కుదరదు ( )

2) కంచరగాడిద అనిశ్చిత భావం కారణంగా విజయాన్ని సాధించింది ( )

3) లక్ష్యసాధనకు మీ బలాలను, బలహీనతలను తెలుసుకోవాలి. ( )

4) చదవటం ఎంత ముఖ్యమో, రాయటం అంత ముఖ్యం కాదు. ( )

5) పాఠం తరగతిలో శ్రద్ధగా విన్న తరువాత ఇంటికొచ్చాక పునశ్చరణ చేసుకోవాలి. ( )

ఈ) అల్లిక పూరించండి.

నిర్ణయం తీసుకోవడం కోసం ఉన్న ఆరు సోపానాలు.	లక్ష్యాన్ని చేరటానికి తొలగించుకోవలసిన అడ్డంకులు :	లక్ష్యాన్ని చేరుకోవటానికి పాటించవలసినవి.
→	→	→
→	→	→
→	→	→
→	→	→
→	→	→

III స్వీయస్పందన :

1) చక్కని నిర్ణయాన్ని తీసుకోవాలంటే ఏయే విషయాలలో శ్రద్ధ వహించాలో మీసొంతమాటల్లో తెలియజేయండి.

2) ''అద్భుతాలు చేయాలంటే ఆత్మబలమే ఇంధనం'' _____ మీ సొంత మాటల్లో వివరించండి.

IV భాషావగాహన :

అ) వ్యతిరేక పదాలు రాయండి.

1) గుణము ×		2) సమస్య ×	
3) అముఖ్యము ×		4) అవసరము ×	
5) నెమ్మదిగా ×		6) జాగ్రత్త ×	

ఆ) కింది వాక్యాలు ఏకాలంలో ఉన్నాయో గుర్తించి రాయండి.

1) ప్రత్యామ్నాయాలను విశ్లేషించిన మీదట ఒకే ఒక్క నిర్ణయాన్నే అమితమైన నిబద్ధతతో అనుసరించాలి.
2) ఆ కంచరగాడిద ఆకలితో బాధపడి నీరసించింది.
3) అందులోనే సినిమాలు, కబుర్లు, క్లాసులు అన్నీ వస్తాయి.
4) క్రమశిక్షణ లేకపోవటం వలన అనేక ఇబ్బందులు వచ్చుచున్నవి.

ఇ) కింది సంధులను జతపరచండి :

'క' వర్గము	'చ' వర్గము
1) ప్రామాణికము + ఐన	అ) ఇకారసంధి
2) ప్రతి + ఆమ్నాయము	ఆ) ఉకారసంధి
3) సాధించాలి + అంటే	ఇ) యణాదేశసంధి.

ఈ) కింది పదాలను సమాసాలతో జతపరచండి :

'క' వర్గము	'చ' వర్గము
1) గుణ దోషాలు	అ) నఞ్‌తత్పురుష సమాసము
2) ఆరుసోపానాలు	ఆ) విశేషణ పూర్వపద కర్మధారయ సమాసము
3) అనిశ్చిత భావము	ఇ) ద్వంద్వసమాసము
4) క్రమ పద్ధతి	ఈ) ద్విగు సమాసము

V సృజనాత్మకత :

1) మీరు ఈనాటి దినపత్రిక చదివి, అందులోని ముఖ్యాంశాలను పాఠశాల సూచనాఫలకముపై రాయండి.
2) దూరదర్శినిలోని వార్తలను విని, దినపత్రికలోని వార్తలతో తులనాత్మకంగా పరిశీలించి రాయండి.
3) మీరు నిర్ణయాన్ని తీసుకునేటప్పుడు ఏయే విషయాలను పరిగణనలోకి తీసుకుంటారో మీ సొంతమాటల్లో రాయండి.
4) పదవతరగతి బోర్డు పరీక్షలు రాయడానికి నీవు చేసుకున్న ప్రణాళికను వివరించుము.
5) పదవతరగతి అనంతరం నీవు ఏవిధంగా భవిష్యత్తును తీర్చి దిద్దుకుందామనుకుంటున్నావో నీ సొంతమాటల్లో రాయుము.

VI లేఖన కౌశల్యాలు :

1) సంభాషణ లేఖనం.

- సంభాషణ వర్తమానకాలంలో ఉండాలి. • విషయానికి, సందర్భానికి పాత్రలకు తగినట్లుగా భాషను ఉపయోగించాలి.
- వాక్యాల మధ్య సహసంబంధం ఉండాలి. • తగిన విరామచిహ్నాలను తప్పక ఉపయోగించాలి.

కింది అంశాల ఆధారంగా విద్యార్థి, వైద్యునితో జరిపిన సంభాషణ రాయండి.

కబడ్డీ ఆడడం | దెబ్బతగలడం | నొప్పి | ప్రథమచికిత్స

మందులు | కాపడం | పథ్యం

2) ఆహ్వాన పత్రిక లేఖనం.

పుట్టిన రోజు పండుగకు ఆహ్వానిస్తూ కింది అంశాల ఆధారంగా మిత్రుని కొరకు ఆహ్వాన పత్రిక తయారు చేయండి.

• తేది • స్థలము • సమయము • విషయ వివరణ • ధన్యవాదములు • మిత్రుని చిరునామా.

3) వ్యాస రచన : (అనుభవాత్మకం)

కింది అంశాల ఆధారంగా వ్యాసం రాయండి.

వైజ్ఞానిక ప్రదర్శన

తేది : 03-12-2018

సమయం : ఉదయం 8 - సా. 5

స్థలం : శారదా విద్యాలయం

సూచన : ప్రవేశం ఉచితం

- చూచిన ప్రయోగాలు, నమూనాలు
- నీ అనుభవాలు
- నిర్వహించిన పాత్ర

అనువదించండి - ఆనందించండి.

కింది మరాఠీ గేయాన్ని తెలుగులోకి అనువదించండి.

आरशातील मुलगी

एक आरसा आहे आमच्या घरात
चांगला मोठा आणि चकचकित
त्या आरशात एक मुलगी आहे.
अगदी माझ्या सारखी आहे ती!
केस कुरळे कुरळे,
डोळे काळे काळे

నేనివి నేర్చుకున్నా :

తెలుగు వార్తా పత్రికలు, మాసపత్రికలలో ప్రచురితమయ్యే కథలు, కథానికలు, గేయాలు అంతర్జాలంలో ప్రచురితమైన విషయాలు అర్థంచేసుకోవటం.

5 కసురుకాయలు

నేపథ్యం







- పై చిత్రాలలోని వ్యక్తులు ఇతరులపై ఎందుకు ఆధారపడ్డారు?
- 'బాల కార్మిక నిషేధం' – గురించి చర్చించండి.

ప్రతి ఒక్కరికి చదువు అవసరం., అందుకే ప్రభుత్వం అంటున్నది. **'అందరు చదవాలి – అందరు ఎదగాలి'**
ఇప్పుడు కింది నాటికలో అప్పలరాజు, టీచరు చేసిన గొప్పపనేంటో చూద్దామా!

నాటికలోని పాత్రలు :

విశ్వం మాష్టారు 50 సం॥ (పాఠశాల ఉపాధ్యాయుడు)
రాముడు (40 సం॥ తండ్రి)
అవ్వ (60 సం॥ (నాయనమ్మ)
అప్పలరాజు (9 సం॥ (కొడుకు)

[తెరతీయగానే పూరిపాక సెట్ కనిపిస్తుంది. అవ్వ ఇల్లు ఊడుస్తూ "అప్పలరాజా! అప్పలరాజా! ఆటలాడు వయసులోన అప్పలరాజు చదువుకొనే వయసులోన అప్పలరాజా! నువు పశువులను తోలుకెళ్తావ అప్పలరాజా!" అని ఉదాసీనంగా కూనిరాగాలు తీస్తుంది. అంతలో బయట నుంచి 'రాజా' అని కేక వినిపిస్తుంది. చేతిలో ఉన్న చీపురు వదలి పాక నుంచి బయటకు వచ్చి వీధి గుమ్మం దగ్గరకొచ్చింది. తేరిపార చూసి కేకవేసిన వ్యక్తిని అవ్వ గుర్తించింది.]

అవ్వ : విశ్వం మాస్టబాబూ! మీరా! రండి! రండి!!
(విశ్వం మాష్టారు వీధి నుంచి స్టేజి మీదకు ప్రవేశిస్తారు)

విశ్వం మాష్టారు : అవ్వా! నీ మనవడు అప్పలరాజు ఉన్నాడా?

అవ్వ : లేడు బాబూ! నేనూ వాడి ధ్యాసలోనే ఉన్నాను! బక్కలు తోలుకెళ్ళిన వాడింకా రాలేదు! బడికెళ్ళి చదువుకునే వయసులో బక్కలు కాయడమేటి?! (చివరి వాక్యం లోడుగుతూ అంటుంది)

విశ్వం మాష్టారు : మీ కొడుకు ఇంట్లో ఉన్నాడా?

అవ్వ : ఉన్నాడు బాబూ! పెరట్లో కంచె బాగు చేస్తున్నాడు!

విశ్వం మాష్టారు : ఒకసారి పిలువు! నేను తనతో మాట్లాడాలి!

అవ్వ : అలాగే బాబూ! ఒరే రాముడూ. మాస్టబాబొచ్చారు. రారా!

రాముడు : (పెరడు నుంచి) ఆ వస్తున్నా!

అవ్వ : (గోడకు చేరేసిన నులక మంచంవేసి) రండిబాబూ! ఇక్కడ కూర్చోండి! (అంతలో రాముడు వస్తాడు)

రాముడు : కూర్చోండి మాష్టారుబాబూ! దండాలు!

(విశ్వం మాష్టారు మంచంపై కూర్చుంటారు. రాముడు వినయంగా చేతులు కట్టుకొని విశ్వం మాష్టారు ముందు నిలబడతాడు)

బాలకార్మికులని ఎవరిని అంటారు? వారి నిర్మూలనకు చేసిన చట్టమేమి?

విశ్వం మాష్టారు : రాముడూ! అప్పలరాజును బక్కలు కాయడానికి పంపిస్తున్నావట!

రాముడు : అవును బాబూ!

రామం మాష్టారు : (ముఖం చిట్లించి) తెలివైన పిల్లాడిని ఎందుకలా చదువుకు దూరం చేస్తున్నావు?

అవ్వ : నేను కూడా అదే బాబూ అంటున్నాను. నా మాట వినకుంటున్నాడు!

రాముడు : ఇప్పటి వరకు అప్పలరాజు చదివిన చదువు చాలు బాబూ! మాకొచ్చిన ఉత్తరం ముక్క చదవగలుగుతున్నాడు. డబ్బుల లెక్కలు చెప్పగలుగుతున్నాడు. ఆ పాటి చదువు మాలాంటి వాళ్ళకు చాలదా బాబూ! అందుకే చదువు ఆపించి పనీ-పాటు నేర్పిస్తున్నాను!

బక్కలు కాయడమొకటేకాదు. అన్ని పనులు నేర్పుతాను. పాలు పితకడం, పేడెత్తడం, గాబు తీయడం ఆ తరువాత పొలం దున్నడం, నారు పొయ్యడం, నారు తియ్యడం....

విశ్వం మాష్టారు : ఆపావు ఆ దండకం! చదువు పూర్తయ్యాక వాడిష్టపడితే అవన్నీ నేర్చుదువులే! ఇప్పుడు మాత్రం చదువాపకు! గొడ్డుకు గడ్డి ఎలాగో, పంటకు ఎరువెలాగో మనిషికి చదువు అలాగ అవసరం!

రాముడు : (మాష్టారు వైపు చూసి) మీ లాంటోళ్ళకు చదువవసరం కాని మాకేల బాబూ చదువు?! పనీపాటు నేర్చుకుంటేనే మాలాంటి వాళ్ళకు బతుకు! మేం గొప్పోళ్ళమా ఏమి! మాకు మడులా? మాణిక్యాలా? కూలినాలి చేసుకొని బతికేటోళ్ళం! చిన్నప్పటి నుంచి పనుల్లో పెడితేనే పిల్లలు పనుల్లో రాణిస్తారు. అందుకే అప్పలరాజును...

విశ్వం మాష్టారు : బడి మానిపించానని అంటావు. అదేనా నువు చెప్పబోయే కారణం!?

రాముడు : ఔను బాబూ నిజమే! మా అయ్యకు చదువు లేదు. మా తాతకు చదువు లేదు. మరి వాళ్ళు బతకలేదా? అయినా మరి మా అప్పలరాజు మా అయ్యకంటె, మా తాత కంటె ఎక్కువే చదివాడు గదా!

విశ్వం మాష్టారు : మూడు పాసై నాలుగుకు వచ్చాడు. అదేదో పెద్ద చదువు చదివినట్లు గొప్ప అనుకుంటున్నారు. అలాకాదు రాముడూ.

ప్రాథమిక విద్య అందరికీ ఉండాలి. దీనిపై నీ అభిప్రాయం ఏమిటి?

రాముడు : (భుజాలెగరేస్తూ) ఆ పాటి చదువు మాకు చాలదా?!

విశ్వం మాష్టారు : సరిపోతుందో లేదో ముందుముందు నీకే తెలియగలదు! (కాసేపాగి) రాముడూ! అప్పలరాజు చదువు విషయం అలా పక్కన పెట్టు! నాకు కొన్ని సందేహాలు కలిగాయి. తీర్చగలవా?

రాముడు : (ఉత్సాహంతో) అడగండి బాబూ!

విశ్వం మాష్టారు : చెట్టు పిందెలు వెయ్యగానే వాటిని తెంపి తింటే తియ్యగా ఉంటాయా? లేదా అవి పలకబారే వరకు చెట్టున ఉండి పండయ్యేటప్పుడు తింటే రుచిగా ఉంటుందా?!

రాముడు : కసురుకాయలు ఏం రుచిగా ఉంటాయి? వగరు! తినలేం! అవి తినడానికి పనికిరావు. పిందెలు పలకబారే వరకు చెట్టునుంటేనే వాటిని తృప్తిగా తినగలం! పండయితేనే రుచి కదా!

విశ్వం మాష్టారు : అయితే విను! పిల్లలు కనీస జ్ఞానం పొందడానికి ఐదేళ్ళ చదువును ప్రాథమిక విద్యగా ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేసింది. ఆ ప్రాథమిక విద్యకూడా చదవకుండా మనదేశంలో అప్పలరాజులాంటి వాళ్ళు కోట్లమంది ఉన్నారు. ఎదుగుతున్న కొలది ఆ పిల్లలు ఈ సమాజంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారు. అన్నిటికీ ఇతరుల మీద ఆధారపడి బతుకుతారు. స్వయంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోలేరు.

రాముడు : (సిగ్గుపడుతూ) నాలాగ!

విశ్వం మాష్టారు : నిజం నిష్టూరంగా ఉన్నా ఒప్పుకున్నావు! చాలా సంతోషం! నా మాటలు మరికొన్ని విను! చదువు మనిషికి చాలా అవసరం! పూర్వం కన్నా ఇప్పుడు మరీను! నేటి ఆధునిక ప్రపంచంలో చదువు లేకపోతే.... మనుగడ కుంటుపడుతుంది.

సంపూర్ణ అక్షరాస్యత అంటే ఏంటి? దాన్ని సాధించడానికి మీ వంతు కృషి ఏం చేస్తారు?

నేడు వాడుకలోకి వచ్చిన ఆధునిక పరికరాలైన స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, కేలక్యులేటర్లు, డిజిటల్ పరికరాలు ఇవేవి చదువురాని మనుషులు సక్రమంగా వాడ లేరు.

రాముడు : ఇప్పుడు మీరు చెప్పినవన్నీ డబ్బున్నోళ్ళకి బాబూ! మాకెలాగా అటువంటి యంత్రాలుండవుగా!

విశ్వం మాష్టారు : నువు తప్పుగా నా మాటలు అర్థం చేసుకుంటున్నావు! ఒక్క యంత్ర పరికరాలు ఉపయోగించడానికే కాదు. చదువు వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయి! చదువు వల్ల తెలివితేటలు పెరుగుతాయి. అంత సులభంగా ఎవరివల్లనూ మోసపోరు. మనలో నాగరికత పెరుగుతుంది. సంస్కారం అబ్బుతుంది. ఏది మంచి, ఏది చెడ్డ తెలుసుకోవచ్చు. ప్రయాణాలు హాయిగా చేసుకోవచ్చు. పుస్తకాలు చదివి జ్ఞానం పొందవచ్చు. పిల్లలను మంచిదారిలో పెంచవచ్చు. మంచి భవిష్యత్‌ను పిల్లలకు అందివ్వవచ్చు!

రాముడు : చదువువల్ల లాభాలు బాగానే చెప్పారు. కాని చదువు చెప్పించడానికి మా వద్ద డబ్బులేదు! పిల్లలకు చదువెలా చెప్పించగలం?

విశ్వం మాస్టారు : ఈనాడు మీలాంటి పేదవారికి చదువుకొనే సదుపాయాలు ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తుంది. మీ అప్పలరాజు శ్రద్ధగా చదువుకుంటే చాలు ఎంత చదువైనా ప్రభుత్వమే బాధ్యత తీసుకుంటుంది! నీ కొడుకు కలెక్టరో, డాక్టరో, ఇంజనీరో, పెద్ద సైంటిస్టో అయితే నీకు గొప్పకాదూ, అప్పలరాజు చదువుకోవడం వల్ల నీ కుటుంబ పరిస్థితి మారిపోతుంది. ఇప్పుడు నీవు అనుభవిస్తున్న పేదరికం నీ వంశం దరిదాపుల్లోకి రాలేదు. తెలిసిందా?!

రాముడు : నాకంతా అర్థమయింది. ఒకటి రెండు అక్షరం ముక్కలు నేర్చుకుంటే జీవితానికి సరిపోదని బాగా చదువుకోవాలని ఇప్పుడు గ్రహించాను. నా కొడుకు కసురుకాయ కాకూడదు. పండు కావాలి. ముందు తరాలకు విత్తనాలు పండు అందించేటట్టు నా కొడుకు ముందుతరాలకు జ్ఞానాన్ని అందివ్వాలి!

(అంతలో)

విద్య ప్రాధాన్యత గురించి తెలియజేయండి.

అప్పలరాజు : అయ్యా! పశువుల్ని శాలలో కట్టేశాను (బయట నుంచి కేక వినిపిస్తుంది)

రాముడు : అప్పలరాజూ! ఇంట్లోకిరా! ఎవరొచ్చారో చూడు! (గట్టిగా అంటాడు లోపలకు అప్పలరాజు వస్తాడు. విశ్వం మాస్టారును చూస్తాడు)

అప్పలరాజు : నమస్తే మాస్టారూ! (రెండు చేతులు జోడించి నమస్కరిస్తాడు)

విశ్వం మాస్టారు : చిరంజీవ! (ఆశీర్వదించి) నీ గురించి వచ్చాను! నిన్ను బడికి పంపమని మీ నాన్నకు చెప్పడానికి వచ్చాను!

అప్పలరాజు : భలే! మా అయ్యకు చెప్పండి మాస్టారూ! నాకు చదువుకోవాలనుంది. మా అయ్యకది నచ్చదు! (నిష్ఠూరంగా తండ్రివైపు చూస్తాడు)

రాముడు : నా వైపు అలా చూడొద్దు మరి! మాస్టారు అన్ని విషయాలు చెప్పారు! రేపటినుంచి బడికి వెళ్తువులే! నీ చదువుకు నేను ఏనాడు అడ్డురాను! నీ ఇష్టం! ఎంతవరకు నువ్వు చదవాలనుకుంటావో అంతవరకు చదువుకో!

విశ్వం మాస్టారు : నేను చెప్పిన మాటలు ఫలించాయి! కసురుకాయలు కాలేదు నా మాటలు! రేపటి నుంచి బడికి వచ్చేయి అప్పలరాజూ!

(విశ్వం మాస్టారు నిష్క్రమిస్తారు)

అప్పలరాజు : (సంతోషంతో గంతులేస్తూ)

అవ్వా! అయ్యా! చదువుకు పోతా!
రేపటి నుంచి బడికి పోతా!
పెద్ద చదువులే నే చదివేస్తా!
విజ్ఞానాన్ని నే ఆర్జిస్తా!
అవ్వా! అయ్యా! చదువుకు పోతా!
రేపటి నుంచి బడికి పోతా!

(పాట ముగుస్తుంది. తెరపడుతుంది)

రచయిత పరిచయం : ఈ పాఠ్యభాగం 'బాలబాట' మాసపత్రిక పుస్తకం నుండి గ్రహించబడినది. రచయిత శ్రీ బెలగాం భీమేశ్వరరావు గారు. వీరి తల్లిదండ్రులు బెలగాం రాజేశ్వరి, గంగారామ్ గార్లు. వీరు వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. వీరు అనేక పుస్తకాలు రచించారు. వాటిలో పేర్కొనదగినవి 'చెట్లొస్తున్నాయ్ జాగ్రత్త (బాలల నవల), పాపం బంగారయ్య, చెట్లను పెంచుదాం, కొంగల తెలివి, అవసరాలు, ఎగురలేని పక్షులు, మంచికిమంచి మొదలైనవి.

అక్షరాస్యత కార్యక్రమాల్లో పాల్గొనడం, బాలసాహిత్య శిక్షణ కార్యక్రమాలు వీరి వ్యాపకాలు.

I వినండి - సంభాషించండి :

1. చదువు కోవడం వల్ల ప్రయోజనాలేంటి?
2. మీరు ఎవరికైనా చదువునేర్చుకునేందుకు సహాయం చేశారా? ఏ విధంగా?

II చదవండి - చర్చించండి - రాయండి.

పదజాలాన్ని పెంపొందించుకుందాం.

ఊడ్చుట = చీపురుతో శుభ్రము చేయుట; తోలుకెళ్ళుట = వెంటబెట్టుకొని వెళ్ళుట; బక్కలు = పశువులు; రాణించు = శోభించు; కసురు కాయలు = పచ్చి పిందెలు; ఇబ్బందులు = కష్టాలు; స్వయంగా = తమంతతాము; సంస్కారము = మంచి ప్రవర్తన; దరిదాపుల్లోకి = దగ్గరలోకి;

III వినండి - చర్చించండి - రాయండి.

అ) జవాబులు రాయండి.

1) నిర్బంధ విద్య అంటే .....
2) విశ్వం మాష్టారు రాముడింటికి వచ్చిన కారణం.
3) 'బాల బాలికలకు విద్య అవసరం' ....
4) అప్పలరాజు చదివిన చదువు చాలు అని రాముడు భావించడంపై నీ అభిప్రాయం.
5) విశ్వం మాష్టారు విద్య యొక్క అవసరాన్ని వివరించిన విధం.
6) బాలురకు, కసురుకాయలకు కవిచెప్పిన పోలికలను సమర్థించండి.

ఆ) ఎవరు ఎవరితో పలికిరి.

1) ''నీ మనవడు అప్పలరాజు వున్నాడా?''
2) ''రామూడూ! మాష్టరుబాబొచ్చారు.''
3) ''చిన్నప్పటి నుంచి పనుల్లో పెడితే పిల్లలు రాణిస్తారు.''
4) ''పంటకు ఎరువెలాగో మనిషికి చదువలాగ.''

ఇ) ఖాళీలను కుండలీకరణంలోని సరియైన పదాలతో పూరించండి.

(పనీపాటు, జ్ఞానం, బక్కలు, బడి, జ్ఞానం)

1) చదువుకునే వయసులో ________________ కాయడమేమిటి?
2) ________________ నేర్చుకుంటేనే మాలాంటివాళ్ళకు బతుకు.
3) చదువు లేకపోతే ________________ కుంటు పడుతుంది.
4) పుస్తకాలు చదివి ________________ పొందవచ్చు.
5) రేపటినుంచి ________________ కి వచ్చేయి అప్పలరాజూ?

ఈ) వాక్యాలను సరియైన క్రమంలో అమర్చండి.

1) పేదరికం నీ వంశం దరిదాపుల్లోకి రాలేదు.

2) అప్పలరాజును బక్కలు కాయటానికి పంపిస్తున్నావట.

3) చదువువల్ల తెలివి తేటలు పెరుగుతాయి.

4) మీలాంటోళ్ళకు చదువవసరంకాని మాకేల బాబూ చదువు.

5) నేనూ వాడి ధ్యాసలోనే ఉన్నాను.

ఉ) అల్లిక :

1) ఆధునిక పరికరాలు



2) విద్యవలన కలిగే ప్రయోజనాలు



IV స్వీయస్పందన :

1) ఉచిత నిర్బంధ విద్య గురించి నీ అభిప్రాయం రాయుము.

2) ఏ రాష్ట్రమయినా పూర్తి స్థాయి అక్షరాస్యతను పొందాలంటే నువ్వు ఇచ్చే సూచనలేమిటి?

V భాషావగాహన :

అ) కింది వాక్యములు ఏకాలమునకు చెందినవో గుర్తించి రాయండి.

1) పెరట్లో కంచె బాగు చేస్తున్నాడు. ________________

2) నా మాటలు తప్పుగా అర్థం చేసుకున్నావు. ________________

3) మంచి భవిష్యత్తును పిల్లలకు అందివ్వవచ్చు ________________

4) చదువు ఆపించి పనిపాటు నేర్పిస్తున్నాను. ________________

ఆ) ఈ కింది ఖాళీలను పూరించి సంధిపేరు రాయండి.

1) ________ + __________ = చదువాపకు = __________

2) చేస్తు + ఉన్నాడు = ____________________ = __________

3) ________ + __________ = చదువవసరం = __________

4) పండు + అయ్యేటప్పుడు = ____________________ = __________

ఇ) ఏ సమాసమో గుర్తించి రాయండి.

1) అజ్ఞానము
- కర్మధారయ సమాసము
- నఞ్‌తత్పురుష సమాసము
- బహువ్రీహి సమాసము

2) కసురుకాయలు
- ద్వంద్వ సమాసము
- ద్విగు సమాసము
- కర్మధారయ సమాసము

ఈ) కింది వాక్యములు సామాన్య/సంశ్లిష్ట/సంయుక్తములలో ఏ రకమునకు చెందినవో గుర్తించండి.

1) తేరిపార చూసి కేకవేసిన వ్యక్తిని అవ్వ గుర్తించింది ______________
2) వినయంగా చేతులు కట్టుకొని మాస్టారిముందు నిలబడ్డాడు ______________
3) మా అయ్యకు చదువులేదు. ______________
4) ఏది మంచి, ఏది చెడ్డ తెలుసుకోవచ్చు ______________

VI సృజనాత్మకత :

1) బాల కార్మిక చట్టాన్ని గురించి వివరించండి.
2) వయోజనవిద్యను గురించి, రాత్రిపాఠశాలల గురించి అంతర్జాలం సహాయంతో తెలుసుకొని రాయండి.

VII లేఖన కౌశల్యాలు :

అనధికార లేఖ : మీరు ప్రదర్శించబోవు కసురు కాయలు నాటికకు ఆహ్వానిస్తూ సోదరునకు లేఖ రాయి.

- కసురుకాయలు నాటిక ప్రదర్శనకు ఆహ్వానం
- సోదరి/సోదరుని చిరునామా
- స్థలం: అంబేద్కర్ పాఠశాల, సోలాపూర్
- సమయం ఉదయం 9 గం.
- తేది :

నేనివినేర్చుకున్నా / తెలుసుకున్నా :

1. ఉపాధ్యాయులు మరియు కుటుంబంలోని పెద్దలని అడిగి తెలుసుకోవడం.
2. విద్యప్రాధాన్యత, ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సహాయసహకారాలు.



- వివిధ భాషా పత్రికలను చదివి ఒకే వార్తను తులనాత్మకంగా పరిశీలించండి.
- ప్రతి రోజూ వార్తా పత్రికలను చదవడం అలవరచుకోండి. ముఖ్యమైన, నచ్చిన అంశాలను నమోదు చేసుకోవటం ప్రారంభించండి.

ఉ.సూ.: నిరక్షరాస్యత నిర్మూలన గురించి ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను విద్యార్థులకు తెలియజేయండి.
వి.సూ.: నిర్బంధ విద్య, వయోజన విద్య వంటి కార్యక్రమాలను గురించి తెలుసుకోండి. 100% అక్షరాస్యత సాధించిన రాష్ట్రాలను సఫలీకృత విధానాన్ని గురించి గ్రహించండి. మీ వంతు కృషి చేయండి.

GSI57K

తల్లికడుపు చల్లగా....

ఉపవాచకం

చలి! చలి! చలి!

ధనుర్మాసం ఉదయాన మంచు పొరలింకా విచ్చుకోలేదు. పొగమంచు బాగా కమ్ముకోటాన పదడుగుల దూరంలో ఉన్న చింతచెట్లు కూడా కన్పించటం లేదు. పదేళ్ళ రంగడు కృష్ణ స్నానానికి బయలుదేరాడు.

చలి! చలి! చలి!

“ఉహుహుహుఁ ....” అంటూ వణికిపోయాడు రంగడు. రంగడికి ఓ సంగతి జ్ఞాపకం వచ్చింది. ఓసారి సూరన్న తాతని అడిగాడు. “చలి ఎక్కణ్ణించి వస్తుంది తాతా!”

“ఎక్కణ్ణించో రావటమేమిట్రా.... నీ గుప్పిటలోనే ఉంటుంది చలి” అన్నాడు సూరన్న.

గుప్పిటలు విప్పేశాడు రంగడు. చలీ గిలీ పారిపోయింది. ఎగిరి గంతేశాడు. పరుగు పరుగున కృష్ణవొడ్డుకి వచ్చాడు. కృష్ణనిండా పొగమంచు - ప్రవాహం కన్పించటంలేదు. నీళ్ళలో వేళ్ళు పెడితే కొంకర్లు పోతున్నాయి. శరీరమంతా చల్లగా మంచుముద్దయి పోతోంది. రంగడు స్నానం చేయటానికి తటపటాయిస్తూ వొడ్డునే కూర్చుని నీళ్ళ పైన పేరుకున్న చలి పొరని చెదరు గొడ్తున్నాడు.

ఇంతలో గుళ్ళోంచి శంఖం మోత విన్పించింది.

‘అమ్మో! వూరేగింపు బయలుదేరే వేళయింది’ అనుకుంటూ చెంగున నీళ్ళలోకి దూకాడు రంగడు. బారలు బారలుగా ఈది ఇంకా లోపలికెళ్ళి బుడుంగున మునిగాడు.

కృష్ణలోపల వెచ్చగా ఉంది. హాయిగా ఉంది. అమ్మకడుపులో ఉన్నట్లు నిశ్చింతగా ఉంది. కృష్ణ లోలోపల అలలు అలలుగా, వెచ్చవెచ్చగా వొళ్ళంతా ప్రేమగా నిమురుతోంది. రంగణ్ణి ఓసారి వాళ్ళమ్మ వొళ్ళో పడుకోబెట్టుకుని వొళ్ళు నిమురుతూ ‘నువ్వుచక్కగా చదువుకొని గొప్పవాడివవ్వాలి’ అంటూ మౌనంగా చేతులతో రాస్తుంటే ఎంతో హాయనిపించింది. మళ్ళీ అంత సుఖంగా ఉంది కృష్ణ కడుపులో. అందుకే తనకి అమ్మ అంటే ఇష్టం! కృష్ణంటే ఇష్టం.

మళ్ళీ గుళ్ళో శంఖం మోగింది.

“అయ్య బాబోయ్! వేళయిపోతుంది” అంటూ గబగబా వొడ్డుకొచ్చాడు. వొడ్డుకి వచ్చీ రావటంతోటే మళ్ళీ చలి చుట్టు ముట్టేసింది. గజగజ వణకుతూ తుండు పిండుకుంటూ “నేను తప్ప ఇంకెవరూ ఇంత చలిలో స్నానం చెయ్యలేరు” అనుకుంటూ పక్కకి చూస్తే ఓ అరవై ఏళ్ళ ముసలమ్మ తనలాగే స్నానం చేసి చీర పిండుకుంటోంది. ఆశ్చర్యం వేసింది. ఆ అవ్వ చలికి వణకటం కూడా లేదు. అలా చూస్తున్న రంగడితో అవ్వ అంది. “నాయనా! నాకు కళ్ళు మసకలు. కొంచెం ఈ రాళ్ళు దాటిస్తావా?” సమాధానం కూడా చెప్పకుండా చేయందించాడు రంగడు. రంగడు అవ్వనే చూస్తున్నాడు. ముఖంనిండా పచ్చగా పసుపు రాసుకుంది. నుదటిమీద పెద్ద కుంకం బొట్టు. వెండి జలతారులా పెద్ద జుట్టు. రాళ్ళు దాటిస్తూ రంగడడిగాడు “అవ్వా మీదే ఊరు.”

ఇంతలో గుళ్ళో మళ్ళీ శంఖం మోత.

అవ్వచెప్పే సమాధానం వినకుండా “నే వెళ్లొస్తానవ్వా!” అంటూ పరుగు పరుగున ఇంటికొచ్చేశాడు రంగడు.

ఇంటికొచ్చీ రావటంతోటే లాగూ చొక్కా తగిలించుకుని “అమ్మా! నేను వూరేగింపు కెళ్తున్నా!” అని దొడ్లో ఉన్న తల్లికి ఓ కేక పెట్టి వీధిలోకొచ్చి పడ్డాడు. వీధిలోని తనీడు పిల్లల్నందర్నీ పేరు పేరునా పిలిచి పదిహేనుమంది జట్టుతో గుళ్ళోకి పరుగెత్తాడు.

దేవుణ్ణి పల్లకీలో వేంచేపు చేశారు. సన్నాయి మేళంతో వూరేగింపు బయలుదేరింది! పెద్ద బజారునిండా ముగ్గులు. ఆ ముగ్గులమీద పసుపు కుంకుమలు. ఆ పసుపు కుంకుమల నడుమ గొబ్బెమ్మలు. ఆ గొబ్బెమ్మల తలల్లో బంతిపూలు. పల్లకీ హారతి ఉన్న చోటల్లా ఆగుతోంది. దేవుడికి హారతి ఇస్తున్నప్పుడు సన్నాయి ఆగిపోగా భజన సాగుతోంది. ప్రతి ఇంటిముందు పిల్లలు కూడా హారతి కళ్ళకద్దుకుంటున్నారు. నివేదన చేసిన రేగిపళ్ళు పంచిపెట్టే టక టక నమిలేస్తున్నారు. అలా నాలుగు వీధులూ పల్లకీతో తిరుగుతూ ఎన్ని హారతులు కళ్ళ కద్దుకున్నారో! ఎన్ని

రేగుపళ్ళు నమిలారో? పళ్ళు పులిసిపోయాయి.

చల్లమ్మగారింటి దగ్గర హారతి ఇస్తుంటే రంగడు పక్కకి తప్పుకున్నాడు. ఎందుకంటే ఓ రోజున చల్లమ్మ అప్పడాలు ఎండబెట్టింది. రంగడు వెళ్ళి ''నాకో అప్పడం ఇవ్వవా?'' అన్నాడు. చల్లమ్మ ఒకటిచ్చింది.

అది ఎడం చేతిలో పెట్టుకుని ''మా అమ్మకో!'' అన్నాడు.

''నీకిచ్చింది కాక మీ అమ్మకు కూడానా ఫో'' అంది.

రంగడికి చెడ్డ కోపమొచ్చింది. చల్లమ్మని ఇంట్లోకి పోనిచ్చి అప్పడాలన్నీ కుప్పపోసి ముక్కలు ముక్కలుగా తొక్కి పరుగెత్తుకొచ్చాడు. ఆ తర్వాత పెద్ద గొడవై తల్లి వెళ్ళి క్షమాపణ చెప్పుకోవటంతో సరిపోయింది. అప్పటి నుంచి చల్లమ్మని చూస్తే రంగడికి భయం. ఆ సంగతి తెలిసిన వాళ్ళందరూ రంగడు ''మా అమ్మకో?'' అని అడగక ముందే రెండు ఇస్తారు.

పిల్లల సరదా అంతా వూరేగింపు మీద కాదు. దేవుడు గుళ్ళోకి తిరిగి ఒచ్చిం తర్వాత పెట్టే దధ్యోజనం మీద. ప్రసాదం పంచి పెడ్తుంటే పిల్లలు ఒకటే గోల. ఇంట్లో చద్ది ఎన్నిసార్లు చేసుకుంటాం కాదు. కాని ఆ రుచి రాదేం!''

''దధ్యోజనం రుచి అంతా కరివేపాకులో ఉందిరా!'' అన్నాడు రంగడు.

''పులిహోర రుచి అంతా తిరగమోత మిరపకాయలో ఉందిరా'' అన్నాడు ఇంకొకడు.

రంగడి వంతు వచ్చింది. ఒకచేత్తో చద్ది పెట్టించుకుని రెండోచెయ్యి చూపించి ''మా అమ్మకో?'' అన్నాడు. అర్చకుడు నవ్వుకుని రెండో చేతిలో కూడా పెట్టాడు. రంగడు సంబరంగా మెట్లుదిగి వస్తుంటే మెట్లకింద పొద్దున్న కృష్ణదగ్గర కన్పించిన అవ్వ కనిపించింది.

''నాయనా! కళ్ళు కానను, పైకి వెళ్ళలేను. కొంచెం ప్రసాదం పెట్టరా!'' అంది.

రంగడు చిక్కులో పడ్డాడు. అమ్మకీ, తనకీ ఉంది ప్రసాదం.

''మా ఇంటికి రా అవ్వా అన్నం పెట్టిస్తా'' అన్నాడు.

''అన్నమెందుకురా! అయ్య ప్రసాదం కావాలిగాని'' అంది అవ్వ. రంగడు కాదనలేక తన ప్రసాదం అవ్వచేతుల్లో పెట్టి ఇంటికి పరుగెత్తుకొచ్చాడు.

గుమ్మంలో స్నానంచేసి నుంచున్న తల్లి చేతిలో ప్రసాదం పెట్టాడు. ''మరి నీకో?'' అంది. తల్లి ''నాది గుళ్లో ఓ అవ్వకిచ్చేశా'' అన్నాడు రంగడు. ''మరయితే ఇది నువ్వు తీసుకో'' అంది తల్లి. ''కాదు నీకే'' అన్నాడు రంగడు. కాదు కాదని కొడుకుచేత బలవంతాన తినిపించింది తల్లి.

''ప్రసాదం రుచి అంతా కరివేపాకులో ఉంటుందమ్మా'' అంటూ కరివేపాకు తల్లి నోటికందించాడు రంగడు.

రంగడి తల్లి నవ్వుతూ కరివేపాకు చప్పరిస్తూ కొడుకుని వొళ్ళోకి తీసుకుని నిమిరింది. రంగడికి కృష్ణమ్మ కడుపులో స్నానమాడినట్లనిపించింది.

వినండి - చర్చించండి - రాయండి.

I అవగాహనా కృత్యాలు :

అ) ఎవరు ఎవరితో అనిరి.

1) 'నీ గుప్పిట్లోనే ఉంటుంది చలి.'
2) 'కొంచెం ఈరాళ్ళు దాటిస్తావా'
3) 'నాకో అప్పడం ఇవ్వవా'
4) 'నాది గుళ్ళో ఓ అవ్వకిచ్చేశా'

ఆ) తప్పొప్పులు గుర్తించి రాయండి.

1) సన్నాయి మేళంతో వూరేగింపు బయలుదేరింది ( )
2) ఇంతలో గుళ్ళోంచి డప్పుల మోత విన్పించింది. ( )
3) ఆ పసుపు కుంకుమల నడుమ గొబ్బెమ్మలు. ( )
4) ప్రసాదం పంచి పెడ్తుంటే అందరూ ఒకటే గోల ( )
5) కొడుకు చేత బలవంతాన తినిపించింది తల్లి. ( )
6) అమ్మని చూస్తే రంగడికి భయం ( )
7) అవ్వ చలికి వణకడం కూడా లేదు ( )
8) అందుకే తనకి అన్న అంటే ఇష్టం. ( )
9) రంగడు అవ్వనే చూస్తున్నాడు. ( )
10) కృష్ణలోపల చల్లగా ఉంది. ( )

ఇ) సరైన క్రమంలో రాయండి.

1) చెంగున నీళ్ళలోకి దూకాడు రంగడు.
2) పదేళ్ళ రంగడు, కృష్ణ స్నానానికి బయలుదేరారు.
3) వొడ్డుకి రావటంతోనే మళ్ళీ చలి చుట్టుముట్టేసింది.
4) నీళ్ళలో వేళ్ళు పెడితే కొంకర్లు పోతున్నాయి.

II అభిప్రాయవ్యక్తీకరణ :

1) నది ఆత్మకథను సొంత మాటల్లో రాయండి.
2) ఈ పాఠం ద్వారా నీవుగ్రహించిన జీవన కౌశల్యాలు పట్టికగా రాయండి.
3) పాఠంలోని వివిధ పరిచ్ఛేదాలలో గ్రహించిన విలువలు వ్యక్తపరచండి.

III స్వీయస్పందన :

1) 'చల్లమ్మని చూస్తే రంగడికి భయం'.... మీ సొంతమాటల్లో రాయండి.
2) గుడివద్ద అవ్వకు, రంగడికి మధ్య జరిగిన సంభాషణ మీ సొంత మాటల్లో రాయండి.
3) నీవు ఎవరికైనా చేసిన సహాయాన్ని నీ సొంతమాటల్లో రాయుము.

IV లఘుటీక రాయండి :

1) దేవుని ఊరేగింపు.
2) రంగడి తల్లి చల్లమ్మకు క్షమాపణ చెప్పిన విధం.
3) రంగడు, అవ్వకు ప్రసాదం పెట్టిన విధం.

6 మిత్రలాభము

నేపథ్యం

- ఈ చిత్రం దేనికి చిహ్నం – చర్చించండి.
- కింది చిత్రకథను గమనించండి. మీరు చిన్నప్పుడు చదువుకున్నదే. కథను తరగతిలో చెప్పండి. అందులోని నీతిని ఎత్తి చూపండి. పాటించండి

జంతువులు సైతం ఐకమత్యంగా ఉంటే ఎంత లాభామో కింది కథలో చెప్పిన విధానాన్ని గమనించండి.

"గోదావరీ తీరమందు గొప్ప బూరుగు వృక్షము గలదు. అందు నానా దిక్కులనుండి వచ్చి పక్షులు రాత్రి వసించు చుండును. ఒకనాఁడు వేఁకువ లఘుపతనక మను వాయసము మేలుకొని చెట్టుకింద సంచరించుచున్న వేటగాన్ని జూచి, వీఁడు వచ్చినచోట నిలువదగదు. జాగు చేయక యీ చోటు విడిచి పోవలె'నని యత్నము చేయుచుండగా వాడావృక్షమునకు సమీపమందు నూకలు చల్లి వల పన్ని పోయి చేరువ పొదలో దాగి పొంచి చూచుచుండెను. అనంతరము చిత్రగ్రీవుడను కపోతరాజు నింగిని సంచరించుచు నేలమీఁది నూకలు చూచి తనతోడి కపోతములతో నిట్లనియె. 'ఈ నిర్జన వనమందు నూకలు రా నిమిత్తమేమి? మన మీ నూకల కాశపడరాదు.



"ఆపదలో ఆదుకున్నవాడే నిజమైన స్నేహితుడు" - ఎందువల్ల?

సర్వవిధముల విచారింపని పని చేయరాదు. చక్కఁగా విచారించి చేసినపనికి హాని యెప్పటికి రాదు.' అని చెప్పఁగా విని యొక కపోతవృద్ధము నవ్వి యిట్లనియె. 'ఆ! యివి యేటిమాటలు? ఒక యిక్కట్టు వచ్చినప్పుడు వృద్ధుని మాట వినవలసినది. వినుండు. స్థానాస్థానములు వివేకింపక సర్వత్ర యిట్టివిచారము పెట్టుకోరాదు. కొఱమాలినశంకలు తెచ్చుకొని భోజనము మానుకోవచ్చునా? మానుకొని యేలాగున బ్రతుకవచ్చును? ఈర్ష్యాళువు, జుగుప్సావంతుడు, నిస్సంతోషి, క్రోధనుఁడు, నిత్యశంకితుఁడు, పరభాగ్యోపజీవియు ననువా రాఱుగురు దుఃఖభాగులని నీతికోవిదులు చెప్పుదురు. అనఁగా విని కపోతములన్ని నేల వ్రాలెను.

అనంతరము పావురము లన్ని వలలో దగులుకొని

కపోత వృద్ధమును జూచి 'నీవు అన్నియు తెలిసినవాఁడవని భ్రాంతిపడి నీమాటలను విని యీవిపత్తు తెచ్చుకొంటిమి.

కపోత వృద్ధమును గూర్చి చిత్రగ్రీవుడన్న మాటలు.

అని కపోతములు నిందింపఁగా విని చిత్రగ్రీవుండిట్లనియె. 'ఇది యీతనిదోషము గాదు. అపదలు రాఁగలప్పుడు మంచి సహితము చెడుగగుచున్నది. మనకాలము మంచిదికాదు. ఊరక యేల యీతని నిందించెదరు? ఈతఁడు తనకుఁదోచినది చెప్పినాఁడు. అప్పుడు మన బుద్ధి యేమయ్యె? ఆపద వచ్చినపుడు తప్పించుకొను సాధనము విచారింపవలె గాని యీ మాటలవల్ల ఫలమేమి? విపత్కాలమందు విస్మయము కాపురుష లక్షణము. కాఁబట్టి యిప్పుడు ధైర్యము తెచ్చుకొని ప్రతీకారము చింతింపుఁడు. ఇప్పటికి నా కొకటి తోఁచుచున్నది. మీరందఱు పరాకు లేక వినుఁడు.

"ఐకమత్యమే మహాబలం" వివరించండి.

ఒక్కసారిగా మన మందఱము వలయెత్తుకొని యెగిరిపోవుదము. మన మల్పులము; మనకీ కార్యము సాధ్యమవునా యని విచారింపఁబనిలేదు. సంఘీభవించి యెంతటి కార్యమయిన సాధింపవచ్చును. గడ్డి పరకలు సహితము వెంటిగా నేర్పడి మదపుటేనుఁగును బంధించు చున్నవి. మీరు విచారింపుఁడు. దీనికంటె మంచిసాధనము మీబుద్ధికిఁ దగిలెనా యది చేయుదము.' అనిన విని 'మీరు చెప్పినదే సరి; యింతకంటె మంచిసాధనము లేదని' చెప్పి పావురములన్ని విచిత్రముగా గగనమార్గమున కెగిరెను. అప్పు డావ్యాధుఁడు వెఱఁగుపడి 'యీపక్షులు గుంపుగూడి వలయెత్తు కొనిపోవుచున్నవి. నేల వ్రాలగానే పోయి పట్టుకొనియెదఁగాక'. యని చింతించి మొగము మీఁది కెత్తుకొని ఱెప్పవ్రేయక చూచుచు నవి పోవు దిక్కునకయి క్రిందనే పోవు చుండెను.

రచయిత పరిచయం : పరవస్తు చిన్నయసూరి 19వ శతాబ్దమందు సంస్కృతాంధ్ర, తమిళభాషలలో పేరెన్నికగన్న పండితుడు. ఈయన తమిళనాడులోని చెంగల్పట్టు జిల్లాకు చెందిన పెరంబుదూరులో క్రీ.శ. 1807వ సంవత్సరమున జన్మించి 1861వ సంవత్సరం వరకు జీవించియుండెను. మద్రాసు ప్రభుత్వ కళాశాలలో ఆంధ్రపండితుడుగా విద్యాబోధన చేయుచు తన జీవితమంతయు భాషాసేవకు వినియోగించిన ధన్యజీవి.

సంస్కృతభాషలో విష్ణుశర్మ రచించిన 'పంచతంత్రమ'ను గ్రంథములోని మొదటి రెండు తంత్రములను చిన్నయ 'నీతి చంద్రిక' యను పేరరచించెను. బాలవ్యాకరణము, సూత్రాంధ్ర వ్యాకరణము, ఆంధ్రధాతుమాల, నీతిసంగ్రహము అతనిచే రచింపబడిన గ్రంథములే. చిన్నయ వచన రచన అనితర సాధ్యము.

ప్రస్తుత పాఠ్యభాగము చిన్నయసూరి రచించిన నీతిచంద్రికలోని 'మిత్రలాభం' నుండి గ్రహించబడినది.

I వినండి - సంభాషించండి :

1) "కలిసి ఉంటే కలదు సుఖం."

2) మీరు చదివిన నీతికథలను గూర్చి తరగతిలో చర్చించండి.

II చదవండి - ఆలోచించండి - రాయండి.

పదజాలాన్ని పెంపొందించుకుందాం.

వాయసము=కాకి; వేఁగువాత = తెల్లవారుఝామున/ఉదయమున; తెరువరి = బాటసారి; హాని = అపాయము; కొరమాలిన శంకలు = పనికిరాని సందేహాలు; క్రోధనుడు = కోపశీలుడు; నిత్యశంకితుడు = ఎప్పుడూ అనుమానించు వాడు; పరభాగ్యోపజీవి = ఇతరులమీద ఆధారపడి బ్రతుకు వాడు; తగులుకొని = చిక్కుకొని; విస్మయము = తెల్లబోవుట; కాపురుషలక్షణము = తెలివితక్కువ వారి లక్షణము; ప్రతీకారము =ప్రతిక్రియ; వ్యాధుడు = వేటగాడు.

III వినండి - చర్చించండి - రాయండి.

అ) i) జవాబులు రాయండి.

1) లఘుపతనకము బూరుగ వృక్షమును వదలి వెళ్ళవలెనని అనుకొనెను.
2) నేలపై నున్న నూకలను చూచిన చిత్రగ్రీవుడు తన మిత్రులతో పలికిన పలుకులు.
3) కపోతములన్ని నేలపై వ్రాలుటకు కారణము.
4) కపోతములు వృద్ధకపోతమును నిందించిన విధము.
5) పావురములు వ్యాధుని బారినుండి తప్పించుకొనిన విధము.

ii) పూరించండి :

ఘటన	పరిణామము
వృద్ధకపోతము మాటలు వినుట	
చిత్రగ్రీవుని హితబోధ	

ఆ) ఎవరు, ఎవరితో అనిరి.

1) వీడు వచ్చిన చోట నిలువదగదు.
2) ఈ నిర్జన వనమందు నూకలు రానిమిత్తమేమి?
3) ఆ! ఇవి యేటిమాటలు.
4) ఎవ్వడు బుద్ధిమంతుడో వాడు వృద్ధుడు.

ఇ) కింది అల్లికను పూరించండి.



ఈ) వరుస క్రమంలో అమర్చి రాయండి.

1) పావురములన్నీ విచిత్రముగా గగన మార్గమున కెగిరెను.
2) విస్మయము కాపురుష లక్షణము.
3) మనమందరము వలఎత్తుకొని పోవుదము.
4) వృద్ధకపోతము మాటలు విని పావురములన్ని నేల వ్రాలెను.
5) మనమీ నూకల కాశపడరాదు.

IV స్వీయస్పందన :

1) ''ఐకమత్యమే మహాబలము'' -- అను సామెతపై మీ అభిప్రాయం తెలియ చేయండి.
2) వృద్ధకపోతమును పావురములు నిందించుట సమంజసమా? కాదా? మీ సొంతమాటల్లో రాయండి.
3) 'చిత్రగ్రీవుడు కపోతరాజు' -- అతనిలోని నాయక లక్షణాలు తెలియ చేయండి.

V భాషావగాహన :

అ) కింది అర్థముగల పదాలను పాఠంలో వెదకి రాయండి.

1) దాగి 2) ఆకాశము 3) బాటసారి 4) అనుమానము 5) తెలివి తక్కువవారు.

ఆ) వచనాలు గుర్తించండి :

1) వృద్ధుడు = ______

2) మాటలు = ______

3) వల = ______

4) మీరు = ______

ఇ) కింది వాక్యములు ఏకాలములో ఉన్నవో గుర్తించి రాయండి.

1) ఈ పక్షులు వల ఎత్తుకొని పోవుచున్నవి. ______

2) మనమందరము వలఎత్తుకొని ఎగిరిపోవుదము. ______

3) వాయసము పొదలో దాగి చూచుచుండెను. ______

ఈ) పట్టిక పూరించండి :

పదము	విడదీసి రాయుట	సంధిపేరు
1) నిమిత్తమేమి		ఉకారసంధి
2) ఏమయ్యె	ఏమి + అయ్యె	
3) స్థానాస్థానములు		
4) పరభాగ్యోపజీవి		
5) కపోతములన్ని		

ఉ) కింది విగ్రహవాక్యాలను, సమాసనామములతో జతపరచండి.

1) బూరుగు అనుపేరుగల వృక్షము	అ) విశేషణ ఉత్తరపద కర్మధారయ సమాసము
2) కపోతములకు రాజు	ఆ) సంభావనా పూర్వపద కర్మధారయ సమాసము.
3) వృద్ధమైన కపోతము	ఇ) ద్విగు సమాసము
4) ఆరు సంఖ్యగల దుఃఖభాగులు	ఈ) షష్ఠీ తత్పురుష సమాసము.

ఊ) కింది వాక్యములు సామాన్య/సంశ్లిష్ట/సంయుక్త వాక్యములలో ఏరకమునకు చెందినవో రాయండి.

1) గోదావరీ తీరమందు బూరుగు వృక్షము కలదు. ______

2) విపత్కాలమందు విస్మయము కాపురుష లక్షణము కాబట్టి ధైర్యముతో ప్రతీకారము చింతింపుడు. ______

3) వ్యాధుడు నూకలు చల్లి, వలపన్ని, పోయి పొదలో దాగి పొంచి చూచుచుండెను. ______

ఋ) గీతగీసిన ప్రత్యయాలు ఏవిభక్తులో రాయండి.

1) పావురములు అన్నీ గగన మార్గమున ఎగిరెను.

[ ] [ ]

2) వాయసము పొదలోదాగి చూచుచుండెను.

[ ] [ ]

VI సృజనాత్మకత :

1) మీరు ఆపదలో చిక్కుకుంటే ఏంచేస్తారో ఊహించి రాయండి.

2) ఈ పాఠం ద్వారా మీరు గ్రహించిన నీతిని వివరించండి. ఇటువంటి మరికొన్ని కథలను సొంతమాటల్లో రాయండి.

చదువుదాం - తెలుసుకుందాం

గ్రాంథిక భాష/వ్యావహారిక భాషల తారతమ్యతను పరిశీలించండి.

గోదావరీ తీరమందు గొప్ప బూరుగు వృక్షము కలదు. అందు నానాదిక్కుల నుండి వచ్చి పక్షులు రాత్రి వసించు చుండును. ఒకనాడు వేకువ లఘుపతనకమను వాయసము మేలుకొని, చెట్టు కింద సంచరించుచున్న కిరాతుని జూచి వలువాత లేచి వీనిమొగము జూచితిని. నేడేమి కీడు రాగలదో తెలియదు. వీడు వచ్చిన చోట నిలువదగదు. జాగుసేయక యీచోటు విడిచి పోవలెనని యత్నము చేయుచుండగా వాడా వృక్షమునకు సమీపమందు నూకలు చల్లి వలపన్ని పోయి చేరువ పొదలో దాగి యుండెను.

వ్యావహారిక భాష

గోదావరి ఒడ్డున పెద్ద బూరుగు చెట్టు ఉన్నది. దానిపై అన్ని దిక్కుల నుండి పక్షులు రాత్రివచ్చి చేరుచుండెను. ఒకనాడు లఘుపతనకము అనుపేరు కల కాకి ప్రొద్దుననే లేచి, చెట్టు కింద తిరుగుచున్న కిరాతకుని చూచెను. ప్రొద్దుననే లేచి వీని ముఖము చూచితిని. ఈ రోజు ఏమి ఆపద రాబోవుచున్నదో తెలియదు. ఆలస్యము చేయకుండా ఈ చోటు విడచి పోవలెను అని ప్రయత్నము చేయుచుండగా అతడు ఆచెట్టు దగ్గరలో నూకలు చల్లి వల పన్ని దగ్గరలోని పొదలో దాక్కొనెను.

VII లేఖన కౌశల్యాలు :

1) కథాలేఖనం :

కింది అంశముల ఆధారంగా కథను రాయండి.

- రామయ్య అడవికి వెళ్ళుట
- గొడ్డలి నదిలో పడుట
- దిగులుపడి ఒడ్డున కూర్చుండుట
- జల దేవత ప్రత్యక్షం
- బంగారు గొడ్డలి
- వెండిగొడ్డలి
- రామయ్య నిరాకరించుట
- చివరకు రామయ్య
- గొడ్డలిని దేవత ఇచ్చుట
- రామయ్య ఆనందం

2) నివేదిక లేఖనం :

కింది అంశాల ఆధారంగా మీ పాఠశాల వార్షికోత్సవ నివేదిక రాయండి.

అంశాలు :

- వార్షికోత్సవం జరిగిన తేది
- విచ్చేసిన ముఖ్య అతిథి
- వేదిక
- బహుమతి ప్రదానం
- ప్రదర్శించిన కార్యక్రమములు
- ముఖ్య అతిథి ఉపన్యాసం
- అందులో చాలా బాగున్నవి
- వందన సమర్పణ

3) ప్రకటన లేఖనం :

కింది సూచనా ఫలకంలోని ప్రకటనను క్షుణ్ణంగా చదివి దాని కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

సూచనా ఫలకం

జీవనదానం గురించి తెలుసుకుందామా!!

ఒక వ్యక్తి చనిపోయిన తర్వాత సగటున ఆరు లేక ఏడుగురికి బ్రతుకు ఇవ్వవచ్చును. దీనిపై మన రాష్ట్రప్రభుత్వం 'జీవనదానం అనే కార్యక్రమం చేపట్టింది. మార్గదర్శకాలు రూపొందించింది. చనిపోయాక మనిషి తన శరీరంలోని దాదాపు 200 అవయవాలు, టిష్యూలను దానం చేయవచ్చును. అనగా కళ్ళు, గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, క్లోమం, పెద్ద ప్రేగు, చిన్నప్రేగు ఎముకల ములుగ (బోన్‌మ్యారో) ను దానం చేయవచ్చును. మనిషి చనిపోయాక అవయవాలమార్పిడి కొన్ని గంటల్లో జరిగిపోవాలి. గుండె ఆగిపోతే కళ్ళు, గుండె కవాటాలు వంటివి 6 నుండి 24 గంటల్లో సేకరించవచ్చును ప్రమాదాలలో బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించిన వారి అవయవాలు గుండెను 4 గంటల్లో, కాలేయాన్ని 10/12 గంటల్లో, మూత్రపిండాన్ని 24 గంటల్లో సేకరించాల్సి ఉంటుంది.

బ్రతికుండగానే అవయవాలు రక్తసంబంధీకులకు అనగా అమ్మ నాన్న, సోదరి, సోదరులకు, పిల్లలకు, భార్యకు ఇవ్వాలంటే ప్రభుత్వ అనుమతి అవసరం లేదు. ఇతరులకు ఇవ్వదలచినచో ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. అన్ని వయస్సుల వారు ఈ అవయవదానం చేయవచ్చును.

''నేత్ర దానం మరోజీవికి వెలుగు దానం

అవయవాల మార్పిడి మరోప్రాణికి ఊపిరి''

1. పై ప్రకటన దేని గురించి ఇవ్వబడింది?
2. ఏయే అవయవాలను దానం చేయవచ్చును?
3. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరెవరికి అవయవదానం చేయవచ్చును?
4. అవయవదానం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమమేది?
5. బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించిన వారి అవయవాలను వినియోగించాలంటే ఎన్ని గంటల్లో సేకరించాలి?

నేనిది నేర్చుకున్నా/తెలుసుకున్నా.

1. గ్రాంథిక, వ్యావహారిక భాషల్లోని తారతమ్యము.
2. ఐకమత్యమే మహాబలం.

ఉ.సూ.: గ్రాంథిక, వ్యావహారిక భాషలలోని వివిధ రచనలు విద్యార్థులకు పరిచయం చేయండి. వ్యావహారిక భాషోద్యమాన్ని గురించి తెలపండి.

GSS198

7 చతురోక్తులు

నేపథ్యం

జనుల వాడుకలోని ఈ కథను మీ మాటలలో వివరంగా చెప్పండి.

పోతన భాగవతంలో శ్రీమహావిష్ణువు గజేంద్రుని ఆర్తనాదం విని, శంఖచక్రాదులు గ్రహింపక హుటాహుటిన బయలుదేరెనని వ్రాసెను.

శ్రీనాథుడు: చక్రాయుధం తీసుకొనక, గరుడుని అధిరోహింపక బయలుదేరి ప్రయోజనమేమి?

పోతన : (నవ్వి ఊరుకొనెను)

[శ్రీనాథుడు తన ఇంటి అరుగుపై కూర్చుని ఉండగా... పోతన పెరటిలోనికి వెళ్లి బావిలో ఒక పెద్ద బండను వేసి అయ్యో! మీ బిడ్డ బావిలో పడెనెను. వెంటనే శ్రీనాథుడు పరుగు పరుగున అచ్చటికి వచ్చి నా బిడ్డకేమైనది, ఎక్కడ వాడు అని కంగారుపడసాగెను.]

పోతన: అయ్యా! భయపడవద్దు. అదుగో మీ బిడ్డడు ఆడుకొనుచున్నాడు. సరేగానీ హుటాహుటిన ఇచ్చటికెందులకు వచ్చిరి?

శ్రీనాథుడు: బిడ్డ బావిలో పడెనని కేకవేసితిరే రక్షించుకొనుటకు వచ్చితిని.

పోతన: మరి తాడుగాని, నిచ్చెనగాని తెచ్చితిరా!

శ్రీనాథుడు: బిడ్డ ప్రాణములకు హానియని తెలియగానే ఏమియు తోచలేదు. వెనువెంటనే ఇచటికి రావలెనని మాత్రమే తట్టినది.

పోతన: ఇప్పుడు అర్థమైనదా ఆ శ్రీహరి గజేంద్రుని ఆర్తనాదం విని, శంఖచక్రాదులు గ్రహింపక హుటాహుటిన ఎట్లు బయలుదేరెనాయని?

-------- ఇలా ఎప్పుడైనా ఎవరైనా మాటలతో సున్నితంగా దెబ్బకు దెబ్బ వేయటం చూశారా.ఇప్పుడు కొందరు ప్రసిద్ధ రచయితలు మాటలతో ఎలా ఆడుకున్నారో చూడండి.

నవరసాల్లో హాస్యం ఒకటి. హాస్యం లేని జీవితం ఊహించలేము. హాస్యభరితమైన మాటలు వింటే అన్ని మరచిపోయి కడుపుబ్బ నవ్వుకుంటాం. జంధ్యాల గారన్నట్లు నవ్వడం ఒక భోగం. నవ్వించడం ఒక యోగం. నవ్వలేక పోవడం ఒక రోగం.

ఉక్తి, సూక్తి, చతురోక్తి వీటికి గల భేదం ఏమిటి?

హాస్యం అనే పదానికి పర్యాయంగా చమత్కారం. చెణుకు, ఛలోక్తి, విసురు మొదలగు అనేక పదాలు వాడుకలో ఉన్నాయి. అయితే అందరూ చమత్కారంగా మాట్లాడలేరు. కొంతమంది చమత్కారంగా మాట్లాడుతున్నట్లుగా మనల్ని ఏదోమాట విసురుగా అనిబాధిస్తారు. మన బాధ వాళ్ళకు ఆనందాన్ని కలిగిస్తుంది. ఈ విధంగా కాకుండా ఎవరైనా ఒక జోక్ వేసినా, వేసినవారు ఎదుటి వారు కూడా ఆనందంగా నవ్వుకుంటే అది అసలైన చమత్కారం. ఆరోగ్యవంతమైన హాస్యం.

మన సాహిత్యంలో హాస్యానికి పెద్దపీట వేసిన మహనీయులు ఎందరో ఉన్నారు. విశ్వనాథ సత్యనారాయణ,

మొక్కపాటి నరసింహశాస్త్రి, గుఱ్ఱం జాషువా, స్థానం నరసింహారావు మొదలగువారు సుప్రసిద్ధులు. ఆంగ్ల సాహిత్యంలో బర్నార్డ్‌షా, మార్క్‌ట్వెయిన్, జోయి బిషప్ వంటి మహనీయులు ఎందరో హాస్యాన్ని పండించారు.

ఒకసారి వేదులవారు, విశ్వనాథ సత్యనారాయణ వారి ఇంటికెళ్లారు. మేడ మీద పిల్లలు ఎగిరి గంతులు, కేకలు వేస్తూ ఆడుకుంటున్నారు. వేదుల వారికి పిల్లలు

అల్లరి చేయడం నచ్చలేదు. అందుకని తనే స్వయంగా పిల్లలను కేక వేద్దామని మేడపైకి వెళ్ళబోయారు. విశ్వనాథ వారికి బహుశ అది ఇష్టం లేక ''నీవు ఎందుకు వెళతావయ్యా వద్దు వెళ్ళకు'' అన్నారు. ఆయన అలా ''నిర్మొహమాటంగా తనను వద్దనడానికి వేదులవారు కష్టపడ్డారు. ఆ విషయం ఆయనకు తెలియ చెప్పాలి. ఎదురుగా ఉన్నది మహాకవి కాబట్టి కాస్త చమత్కారంగా చెప్పాలి. అందుకని ఒక్క క్షణం ఆలోచించి 'పైన ఏమన్నా పిచ్చి ఆసుపత్రి ఉన్నదా?'' అందుకని నన్ను వెళ్ళవద్దు అంటున్నారా! అని కొంటెగా అడిగారు.

మహాకవి ఏమైనా తక్కువ తిన్నారా. ఎంత పొరపాటు పడ్డావయ్యా వేదులా! పైన పిచ్చి ఆసుపత్రి ఉంటే నిన్ను ఎందుకు వెళ్ళొద్దు అంటానయ్యా బాబూ! అన్నారట. ఇద్దరికీ తమ ప్రసంగం నచ్చి విరగబడి నవ్వుకొన్నారు.

ఢిల్లీ ఆంధ్ర సంఘం వారు విశ్వనాథ సత్యనారాయణ గారిని ఒకసారి ఘనంగా సన్మానించారు. ఆ సందర్భంగా ఆయన ఢిల్లీ వెళ్ళారు. అప్పుడు పార్లమెంటు సభ్యులుగావున్న తెన్నేటి విశ్వనాథంగారు కూడా సన్మానసభకు వచ్చి పాల్గొన్నారు. సభ ముగిశాక తెన్నేటితో విశ్వనాథా 'మనిద్దర్నీ కలిపితే ముచ్చటైన ముక్త పదగ్రస్త అలంకారం అవుతుంది'' అన్నారట ఛలోక్తిగా తెన్నేటి విశ్వనాథం – విశ్వనాథ సత్యనారాయణ.

జీవితంలో హాస్యం ప్రాధాన్యత వివరించు.

మొక్కపాటి నరసింహశాస్త్రి పొరుగూరు వెళ్ళినపుడల్లా పూటకూళ్ళ ఇంట్లో భోజనం చేస్తుంటారు. ఆ పూటకూళ్ళ ఆమె ఒక కుక్కను ఎంతో ప్రేమగా పెంచుతున్నది. మొక్కపాటి వారికి ఆకుక్క అలా ఇంట్లో అటు ఇటూ తిరగడం నచ్చలేదు. ఆమె కుక్క పట్ల చూపే ప్రేమను కాస్త హేళన చేద్దామనే ఉద్దేశ్యంతో ''ఏమమ్మా! కుక్కను నువ్వుచాలా ప్రేమగా చూసుకుంటున్నావల్లె ఉంది అన్నారంట. అందుకు ఆమె ఏదోబాబూ ఇంతవరకు అలాగే జరిగింది. కాని నువ్వు వచ్చిన దగ్గరనుండి దాని ఆలనాపాలనా చూడడానికే నాకు సమయం చిక్కడం లేదు అన్నది. విసురు వెనక్కివచ్చి నరసింహశాస్త్రి గారికే తగిలింది.

ఒకసారి భారీ యెత్తున మద్రాసులో కవిసమ్మేళనం జరుగుతోంది. ఆహ్వానితులైన కవులంతా వేదిక నలంకరించారు. వారిలో కవిసామ్రాట్ విశ్వనాథ, దేవులపల్లి, కవికోకిల జాషువా, కవికోకిల దువ్వూరి రామిరెడ్డి యింకా కొందరు ప్రముఖులు వున్నారు. మొదటినుంచి రామిరెడ్డి గారితో జాషువాగారికి సాన్నిహిత్యం హెచ్చు. వారిద్దరూ పక్కపక్కనే చేరి మాట్లాడుకుంటున్నారు.



వారిద్దరినీ చూచిన విశ్వనాథ 'పక్షులు రెండూ ఒక చోటికి చేరాయే'' (ఇద్దరూ కవికోకిలలు) అని చమత్కరిస్తే వెంటనే జాషువాగారు–

''కిరాతుడి కన్నుఇంకా పక్షుల మీదనే వున్నదే'' అని తిరుగుదెబ్బ తీశాడు. (కిరాతుడు క్రౌంచపక్షిని కొట్టడం రామాయణ రచనకు దారితీసింది.)

'నవ్వు-ఇతరులను నవ్వించు' దీని ఆంతర్యమేమి?

స్థానం వారి సమయస్ఫూర్తికి సంబంధించిన ఒక సంఘటన. అనకాపల్లిలో శ్రీకృష్ణ తులాభారం ప్రదర్శన జరుగుతోంది. స్థానం నరసింహారావుగారు సత్యభామగా, గోవిందరావు రుక్మిణిగా నటిస్తున్నారు. రుక్మిణి కృష్ణుణ్ణి తులసిదళంతో తూచే దృశ్యం వచ్చింది. రుక్మిణి తులసిదళం పుచ్చుకొని భక్తి భావంతో

ఫలమో, ఘనరసంబో పత్రమో

గొనుచు భక్తి నిన్ను గొలుచు వారికీవు

వశుడగుటయే సత్యమేని

ఈ తులసిదళము నిన్ను తూచుగాక!

అని తక్కెడలో పెట్టింది. కాని సాంకేతిక లోపం వలన కృష్ణుడి సిబ్బి పైకి లేవలేదు. వెంటనే జనం గొల్లు మన్నారు. నటులు తెల్లబోయారు. అపుడు స్థానం వారు ''అక్కా! భర్తకు పట్టిన దుస్థితి తలచుకొని నీధ్యానం నిలకడ తప్పినట్లుంది. మనసు లగ్నం చేసుకొని మళ్ళీ తులసిదళం వెయ్యి'' అన్నారు. రుక్మిణి పద్యం పాడుతూ తులసిదళం త్రాసులో ఉంచకముందే ఈసారి కృష్ణుడుపైకి లేచాడు.

లాఫింగ్ క్లబ్బులు అని వేటిని అంటారు? వాటి ప్రయోజనాలు ఏంటి?

జనం మళ్ళీ గొల్లుమన్నారు. నటుల పరిస్థితి చూసి స్థానం వారు వెంటనే అందుకు అక్కా, నీభక్తి మధ్యలోనే పరాకాష్ట నందుకొన్నది చూశావా అని సమర్థించారు.

హాస్యానికి, చతురతకు అమెరికన్ రచయిత మార్కు ట్వెయిన్ పేరొందాడు. ఆయనకు ఒకసారి ఒక పుస్తకం

కావలసివచ్చింది. పొరుగింటి ఆసామికి ఆ పుస్తకం పేరు చెప్పి అది మీవద్ద ఉన్నదా? అని అడిగాడు. వెంటనే అతడు ఉన్నది కావాలంటే మీరు దాన్ని నా లైబ్రరీలో కూర్చుని మాత్రమే చదువుకోవలసి ఉంటుంది అన్నాడు. మార్క్‌ట్వెయిన్ అప్పటికి ఏమీ మాట్లాడలేదు. కొన్నాళ్ళకు ఆ పొరిగింటి ఆసామికి లాన్ మొవర్ కావలసి వచ్చింది. (అంటే ఆరుబయట ఉన్న గడ్డిని కత్తిరించి చదును చేసే పనిముట్టు) వెంటనే మార్క్‌ట్వెయిన్ అది కావాలంటే మీరు మా లాన్ మీద దానిని సంతోషంగా ఉపయోగించు కోవచ్చు అని జవాబిచ్చాడు.

ఇలాంటిదే మరో సంఘటన చూడండి. అమెరికన్ హాస్యనటుడు బోయి బిషప్ టెలివిజన్‌లో 'టునైట్‌షో' అనే కార్యక్రమం నిర్వహించేవాడు. ఈయనకు అభిమానుల బెడద ఎక్కువగా ఉండేది. బోయి బిషప్ నడుస్తుండగా ఒకావిడ అతన్ని మీరు బోయి బిషప్ కదూ అని అడిగింది.

బిషప్ ఆవిడని వదిలించుకుందామని 'లేదు అలా కనిపిస్తానంతే' అన్నాడు చాలా వినయంగా. కాని ఆటోగ్రాఫ్‌లకి అలవాటు పడ్డ ప్రాణం కాబట్టి వెళ్ళబోతూ ఆగి మీరు బోయి బిషప్ అభిమానా అని ప్రశ్నించాడు. ''లేదు అలా కనిపిస్తానంతే'' అని తాపీమని జవాబు వచ్చింది. చమత్కారంగా మాట్లాడడం అందరికీ చేతకాకపోవచ్చు. అయితే మన నిత్య జీవితంలో చమత్కారంగా మాట్లాడేవారు కూడా ఎదురవుతుంటారు. మన మనస్సు నొప్పించని వారి సంభాషణా చాతుర్యం కోసం వారి స్నేహాన్ని మనం కోరుకోవచ్చు.

I చదవండి - ఆలోచించండి - రాయండి.

పదజాలాన్ని పెంపొందించుకుందాం.

హేళన = ఎగతాళి; సమయస్ఫూర్తి = సమయానికి తగినట్లు; పరాకాష్ఠ = పతాకస్థాయి/ఉన్నతస్థాయి.

కృత్యము :

అ) కింది వాక్యాల్లోని తప్పొప్పులను గుర్తించండి.

1) విశ్వనాథవారు వేదుల వారింటికి వెళ్ళారు. (   )

2) వేదుల వారికి పిల్లలు అల్లరిచేయడం నచ్చలేదు. (   )

3) పైనేమన్నా పిచ్చాసుపత్రివుందా? అన్నారు వేదుల. (   )

4) ఇద్దరికీ తమప్రసంగం నచ్చలేదు. (   )

పుటసంఖ్యలో 97 లోని 3, 4, 5 పేరాలు - ''మన సాహిత్యంలో'' నుంచి ''విరగబడి నవ్వుకొన్నారు'' వరకు.

ఆ) అల్లికను పూరించండి.

తెలుగు హాస్యానికి పెద్దపీట వేసిన కవులు

ఇ) కింది పదాలను సొంత వాక్యాలలో ఉపయోగించి రాయండి :

1) నిర్మొహమాటము : ____________________

2) చమత్కారము : ____________________

ఈ) స్వీయస్పందన :

విశ్వనాథవారు పిచ్చాసుపత్రి ఉంటే నిన్నెందుకు వెళ్ళొద్దంటాను'' అనటంలోని చమత్కారం నీసొంతమాటల్లో తెలియజేయి.

II వినండి - చర్చించండి - రాయండి.

అ) జవాబులు రాయండి.

1) ''అసలైన చమత్కారము'' - వివరించండి.

2) స్థానం వారి సమయస్ఫూర్తి.

3) ''లాన్‌మొవర్‌ను మా లాన్‌పైనే ఉపయోగించండి''. అనటంలోని హాస్యం.

ఆ) ఎవరు, ఎవరితో అనిరి.

1) నీవు ఎందుకు వెళతావయ్యా! వద్దు.

2) కుక్కను నీవు చాలాప్రేమగా చూసుకుంటున్నావల్లె వుంది.

3) ''పక్షులు రెండూ ఒక చోటికి చేరాయే''

4) మనసు లగ్నం చేసి మళ్ళీ తులసీదళం వెయ్యి.

ఇ) క్రింది ఖాళీలను అర్థవంతమైన పదాలతో పూరించండి :

1) పైన ఏమన్నా ______________ వున్నదా?
2) తెన్నేటి విశ్వనాథం గారుకూడా ______________కి వచ్చి పాల్గొన్నారు.
3) జోయిబిషప్ టెలివిజన్‌లో ______________ అనే కార్యక్రమం నిర్వహించేవారు.
4) నిత్యజీవితంలో ______________ గా మాట్లాడేవారు కూడా ఎదురవుతుంటారు.

ఈ) క్రింది సంఘటనలను, ఆయా రచయితలతో జతచేయండి.

1) పిచ్చానుపత్రి సంభాషణ	అ) మొక్కపాటి నరసింహారావు.
2) పూటకూళ్ళ సంఘటన.	ఆ) మార్క్‌ట్వెయిన్
3) కవికోకిల చమత్కారం	ఇ) వేదుల, విశ్వనాథ
4) లాన్ మొవర్ ఘటన	ఈ) విశ్వనాథ సత్యనారాయణ.

III స్వీయస్పందన:

1) దూరదర్శన్‌లో ప్రసారమయ్యే నీకు నచ్చిన తెలుగు హాస్య కార్యక్రమాన్ని గురించి రాయుము.
2) దిన, వార, మాస పత్రికల్లో వచ్చే ఛలోక్తులను సేకరించి ఆల్బమ్ తయారుచేయండి.

IV భాషావగాహన :

అ) పర్యాయపదాలు రాయండి.

1) హాస్యము 2) ఇష్టము 3) అర్థము 4) స్నేహము

ఆ) క్రింది పదాలను విడదీసి, సంధులతో జతపరచండి.:

1) చతురోక్తి	______________	అ) యడాగమసంధి
2) భారీయెత్తున	______________	ఆ) ఉకారసంధి
3) చేస్తుంటారు	______________	ఇ) గుణసంధి

ఇ) క్రింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి, సమాస నామములను రాయండి.

1) కవిసమ్మేళనం		
2) పెద్దపీట		
3) ఆలనాపాలన		

ఈ) సామాన్య/సంశ్లిష్ట/సంయుక్తములలో ఏ రకమునకు చెందినవో రాయండి.

1) మేడమీద పిల్లలు ఎగిరి గంతులు, కేకలు వేస్తూ ఆడుకుంటున్నారు. ______________
2) హాస్యానికి, చతురతకు అమెరికన్ రచయిత పేరొందాడు. ______________
3) ఆపుస్తకం పేరుచెప్పి, అది మీవద్ద ఉన్నదా అన్నాడు. ______________

ఉ) క్రింది వాక్యాలను చదివి, వాక్యాంగాలను రాయండి.

1) పూటకూళ్ళ ఆమె కుక్కను ప్రేమగా పెంచుతున్నది.
2) స్థానంవారు భామాకలాప నాటకాన్ని ప్రదర్శిస్తున్నారు.
3) ఢిల్లీ ఆంధ్రసంఘంవారు విశ్వనాథవారిని సన్మానించారు.

కర్త	కర్మ	క్రియ

V సృజనాత్మకత:

1) హాస్యము నిత్యజీవితంలో ఎంతవరకు అవసరమో నీ అభిప్రాయాన్ని వ్యక్తం చేయి.

2) తెలుగు, మరాఠీ, ఆంగ్ల భాషలలోని హాస్యరచనలు గ్రంథాలయం నుండి సేకరించి చదవండి.

3) మీరు స్వయంగా కొన్ని ఛలోక్తులు రాయండి.

VI లేఖన కౌశల్యాలు :

1) గద్య అవగాహన :

కింది గద్యభాగాన్ని చదివి 5 ప్రశ్నలు రాయండి.

తన కొడుకుని టీచర్లందరూ ఉత్తమ విద్యార్థి అని పొగడుతుంటే పొంగిపోయింది ఓ తల్లి. ఆ తల్లి క్రమశిక్షణ, ఉపాధ్యాయులు చెప్పిన విద్యాబుద్ధులు ఆ అబ్బాయిని మంచి మార్గంలో నడిపాయి. అతను పాఠ్యపుస్తకాలే కాకుండా భారత, భాగవత పురాణాలు చదివేవాడు. తోటి విద్యార్థులతో వాటిలోని ఆసక్తికరమైన విశేషాలు చెప్తూ వాళ్ళలో ఆసక్తిని రేకెత్తించేవాడు. అతన్నిచూసి వాళ్ళంతా తాము కూడా బాగా చదవాలనుకునేవారు. ఒకసారి ఒక ఇంగ్లీషుదొర వాళ్ళపాఠశాల చూడ్డానికి వచ్చాడు. అతని మంచి నడవడికని గమనించి ఖరీదైన పుస్తకాన్ని బహుకరించాడు. అప్పట్నించి అటువంటి పెద్దపెద్ద పుస్తకాలన్నీ చదివెయ్యాలని ఎంతో ఉబలాటపడ్డాడు. అతనికి పుస్తకాలంటే అంతప్రేమ.

ప్రశ్నలు 1) ______________________ 2) ______________________

3) ______________________ 4) ______________________

5) ______________________

2) సంక్షిప్త లేఖనం :

కింది పరిచ్ఛేదాన్ని చదివి, మూడోవంతుకు తగ్గించి రాయండి.

వ్యాయామం అనగానే వ్యాయామశాలలు గుర్తుకువస్తాయి. కాని వ్యాయామశాలలకు వెళ్ళకుండా కూడా మనం అనేక పద్ధతులలో వ్యాయామం చేయవచ్చు. నడవటం, జాగింగ్ చేయటం, సైకిలు తొక్కటం -- ఇవన్నీ వ్యాయామ పద్ధతులే. నడవటం, జాగింగ్ చేయటం వలన కాలికండరాలు బలిష్ఠంగా తయారవుతాయి. రక్తప్రసరణ బాగా జరుగుతుంది. సైకిల్ త్రొక్కడం వలన కాలి కండరాలు, వీపు, భుజపుకండరాలు దృఢపడతాయి. ఇవి అందరికి అందుబాటులో ఉన్న వ్యాయామ పద్ధతులు.

ఇవి కాకుండా బాలబాలికలు వ్యాయామశాలలకు కూడా వెళ్ళినచో మరికొన్ని వ్యాయామ పద్ధతులను నేర్చుకొనవచ్చును. వ్యాయామ పద్ధతులను నేర్పు స్థలములను 'వ్యాయామశాలలు' అంటారు. వీటినే 'తాలింఖానాలు' అని కూడా అంటారు. చిన్న పిల్లలు మొదలుకొని పెద్దలవరకూ అందరూ అక్కడకు వెళ్ళి వ్యాయామ పద్ధతులను నేర్చుకోవచ్చును. ప్రతిరోజు వ్యాయామము చేసిన కండలు బాగా దృఢపడతాయి. నరములలో పటుత్వము ఏర్పడుతుంది. వ్యాయామము చేయునపుడు తప్పనిసరిగా బలాన్ని ఇచ్చే ఆహారాన్ని, వేళప్రకారం పాలు, పండ్లు, ఆకుకూరలు మొదలైన వాటిని తప్పనిసరిగా తీసుకోవలెను.

నేనివి నేర్చుకున్నా:

1. హాస్యము నిత్య జీవితములో ఎంత అవసరమో గ్రహించాను.
2. తెలుగు సాహిత్యంలోని ప్రసిద్ధ హాస్యకవుల రచనలు చదివి, చమత్కార రచనలలోని స్వారస్యం గ్రహించాను.

ఉ.సూ.: బాపు, భానుమతి రామకృష్ణ వంటి వారి రచనల్లోని హాస్యాన్ని విద్యార్థులకు పరిచయం చేయండి.

GT1HAV

8 అమ్మమ్మ చదువు

నేపథ్యం

- విద్య విలువను తెలియజేసే కింది పద్యాన్ని చదివి దాని అర్థాన్ని తరగతిలో వివరించి చెప్పండి.
- దొరలు దోచలేరు దొంగ లెత్తుకపోరు
  భ్రాతృజనము వచ్చి పంచుకోరు
  విశ్వవర్ధనంబు విద్యాధనంబురా
  లలిత సుగుణజాల తెలుగుబాల.
  జాతీయ సాక్షరతా మిషన్ (National Literacy Mission) గురించి విన్నారా! దీనిని గురించి అంతర్జాలంలో చదవండి.
- 'వయోజన విద్య' – అంటే ఏమిటి. ఉపాధ్యాయుల సహాయంతో చర్చించండి.
- నీవెప్పుడైనా నీ చుట్టు పక్కల వారికి ఎవరికైనా చదువు నేర్పావా!

చదువు నేర్చుకోవడానికి వయసేమి అడ్డురాదని, పట్టుదలతో సాధించలేనిది ఉండదని ఈ పాఠ్యభాగంలో నిరూపించింది ఒక అమ్మమ్మ. ఎవరీ అమ్మమ్మ? ఆమె ఎవరి అమ్మమ్మ? ఏమా కథా కమామిషు? చూద్దామా మరి!

అప్పుడు నా వయసు పన్నెండేళ్లు. మా అమ్మమ్మ, తాతయ్య గారింట్లో వుండేదాన్ని, వాళ్ళున్నది ఉత్తర కర్నాటకలోని ఓ పల్లెటూర్లో. ఇప్పట్లా అప్పుడు రవాణా సౌకర్యాలు ఎక్కువగా వుండేవి కాదు. ఉదయం రావాల్సిన వార్తాపత్రిక సాయంత్రానిక్కాని వచ్చేదిగాదు.

త్రివేణి ఆ రోజుల్లో ప్రఖ్యాత కన్నడ రచయిత్రి. అద్భుతంగా రాస్తుందావిడ. అవిడ రచన సులభంగా అర్థమయ్యేది.

చదువుకోవడానికి వయసుతో సంబంధం లేదు. వివరించు.

అప్పుడు 'కర్మవీర' అనే పత్రిక వచ్చేది. అందులో ఆవిడ రాసిన 'కాశీయాత్ర' అనే కథను సీరియల్‌గా వేసేవారు. కథ ఒక ముసలావిడ 'కాశీయాత్ర' చెయ్యాలనే గాఢమైన కోరికకు సంబంధించింది. ఆ కథలో ఒక అనాథ యువతి వుంది. ఆమె పెళ్ళి చేసుకోవాలనుకుంది.

పెళ్లి చేసుకునేందుకు డబ్బుండదు. ముసలావిడ జాలితో తను కాశికి పోయేందుకు కూడబెట్టుకున్న డబ్బంతా ఇచ్చేస్తుంది. ''ఈ అనాథయువతి ఆనందం కాశీవిశ్వనాథుణ్ణి పూజించడం కంటే ముఖ్యమైంది'' అంటుందావిడ.

మా అమ్మమ్మ క్రిష్ణక్క, ఎన్నడూ బడికిపోయి చదవలేదు. ప్రతి బుధవారం పత్రిక వచ్చేది. రాగానే తరువాత కథ చదివి వినిపించేదాన్ని. కథవింటూ ప్రపంచాన్నే మరచిపోయేది. విన్న తరువాత కథంతా పొల్లుపోకుండా తిరిగిచెప్పేది.

కొత్త కథాభాగం విన్న తరువాత గుడిలో తన స్నేహితుల మధ్యకు చేరేది. మేం పిల్లలం దాగుడుమూతలాడుకునేవాళ్ళం. కథను గురించి ఆవిడ స్నేహితులతో చర్చించేది. ఆ కథ గురించి అంతగా ఎందుకు మాట్లాడుకునేవాళ్లో నాకప్పుడు తెలిసేది కాదు. ఒకసారి బంధువులతో కలిసి పొరుగూళ్లో పెళ్లికెళ్లాను.

ఊరికి తిరిగొచ్చి అమ్మమ్మను చూచాను. ఆవిడ కళ్లవెంట నీరు కారుతున్నది. ఎంత కష్టమొచ్చినా కన్నీరు పెట్టేదికాదు. నాకాశ్చర్యమేసింది. ఏం కారణమై వుంటుంది? నాకు దిగులుపట్టుకుంది.

''అవ్వా! నువ్వు బాగున్నావు కదా? అంతా బాగుంది కదా?'' అడిగాను. కన్నడంలో 'అవ్వ' అంటే 'అమ్మ' అని అర్థం. నేనామెను 'అవ్వ' అంటాను.

ఆమె తలవూపిందిగాని మాట్లాడలేదు. ఎందుకోలే అనుకొని తరువాత ఆ విషయం మరచాను.

రాత్రి భోజనాలైంతరువాత అందరం డాబా మీద పడుకున్నాము. వేసవికాలం పూర్ణచంద్రుడు ఆకాశంలో వెలుగుతున్నాడు.

అవ్వ వచ్చి నాప్రక్కన కూచున్నది. ప్రియంగా నా నొసలు నిమిరింది. ఆవిడ యేమో చెప్పాలనుకుంటున్నదని అర్థమైంది.

''ఏమవ్వా!'' అడిగాను.

''నా చిన్నతనంలోనే అమ్మ చనిపోయింది. నా ఆలనాపాలన చూచేందుకు, సలహాలిచ్చేందుకు ఎవరూలేరు. ఆరోజుల్లో ఆడపిల్లలకు చదువనవసరమని అనుకునేవాళ్లు. నన్ను బడికి పంపలేదు. చిన్నతనంలోనే పెళ్ళిచేశారు. పిల్లలు పుట్టారు. తీరికలేకుండా పోయింది. తరువాత మనుమలు, మనుమరాళ్ళు వచ్చారు. వాళ్ళకు వండటం, పెట్టడం చాలా సంతోషంగా వుండేది. అప్పుడప్పుడు చదువుకోలేదని బాధపడేదాన్ని. అందుకే నాపిల్లల్ని, వాళ్ల పిల్లల్ని బాగా చదివించాలని నిర్ణయించుకున్నాను.''

నాకు పన్నేండేళ్లు. అమ్మమ్మకు అరవైరెండేళ్ళు. ఈ అర్థరాత్రి తన జీవితకథ నాకెందుకు చెబుతున్నట్లు? ఆమె అంటే నాకు మహాయిష్టం. ఈ కథ చెప్పడానికి ఏదో కారణంవుందని నాకు తెలుసు. ఆమె ముఖంలోకి చూచాను. సంతోషంగా లేదు. కళ్ళవెంట నీరు కారుతున్నది. ఆవిడ చాలా అందంగా, ఎప్పుడూ నవ్వుముఖంతో వుంటుంది. అప్పటి ఆమె విషాదవదనం ఇప్పుడుగూడా నాకళ్లక్కడుతుంది. ముందుకు జరిగి ఆమె చెయ్యి-పట్టుకున్నాను.

''ఏడవడమెందుకవ్వా! వద్దు. అసలు సంగతేమిటి? నేనేమైనా చెయ్యాల్నా?'' అన్నాను.

''అవును, నువ్వు సహాయం చెయ్యాలి. 'కర్మవీర' మామూలుగా వచ్చింది. నువ్వులేవు. పత్రిక తెరచాను. 'కాశీయాత్ర' కథ బొమ్మ చూచాను. కాని చదవలేకపోయాను. నేను చదువుకొనివుంటే ఎంత బాగుండేది! నువ్వు త్వరగా వస్తావని, చదివి వినిపిస్తావని వెయ్యికళ్ళతో ఎదురుచూచాను. అసలావూరికే వచ్చి నీ చేత చదివించుకోవాలనుకున్నాను. ఊళ్లో ఎవర్నయినా చదవమని వుండొచ్చును కాని ఎందుకో నాకిష్టం లేదు. అస్వతంత్రంగా, నిస్సహాయంగా వున్నట్లని పించింది. మనకు డబ్బుంది. స్వతంత్రంగా వుండలేకపోతే డబ్బెందుకు?''

'మనసుంటే మార్గముంది' - వివరించు.

ఏం చెప్పాలో తెలీలేదు. అవ్వ ఇంకా చెప్పింది.

''రేపట్నించి కన్నడం అక్షరాలు నేర్చుకోవాలని నిర్ణయించుకున్నాను. బాగా కష్టపడతాను. సరస్వతిపూజ నాటికి పూర్తిచేస్తాను ఆరోజు నాకయి నేను నవల చదవాలి. స్వతంత్రంగా వుండాలనిపిస్తున్నది.''

ఆమె ముఖంలో నిర్ణయంతో కూడిన నమ్మకం కనిపించింది. నవ్వాను.

''అరవైరెండేళ్ళ ముసలమ్మవి. అక్షరాలు నేర్చు కోవాలనుందా అవ్వా! జుట్టంతా తెల్లబడింది. చర్మం ముడతలుబడ్డది. కళ్లకద్దాలొచ్చాయి. వంటిల్లే లోకం నీకు .....''

ఆకతాయితనం. పెద్దామెను గేలిచేశాను. ఆమె చిరునవ్వు నవ్వింది.

''మంచి పని చెయ్యాలని నిర్ణయించుకున్నాను. ఎలాంటి ఆటంకాలనైనా దాటుతాను. అందరి కంటె ఎక్కువగా

కష్టపడతాను. నిజంగా కష్టపడతాను. నేర్చుకునేందుకు వయసడ్డం కాదు.''

'కష్టేఫలి'-సోదాహరణంగా తెలియజేయండి.

మర్నాడే చదువు చెప్పడం ఆరంభించాను. అవ్వ అద్భుతమైన విద్యార్థిని. హోంవర్కు అద్భుతంగా చేసింది. చదువుతుంది, మళ్లీ మళ్లీ చదువుతుంది. రాస్తుంది, ఒప్పగిస్తుంది.

నేనామెకు ఏకైక ఉపాధ్యాయినిని. ఆమె నా ప్రప్రథమ విద్యార్థిని. ఏదో ఒకరోజున నేను టీచర్నవుతానని, వందలమంది విద్యార్థులకు కంప్యూటర్ సైన్సు బోధిస్తానని ఆనాడు తెలీదు!

యథాప్రకారం దసరా వచ్చింది. అప్పటికి 'కాశీయాత్ర' పుస్తకరూపంలో వచ్చింది. ఆ నవలను రహస్యంగా కొన్నాను.

అమ్మమ్మ నన్ను పూజ గదిలోకి రమ్మన్నది. ఓ స్టూలు మీద కూచోబెట్టింది. లంగా, జాకెట్టు గుడ్డ బహుమానంగా ఇచ్చింది.

నాకు ప్రేమగా పాఠాలు చెప్పిన టీచరువి. ఇప్పుడు ఏ నవలనైనా సునాయాసంగా చదవగలను. ఇప్పుడు నేను స్వతంత్రురాలిని. ఇదంతా నీ వల్లనే జరిగింది. నా టీచర్ను గౌరవించడం నా ధర్మం అన్నది.

నేను ఆమె పాదాలు పట్టుకొని ప్రతి నమస్కారం చేశాను. మొట్టమొదటి విద్యార్థికి నా బహుమతి నందించాను.

'కాశీయాత్ర', నవల. రచయిత్రి త్రివేణి ప్రచురణ కర్త అంటూ గడగడా చదివేసింది.

నా విద్యార్థిని అత్యుత్తమ శ్రేణిలో ఉత్తీర్ణురాలైంది.

రచయిత్రి పరిచయం : సుధామూర్తిగారు 1950లో కర్ణాటక రాష్ట్రంలోని ఉత్తర కనరా జిల్లాలో జన్మించారు. సుధామూర్తి కంప్యూటర్‌సైన్స్‌లో ఎమ్.టెక్. చేశారు. ఆమె ఇప్పటికే ఎన్నో నవలలు, యాత్రావిశేషాల పుస్తకాలు, కథల పుస్తకాలు రచించారు. ఆమె ఇది వరలో వ్రాసిన ''Wise and otherwise'' అను పుస్తకము 13 భారతీయ భాషలలోకి అనువదింపబడింది. ''జ్ఞానం – పరిజ్ఞానం'' పేరుతో తెలుగులో వెలువడింది.

ప్రస్తుత పాఠ్యభాగమైన ''అమ్మమ్మచదువు'' సుధామూర్తిగారి ''హౌ ఐ టాట్ మై గ్రాండ్ మదర్ టు రీడ్ అదర్ స్టోరీస్'' అను పుస్తకం నుండి గ్రహింపబడినది. దీనిని తెలుగులోకి ద్వారక గారు అనువదించిరి.

I చదవండి - ఆలోచించండి - రాయండి.

1) మీ ఇంట్లోని వయోవృద్ధులు, వారి అక్షరాస్యత.
2) నిరక్షరాస్యులకు నీవు సహాయపడిన విధం.
3) విద్యావశ్యకత.
4) ప్రతి ఒక్కరూ మరొకరికి విద్యను నేర్పాలి (each one teach one).

II వినండి - చర్చించండి - రాయండి.

అ) జవాబులు రాయండి.

1) ముసలావిడ కాశీయాత్రకు వెళ్ళలేకపోవటానికి గల కారణం.
2) రచయిత్రి అమ్మమ్మకు కథ చదివి వినిపించింది.
3) అవ్వ తాను అస్వతంత్రంగా, నిస్సహాయంగా ఉన్నానని ఎందుకు భావించింది?
4) అవ్వ మనమరాలికి తన చిరకాల వాంఛను ఏమని తెలియ పరిచింది.
5) అమ్మమ్మ స్వతంత్రురాలినయ్యానని ఎప్పుడు భావించింది.

ఆ) ఎవరు, ఎవరితో అనిరి.

1) అవ్వా! నువ్వు బాగున్నావు కదా?

2) నా పిల్లల్ని బాగా చదివించాలని నిర్ణయించుకున్నాను.

3) స్వతంత్రంగా వుండలేకపోతే డబ్బెందుకు.

4) అక్షరాలు నేర్చుకోవాలని ఉందా అవ్వా!

ఇ) కింది వాక్యాల్లోని తప్పొప్పులను గుర్తించండి.

1) అనాథ యువతి ఆనందం కాశీవిశ్వేశ్వరుని పూజించటం కంటే ముఖ్యమైంది. (   )

2) అవ్వ అంటే అత్త అని అర్థం (   )

3) ఆ రోజుల్లో ఆడపిల్లలకు చదువు అవసరం అని భావించేవారు. (   )

4) అవ్వ అక్షరాలు నేర్చుకోవాలని నిర్ణయించుకుంది. (   )

III స్వీయస్పందన :

1) అవ్వ చదువు నేర్చుకోవాలను కోవటం పట్ల నీ అభిప్రాయం తెలియజేయి.

2) స్త్రీ విద్యా ప్రయోజనం గురించి రాయండి.

స్వయం | పరివారం | సమాజం | దేశం

IV భాషావగాహన :

అ) వ్యతిరేక పదాలు పాఠ్యభాగం నుండి వెదకి రాయండి.

1) సాయంత్రము × ____

2) ____ × పాత

3) సంతోషపడుట × ____

4) ____ × స్వతంత్రము.

ఆ) వాచకములను గుర్తించి రాయండి.

1) ఆవిడ ____ 2) గుడి ____ 3) అమ్మమ్మ ____ 4) మనుమడు ____

5) పత్రిక ____ 6) సరస్వతి ____ 7) బొమ్మ ____ 8) విద్యార్థిని ____

ఇ) కింది వాక్యములు ఏకాలమునకు చెందినవో రాయండి.

1) నాకు దిగులు పట్టుకుంది. ____________________

2) చంద్రుడు ఆకాశంలో వెలుగుతున్నాడు. ____________

3) నేను ఆమె చేయి పట్టుకున్నాను. ____________

4) రేపటి నుంచి అక్షరాలు నేర్చుకోపోతున్నాను. ____________

ఈ) సంధులు జతచేయండి.

1) కష్టమొచ్చిన — అ) ఇకారసంధి

2) అత్యుత్తమ — ఆ) వృద్ధిసంధి

3) అప్పుడప్పుడు — ఇ) ఉకారసంధి

4) నేర్చుకోవాలని — ఈ) ఆమ్రేడిత సంధి

5) ఏకైక — ఉ) యణాదేశ సంధి

ఉ) సరియైన సమాధానం గుర్తించి రాయండి.

1) పన్నెండేళ్లు
- ద్వంద్వ సమాసము
- బహుబ్రీహిసమాసము
- ద్విగు సమాసము

2) వార్తాపత్రిక
- షష్ఠీ తత్పురుష సమాసము
- కర్మధారయ సమాసము
- అవ్యయీభావ సమాసము

3) మంచిపని
- ద్విగు సమాసము
- ద్వంద్వ సమాసము
- కర్మధారయ సమాసము

ఊ) కింది వాక్యాలు సామాన్య/సంశ్లిష్ట/సంయుక్తములలో ఏరకమునకు చెందినవో రాయండి.

1) ప్రతి బుధవారం పత్రిక వచ్చేది.
2) ఆమె తల వూపింది కాని మాట్లాడలేదు.
3) నా ఆలనాపాలనా చూసేందుకు సలహాలిచ్చేందుకు ఎవరూలేరు.
4) స్వతంత్రంగా వుండాలి అనిపిస్తోంది.

ఋ) గుర్తించబడిన పదాలు ఏ వాక్యాంగములో రాయుము.

	కర్త	కర్మ	క్రియ
1) కథను గురించి ఆవిడ స్నేహితులతో చర్చించేది.			
2) అవ్వవచ్చి నా పక్కన కూర్చున్నది.			
3) నేను పెద్దామెను గేలిచేశాను.			
4) అమ్మమ్మ నన్ను పూజగదిలోకి రమ్మన్నది.			
5) ఆమె పాదాలకు నేను నమస్కరించాను.			

ౠ) గుర్తింపబడిన పదములు వ్రాసి ఏ భాషాభాగములో ఆయా గడులలో రాయండి.

1) త్రివేణి ఆరోజుల్లో ప్రఖ్యాత రచయిత్రి.
2) మేము దాగుడుమూతలు ఆడుకొనేవాళ్ళం.
3) నవలను రహస్యంగా కొన్నాను.

నామవాచకం	సర్వనామం	క్రియ	విశేషణము

V సృజనాత్మకత :

మీ పరిసరాలలోని నిరక్షరాస్యులను ఏవిధంగా అక్షరాస్యులుగా మార్చవచ్చో కొన్ని అంశాలను సూచించండి.

VI లేఖన కౌశల్యాలు : వ్యాసం (ఆత్మకథ)

కింది అంశాల ఆధారంగా 'కొబ్బరిచెట్టు' ఆత్మకథను రాయండి.

- కొబ్బరి చెట్టు
- కల్ప వృక్షం
- నేను పెరిగే ప్రాంతాలు
- రచన ఉత్తమ పురుషలో ఉండాలి
- ఉపయోగాలు: తాళ్ళు, పరుపులు, చీపుర్లు, గుండీలు, అలంకరణసామగ్రి

సమాచార ప్రసార సాంకేతిక పరిజ్ఞానము (ICT)

పూర్వం ప్రాంతీయభాషల్లో వెబ్‌సైట్లను రూపొందించటం సాధ్యమయ్యేది కాదు. కానీ యూనికోడ్ ఫాంట్ల వల్ల అది సాధ్యమైంది. ఈ ఫాంట్ల వల్ల ఇప్పుడు సునాయాసంగా కంప్యూటర్ తెలుగుటైప్ చేయగలుగుతున్నాము. అలాగే ఇంగ్లీషు తెలియని వ్యక్తులు e-కామర్స్, e-గవర్నెన్స్‌లో పాలుపంచుకోగలుగుతున్నారు. ప్రభుత్వం కూడా ప్రాంతీయ భాషలలో సమాచారాన్ని ప్రదర్శించు విషయమై శ్రద్ధ వహించుచున్నది. ఫాంట్ అనగా ఒకే శైలిలోని అచ్చు అక్షరాల మొత్తం అనవచ్చు. యూనికోడ్ ఫాంట్ (Unicode font) అనునది పెక్కు అక్షరాలు, చిహ్నాలు, అంకెలు మొదలగు వాటితో కూడిన కంప్యూటర్ ఫాంట్.

ప్రాంతీయ భాషలలో కంప్యూటర్‌పై పనిచేయుటకు విండోస్ ఇన్‌స్టాల్ చేయునపుడు మొదట ప్రాంతీయ భాషను మనకు కావలసిన కీబోర్డ్ లేఅవుట్‌ను ఎన్నుకోవాలి. తరచుగా వాడే కీబోర్డ్‌లు రెండు రకాలు.

ఫోనెటిక్ కీబోర్డ్ (Phonetic Keyboard) – అక్షరాలు, పదాలు ఉచ్చారణ అనుసారం ఇంగ్లీషులో టైప్ చెయ్యడం.

namaste – నమస్తే	shubham – శుభం	patnam – పట్నం
kartavyam – కర్తవ్యం	patrika – పత్రిక	Dabbu – డబ్బు
pakshi – పక్షి	Rushi – ఋషి	baanamu – బాణము

ఇన్‌స్క్రిప్ట్ కీబోర్డ్ (Inscript Keyboard) – దీనిని ఉపయోగించుటకు తెలుగు వర్ణమాల.

గుణింతాలు ఎలాటైప్ చెయ్యాలో తెలిసి ఉండాలి.

అన్యథా కీబోర్డ్ లేఅవుట్‌ను స్క్రీన్‌పై పెట్టుకొని దాని సహాయంతో పనిచేసుకోవచ్చు. అవసరమైతే ఆన్‌లైన్ నిఘంటువులను సంప్రదించవచ్చును. ఈ విధంగా 'ఈమెయిల్'లో కూడా తెలుగులో టైప్ చెయ్యవచ్చును. ఇప్పుడు మీరు తెలుగులో ఒక మంచి ఉత్తరాన్ని రాసి మీ అమ్మమ్మ, తాతయ్యలకు 'ఈమెయిల్' ద్వారా పంపండి.

నేనిది నేర్చుకున్నా:

అక్షరాస్యత ప్రాధాన్యత.

నేను కూడా నిరక్షరాస్యతను తొలగించుటకు నావంతు ప్రయత్నం చేయాలని నిర్ణయించుకున్నా.

వి.సూ. రాత్రి పాఠశాలను సందర్శించి వయోజన విద్య ప్రాముఖ్యతను గ్రహించి పెద్ద పిన్నలందరూ అక్షరాస్యులయ్యేటట్లుగా ప్రోత్సహించండి.

H5F5RF

ఉపవాచకం

సంకల్పం దృఢంగా ఉంటే సాధించలేనిదేది?

మాటలతో కాదు చేతలతో చేసి చూపే.... మన అఫ్రోజ్‌షా

అఫ్రోజ్ చిన్ననాటి జ్ఞాపకాలన్నీ స్వచ్ఛమైన వర్సోవాబీచ్‌లో ఆడుకోవడంతో ముడివడి ఉన్నాయి. కానీ, తరువాత అఫ్రోజ్ వర్సోవా నుండి ముంబయిలోని వేరొక ప్రాంతానికి వెళ్ళడం జరిగింది. కొన్ని సంవత్సరాల తరువాత మరలా వర్సోవాకు తిరిగి వచ్చిన అఫ్రోజ్ తన స్వచ్ఛమైన సముద్రాన్ని కోల్పోయానని ఖిన్నుడయ్యాడు. బీచ్ అంతా ప్లాస్టిక్‌తో కూడిన చెత్తా చెదారంతో నిండి పోయింది.

అది 2015వ సంవత్సరం. సముద్రముఖంగా ఉన్న తమ వర్సోవా ఫ్లాట్ నుండి కనబడిన దృశ్యం అఫ్రోజ్‌ను దిగ్భ్రాంతికి గురిచేసి కలచివేసింది. ఎందుకనగా సముద్రము, సముద్ర తీరమంతా ప్లాస్టిక్కులు అనేక వ్యర్థ పదార్థాల దిబ్బలతో నిండి నికృష్టంగా కనబడింది. సముద్రం మనం వేసే చెత్త చెదారాలన్నింటిని మొదట తన గర్భంలోకి తీసుకొంటుంది. కాని తరువాత పైకెగసి తటిని తాకే ప్రతి అలతో కుప్పలు తెప్పలుగా ఆ చెత్తను తిరిగి తీరానికి విసురుతుంది. అలా అరేబియా సముద్రము విసిరిన చెత్తతో నిండి ఇక ఆ తీరంలో ఇసుక అనేది రేణువు మాత్రం కూడా కనిపించకుండా పోయిందంటే అతిశయోక్తి కాదు. ముందు చూపు, విచక్షణ లేని మానవులు చేసిన అధ్వాన్నపు పనులతో తీరం అంతా ప్లాస్టిక్ సంచులు, సీసాలు, బట్టలు, చెప్పులు ఒకటేమిటి అనేక రకాల నికృష్టమైన చెత్తతో నిండి పోయింది. అంత అందమైన సముద్రం జుగుప్సాకరంగా తయారైంది. ఈ ఘోరదృశ్యమే ముంబయి హైకోర్ట్ లాయర్ 'అఫ్రోజ్ షా'ను కలచివేసింది. దానితో అతడు ఒక నిర్ణయానికి వచ్చాడు. ఒక గొప్ప మార్పు తేవాలని సంకల్పించాడు. సాధారణంగా అందరూ అడిగేలా 'నాకు దేశం ఏం చేసింది?' అని ప్రశ్నించకుండా 'నేను దేశానికి నావంతు ఏమి చేశాను?' అని తనను తాను ప్రశ్నించుకున్నాడు అఫ్రోజ్.

మనము ప్రకృతి మాతతో, దేశంతో, మన భూగ్రహంతో పొగొట్టుకున్న సంబంధాలను విడదీయరానివిగా పెంచుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని

అఫ్రోజ్‌షా భావించాడు. 111 వారాల తరువాత యువ అఫ్రోజ్ తన వాలంటీర్లతో కలిసి 10, 000 టన్నుల చెత్తను తొలగించగలిగాడు. 52 సార్వజనిక మరుగుదొడ్లను శుభ్రపరిచాడు. బహిర్విసర్జన సమస్య నివారణకు కూడా ప్రయత్నించాడు. వీటిని యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్ **(U.N.E.P.)** సముద్రతీర శుద్ధీకరణలో ప్రపంచంలోని చరిత్రను సృష్టించిన మహత్కార్యంగా గుర్తించి ఉత్కృష్ట పర్యావరణ పరిరక్షణ పురస్కారమైన **'చాంపియన్స్ ఆఫ్ ద ఎర్త్'** అవార్డును అఫ్రోజ్‌కు బహుకరించింది. ఇట్టి గౌరవాన్ని పొందడంలో అఫ్రోజ్ మొట్టమొదటి భారతీయుడు. భారతప్రధాని గౌ. శ్రీ నరేంద్ర మోడిగారు అఫ్రోజ్‌షాను తన **'మన్ కీ బాత్'** సందేశంలో ప్రశంసించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి గౌ. శ్రీ దేవేంద్ర ఫడ్నవిజ్‌గారు కూడా అఫ్రోజ్‌తో స్వయంగా కలిసి స్వచ్ఛతా కార్యక్రమంలో పాలుపంచుకొన్నారు.

అతడు చేస్తున్న ఈ ప్రకృతి రక్షణ కార్యం సామాన్యమైనది కాదు. సముద్రపు అలలతో ఎగిసి వచ్చి మేట వేసుకుపోయి గట్టిగా పేరుకున్న చెత్తను తొలగించాలంటే ఎంతో అంకితభావం కావాలి. ఇట్టి చెత్తను తొలగించడానికి దానిని చేతులతోలాగాలి. ఇసుకను విదిలించాలి, చెత్తను బండ్లకెత్తాలి, ట్రక్కులకు చేర్చాలి. ఇలా మరెన్నో పనులు చేయాలి. ఇట్టి బృహత్ సంకల్పంలో అఫ్రోజ్‌కు తన పొరుగు వారైన 84 సంవత్సరాల 'హర్‌బన్స్ మాథూర్' చేయూత నిచ్చారు. దాదాపు ఒక్క నెలలోపే వర్సోవాలోని 40 మంది వీరితో చేతులు కలిపారు. వారం వారం (శని, ఆదివారాలు) క్రమం తప్పక ఈ పారిశుద్ధ్య కార్యాన్ని నిర్వహిస్తూ వచ్చారు.

మెల్లమెల్లగా ఈ పారిశుద్ధ్య కార్యం వాలంటీర్లను చకితులను చేసేరీతిలో ఒక ఉద్యమంగా రూపొందింది. ఆశ్చర్యకరంగా సినీ పరిశ్రమలోని ప్రముఖులు, పోలీసులు, లాయర్లు, పాఠశాల విద్యార్థులు, మత్స్యకారులు, రాజకీయనాయకులు ఒకరేమిటి అనేక రంగాలకు చెందిన మహామహులెందరో ఈ ఉత్తమవిధి నిమిత్తంగా వి.ఆర్.వి (వర్సోవా రెసిడెంట్ వాలంటీర్స్)తో చేతులు కలిపి ఒక్కటయ్యారు. అంతేకాదు మునిసిపల్ అధికారులు కూడా ఎస్కవేషన్ మిషన్‌లు, ట్రక్కులు, కార్మికులను ఈ 111 వారాలు నిరంతరంగా సమకూర్చారు. అఖిల భారత ప్లాస్టిక్ ఉత్పత్తి సంఘం (AIPMA) వారు కూడా ఎస్కవేటర్లు, ట్రాక్టర్లను సమకూర్చారు.

నేడు **'సముద్రపు అపరిశుభ్రత'** (మెరిన్ లిట్టర్) ప్రపంచ సమస్యగా పరిణమించింది. చిన్నచిన్న అడుగులైనా సరే ముందుకువేసి ఈ సమస్యను ఎదుర్కొనవచ్చును. పౌరుల ఆలోచనా సరళిని మార్చటం ఇందులో ఒకటి. అఫ్రోజ్‌షా శుద్ధీకరణతో పాటు జనజాగృతిని కూడా కలిగించారు. మత్స్యకారుల ఇండ్లకు వెళ్లి ఈ కాలుష్యం వలన కలిగే హానిని వారికి వివరించారు. ప్రస్తుతం వీరు, వీరి జట్టు సముద్రపాయల (creek) ద్వారా చెత్త సముద్రములోనికి కొట్టుకొని పోకుండా అరికట్టే ప్రయత్నం చేస్తున్నారు. అంతేగాక ఎంతో ప్రాముఖ్యతగల 'మేంగ్రూవ్' (Mangroove) చెట్లలో చిక్కుకున్న చెత్త, ప్లాస్టిక్కులను తొలగించుటకు ప్రయత్నిస్తున్నారు. అందుకుగాను భారతదేశమంతా ఇటువంటి జట్టులను ఏర్పరచాలనుకుంటున్నారు.

ప్రజాసమస్యలకు ప్రతి ఒక్కరు 'మనమే ఎందుకు మార్గాన్ని చూపే కాగడా (Path Blazer) కాకూడదు?' – అనే ఉద్దేశంతో ముందుకు వస్తే సహాయం ఎటునుండి అందుతుందో, ఎలా అందుతుందో గానీ ఆశ్చర్యకరంగా సమస్యపరిష్కరింపబడుతుంది అనడానికి అఫ్రోజ్‌షా మరియు వి.ఆర్.వి. ఒక ప్రత్యక్ష నిదర్శనం.

(పాఠం యొక్క సమాచారం, చాయా చిత్రాల సౌజన్యం, శ్రీ అఫ్రోజ్ షా)

అఫ్రోజ్ తన మనస్సుకు స్ఫురించిన మంచిపనిని మనస్పూర్తిగా చేస్తూ వస్తున్నాడు. కానీ ఇది తనకి ఇంత గుర్తింపును తెస్తుందనిగాని, ఇంత సంతృప్తిని ఇస్తుందనిగాని ఊహించలేదు.

– అఫ్రోజ్‌షా తల్లి శ్రీమతి నిలుఫర్ షా

పూర్తిపేరు	:	శ్రీ అఫ్రోజ్ షా
విద్య	:	LLM (గోల్డ్ మెడలిస్ట్)
వృత్తి	:	లాయరు
పురస్కారాలు	:	• ఛాంపియన్ ఆఫ్ ద ఎర్త్ యునైటెడ్ నేషన్స్ - 2016 • ఇండియన్ ఆఫ్ ద ఇయర్ 2017

వినండి – చర్చించండి – రాయండి.

I అవగాహనా కృత్యాలు :

అ) జవాబులు రాయండి.

1) వర్సోవా సముద్ర తీరంలో ఇసుకరేణువు కనిపించకుండా ఉండుటకు కారణము.

2) అఫ్రోజ్‌షా 'ఛాంపియన్స్ ఆఫ్ ద ఎర్త్' అవార్డును పొందిన కారణం.

3) అఫ్రోజ్‌షా నిర్వహించిన పారిశుద్ధ్యకార్యంలో పాల్గొన్న వివిధరంగాలకు చెందిన వ్యక్తులు.

ఆ) కింది ఖాళీలను కుండలీకరణంలోని సరైన పదాలతో పూరించండి.

(జనజాగృతి, ఖిన్నుడు, హర్‌బన్స్ మాథూర్, 4, 500)

1) అఫ్రోజ్ తన స్వచ్ఛమైన సముద్రాన్ని కోల్పోయానని _______________ అయ్యాడు.

2) అఫ్రోజ్‌షాకు తన పొరుగువారైన 84 సంవత్సరాల _______________చేయూతనిచ్చారు.

3) అఫ్రోజ్‌షా శుద్ధీకరణతో బాటు _______________ ని కూడా కలిగించారు.

ఇ) జతపరచండి.

'క' వర్గము	'చ' వర్గము
1) వర్సోవా రెసిడెంట్ వాలంటీర్	అ) U.N.E.P.
2) యునైటేడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగామ్	ఆ) జుగుప్సాకరంగా తయారైంది.
3) అందమైన సముద్రం	ఇ) అఖిల భారతప్లాస్టిక్ ఉత్పత్తి సంఘం
4) AIPMA	ఈ) V.R.V.
	ఉ) అప్రోజ్‌షా

ఈ) కింది అల్లికను పూరించండి.

వర్సోవా సముద్రతీర పారిశుద్ధ్య కార్యంలో పాల్గొన్న వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు

II అభిప్రాయ వ్యక్తీకరణ :

1) పాఠం యొక్క ఆశయాన్ని నీ సొంత మాటల్లో వ్యక్తం చేయండి.

2) పాఠంద్వారా నీవు నేర్చుకున్న విలువల్ని పట్టికగా రాయండి.

III స్వీయస్పందన :

1) నీకు ఇష్టమైన సామాజిక సేవను గురించి నీ సొంత మాటల్లో రాయి.

2) మీ ప్రాంతంలోని సామాజిక సేవాసంస్థలు బతుకమ్మ, గణేష్ నిమజ్జనము సందర్భంగా చెఱువులు కాలుష్యం కాకుండా ఉండుటకు చేపట్టిన నివారణ చర్యలను గూర్చి రాయండి.

IV లఘుటీక రాయండి :

1) అఫ్రోజ్‌షాను కలచివేసిన దృశ్యము.

2) ప్రస్తుతము అఫ్రోజ్‌షా జట్టు చేస్తున్న ప్రయత్నము.

V ప్రాజెక్టు (జట్టు పని) :

మీ పాఠశాల మరియు మీ చుట్టు పక్కల పరిసరాలలో చెత్తా చెదారం, కాలుష్యం కనిపిస్తోందా? వాటిని ఛాయా చిత్రాలలో బంధించండి. మీ పాఠశాలలో ఆ ఫోటోల ప్రదర్శన ఏర్పాటు చేయండి. ప్రదర్శనకు పాలకులను, చుట్టు ప్రక్కల ప్రజలకు కరపత్రాలకు పంచి ఆహ్వానించండి. పౌరులు మరియు మునిసిపాలిటి సహకారంతో కాలుష్య నివారణకు తగిన చర్యలు తీసుకొని అమలుపరచండి, వాటిని గురించి ఒక నివేదిక రాయండి.

వార్తావని (మ్యాన్ ఆఫ్ ద మిలేనియమ్)

మలుపు తిరిగిన జయవేల్ జీవితం.

తెలుగు వార్త, హైదరాబాద్: 'అయ్యో! పాపం పసివాడు' అన్పిస్తుంది. ఆ బాలుడ్ని చూస్తే. మూడేళ్ళయినా నిండని జయవేల్ వీధుల్లో అడుక్కుంటున్నాడు. కానీ అదృష్టవశాత్తు పొడసూపిన ఓ వెలుగు రేఖ, ఆ బాలుని మార్గాన్ని మార్చి బ్రిటన్‌లోని గ్లిండర్ యూనివర్సిటీ వరకు పయనింపజేసింది. ఆ అదృష్టం అతనిని వీధి బాలలపై డాక్యుమెంటరీ నిర్మిస్తున్న ఉమ, ముత్తురామ్‌ల కంట బడేలా చేసింది. చిన్నప్పటినుండే సేవానిరతులైన ఆ దంపతులు ఆ పిల్లవాడ్ని తమ 'సుయమ్ చారిటబుల్ ట్రస్ట్' నడిపే ''సిరగు మాంటిస్సోరి స్కూల్లో'' చేర్పించారు. పన్నెండో తరగతి వరకు అక్కడే చదువుకున్న జయవేల్ తరువాత ''గ్లిండర్ విశ్వవిద్యాలయం''లో సీటు సంపాదించి ''పెర్‌ఫార్మెన్స్ కార్ ఎన్‌హాన్స్‌మెంట్ టెక్నాలజీ ఇంజనీరిగ్''లో పట్టభద్రుడయ్యాడు. అడ్వాన్స్‌డ్ కోర్స్‌కోసం ఇటలీలోని ఒక విద్యాసంస్థకు దరఖాస్తు చేశాడు.

మ్యాన్ ఆఫ్ ద మిలేనియమ్

మీవార్త-దినపత్రిక, విజయవాడ : పాలం కళ్యాణసుందరాన్ని గౌరవించిన అమెరికా ప్రభుత్వం.

సాధారణ జీవనశైలి. అసాధారణ ఆలోచనాసరళి అంటారే దానికి ప్రత్యక్ష తార్కాణం శ్రీ పాలం కళ్యాణసుందరం. నిస్వార్థ సేవకు ప్రతీకయైన గాంధేయవాది. ఈయన ముప్పై సంవత్సరాలు గ్రంథాలయాధికారి (లైబ్రేరియన్)గా పనిచేశారు. పనిచేయటం పారిపాటే. అది చాలా మంది చేసేపనే. కానీ ఈయన తన సర్వీసు మొత్తంలో ప్రతినెలా వచ్చే జీతమంతా అనాథలను, అభాగ్యులను ఆదుకోవడానికి వెచ్చించారు. మరయితే ఈయన ఎలా జీవించేవారంటూరా! తన జీవనాధారానికి హోటల్‌లో సర్వర్‌గా పనిచేసేవారట. ఇప్పటికీ తన పెన్షన్‌ను కూడా అలాగే దానం చేస్తున్నారు దీన జన బాంధవుడు. ప్రపంచం మొత్తంలో ఇలా తన ఆదాయాన్నంతా



సమాజసేవకై వినియోగించినవారిలో ఈయనే ప్రథముడు. ఈ నిస్వార్థ సేవాపరాయణుని సేవలను గుర్తించిన అమెరికా ప్రభుత్వం ఈయనకు 2000 సం.లో 'మ్యాన్ ఆఫ్ ద మిలేనియం' అవార్డునొసగి సత్కరించింది. ఈ అవార్డు పారితోషికం మొత్తాన్ని (6.5 మిలియన్ డాలర్స్) కూడా ఇతరులను అదుకోవడానికే వెచ్చించాడీ మహనీయుడు. వీరి సేవాతత్పరతకు చలించిన ప్రసిద్ధ చలనచిత్ర నటుడు రజనీకాంత్‌గారు ఇతనిని తన తండ్రిగా దత్తత స్వీకరించారు. తనకు కావలసింది ఆప్యాయతే గాని ఆర్థిక పరమైన లాభంకాదు. కాబట్టి ఆవిధంగా ఏమీ చేయకూడదన్న షరతులపై అంగీకరించారట కళ్యాణ సుందరం. కళ్యాణ సుందరంగారికి ప్రస్తుతం 78 ఏళ్ళు. అయినా తన పంథాలోనే కొనసాగుతున్నారు.

నాటినుండి - నేటి వరకు....

పఠనం

''యత్ర నార్యస్తు పూజ్యతే, రమంతే తత్రదేవతాః........

ఎక్కడైతే స్త్రీలు గౌరవింపబడతారో అక్కడ దేవతలు నివసిస్తారు అని స్త్రీల యొక్క ఔన్నత్యాన్ని కొనియాడారు. కాని తరువాతి కాలంలో స్త్రీలకు విద్యార్హత కల్పించక, వారిచుట్టూ అనేక సాంఘిక బంధనాలను బిగించారు. అందుకే సావిత్రిబాయిపులే, కందుకూరి వీరేశలింగం వంటి సంఘ సంస్కర్తలు స్త్రీల కొరకు పోరాడి, వారి అభివృద్ధికి పాటుపడవలసి వచ్చింది. స్త్రీ, పురుషులిరువురు సమానులే, సంఘానికి ఇరువురి ఆవశ్యకతా ఉన్నదని గుర్తించాలి. అన్ని రంగాలలో స్త్రీలకు కూడా సమాన హక్కులు కల్పించాలి. మనం కూడా ఇంటా-బయటా మనవంతు కర్తవ్యం నిర్వర్తించాలి. స్త్రీ-పురుషులే కాదు అందరినీ గౌరవించాలి.

ఇప్పుడు కింది నారీమణుల గురించి తెలుసుకుందాం.

దుర్గాబాయి : 1927 సంవత్సరంలో గాంధీజీ కోటిరూపాయల నిధి సేకరణ చేస్తూ ఆంధ్ర పర్యటనకు వచ్చారు. దుర్గాబాయి కస్తూరి నిధికి వేలాది రూపాయలు వసూలు చేసి ఇచ్చారు. ప్లానింగ్ కమీషన్ మెంబరుగా, లాయరుగా ప్రాక్టీసు చేస్తూనే ఎనలేని సంఘసేవ చేశారు.

లక్ష్మీసైగల్ : అరవైయేళ్ళ కిందటే తుపాకి చేతపట్టి ఆంగ్లేయుల నెదిరించిన వీరవనిత కెప్టెన్ లక్ష్మీసైగల్. స్వరాజ్యం వచ్చాక కూడా డాక్టర్ వృత్తి చేపట్టి పేద ప్రజలకు ఎనలేని సేవ చేశారు. ఒకనాడు కొందరు యువకులు ఒక అమ్మాయిని అల్లరి పెడుతుంటే అక్కడి వాళ్ళు ఎవరు నోరు విప్పలేదు. కాని మన లక్ష్మీసైగల్ 80 ఏళ్ళ వయస్సులో కూడా ముందుకు దూకి వాళ్ళకు బుద్ధి చెప్పారు. ఇట్టి వీరవనితల గురించి తెలుసుకోవడం, నేర్చుకోవడం ఎంతో ఆవశ్యకం.

ప్రాంజల్ పాటిల్ : ''మనసుంటే మార్గముంటుంది'' అన్న విషయాన్ని 26 ఏళ్ళ ప్రాంజిల్ పాటిల్ ఋుజువు చేసింది. ఆమె మహారాష్ట్ర, థాణె జిల్లా, ఉల్హాస్ నగర్‌లో జన్మించింది. పుట్టినపుడు చూపున్నా, ఆరేళ్ళ వయస్సులో చూపును పూర్తిగా కోల్పోయింది. అయినప్పటికి బ్రెయిలీ విధానంలో విద్యాభ్యాసం మొదలుపెట్టి ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం నుండి ఎమ్.ఏ.డిగ్రీ పొందడం వరకు కొనసాగించింది.

ప్రాంజిల్ డిగ్రీ చదువుచున్నప్పుడు I.A.S. గురించి విని మక్కువ పెంచుకుంది. 'జాజ్ ఆక్సెస్ విత్‌స్పీచ్', 'రిఫ్రెషబుల్ బ్రెయిలీ డిస్‌ప్లే' మొదలగు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని సివిల్ సర్వీసెస్‌కు సన్నద్ధమైంది. కోచింగ్ క్లాసెస్ సహాయం లేకుండానే 'యు.పి.ఎస్.సి. (UPSC) పరీక్షలలో 773వ ర్యాంకుతో బ్రహ్మాండమైన విజయం సాధించింది.

మిథాలీ రాజ్ : మిథాలీ రాజ్ భారతదేశపు క్రికెట్ క్రీడాకారిణి. ఆమె విద్యాభ్యాసం హైదరాబాద్‌లో జరిగింది. 10 ఏళ్ళ వయస్సులో ఆడటం మొదలు పెట్టి 17 ఏళ్ళ వయస్సులోనే ఆమె భారతజట్టుకు ఎంపికయ్యింది.

మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన క్రీడాకారిణిగా మరియు ఓడిఐ (ODI) లలో 6000 పరుగులు సాధించిన ఏకైక మహిళా క్రికెటర్‌గా పేరుపొందింది. అర్జున అవార్డు కాక, అతిపిన్న వయస్సులోనే పద్మశ్రీ పురస్కారాన్ని కూడా అందుకొని తోటి క్రీడాకారిణులకు ఆదర్శంగా నిలిచింది.

9 బయలు బతుకు

నేపథ్యం

- 'బడి బయట పిల్లలు' అనే మాట విన్నారా! వీరినే ఆంగ్లంలో 'out of school children' అని, మరాఠీ భాషలో 'शाळा बाहेरचे मुले' అని అంటారు.
- పిల్లలు బడికి పోలేకపోవడానికి కారణాలేంటి? చర్చించండి.

ఇప్పుడు అంబల్ల జనార్ధన్‌గారు భవన నిర్మాణ పనివారి ఇక్కట్లు, ఇబ్బందులు, కోరిక కళ్ళకు కట్టినట్లు దృశ్యమానంగా ఎలా చిత్రించారో... ఆలస్యమెందుకు? వెంటనే తెలుసుకుందాం. తెలుసుకొని సమాజాన్ని సమానుభూతితో చూసి స్పందించడం అలవరచుకుందాం.

మలాడ్! బొంబాయిలోని ఓ ఉపనగరం.

అక్కడో పన్నెండు అంతస్థుల భవనం. కట్టడం పని చురుకుగా సాగుతోంది. ఇటుక కట్టడం అయిపోయింది. ప్లాస్టరింగ్ వర్క్ నడుస్తోంది. ఇసుకా సిమెంట్ మిక్స్చర్‌లో కలుపుతున్నారు. ఆ మిశ్రమాన్ని ఆడకూలీలు ఇనుప బొచ్చెల్లో తీసుకెళ్ళి మేస్త్రీలకు అందిస్తున్నారు. వారు గోడకి చల్లి చదును చేస్తున్నారు.

పండే కోటేరు అంటే ఏంటి?

ఆ బిల్డింగ్‌కి ఆనుకునేలా కట్టిన కర్రల స్టాండుపై నిలబడి వారు తమ పనిని వేగంగా చేసుకుపోతున్నారు.

ఆ ఇనుప బొచ్చెలు ఒకరి చేతులనుండి మరొకరి చేతుల్లోకి మారి మేస్త్రీకి చేరటం అపూర్వ దృశ్యంలా ఉంది. దూరం నుండి చూస్తుంటే ఓ హిందీ గీతం తలపుకొస్తోంది.

''సాథీహాత్ బఢాన సాథిరే''

ఒంటి గంటయ్యింది. పనివారంతా భోజనానికి దిగారు. మల్లమ్మ, పోశెట్టి ఆ బిల్డింగ్‌లోనే సగం కట్టిన ఓ గదిలో ఉంటారు.

మల్లమ్మ మామూలు కూలీ అయితే పోశెట్టి తాపీ మేస్త్రీ.

రాత్రి మిగిలిన చేపల పులుసుతో అన్నం తింటున్నారు. వారి కొడుకు రమేష్ బడికి వెళ్ళాడు. వాడికి ఆరు సంవత్సరాలు. తర్వాత ఓ అమ్మాయి రుక్మిణి, నాలుగో సంవత్సరం నడుస్తోంది. తల్లీ తండ్రి పనిచేస్తుంటే రుక్మిణి మిగతా పిల్లల్తో చేరి మట్టిలో ఆడుకుంటోంది. ''ఇంకో నెలలో బిల్డింగు పని పూర్తయితుందట గదా మల్లీ! ఇంక మనం మలబార్ హిల్‌కి పోవాలె... శేటు బిల్డింగ్ కూలగొట్టి

కట్టుకుంటున్నాడు. ఈడ పనయినంక ఆడ సురూజేత్తడట. మనం ఆయన దగ్గర వచ్చే పదేండ్ల నుంచి పని జేత్తున్నం గదా, మనమంటే ఆయనకు నమ్మిక. మనని ఆడ బయటి రూం (ఔట్‌హౌస్)లో వుండి పనిచేస్తూ దేక్‌రేక్ జేయుమన్నడు'' అన్నాడు పోశెట్టి.

''ఇట్ల ఎన్నేండ్లు తిరుగుదం. యాడన్న ఒక జోపిడి (గుడిసె) సూడరాదా'' మల్లమ్మ.

''జోపిడంటే మాటలా. ఎంతలేదన్నా డెబ్బై, ఎనభైవేలు కావలె. యాడికెల్లి తీసుకద్దాం?''

''రమేశ్ పెద్దగయితున్నడు. ఇట్ల వూకూకె తిరుగుతె ఆడి సదువు కరాబుగాదా ఒచ్చే యాడాది బుజ్జిని గూడా ఇస్కూలుకి పంపాలి.''

''ఈ పరీచ్చలయిందాకా ఓల్ల దగ్గరున్న వుంచాల ఆనంక అటు యాడన్న సూడాల'' అన్నాడు పోశెట్టి.

''నేననేది ఈ యాడాది మాటగాదు. ఎప్పటి కోసరం. మలబార్‌హిల్ కెల్లి మాలాడ్ రావాలంటే రెండు గంటలు పడుద్ది. పొల్లగాడు వత్తడా. ఆడనేమో తెలుగు ఇస్కూలు లేదాయె నా కొడుకును నేనోల్ల దగ్గర ఉంచనయ్యా.''

''బొంబాయిలో యాడ గుడిసె దీసుకున్నా మనకు తకిలబ్ అయితది. మన ఇంటి దగ్గరే పని దొరుకాల్లా! ఇదే మంచిగున్నది. మన పని వున్న తాటనే ఉండేన్కి దొరుకుంది. ఇక మరాఠి ఇస్కలు జేరిపియ్యాల. అవి అన్ని తాట్ల వుంటాయి.''

''మన కొడుక్కు మనబాస రాకుంటే ఎట్ల'' అంది మల్లమ్మ.

పోశెట్టి మాట్లాడలేదు. మల్లమ్మే అంది.

''ఆకరుకు కారటు సదెతందుకు రావాలెగదా. బుజ్జినయితే తెలుగు ఇస్కూల్లనే ఎయ్యాల.''

''ఇగో మనం బతికేదే ముస్కిలున్నది. ఇగ ఇల్లు గావాల, పిల్లగాండ్లకు సదురావాల అంటే యాడ కుదురుతది?'' చిరాగ్గా అన్నాడు పోశెట్టి.

''గీడ మలాడ్ల యాభై ఏల లోపు జోపిడి దొరుకుతదట. ఈ శేటు దగ్గర పని విడిసిపెట్టుదం. 'నాక' మీద నిలుసుంటే పని దొరుకదే?'' (బొంబాయిలో నాకా లేబర్ అని వుంటారు. వారు దాదాపు ప్రతి రైల్వే స్టేషన్ దగ్గర పొద్దున్నే నిలుచుంటారు. చిన్న చిన్న కాంట్రాక్టర్లూ, చిన్న చిన్న పనులు చేయించుకునేవారు ఆ రోజు కూలీ రేటు మాట్లాడుకుని తీసుకువెళ్తారు. అయితే అన్ని రోజులూ పని దొరుకుతుందని గ్యారంటీ లేదు. దొరికినా కూలీ రేటు గిట్టుబాటు కాకపోవచ్చు. డిమాండ్ మరియు సప్లై బట్టి కూలీ ధర మారుతుంటుంది.)

''లగ్గం కాక ముందు 'నాక' మీదనే

నిల్చుండేటోన్నిగదా. నెలకు పదిహేను రోజులు పని దొరుకుతె బాగాయె. తుట్టికి పావుశేరు అడుగుతరు'' అన్నాడు పోశెట్టి.

''మన జిందగీ ఇట్లనే పాయె. మన పోరగండ్లనన్నా సదివిస్తే, ఆల్లకు గొంచెం ముందట దారి దొరుకుతది. నాకైతే మన పిల్లలకు తెలుగు రావాలె అని కాశ్ (కోరిక) వున్నది. మన తెలుగోల్లకు తెలుగు రాకపోతెట్లా.''

మాతృభాషాభిమానాన్ని పెంపొందించుకోవలసిన ఆవశ్యకత ఏమిటి?

''మనండ్ల పెద్ద పెద్ద సదూకున్నోల్ల పిల్లగాండ్లకు కూడా తెలుగురాదు. అందరు ఇంగ్లీషు ఇస్కూల్లకు ఎగబడుతున్నారు. నువ్వేమో తెలుగును బట్టుకుని యాళ్లాడుతున్నావ్. అసలు సదువు సెప్పించేదే గగనం వుందంటే ఇంక నువ్వు తెలుగు ఇస్కూలుకే పంపియ్యలంటవు.''

''నువ్వేమన్నా అనయ్యా, నాకో గుడిసె జూసి వుంచు. నేను నా పిల్లగాండ్లను బట్టుకుని ఎట్లన్న బతుకుత. ఆవుసున్నంతసేపు మందికి ఇండ్లు కట్టుకుంట. పిల్లి తన పిల్లల్ని తింపినట్టు నేను నా పిల్లల్ని పదిండ్ల తింప. నువ్వు యాడ పనిజేసినా పొద్దూకెవరకు ఇంటికత్తెసాలు.''

సంభాషణ అంతటిదో ముగిసింది. రెండు గంటలు కొట్టారు. తిరిగి పనిలోకి వెళ్లారు. ఆ రాత్రి పోశెట్టి ఆలోచించడం మొదలుపెట్టాడు.

మొదట్లో ఏదో ఉబుసుపోకకు అంటున్నదనుకున్నాడు. కాని తన భార్యకి ఇంత పట్టుదలగా వుందని తెలియదు. మల్లమ్మ మాటలు కూడా నిజమే కదా! కొన్ని వందల 'ఇండ్లు' కట్టినా వెనక్కి తిరిగితే ఏముంది? ఇంటి వారి కంటే ముందు తామే ఉంటున్నామని ఇన్నాళ్లూ చంకలు గుద్దుకోవటమే గాని ఇదంతా భ్రమకదూ? ఫుట్‌పాత్‌పై డేరా వేసుకున్నవాడికి కూడా తనది అనే ఓ గూడుంది. వారిని గవర్నమెంటు కూడా ఖాళీ చేయించలేదు. గట్టిగా చేయించినా ఇంకోచోట చూపిస్తుంది. మరి తనో!

ఇలానే ఆర్నెల్లకో సంవత్సరానికో కట్టే బిల్డింగు మారినప్పుడల్లా ఇల్లు మారాల్సిందే. అన్నీ తనవే. తన ఇండ్లే. అయితే ఏదీ తనది కాదు.

పాఠశాలకు వెళ్ళలేని పిల్లలకు నువ్వు ఏ విధంగా చదువుకునేందుకు సహాయం చేస్తావు?

మల్లమ్మ అన్నట్లు వెంటనే గుడిసె చూడాలి. అవసరమైతే శేటును బతిమాలి కొంత అప్పు తీసుకోవాలి, మల్లమ్మనీ, పిల్లలను ఆ ఇంట్లో ఉంచి, తనుఎక్కడ పనుంటె అక్కడికి వెళ్ళాలి. రాత్రికి ఇంటికి చేరుకోవాలి. ఇదంతా కష్టమే. కానీ తనవారికి ఓ గూడు దొరుకుతుంది. మల్లమ్మకి ఏదో పని దొరక్కుండా పోదు.''

అలా అనుకోగానే పోశెట్టి మనసు శాంతించింది.

మల్లమ్మకి తన నిర్ణయం చెప్పాడు.

మల్లమ్మకెందుకో కళ్ళు చెమర్చాయి.

రాత్రంతా వారిద్దరికీ కలలు. కలలోనే కలవరింతలు.

రచయిత పరిచయం : శ్రీ అంబల్ల జనార్ధన్ గారు నిజామాబాద్ జిల్లాలోని ధర్మోరా గ్రామములో 1950 నవంబరు 9న జన్మించిరి. వీరి తల్లిదండ్రులు శ్రీ అంబల్ల చిన్న నర్సయ్య, శ్రీమతి అంబల్ల నర్సవ్వ. వీరు బొంబాయిలోని ఆంధ్ర ఎడ్యుకేషన్ సొసైటి పాఠశాలలో చదివారు. దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ నుండి పదవీ విరమణ పొందారు.

1993 నుండి కథలు రాస్తున్న అంబల్ల జనార్ధన్‌గారు ఆంగ్లంలోను, వివిధ విషయాల మీద వ్యాసాలు రాసి ప్రచురించారు. బొంబాయి కథలు, బొంబాయి నానీలు మొదలగునవి వీరి రచనలు. వీరి శైలి సహజ సుందరంగా, సరళంగా, పాఠకుల హృదయాలను హత్తుకొనేటట్లు వుంటుంది.

ప్రస్తుత పాఠ్యభాగం వీరు రచించిన 'అంబల్ల జనార్ధన్ కథలు' నుండి గ్రహించబడినది.

I వినండి - సంభాషించండి.

1) కొంతమంది పిల్లల చదువెందుకు ఆగిపోతుంది?
2) బ్రతుకు తెరువుకోసం దూరప్రాంతాలకు వచ్చిన వారిపిల్లల సమస్యలు ఎలా ఉంటాయో చర్చించండి.

II చదవండి - ఆలోచించండి - రాయండి.

పదజాలాన్ని పెంపొందించుకుందాం.

బొచ్చె = ఇనపగంప; ఆనంక = తరువాత; గగనం = ఆకాశం;
కాశ్=కోరిక; అవుసున్నంతసేపు = ప్రాణమున్నంతవరకు

III వినండి - చర్చించండి - రాయండి.

అ) జవాబులు రాయండి.

1) మలాడ్ ఉపనగరమందు భవనకూలీలు పని చేయు విధము.
2) మల్లమ్మ, పోశెట్టి దంపతుల సంభాషణ.
3) మల్లమ్మ తనపిల్లలకు తెలుగులో చదువు చెప్పించడానికి పడ్డ ఆరాటం.
4) పోశెట్టి మనసు శాంతించిన విధం.

ఆ) ఎవరు, ఎవరితో అనిరి.

1) ''ఇంక మనం మలబార్ హిల్‌కి పోవాలె.....''
2) ''యాడన్న ఒక జోపిడి (గుడిసె) సూడరాదా''
3) ''నాకైతే మన పిల్లలకు తెలుగురావాలె అని కాశ్ వున్నది.''
4) ''అందరు ఇంగ్లీషు ఇస్కూల్లకు ఎగబడుతున్నారు.''
5) ''ఇదిగో మనం బతికేదే ముస్కిలున్నది.''
6) ''మన జిందగీ ఇట్లనేపాయె.''

ఇ) కింది ఖాళీలను సరైన పదాలతో పూరించండి :

1) ఇంకో నెలలో ____________ పని పూర్తయితదట.
2) మలబార్ హిల్‌కెళ్లి మలాడ్ రావాలంటే ____________ పడుద్ది.
3) నెలకు ____________ రోజులు పని దొరుకుతె బాగాయె.
4) అందరు ____________ ఇస్కూల్లకు ఎగబడుతున్నారు.

ఈ) కింది వాక్యాలలోని తప్పొప్పులను గుర్తించండి.

1) ఒచ్చేయాడాది బుజ్జిని గూడా ఇస్కూలుకి పంపాల. (   )
2) గీడ మలాడ్ల డెబ్బై ఏల లోపు జోపిడి దొరుకుతదట. (   )
3) నాకైతే మన పిల్లలకు ఇంగ్లీషు రావాలె అని కాశ్వున్నది. (   )
4) మల్లమ్మ కెందుకో కళ్ళు చెమర్చాయి. (   )

ఉ) జతచేయండి.

	'క' వర్గము		'చ' వర్గము
1)	నా పిల్లగాండ్లను పట్టుకొని	[ ]	అ) తాపీ మేస్త్రీ
2)	పోశెట్టి	[ ]	ఆ) ఇనపగంప
3)	మల్లమ్మ	[ ]	ఇ) ఎట్లన్న బతుకుత
4)	బొచ్చె	[ ]	ఈ) మాములు కూలీ.

ఊ) కింది అల్లికను పూరించండి.

బొంబాయిలో నాకా లేబర్

IV స్వీయస్పందన:

మల్లమ్మ, పోశెట్టి దంపతుల సంభాషణను మీ సొంత మాటల్లో రాయండి.

V భాషావగాహన :

అ) కింది పదాలకు వ్యతిరేక పదాలు రాయండి.

1) పూర్వము × ____________ 2) వెనుక × ____________

3) వేగము × ____________ 4) అబద్ధము × ____________

ఆ) వచనం మార్చి రాయండి.

1) అంతస్థు = ____________ 2) కూలీలు = ____________

3) గంటలు = ____________ 4) గూడు = ____________

ఇ) ఏ వాచకములో రాయండి.

1) భార్య = ____________ 2) కొడుకు = ____________

3) మల్లమ్మ = ____________ 4) గుడిసె = ____________

ఈ) ఏ కాలములకు చెందినవో రాయండి.

1) సంభాషణ అంతటితో ముగిసింది. [ ]

2) శేట్ బిల్డింగ్ కూలగొట్టి కట్టుకుంటున్నాడు. [ ]

3) వారిని గవర్నమెంటు కూడా ఖాళీ చేయించలేదు. [ ]

4) రాత్రి మిగిలిన పులుసుతో అన్నం తింటున్నారు. [ ]

ఉ) కింది పదాలను విడదీసి సంధిపేరు రాయండి.

1) వారంతా = ____________ ____________

2) పదేండ్లు = ____________ ____________

3) మారినప్పుడు = ____________ ____________

4) దొరుకుతుంది = ____________ ____________

ఊ) కింది పట్టికను పూరించండి.

పదము	విగ్రహవాక్యము	సమాసనామము
1)	కర్రల యొక్క స్టాండు.	
2) అపూర్వము		
3)	చిన్నవైన పనులు	
4) పదిహేను రోజులు		

ఋ) కింది వాక్యములు సామాన్య/సంశ్లిష్ట/సంయుక్తములలో ఏరకమునకు చెందినవో గుర్తించి రాయండి.

1) ఇటుక కట్టడం అయిపోయింది ____________________

2) ఎంతలేదన్నా డెబ్బై, ఎనభైవేలు కావాలె ____________________

3) మల్లమ్మని, పిల్లలను ఆ ఇంట్లో వుంచి తను ఎక్కడ పనుంటే అక్కడికి వెళ్ళాలి. ____________

4) మనమంటే ఆయనకు నమ్మిక ____________________

5) ఆ మిశ్రమాన్ని ఆడకూలీలు ఇనుప బొచ్చెల్లో తీసుకెళ్ళి, మేస్త్రీలకు అందిస్తున్నారు.____________

ౠ) కింద గుర్తింప బడిన ప్రత్యయాలు ఏ విభక్తులకు చెందినవో రాయండి.

1) వారు పులుసుతో అన్నం తింటున్నారు. [ ]

2) నాకైతే మన పిల్లలకు తెలుగు రావాలె. [ ]

3) నువ్వేమా తెలుగును బట్టుకొని యాళ్ళాడుతున్నావ్. [ ]

ఎ) కింది వాక్యములో గుర్తింపబడిన పదాలు ఏభాషాభాగములకు చెందినవో రాయండి.

బొంబాయిలో యాడ గుడిసె దీసుకున్నా మనకు తకిలెబ్ అయితది.

[ ] [ ] [ ]

ఏ) కింది పదాల ప్రకృతులకు వికృతులు, వికృతులకు ప్రకృతులు రాయండి.

1) సదువు = ____________ 2) భ్రమ = ____________

3) పరీచ్ఛ = ____________ 4) బాస = ____________

5) సాలు = ____________

VI సృజనాత్మకత :

1) మహారాష్ట్రలో చక్కెర కర్మాగారాలలో పనిచేయువారి పిల్లల విద్యాభ్యాసము గూర్చి రాయండి.

2) భవననిర్మాణ కూలీల ఇక్కట్లు, కోరికలను గూర్చిరాయండి.

జీవనోపాధి కొరకు పిల్లల్ని పనులకు పంపడం లేదా పెద్దలు పనికెళితే తమకన్నా చిన్ని చెల్లెలు లేదా తమ్ముడ్ని చూసుకోవడంకోసం బడికి పంపక పోవడంవల్ల చాలామంది పిల్లల చదువు ఆగిపోతుంది. ఇట్టి వారికొరకు వారున్న చోటికే అంటే ఫుట్‌పాథ్, భవన నిర్మాణ స్థలాలు, కార్ఖానాలకు వెళ్ళి చదువు నేర్పడం కొరకు ముంబయిలో 1989లో ఈ డోర్‌స్టెప్ స్కూల్ ఏర్పడింది.

ఇటువంటివే 'స్కూల్ ఫర్ బ్రిక్ కిల్న్ (Brick kiln) చిల్డ్రన్, సాఖర్ శాళా మొదలగునవి. వీటి గురించిన మరిన్ని వివరాలు ఉపాధ్యాయుల సహాయంతో అంతర్జాలంలో చదివి తెలుసుకోండి.

VIII లేఖన కౌశల్యాలు :

నివేదిక లేఖనం :

మీ పాఠశాలలో జరుపుకున్న **'పఠనప్రేరణా దినోత్సవం'** గూర్చి కింది అంశాల ఆధారంగా నివేదిక రాయండి.

అంశాలు
- డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాం జన్మదిన సందర్భం.
- అబ్దుల్ కలాంగారి గురించి ఉపన్యాసం.
- వివిధ రకాల పుస్తకాల పఠనం.
- నేను చదివిన పుస్తకాలు.
- నాకు నచ్చిన కథ.

చదువుకుందాం - చకితులమౌదాం

- మీకు తెలుసా! తెలుగు భాషకు దాదాపు ముప్పయి మాండలికాలు వాడుకలో ఉన్నాయి.
- మారిషస్‌లో రేడియో, టీవీలలో తెలుగు కార్యక్రమాలు ప్రసారమవుతుంటాయి.
- బెంజమిన్ షుల్జే అనే పోర్చుగీసు మతగురువు తొలిసారిగా బైబిల్‌ను తెలుగులోకి అనువదించాడట.
- మయన్మార్ రాజధాని యాంగల్‌లో ఒక తెలుగు గ్రంథాలయం ఉంది దాని పేరు. **'శ్రీయోగి వేమన గ్రంథాలయం'.**
- అలాగే మయన్మార్‌లోని ఒకవీధికి అతిపెద్ద నగరాలలో ఒకటైన మాలమ్యీన్‌లో 'మల్లెమాల దిబ్బ' అనే అచ్చతెలుగు పేరు ఉన్నది.

నేనివి నేర్చుకున్నా :

1. దిన, మాస పత్రికలలోని కథలు, వ్యాసాలు చదివి అవగాహన చేసుకోవటం.
2. మాతృభాషపై మమకారం పెంచుకోవాలి.

ఉ.సూ. వివిధ మాండలికాలను విద్యార్థులకు పరిచయం చేయండి.

H5P1T3

బళ్లారిలో గాంధీజీ

మర్రి చెట్టుకు ఎన్నో కాయలు కాస్తాయి. వాటిలో కొన్నే పండుతాయి. ఆ పండిన వాటిలోను కొన్ని పండ్ల విత్తులే మొలకెత్తుతాయి. అలాటి మొలకలలో కొన్ని ఎదుగుతాయి. అలాటి వాటిలోను కొన్నే బాగా ఎత్తుగా పెరుగుతాయి. వేసవిలో ఎండలకు బాధపడే వారు తమ తాపం పోగొట్టుకొనడానికి ఎత్తుగా పెరిగిన చెట్లు చూచి నీడ కోసం వాటివైపు పరుగులు తీస్తారు.

‘‘ఏదో ఒకనాడు మనకు స్వరాజ్యం లభిస్తుంది. స్వరాజ్యం మనకు ఎన్నటికీ దానంగా లభించదు. బ్రిటిష్‌వారు ఎంత స్వాతంత్ర్యప్రియులైనప్పటికీ, స్వాతంత్ర్యానికై స్వయంకృషి చేయని వారికి స్వాతంత్ర్యాన్ని ఎన్నటికీ దానంగా ఇవ్వరు.

దక్షిణాఫ్రికా నుంచి వచ్చిన తర్వాత 1916లో కాశీ విశ్వవిద్యాలయానికి వైస్రాయి హార్డింగ్ ప్రారంభోత్సవం చేసినప్పుడు గాంధీజీ చేసిన ప్రసంగంలోని భాగమిది. ఇప్పుడది మనకు సాధారణ వార్తగా కనిపిస్తుందేగాని, అంత వరకు ఈ విధంగా ప్రసంగించిన భారతీయుడు లేడు. ఈ విధంగా ప్రసంగించడం నా చిన్నతనంలో మహాసాహసం.

మాతాతగారు వాళ్ళంతా తిలక్ అనుయాయులు గదా! గాంధీజీని గురించి మొదట్లో అంతగా మాట్లాడేవారు కాదట. కాని, నాకు ఆరేడేళ్ళు వచ్చేవేళకు గాంధీజీని గురించి చాలా వినేవాడిని. అప్పుడు తెలుగువాళ్లకు ఉన్న ఏకైక పత్రిక ఆంధ్రపత్రిక – గాంధీజీని గురించి గొప్పగా వ్రాసేది. నాకు అవన్నీ అర్థమయ్యేవి కాదుగాని, బొమ్మలు చూసి సంతోషించేవాడిని. అప్పుడు గాంధీజీ వేషం ఊరిలో ఉన్న మార్వాడీ గుజరాతీ సేఠ్‌ల వేషంలాగ ఉండేది. తల మీద కోర తలపాగా, గుండె కిందుగా బొందులతో ముడి వేసిన చొక్కా, ధోవతి, ఆకు చెప్పులు. కోలాచలం వెంకటరావుగారు మాఇంటికి వచ్చినప్పుడు, అప్పుడప్పుడు ఆయన సంభాషణలో గాంధీజీ ప్రస్తావన వచ్చేది. ఆయన దక్షిణాఫ్రికా అనే దేశంలో బ్రిటిష్ వారిని ఎదిరించడం, కోర్టులలో తానే తన సంగతి వాదించుకోడం, అక్కడ సంపాదించిందీ, బహుమతులుగా వచ్చిందీ అంతా ఒక ధర్మనిధికి అప్పగించి దాని మీద వచ్చే వడ్డీని ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించే ఏర్పాటు చేశారని ఇంకా ఇలా ఎన్నో చెప్పుకొనేవారు.

గాంధీజీ దేశ పరిస్థితులను తెలుసుకొని సహాయ నిరాకరణోద్యమం ప్రారంభిద్దామనే దృష్టితో యావద్భారత పర్యటన చేస్తూ, 1921లో కాబోలు, బళ్ళారి వస్తారని జనం చెప్పుకుంటున్నారు. ఆంధ్ర పత్రికలోను ఆయన పర్యటన కార్యక్రమం చదివాను. మనజిల్లా ప్రధాన పట్టణానికి వస్తున్నారు గదా, తప్పక వెళ్లి చూడాలనే వాంఛ కలిగింది. మా అమ్మకు ఈ సంగతి చెప్పాను. ‘‘తాతగారిని అడుగు. పిలుచుకొని వెళ్లితే వెళ్ళు’’ అన్నది. తాతగారు వెళ్లుతున్నట్లు ఆమె మాటలవల్ల తెలిసింది. నా కోసం ప్రత్యేకంగా ప్రయాణం చేయనక్కరలేదు. కనుక తాతగారిని బ్రతిమాలితే కాదనరు అనే అభిప్రాయం కలిగింది. మా వూరి నుంచి దాదాపు వంద మంది వెళ్ళుతున్నట్లు తర్వాత తెలిసింది. తాతగారిని అడిగాను. ‘‘వేలమంది జనం వస్తారు. బస చేయడానికి కూడా బంధువులు ఉన్నారు. గనుక మనకాబాధ లేదనుకో, ఆగుంపులో నీవు తప్పిపోతే నేను వెదగ్గలనా?’’ అంటూ మొదట్లో ఆత్మగతంగా అనుకున్నారు. కాని తక్కిన పెద్దలంతా నన్ను కనికరించి ఇబ్బంది ఏమీ ఉండదని అనడం వల్ల అంగీకరించారు.’’

మేము బళ్ళారి రైలు స్టేషనులో దిగాము గాంధీజీ రాకకు ఒక రోజు ముందే. నేను అంతకు ముందు బళ్లారి మీదుగా రెండు మూడుసార్లు రైల్లో ప్రయాణం చేశాను. రైలు స్టేషను ద్వారాలకన్నిటికి బంతిపూల దండలు, ఒక్కొక్క చోట నిత్యమల్లి దండలతో గాంధీజీకి స్వాగతం చెబుతూ నినాదాలతో పతాకాలు!

మా తాతగారు కోర్టు వ్యవహారాలకో, తక్కిన పనులకో బళ్లారికి వెళ్లినప్పుడల్లా కృష్ణమాచార్యుల బంగాళాలోనే దిగేవారు. అందువల్ల కృష్ణమాచార్యుల బంగళాకు బయలుదేరాము. దారిపొడుగునా తోరణాలు. బంగాళా

చేరాము. కృష్ణమాచార్యుల బంగళా అంటే ఆంధ్ర నాటక పితామహ బిరుదాంకితులు ధర్మవరం రామకృష్ణమాచార్యుల నివాసం. అదొక పెద్ద హవేలీ, బహిరంగ సభలు, నాటకాలు, మొదలయినవి ఆ బంగ్లాచుట్టు ఉన్న మైదానంలో జరిగేవి. ఈ మైదానం పేరే బంగ్లా కాంపౌండు. కొన్ని వేల మంది కూర్చునేటంత విశాలమైన మైదానం (అది ఇప్పుడు ఊరు అయిపోయింది) గాంధీజీకి ఘన స్వాగతమివ్వడానికి ఆ కాంపౌండులోనే ఏర్పాట్లు చేశారు. గాంధీజీని దగ్గరగా చూసే అవకాశం కలగడం అదృష్టం.

బంగ్లా కాంపౌండులో ఒక చోట వేదిక అమర్చారు. బల్లలు వేసి తెల్లటి ఖద్దరు గౌనులు, పలుచని పరుపులు పరిచి, దిండ్లు పెట్టారు. మైదానం అంతటా వెదుళ్ల నాటి తోరణాలు, పూలమాలలు అలంకరించారు. ప్రవేశద్వారానికి రాట్నాల తోరణం ఎంతో బాగుంది. మైకులు ఉన్నట్టు లేదు. నాకు ఊరంతా చూద్దామని ఉంది. కాని తప్పిపోతానన్న భయం. తాతగారు ఏమంటారోనని బెరుకు. కాని, బంగ్లాలో నా వయస్సు పిల్లవాడొకడు మిత్రుడయ్యాడు. అతనితో వెళ్లి ఊరంతా మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు తిరిగాను. ఊరంతా పెండ్లి సంబరంలాగ ఉంది. ఎక్కడ చూచినా ఏదో ఆనందం.

మరుసటి అపరాహ్ణానికి గాంధీజీ బళ్లారి ప్రవేశించారని వార్త వచ్చింది. ఆయన ధార్వాడ నుంచి ఫోర్డ్ కారులో వచ్చారట. అప్పుడు ఫోర్ట్ కారులు చాల ప్రఖ్యాతమైనవి. బంగళా కాంపౌండులో హడావుడి ఎక్కువయింది. ఆంధ్ర నాటక పితామహుని చివరి కుమారుడు భోగీంద్రనాథ్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఆయన కాశీవిశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ చదివి వచ్చారు. హిందీ కూడా బాగా మాట్లాడేవారు. మైదానం జనంతో కిటకిటలాడసాగింది. చుట్టుప్రక్కల గ్రామాల నుంచి కూడ జనం వచ్చారు. ''గాంధీజీకి జయ్'' అనే నినాదాలు మిన్నుముట్టాయి. ఆయన వెంట చాలా మంది ప్రముఖులే వచ్చారు. గాని నాకెవరూ గుర్తులేదు. బంగళా వాళ్ళందరికీ వేదిక దగ్గరగా ఒక స్థలం కేటాయించారు. కనుక మాకు జన సమ్మర్థం బాధేమీ కలుగలేదు.

గాంధీజీ హిందీలో మాట్లాడారు. అదీ ఐదు నిమిషాలసేపే. దానిని భోగీంద్రనాథ్ తెలుగులో అనువదించాడని గుర్తు. త్వరలో సహాయ నిరాకరణం, శాసనోల్లంఘనం ఉద్యమాలు ప్రారంభవుమతాయి. ప్రజలు యథాశక్తి ఆర్థిక సహాయం చేయాలి. స్వచ్ఛంద సేవకులను పంపాలి. దేశంలోని స్త్రీపురుషులు అంతా ఖద్దరు కడితే నెలరోజులలో మనకు స్వరాజ్యం వస్తుంది. స్వరాజ్యం వచ్చేవరకు స్త్రీలు నగలు ధరించరాదు. పురుషులు విలాస

వస్తువులు వాడరాదు. సోదరీమణులు, తల్లులు ఉద్యమానికి నగలూ దానం చేయాలి. అవసరమైతే ఎలాంటి త్యాగానికైనా సిద్ధపడాలి. ఇదీ ఆయన ప్రసంగం సారాంశం.

''మహిళలు త్యాగం చేయాలి. విరాళమివ్వాలి అని గాంధీజీ అన్నారో లేదో. శ్రోతల నుంచి వందల కొలది స్త్రీలు వేదిక వద్దకు పరుగున వచ్చారు. చేతులలోని బంగారు గాజులను దూసి ఇచ్చేవారు, చెవిలోని కమ్మలను ఒలిచి ఇచ్చేవారు, మెడలోని బంగారు గొలుసులను తల మీదుగా తీసి ఇచ్చేవారు, ముక్కులోని నత్తులను. ముక్కు పుడకలనుతిప్పి ఇచ్చేవారు, జడ బిళ్ళలను తీసి ఇచ్చేవారు, ఇలా అత్యాశ్చర్యకరమైన దృశ్యం చూచి నేను విస్తుపోయాను.

గాంధీజీ ఎంత గొప్పవారు! ఆయన ఎవరో తెలియదు. పత్రికలో పడిన వార్తలు చదవడం తప్ప. జనానికి ఎంత విశ్వాసం ఆయనంటే. ఆ విశ్వాసం చూస్తే ఆ సంవత్సరమే స్వరాజ్యం గాంధీజీ చెప్పే రామరాజ్యం వస్తుందనే నమ్మకం ప్రజలకు కలిగింది. మా తాతగారు ఆ భావంతోనే ఉన్నట్లు తోచింది.

బళ్లారి మధుర స్మృతులతో మాఊరికి తిరిగి వచ్చాను. గాంధీజీ గొప్పతనాన్ని బేరీజు వేసే శక్తి నాకు అప్పుడూ లేదు, ఇప్పుడూ లేదుగాని ఆ జనం ఉత్సాహం, విశ్వాసం, సంరంభం నామనస్సులో బాగా హత్తుకొనిపోయి ప్రజల విశ్వాసం చూరగొనాలంటే ఏమి పనిచేయాలి? అంతటి విశ్వాసం ఎలా కలుగుతుంది? ఆ విశ్వాసంతో అనుకున్న పనులు సాధించగలుగుతామా? ఆ విశ్వాసం స్థిరంగా ఉంటుందా? అనే ప్రశ్నలు, ఆ రూపంలో కాకపోయినా అస్పష్టంగా మనస్సులో తారట్లాడాయి.

తర్వాత పది పన్నెండేళ్ళకు హరిజనోద్యమంలో గాంధీజీతో ఒక రాత్రి ఒకే కారులో పయనించడం తటస్థించింది. అప్పటికి దేశంలో ఎన్నోమార్పులు వచ్చాయి. మద్రాసుకు ప్రయాణం. గాంధీజీ ప్రశ్నించారు. ''మద్రాసు ఇంకా ఎన్నిమైళ్లు?'' అని. దాదాపు నలభైమైళ్లన్నారు మాలో పెద్దలు. తెల్లవారే వరకు చేరగలం అన్నారు.అయితే నేను కునుకుతీస్తాను. మద్రాసు పొలిమేరల్లో లేపండి.'' అన్నారు గాంధీజీ. కారు వేగంగా పోగలిగేదే కాని, ఎదురుగాను, వెనుకనుంచీ వస్తున్న లారీల నుంచి ప్రమాదం జరగకుండా నెమ్మదిగా నడుస్తున్నది. గంటంబావుకు మద్రాసు పొలిమేర చేరగానే దిగ్గున మేల్కొని ''మద్రాసు చేరామా?'' అన్నారు. మాకంతా ఆశ్చర్యం కలిగింది. గాంధీజీ స్థిత ప్రజ్ఞులు. మనస్సు స్వాధీనంలో ఉన్నవారు, నియమపాలనం గొప్పగా ఆచరిస్తున్న వారు కనుక ఆ విధంగా మేల్కొనగలిగారని భావించాను.

గాంధీజీ 1932-33లో మద్రాసులో దాదాపు నెల మకాం చేశారు. నేను ఆ నెలనాళ్లూ అక్కడ ఉండి గాంధీజీ వాక్కులు విన్నాను. ఆయన చిడిముడి పాటు చూచాను. ప్రజల విశ్వాసానికి కారణమేమిటనే చిన్ననాటి ప్రశ్నకు, ఒక విధంగా సమాధానం దొరికినట్లనిపించింది. ఏవ్యక్తి అయినా, తాను నమ్మిన దానిని ఆధీతి బోధాచరణాలతో ప్రజలకు చూపగలిగినప్పుడే వారి విశ్వాసం చూరగొంటాడు అనే నిశ్చయజ్ఞానం కలిగింది.

సత్కార్యసాధనకు సత్సాధనాలు ఉండాలనేది గాంధీజీ సిద్ధాంతం. ఈ సిద్ధాంతానికి ఆయన వ్రాసి పెట్టిన వీలునామా గొప్ప దృష్టాంతం. వీలునామాయే కాదు. ఆయన జీవితమంతా దృష్టాంతమే. గాంధీజీ జీవిత చరిత్రను ''బాపూజీ కథ'' గా రచించిన హరిభావూ ఉపాధ్యాయ అన్నట్లు ఈ వీలునామా ఎప్పుడు ఆచరణలోకి వస్తుందో చెప్పలేము.

గడ్డిపోచలను గండు చీమలుగా మలచిన గాంధీజీ అకస్మాత్తుగానో, కాకతాళీయంగానో మహానాయకుడుగా రూపొందలేదని బాల్యంనుంచి క్రమశిక్షణతో, సత్యనిష్ఠతో, సేవాదృష్టితో, భగవదర్పణ భావంతో గడిపిన జీవితమే ఆయనను మహాయోద్ధగా, 'మహాసేనానిగా, జాతిపితగా తీర్చిదిద్దిందని పెద్దవాడయిన తర్వాత గ్రహించాను. ఆయన అడుగడుగున చేసిన సత్యశోధన, ఆయన జీవితానికి ఎప్పటికప్పుడు మెరుగులు పెట్టి, దానిని సహస్ర కిరణ సదృశం చేసింది.

ఉ.సూ.: గాంధీజీ జీవిత చరిత్రను, ఇతర స్వాతంత్రోద్యమ నాయకుల జీవితచరిత్రలను గురించి సమాచారాన్ని విద్యార్థులకు అంతర్జాలము ద్వారా తెలియజేయండి.

I వినండి - చర్చించండి - రాయండి.

అవగాహనా కృత్యాలు :

అ) ఎవరు ఎవరితో అనిరి.

1) ఏదో ఒకనాడు మనకు స్వాతంత్ర్యం లభిస్తుంది. 2) వేలమంది జనం వస్తారు.

3) తాతగారిని అడుగు, పిలుచుకొని వెళితే వెళ్లు. 4) మహిళలు త్యాగం చేయాలి.

ఆ) ఖాళీలను పూరించండి.

1) అప్పట్లో తెలుగువాళ్ళకున్న ఏకైక పత్రిక __________ 3) బళ్ళారిలో ఉన్న విశాలమైన మైదానం. ____________

2) గాంధీగారి సిద్ధాంతం ____________ 4) హరిభావూ రచన ____________

ఇ) తప్పొప్పులు గుర్తించి రాయండి.

1) మా తాతగారు వాళ్ళంతా తిలక్ అనుయాయులు. ( )

2) ఆ గుంపులో నేను తప్పిపోతే నీవు వెదగ్గలవా? ( )

3) మేము మద్రాసు రైలు స్టేషనులో దిగాము. ( )

4) గాంధీజీ స్థితప్రజ్ఞులు. ( )

II అభిప్రాయ వ్యక్తీకరణ :

1) పాఠం ద్వారా నీవు తెలుసుకున్న జీవనకౌశల్యాలు రాయుము.

2) ''గాంధీగారు క్రమశిక్షణకు మారుపేరు'' దీనిపై మీ అభిప్రాయం రాయండి.

III స్వీయస్పందన :

1) సహాయ నిరాకరణోద్యమం గురించి మీ సొంత మాటల్లో రాయండి.

2) బళ్ళారిలో రచయితకు ఆశ్చర్యం కలిగించిన దృశ్యం .... మీ సొంతమాటల్లో రాయండి.

IV లఘుటీక రాయండి.

1) గాంధీజీ బళ్ళారిలో చేసిన ప్రసంగం.

2) 'గాంధీజీ నియమపాలనం కలవారు' - వివరించండి.

H5XHUD

నేనివి నేర్చుకున్నా:

1) గాంధీజీ భారతీయులను ప్రభావితం చేసిన విధం (2) క్రమశిక్షణలోని మహత్త్వం.

వ్యాకరణము

భాషాభాగాలు : (1) నామ వాచకము (2) సర్వనామము (3) విశేషణము (4) క్రియ (5) అవ్యయము.

ఈ ఐదింటిని భాషాభాగములు అంటారు.

నామవాచకము : పేర్లను తెలియజేయునది. ఉదా., కమల

సర్వనామము : నామవాచకమునకు, బదులుగా వాడబడునది. ఉదా., అతడు, ఆమె, వాడు

విశేషణము: నామవాచకములోని విశేష విషయమును (రంగు, స్వభావము, గుణము) తెలియజేయునది. ఉదా., తెల్లని గుఱ్ఱము.

క్రియ : పనిని తెలియజేయునది. ఉదా., చదువుచున్నాడు

అవ్యయము : లింగ, వచన, విభక్తులు లేని పదములు. ఉదా., ఆహా! ఔరా! అక్కటా!

వాక్యరకములు : వాక్యములు మూడు విధములు.

సామాన్యవాక్యము : ఒకే సమాపక క్రియ కలిగినవాక్యము. ఉదా., రఘు బడికి వెళ్ళెను.

సంశ్లిష్ట వాక్యము : అసమాపక క్రియతో కూడి యుండు వాక్యము. ఉదా., రఘు బడికి వెళ్లి, పరీక్ష రాసెను.

సంయుక్త వాక్యము : రెండు లేక అంతకంటే ఎక్కువ వాక్యములు కలిసి ఏక వాక్యముగా ఏర్పడుట. ఉదా., శాంతి బాగా చదివింది అందువలన మంచి మార్కులు పొందినది.

విభక్తి ప్రత్యయాలు :

1. ప్రథమా విభక్తి - డు, ము, వు, లు
2. ద్వితీయా విభక్తి - నిన్, నున్, లన్, కూర్చి, గుఱించి.

3. తృతీయావిభక్తి – చేతన్, చేన్, తోడన్, తోన్
4. చతుర్థీ విభక్తి – కొఱకున్, కై
5. పంచమీ విభక్తి – వలనన్, కంటెన్, పట్టి
6. షష్ఠీ విభక్తి – కిన్, కున్, యొక్క, లోన్, లోపలన్
7. సప్తమీ విభక్తి – అందున్, నన్
8. సంబోధన ప్రథమా విభక్తి – ఓ, ఓయి, ఓరి, ఓసి

వాక్యాంగములు : కర్త, కర్మ, క్రియ అనునవి వాక్యాంగములు.

కర్త – పనిచేయువాడు. నేను పూలను కోశాను.

కర్మ – ఫలితము పొందువాడు – ఎవరిని, దేనిని అని ప్రశ్నించగా వచ్చు సమాధానము కర్మ. ఉదా., వాడు పాట పాడెను.

క్రియ – పనిని తెలుపునది. ఉదా., అతడు వ్రాయుచున్నాడు.

తెలుగు సంధులు

ఉకారసంధి: ఉత్తునకు అచ్చు పరమగునపుడు సంధి నిత్యము. ఉదా., నీవు + ఎక్కడ = నీవెక్కడ

ఇకారసంధి: ఇత్తునకు అచ్చు పరమగునపుడు సంధి వైకల్పికము. వైకల్పికము అనగా సంధి జరుగవచ్చు, జరుగకపోవచ్చు. రెండు అచ్చుల మధ్య సంధి జరుగునపుడు 'య్' ఆగమముగా వచ్చును. ఉదా., ఏమి + అంటివి – ఏమంటివి, ఏమియంటివి.

అకారసంధి : అత్తునకు సంధి బహుళము. బహుళము అనగా నిత్య, నిషేధ, వైకల్పిక, అన్యకార్యము. ఉదా., రామ + అయ్య = రామయ్య; అమ్మ + ఇచ్చెను = అమ్మయిచ్చెను; మేన + అత్త = మేనత్త, మేనయత్త; ఒక + ఒక = ఒకానొక.

గసడదవాదేశ సంధి : ప్రథమ మీది పరుషములకు గ–స–డ–ద–వ–లు బహుళముగానగు. ఉదా., వారు + పోరు = వారువోరు

సరళాదేశము : ద్రుత ప్రకృతికము మీది పరుషములకు సరళములగును. ఉదా., పూచెను + కలువలు = పూచెనుగలువలు

ఆమ్రేడిత సంధి:

i) అచ్చునకు ఆమ్రేడితము పరమగునపుడు సంధి తరచుగ నగును.
ఆమ్రేడితము : ఒకే పదము రెండు సార్లు పలుకబడినపుడు రెండవసారి పలికిన పదాన్ని ఆమ్రేడితము అంటారు.
ఉదా:– ఆహా + ఆహా = ఆహాహా

ii) ఆమ్రేడితము పరమగునపుడు కడాదుల తొలియచ్చు మీది వర్ణములకెల్ల ఆదంతమగు ద్విరుక్తటకారమగును.
ఉదా:– కడ + కడ = కట్టకడ

iii) ఆమ్రేడితము పరమైనచో విభక్తిలోపము బహుళముగానగును. ఇంచుక, నాడు ఇత్యాదులందు అంతిమాక్షర లోపంబగు.
ఉదా: ఇంటన్ + ఇంటన్ = ఇంటింటన్, ఇంచుక + ఇంచుక = ఇంచించుక, ఇంచుకించుక; నాడు + నాడు = నానాఁడు, నాడునాడు.

iv) అందదుకు ప్రభృతులు యథా ప్రయోగముగా గ్రాహ్యములు.
ఉదా: అందుకు + అందుకు = అందందుకు, చెదరు + చెదరు = చెల్లాచెదురు.

త్రికసంధి:

'ఆ, ఈ, ఏ' లను త్రికములు అందురు.

త్రికము మీది అసంయుక్త హల్లునకు ద్విత్వంబు బహుళంబుగానగును. ద్విరుక్తంబగు హల్లు పరంబగునపుడు ఆచ్ఛికంబగు దీర్ఘమునకు హ్రస్వంబగు.

అసంయుక్తము : సంయుక్తము కాని అక్షరం. ఒక హల్లు కింద వేరొక హల్లు ఉంటే అది సంయుక్తము. కానిది అసంయుక్తము.

ద్విత్వము : ఒక హల్లు కింద అదే హల్లు రావటం ద్విత్వం అంటారు. ఉదా: క్క, ట్ట మొదలగునవి.

ఆచ్ఛికము : కేవలం తెలుగు శబ్దాలు. ఆ + కన్య = 'ఆ' అనునది 'త్రికము' త్రికము తరువాత ఉన్న 'క' అసంయుక్తము. సూత్రము ప్రకారము అసంయుక్త హల్లు పరమైనపుడు ద్విత్వంబు బహుళంబుగా నగును. కావున

ఆ + కన్య ⟶ ఆ + క్కన్య గా మారును.

ద్విరుక్తంబగు హల్లు పరమగునపుడు ఆచ్ఛికంబగు దీర్ఘమునకు హ్రస్వంబగు. కావున

ఆ + క్కన్య = అక్కన్యగా మారును.

ఇదే విధంగా :

ఇవ్విధము = ఈ + విధము ⟶ ఈ + వ్విధము = ఇవ్విధము

ఎక్కాలము = ఏ + కాలము ⟶ ఏ + క్కాలము = ఎక్కాలము

అయ్యశ్వము = ఆ + అశ్వము

ఆ + అశ్వము అన్న చోట రెండు స్వరాల మధ్య సంధి జరగనిచో యట్ ఆగమముగా వచ్చును. అన్న సూత్ర నియమాన్ని బట్టి ఆ + య్ + అశ్వము = ఆ + య్యశ్వము ⟶ అయ్యశ్వముగా మారును.

సంస్కృతసంధులు

సవర్ణదీర్ఘసంధి : అ, ఇ, ఉ, ఋ లకు అవియే అచ్చులు పరమైన దీర్ఘము ఏకాదేశ మగును. ఉదా., రామ + ఆలయము = రామాలయము.

గుణసంధి : అకారమునకు ఇ, ఉ, ఋ లు పరమైన క్రమముగా ఏ, ఓ, అర్ లు ఆదేశమగును. ఉదా., దేవ + ఇంద్రుడు = దేవేంద్రుడు.

వృద్ధి సంధి:

'ఐ, ఔ' లకు వృద్ధులని పేరు.

సూత్రం : అ కారమునకు 'ఏ, ఐ'లు పరమైన 'ఐ' కారము, 'ఓ, ఔ' లు పరమైన 'ఔ' కారము ఏకాదేశమగును.

ఏకైక ——— ఏక + ఏక

ఏక్ + అ + ఏ క = మొదటి పదంలోని అకారమునకు 'ఏ' అను అచ్చు పరమైనది.

వృద్ధిసంధి సూత్రం ప్రకారం 'ఏ' అను అచ్చు పరమగునపుడు 'ఏ' స్థానములో 'ఐ' వచ్చును.

ఏక్ + ఐ క = ఏకైక అన్న రూపం ఏర్పడును.

ఇదే విధంగా అష్ట్ + అ + ఐ శ్వర్యము = అ ష్ట్ + ఐ శ్వర్యము = అష్టైశ్వర్యము అను రూపం ఏర్పడును.

మహౌషధి – మహ్ + ఆ + ఓ షధి 'ఓ' స్థానంలో 'ఔ' వచ్చి ఔషధి అగును.

దివ్యౌషధము – దివ్య్ + అ + ఔషధము = ది వ్యౌషధము

గంగౌఘము – గంగ్ అ + ఓఘము 'ఓ' స్థానంలో 'ఔ' వచ్చి గంగ్ + అ + ఔఘము గంగౌఘము అగును.

యణాదేశ సంధి:

''య, వ, ర, ల'' అనే వాటికి యణ్ణులని పేరు.

సూత్రం : **''ఇ, ఉ, ఋ, ౠ''** అనే అచ్చులకు సవర్ణముకాని అచ్చులు (అసవర్ణములు) పరమైన క్రమముగా ''య, వ, ర, ల'' లు ఆదేశమగును.

ఉదా: ప్రత్యుపకారము ⟶ ప్రతి + ఉపకారము
ప్రత్ + ఇ + ఉపకారము

'ఇ' కి అసవర్ణమైన 'ఉ' అను అచ్చు పరమైనది 'ఇ' స్థానంలో 'య' అనునది ఆదేశంగా వచ్చును.

కావున ప్రత్ + ఇ + ఉపకారము అనునది
ప్రత్ + య్ + ఉపకారము అగును

ప్రత్యుపకారము అను రూపము ఏర్పడును. అదేవిధంగా

అత్యున్నతము ⟶ అతి + ఉన్నతము
అత్ + ఇ + ఉ
త్ + య్ + ఉ = త్యు

గుర్వర్థము ⟶ గురు + అర్థము
ర్ + వ్ + అ = ర్వ

పిత్రంశ ⟶ పిత్ + ఋ + అంశ
త్ + ర + అ = త్ర

లాకృతి ⟶ ౡ + ఆకృతి
ౡ + ఆ
ల్ + ఆ = లా

సమాసములు

సమర్థ వంతమైన పదములు కలిసి ఏకపదమగుట సమాసము.

తత్పురుషసమాసము - ఇది ఉత్తరపద ప్రాధాన్యతకలది.

ప్రథమాతత్పురుష - కడ కన్ను - కంటి యొక్క కడ

ద్వితీయాతత్పురుష - కృష్ణాశ్రితుడు - కృష్ణుని ఆశ్రయించినవాడు.

తృతీయాతత్పురుష - రాజపూజితుడు - రాజు చేత పూజితుడు

చతుర్థీతత్పురుష - గ్రంథాలయము - గ్రంథముల కొఱకు ఆలయము.

పంచమీతత్పురుష - చోరభయము - చోరుని వలన భయము.

షష్ఠీతత్పురుష - తండ్రిమాట - తండ్రి యొక్క మాట

సప్తమీతత్పురుష - శాస్త్రనిపుణుడు - శాస్త్రము నందునిపుణుడు

నఞ్ తత్పురుష - అసత్యము - సత్యము కానిది.

కర్మధారయసమాసము : విశేషణ, విశేష్యముతోడి సమాసము - వృద్ధకపోతము-వృద్ధమైన కపోతము. విశేషణము ఇందు మొదటి పదముగా ఉన్నది కనుక విశేషణ పూర్వపద కర్మధారయం.

కపోత వృద్ధము - వృద్ధమైన కపోతము - ఇందు విశేషణము రెండవ పదముగా వున్నది కనుక విశేషణ ఉత్తరపద కర్మధారయము.

మృదుమధురము - మృదువైనది, మధురమైనది. ఈ సమాసమందు రెండు పదాలు విశేషణములు కనుక విశేషణ ఉభయపద కర్మధారయము.

ద్విగుసమాసము : సంఖ్యాపూర్వకమైన కర్మధారయమే ద్విగువు. త్రిలోకములు - మూడు లోకములు.

ద్వంద్వసమాసము: ఉభయపద ప్రాధాన్యత కలది ద్వంద్వసమాసము. తల్లిదండ్రులు - తల్లియును, తండ్రియును.

బహువ్రీహిసమాసము :

అన్యపదము ప్రధానంగా కలిగినది బహువ్రీహి. సమాసములో ఉన్న పదాలు కాక వాటి చేత సూచింపబడే వేరొక పదం యొక్క అర్థం కలిగి ఉండడమే 'అన్యపదం'.

సూత్రం : 'అన్య పదార్థ ప్రాధాన్యం కలది బహువ్రీహి''

బహువ్రీహి సమాసములో విగ్రహవాక్యం చెప్పేటప్పుడు 'కలది, కలవాడు అనే రెండు పదాలు సమాస పదాలకు చివరన వచ్చి చేరతాయి.

ఉదాహరణకు : ముక్కంటి - మూడుకన్నులు కలవాడు (శివుడు), ఇందులో మూడు అన్న పదానికి గాని, కన్నులు అన్న పదానికి గాని ప్రాముఖ్యత లేదు. మూడు కన్నులు కలిగిన 'శివుడు' అన్న పదానికే ప్రాముఖ్యత వుంది.

ముక్కంటి తాండవం చేసెను. అనగా శివుడు తాండవం చేసెను అని సమాసములో చూపని అన్యపదాన్ని తెచ్చి ''శివుడు'' అని అర్థం చెప్పుట జరుగుచున్నది. ఇదియే అన్య పదార్థ ప్రాధాన్యం కలది బహువ్రీహి అనుటకు అర్థం.

- మీనాక్షి మీనముల వంటి అక్షులు కలది. (స్త్రీ)
- చతుర్ముఖుడు నాలుగు ముఖాలు కలవాడు (బ్రహ్మ)

రూపకసమాసము : దీనినే అవధారణా పూర్వపద కర్మధారయ సమాసము అందురు. ఉదా., కవికోకిల - కవియనెడి కోకిల

అలంకారములు

శబ్దాలంకారములు :

వృత్యనుప్రాస : ఒకటి, రెండక్షరములు పలుమార్లు ఆ వృత్తి అగుట. ఉదా., ఆనంద, బిందు బృందస్యందన. బిందు పూర్వక'ద'కారము పలుమార్లు ఆవృతమైనది.

ఛేకానుప్రాస : రెండు హల్లులు అవ్యవధానముగా వచ్చుట - అర్థములో మార్పు వుండుట. ఉదా., నీ సుందర దరహాసము - దర, దర అను పదములు వెంట వెంటనే వచ్చినవి కాని సుందర - అనునపుడు అందమైన అని, దరహాసము అనగా చిరునవ్వు అని అర్థము చెప్పుకొందుము.

లాటానుప్రాస : తాత్పర్య భేదముతో శబ్దార్థములు పునరుక్తములగుట. కమలాక్షు నర్చించు కరములు కరములు

ఇందు కరములు అన్న పదం రెండుసార్లు కవి ప్రయోగించారు. కరములు అనగా చేతులు. విష్ణువును పూజించునట్టి చేతులే సార్థకత కలిగిన చేతులు అని తాత్పర్యమునందు భేదమును తెలుపు చున్నాము.

అంత్యానుప్రాస : పదాంతములందుకాని, పాదాంతము లందు కాని, వాక్యాంతములందు కాని వర్ణములు పునరుక్తములగుట. ఉదా., విశ్వదాభిరామ వినురవేమ

ఇందు పదాంతములందు రామ, వేమ అను ప్రాస పదములు ఉపయోగింపబడినవి.

యమకము :
ఉపయోగించిన పదాలనే అర్థ భేదము కలుగునట్లు మరల మరల ప్రయోగించుట.

ఉదా : **మన సుభద్ర సుకృతి మహిమ ఏమనవచ్చు**
మనసు భద్రమయ్యె మనకు నెల్ల

ఈ పద్యపాదంలో ''మన సుభద్ర'' అనునపుడు మన యొక్క సుభద్ర అని అర్థము చెప్పుకొందుము.
రెండవ పాదమందు ''మనసు భద్రమయ్యె'' అనగా మనందరి మనసు కుదుటపడెను అని అర్థ భేదమును చెప్పుకొందుము.
''మనసుభద్ర'', ''మనసుభద్ర'' అని రెండు మార్లు అవే పదాలను ఉపయోగించినను ఆ పద విభజనలో మార్పువల్ల
అర్థ భేదం కలుగుతున్నది. (మన సుభద్ర మనసు భద్ర)
అదే విధంగా

లేమా దనుజుల గెలువగ
లేమా నీవేల కడగి లేచితి విటురా
లేమాను మానవేనిన్
లేమా! విల్లందు కొనుము లీలంగేలన్

పై పద్యంలో 'లేమా' అనే అక్షరద్వయం ''లేమా! లేమా? లే-మాను, లే-మాను (ఆవు అనే అర్థంలోనువాడబడి అర్థం భేదంగా ఉన్నందున' యమకాలంకారం' అయింది.

ముక్త పదగ్రస్తం :
విడిచిన పదాన్నే అవ్యవధానంగా మరల మరల ప్రయోగించుట

ఉదా : **సుదతీ నూతన మదనా**
మదనాగ తురంగ పూర్ణ మణిమయ సదనా
సదనా మయ గజ రదనా
రదనాగేంద్ర నిభకీర్తి రస నరసింహా!

ఈ పద్యము నందు మొదటిపాదము ''మదనా'' అను పదముతో ముగియుచుండగా రెండవ పాదములో మొదటి పదం 'మదనా'తో ప్రారంభింపబడింది. అట్లే రెండవ పాదం చివరి పదం 'సదనా' తో ముగియగా, మూడవ పాదము మొదటిపదం
'సదనా తో ప్రారంభించబడింది. ఈ విధంగా విడిచిన పదాన్ని తిరిగి స్వీకరించుటనే 'ముక్త పదగ్రస్తము' అందురు.

అర్థాలంకారములు

ఉపమాలంకారం : ఉపమాన, ఉపమేయాలకు పోలికను చెప్పుటను ఉపమాలంకారము అందురు. ఇందు నాలుగు భాగాలుండును.
ఉపమానం : పోలికకై స్వీకరించిన వస్తువు
ఉపమేయం : పోల్చదగిన వస్తువు
ఉపమా వాచకం : వలె
సమానధర్మం : ఉపమాన, ఉపమేయాల మధ్యనుండు పోలిక.
ఉదా: భూమి బంతి వలెనున్నది.
ఇందు వర్ణించ దలచిన వస్తువు ''భూమి'' కనుక ఇది ఉపమేయం. పోలికకై స్వీకరించిన వస్తువు 'బంతి'. కనుక 'బంతి' ఉపమానం. ఈ రెండింటి మధ్య ఉన్న సమానమైన ధర్మము 'గుండ్రంగా వుండుట, తిరుగుట' - కావున భూమిని బంతితో పోల్చుట జరిగినది. దీనినే ఉపమాలంకారం అందురు.

ఇటువంటివే -
''అక్షరములు ముత్యముల వలెనున్నవి.''
'కన్నులు కలువల వలెనున్నవి' మొదలగునవి.

ఉత్ప్రేక్షాలంకారము : ఉపమాన ధర్మ సంబంధం చేత ఉపమేయాన్ని ఉపమానంగా ఊహించుట.
ఉదా: తాడు పాము అని భ్రమించితిని. ఇందు వర్ణింప దలచిన వస్తువు తాడు. కావున ఇది ఉపమేయం. పోలికకై
స్వీకరించిన వస్తువు పాము. కనుక ఇది ఉపమానం. ఉపమానం యొక్క ధర్మం ''పొడవుగా నుండుట, కదలుట. ఈ రెండు ధర్మాలు తాడు యందు చూచుటచే తాడును పాముని భ్రమించుట జరిగెను. ఈ విధంగా ఉపమాన ధర్మ సంబంధం చేత ఉపమేయాన్ని ఉపమానంగా ఊహించుటను భ్రాంతి చెందుటను ఉత్ప్రేక్షాలంకారము అందురు.
అట్లే ''ఆకాశము కాటుకను వర్షించు చున్నదా అన్నట్లున్నది.''
కాటుక యొక్క నల్లని ధర్మాన్ని చీకటి యందు కవి ఊహించుచున్నాడు.

రూపకాలంకారము :
ఉపమేయమునందు ఉపమాన ధర్మమును ఆరోపించుట.
''రూపారోపాత్తు రూపకం'' లేదా ఉపమాన ఉపమేయాలకు అభేదమును చెప్పుట.
ఉదా: ఆమె ముఖ చంద్రుడు మనకు నేత్రానందం కలిగించుచున్నాడు.
ముఖం - ఉపమేయం; చంద్రుడు - ఉపమానం.
చంద్రధర్మం కాంతి కలిగియుండుట, నేత్రములకు ఆనందం కలిగించుట అన్న విషయాలను కవి ఆమె ముఖంనందు ఆరోపించు చున్నాడు. ముఖానికి చంద్రధర్మం ఆరోపించుటచే రూపకాలంకారం అందురు.

ఛందస్సు

అక్షరములు లఘువులు, గురువులు అని ముఖ్యంగా రెండు విధములు. ఒక మాత్రాకాలములో ఉచ్చరింప బడునవి లఘువులు, రెండు మాత్రల కాలములో ఉచ్చరింప బడునవి గురువులు హ్రస్వాక్షరములన్నియు లఘువులు. ఈ క్రిందివి గురువులు.

1) దీర్ఘాక్షరములు (ఆ, ఈ, కా మొ॥) — U U U
2) ఐ, ఔ లు-వానితో కూడిన హల్లులు (కై క, ఔరసుడు, కౌరవులు) — U I, U I I I, U I I I
3) నిండుసున్నతో కూడిన అక్షరములు (అందము, గంప) — U I I, U I
4) విసర్గతో కూడిన అక్షరములు (దుఃఖము, తపఃఫలము) — U I I, I U I I I
5) పొల్లు హల్లులతో కూడిన అక్షరములు (నిన్, లన్, చేతన్) — U, U, U U
6) ద్విత్వ, సంయుక్తాక్షరములకు ముందున్న అక్షరములు (అత్త, పద్మము) — U I, U I I

(లఘువునకు I, గురువునకు U గుర్తులు)

గణము అనగా సమూహము, కొన్ని అక్షరములు కలిసి గణము అగును.

I U UU IU I I I U
యమాతారాజభానసలగం – దీనిని గుర్తించుము. ఏగణమునందలి గురు, లఘువులు కావలెనో ఆ అక్షరము నుండి మూడక్షరములు గ్రహించినచో ఆ గణము తెలియును. ఉదా., భగణము కావలెనన్న భానస వరకు – గుర్తించిన గణములు చూసిన UII అని తెలియును.

య గణము - IUU	మ గణము - UUU	త గణము - UUI	ర గణము - UIU
జ గణము - IUI	భ గణము - UII	న గణము - III	స గణము - IIU

యతి : పద్యపాదము మొదటి అక్షరమునకు 'యతి' అనిపేరు. పాదాది అక్షరముకాని దానితో మైత్రికల అక్షరముకాని నియమిత స్థలమున పునరుక్తమగుటయే యతిమైత్రి.

ప్రాస : పాద ద్వితీయాక్షరము ప్రాసము. ఇందు హల్లు ప్రధానము. పద్య మొదటి పాదము నందు ద్వితీయాక్షరము ఏ హల్లు వుండునో మిగిలిన మూడు పాదములందు అదే హల్లు వుండుట ప్రాస.

ఉత్పలమాల : గణములు : భ, ర, న, భ, భ, ర, వ.

యతి : 1 – 10 అక్షరములకు చెల్లును. ప్రాసనియమం కలదు.

	UII	UIU	III	UII	UII	UIU	IU
ఉదా.,	తమ్ముని	గూడి పు	ణ్య గుణ	ధాముడు	రాముడు	వచ్చిమా	ల్యవం
	భ	ర	న	భ	భ	ర	వ

చంపకమాల – గణములు : న, జ, భ, జ, జ, జ, ర.

యతి 1 – 11 అక్షరములకు చెల్లును. ప్రాస నియమం కలదు.

	III	IUI	UII	IUI	IUI	IUI	UIU
ఉదా.	పొదవె	డునువ్వు	లేకరు	చిపుట్ట	గనేర్చు	నటయ్యు	భాస్కరా
	న	జ	భ	జ	జ	జ	ర

శార్దూలము : ఈ వృత్తమునకు నాలుగు పాదములుండును. ప్రతి పాదమునందును 'మ, స, జ, స, త, త, గ' అను గణములుండును. పదమూడవ అక్షరము యతిస్థానము. ప్రాస నియమము కలదు. ప్రతి పాదము నందు 19 అక్షరములుండును.

క్రింది పద్యపాదమును గమనించుము.

మ	స	జ	స	త	త	గ
UUU	IIU	IUI	IIU	UUI	UUI	U
ఆరంభిం	పరునీ	చమాన	వులువి	ఘ్నాయాన	సంత్రస్తు	లై

మత్తేభము: ఈ వృత్తమునకు నాలుగు పాదములుండును. ప్రతి పాదమునందును 'స, భ, ర, న, మ, య, వ' అను గణములుండును. పదునాల్గవ అక్షరము యతిస్థానము. ప్రాస నియమము కలదు. ప్రతి పాదము నందు 20 అక్షరములుండును.

క్రింది పద్యపాదమును గమనించుము.

స	భ	ర	న	మ	య	వ
IIU	UII	UIU	III	UUU	IUU	IU
ఘనుడ	వ్వాడగు	వేడుతా	గమయ	దీక్షంబూ	నిసర్వం	సహా

ఛందస్సు

ఇంద్రగణములు		సూర్యగణములు	
IIII	నల	UI	గల
IIIU	నగ	III	న
IIUI	సల		
UII	భ		
UIU	ర		
UUI	త		

ఆటవెలది, తేటగీతి, సీసము చూడు పుట సంఖ్య : 37, 18

కంద పద్య లక్షణములు
- పద్యమునకు 4 పాదములు ఉండును.
- 1, 3 పాదములందు 3 గణములు; 2, 4 పాదములందు 5 గణములు రావలెను.
- 'భ, జ, స, నల, గగ' అను గణములు రావలెను.
- 2, 4 పాదములందు చివర అక్షరం గురువు రావలెను.
- 2, 4 పాదములందు 3వ గణము జగణము కాని, నలము కాని రావలెను.
- 1, 3 పాదము లందు 3వ గణము జగణము కారాదు.
- 2, 4 పాదములలో నాల్గవ గణము మొదటి అక్షరము యతిస్థానం.
- ప్రాస నియమం కలదు.
- గ గ – అనగా రెండు గురువులు.

	U II	II U	UII
ఉదా.	ఈ విధ	మున న	భ్యాగత

UU	IIU	I III	UII	U U
సేవా	పరతం	త్ర సకల	జీవన	ద్రై భూ

లేఖన కౌశల్యాలు

1. లేఖా రచన

లేఖారచన ఒక కళ, మన మనస్సులోని భావాలు ఆలోచనలు ఇతరులకు తెలుపడానికి లేఖ ఒక ఉత్తమ సాధనం. లేఖారచనకు సాంకేతిక పద్ధతినుపయోగించడం కాలానుగుణ అవసరం. ముందు తరగతులలో మీరు 'ఈ-మెయిల్' (ఎలక్ట్రానిక్ మెయిల్) పంపేవిధానం అవగతం చేసుకోవలసి ఉంటుంది. అందుకనే ఈ సంవత్సరం మనం 'లేఖ'ల నమూనాలు నూతన సాంకేతికతానుసారం మెయిల్ పంపే పద్ధతిననుసరించి తెలుసుకోబోతున్నాం.

లేఖ

అనధికార లేఖ

- కుటుంబంలోని వ్యక్తులు, అత్యంత సన్నిహితులైన వ్యక్తులకు రాయు లేఖలు.
- బంధుత్వాన్నిబట్టి/సగౌరవంగా వ్యక్తులను సంబోధించాలి.
- వ్యక్తుల క్షేమ సమాచారాలు అడగాలి.
- ఆలోచనలు ప్రభావవంతమైన పదాలతో వ్యక్తపరచాలి.
- అనధికార లేఖలో **'విషయం'** అనే ప్రత్యేక శీర్షిక రాయవలసిన అవసరం లేదు.
- లేఖలో చివరన లేఖను రాసేవారి చిరునామా రాయడం తప్పనిసరి.
- పై అంశాలన్నీ **'లేఖ-స్వరూపం'** లో చూపినవిధంగా ఎడమవైపు సమరేఖలో ఉంచాలి.

అధికార లేఖ

- మనవి, విన్నపం మొదలగు కార్యాలయ/వృత్తి సంబంధ లేఖలు.
- గౌరవసంబోధన తర్వాత వ్యక్తి యొక్క హోదాను పేర్కొనవలెను.
- లేఖలోని ముఖ్య విషయాన్ని (subject) **'విషయం'** అనే ప్రత్యేక శీర్షికగా రాయాలి.
- ప్రామాణికమైన భాషలో ముఖ్య ఉద్దేశ్యమును సూటిగా వ్యక్తపరచాలి.
- లేఖలో చివరన లేఖను రాసేవారి చిరునామా రాయాలి.
- పై అంశాలన్నీ **'లేఖ-స్వరూపం'లో** చూపినవిధంగా ఎడమవైపు సమరేఖలో ఉంచాలి.

లేఖ-స్వరూపం

అనధికార లేఖ

తేది ....
లేఖ ఎవరికి రాస్తున్నామో వారి పేరు
చిరునామా ....
....
గౌరవనీయులైన/పూజ్యులైన/ప్రియమైన

ముఖ్య సమాచారం

ఇట్లు ....
మీ ....
చిరునామా ....
(లేఖ పంపువారి చిరునామా)
గమనిక : అనధికార లేఖలో 'విషయం' అనే ప్రత్యేక శీర్షిక రాయవలసిన అవసరం లేదు.

అధికార లేఖ

తేది ....
వ్యక్తి / సంస్థ పేరు,
చిరునామా ....
....
విషయం : ....
గౌరవనీయులైన/శ్రీ/శ్రీమతి,

ముఖ్య సమాచారం

ఇట్లు ....
మీ ....
చిరునామా ....
(లేఖ పంపువారి చిరునామా)

ఇప్పుడు కింది అంశాల ఆధారంగా అధికార, అనధికార లేఖలు రాయండి.

విషయం : స్వచ్ఛ భారత్ కార్యక్రమం

మునిసిపల్ కమీషనర్,
బృహన్ ముంబయి మహానగరపాలిక,
ముఖ్య కార్యాలయం, ముంబయి-400001.

తేది : 02-10-2018
సమయం : ఉదయం 10 గంటలు
స్థలం : ఛత్రపతి శివాజీ పార్క్, దాదర్, ముంబయి-400028.

కార్యక్రమంలో పాల్గొనుటకు విద్యార్థి నాయకునిగా అనుమతి కోరుతూ లేఖ.
అధికారలేఖ

కార్యక్రమంలో పాల్గొన్న స్నేహితుని అభినందిస్తూ లేఖ
అనధికారలేఖ

2. కథారచన

కథలు వినడం, చెప్పడం ఆబాలగోపాలానికి సంతోషం కలిగించే విషయం. విద్యార్థుల యొక్క ఊహాశక్తిని, సృజనాత్మకతను కూడా పెంపొందించే అంశం.

'కథయతి ఇతి కథా' అనగా చెప్పబడునది కథ. తమ ఊహాశక్తితో, సృజనశీలతతో కథలు సృష్టించబడుతాయి. కథలోని కథావస్తువు ఆ కథకు ప్రాణమువంటిది. కథాలేఖనం కల్పితాలపై ఆధారపడిన కళ. కథావస్తువు యొక్క విషయాన్ని, పాత్రలు, సంఘటనలను తర్కశుద్ధఆలోచనతో విస్తరించడమే కథారచన కౌశల్యం. ఈ కౌశల్యాన్ని అభివృద్ధి పరచడం 'కథా రచన' లేఖన కౌశల్యం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

ఉత్తమ కథాలేఖనానికై కింది అంశాలను గుర్తుంచుకోవాలి.

(1) కథకు తగిన శీర్షికపెట్టండి.
(2) శీర్షికనుబట్టి కథయొక్క విషయం (కథావస్తువు) తెలియాలి.
(3) సామెతలే శీర్షికగా ఉండనవసరం లేదు.
(4) సాధారణంగా గడచిన వృత్తాంతాన్ని చెబుతాము కాబట్టి కథను భూతకాలంలోరాయాలి. కానీ విద్యార్థులు తమ సొంతకల్పనాశక్తితో కథను రచించే స్వాతంత్ర్యం తీసుకోవచ్చు. ఉదా: కథలో ఇతః పూర్వము (ఫ్లాష్ బ్యాక్‌లో) జరిగిన ఘటనలను చెబుతున్నపుడు దానిని భూతకాలంలో, ఒకవేళ వర్తమానకాలంలోని సంఘటనలు అయితే వర్తమానకాలంలో చెప్పవచ్చు.
(5) సంఘటనలు, ప్రసంగాలనుబట్టి 'ఏ కాలంలో' రాయలో నిర్ణయించు కోవడం ముఖ్యం.
(6) కథ, కాలాను క్రమంలో చక్కగా ప్రవహించాలి. (సంఘటనల కూర్పులో అస్తవ్యస్తత ఉండకూడదు. ఒక సంఘటననుండి రెండవ సంఘటన చిక్కులు తొలగిపోతు ముందుకు సాగాలి.
(7) కథలలోని సందర్భాలనుబట్టి వాతావరణాన్ని ఏర్పరచాలి.
(8) కథావస్తువుననుసరించి పాత్రలు, సందర్భాన్ని, స్థలాన్ని బట్టి వారి సంభాషణలు, పాత్రలకు తగిన భాష ఉండాలి. ఉదా: ఆటస్థలంలో, ఇంట్లో, రాజదర్బారు ఇలా ఏ చోట సంఘటన జరిగిందో దాని ప్రకారం భాష, దానిశైలికూడా వేరుగా ఉంటుంది.

(9) లేఖనంలో మనం మన పరిసరాలలో సహజంగా ఉపయోగించే (తెలుగుభాషలోనే వాడుకభాషారూపాన్ని) భాషనుపయోగించవచ్చు.
(10) కథ ప్రారంభం మరియు ముగింపుల మధ్య సరియైన సంబంధం ఉండటం చాలా అవసరం.

కథా రచన మూల్యాంకానికి నిర్ణయించిన కృత్యాలు:

1) కథావస్తువును బట్టి కథాలేఖనం.
2) శీర్షికనుబట్టి కథాలేఖనం.
3) ఇచ్చిన పదాలను బట్టి కథాలేఖనం.
4) అసంపూర్ణమైన కథను పూర్తి చేయడం.
   అ) కథ పూర్వార్థం ఇచ్చిన ఉత్తరార్థం రాయుట.
   ఆ) ఉత్తరార్థం ఇచ్చిన పూర్వార్థం రాయుట.
5) అంశాలను బట్టి కథాలేఖనం.

కథాలేఖనానికై పైన ఇచ్చిన రకాలకంటే వేరుగా, సృజనశీల పద్ధతిలో కృత్యాలను కూర్చవచ్చు, ఇలాంటి వైవిధ్యపూరితమైన కృత్యాలను వెతికి, వాటిని అభ్యసించండి.

అభ్యాసం :

కింది ఇచ్చిన పదాల ఆధారంతో కథను రాయండి.

I



3. వ్యాస రచన

లేఖన కౌశల్యాభివృద్ధిలో అత్యంత ముఖ్యమైన అంశం వ్యాసరచన. 'వ్యాసం' అనగా ఏదేని విషయానికి అనుగుణంగా మన ఆలోచనలను అంశాల వారిగా కూర్చడం.

లేఖన కౌశల్య అభివృద్ధితోబాటు సూక్ష్మంగా ఆలోచించుట, పరిశీలనాశక్తి, సృజనశీలతలాంటి విశేష సామర్థ్యాల అభివృద్ధియే ఈ వ్యాసరచన అంశం వెనుకగల ఉద్దేశం.

వ్యాసరచనలో వ్యాసం రాసేవారి ఆలోచనలు ప్రతిబింబిస్తాయి. విషయానికనుగుణంగా సృజనశీలతను ప్రభావవంతంగా అవిష్కరించడమే వ్యాసరచన.

> పఠనం, గ్రహించుట, పరిశీలన, ఆలోచన, ఊహ మరియు అనుభవాలను సొంతమాటలలో వ్యక్తం చేయడం లేఖన–కౌశల్యాభివృద్ధి యొక్క ముఖ్య సూత్రం.

ఈ సంవత్సరం మీరు కృత్యపత్రికకై (1) ఆలోచనాత్మక, (2) వర్ణనాత్మక, (3) ఆత్మకథ వ్యాసరచన రకాలను అభ్యసించబోతున్నారు.

- **వ్యాసరచన నియమాలు :**

1) ఏ వ్యాసం వ్రాసినా దాని ప్రారంభం ఆకర్షణీయంగా ఆసక్తికరంగా ఉండాలి.
2) వ్యాసం యొక్క విషయాన్ని విస్తరించి రాయాలి. జాతీయాలు, సామెతలనుపయోగించి ప్రభావవంతంగా రచన చేయాలి.
3) వ్యాసం చదువరిని విషయానికి అనుగుణమైన ఆలోచనలవైపు తీసుకెళ్ళునట్లుగా ఉండాలి.

(1) ఆలోచనాత్మకం :

మనముందు జరుగుచున్న/జరిగినటువంటి ఏదేని ఘటన మనలను ఎల్లప్పుడు ఆలోచింపజేస్తుంది. ఆ ఘటన మన మనసుపై ప్రభావాన్ని కలుగజేస్తుంది. వాటిని గూర్చి మన ఆలోచనలు, భావనలు, అనుభవాలను పదాలతో కూర్చడం సంఘటన లేఖనం, అనుభవలేఖనంలో ఆశించడమైనది.

సూక్ష్మపరిశీలనాశక్తి, సంవేదనాశీలతలు సంఘటనవర్ణనకు అనుభవకథనానికై అంత్యంత ముఖ్యమైన సామర్థ్యాలు.

(2) వర్ణనాత్మకం

మనం ఏదైన కార్యక్రమంలో, సంఘటనలో పాల్గొన్నట్లుగా ఊహించి, ఆ కార్యక్రమం/సంఘటనయొక్క సవివర వర్ణన, దాని ఇతరసందర్భాలు (ఉదా: విహారయాత్ర అయినచో చారిత్రాత్మకసందర్భం, మన అనుభవాలు మరియు మనోభావాలు) వీటిని వర్ణించాలి. అనుభవలేఖనంలో తాను పొందిన అనుభవాలను మనోరంజకముగా, ప్రభావంతంగా చేయగల్గడం ముఖ్యం.

(3) ఆత్మకథ

1) ఆత్మకథ అనగా ఒకరకంగా పరకాయ ప్రవేశం.
2) ఇతరుల సుఖదుఃఖాలను గూర్చి ఆలోచించడం, వారి మనసును అర్థం చేసుకోవడం.
3) సజీవుల, నిర్జీవులయొక్క భావనలను ఊహించి వ్యక్తపరచటం.
4) ఆ ప్రాణి వస్తువున్న స్థానంలో మనమున్నట్లుగా ఊహించుకొని ఆ వస్తువు మనసు, ఆలోచన, భావనలు, సుఖదుఃఖాలను పదబంధం చేయడం ఆత్మకథ రచనలో మర్మం.
5) ఆత్మకథారచనలో భాష ఉత్తమపురుషలో ఏకవచనంలో (నేను మాట్లాడుచున్నాను/మట్లాడుతాను) ఉండాలి.
6) విషయానికి తగిన రీతిలో ఏదేని సుభాషితం, సంఘటన, ఘటనతో వ్యాసరచన ప్రారంభించవచ్చు. కానీ ప్రస్తావన/ప్రారంభం అత్యంత క్లుప్తంగా ఉండాలి.

అభ్యాసం :

1. ఆలోచనాత్మక వ్యాసం :

కింది చిత్రాల ఆధారంగా ఆలోచించి వ్యాసం రాయండి.



2. వర్ణనాత్మక వ్యాసం :

కింది అంశాల ఆధారంగా 'సింహగడ్' కోట విశేషాలను వర్ణిస్తూ వ్యాసం రాయండి.

- స్థలం
- కోట వర్ణన
- చరిత్ర
- ప్రస్తుత పరిస్థితి-నిర్వహణ
- నీకు కలిగిన అనుభూతి
- ముగింపు

3. ఆత్మకథ వ్యాసం :

కింది అంశాల ఆధారంగా 'భ్రమణ ధ్వని' (మొబైల్) ఆత్మకథను రాయండి.

- మొబైల్ జననం
- దశల వారిగా అభివృద్ధి
- లాభాలు
- నష్టాలు
- ముగింపు
- భవిష్యత్తు
- తీసుకోవలసిన జాగ్రత్తలు

4. ప్రకటన లేఖనం

నేటి పోటీ ప్రపంచంలో ప్రకటనలు అత్యంత ముఖ్యమైన అంశం. వాటి విజయంపైనే వస్తువు ఉత్పత్తి యొక్క క్రయవిక్రయాల హెచ్చు తగ్గులు ఆధారపడి ఉంటాయి. కనుక ఏదేని ఉత్పత్తియొక్క ప్రకటన తయారు చేయడం అత్యంత సృజనశీలతతో కూడిన కళ. దానిలో నైపుణ్యాన్ని సంపాదించడం ఈ వృత్తిలో విజయానికి అతిముఖ్యమైనది.

నేటి కంప్యూటర్ మరియు సాంకేతిక సమాచార యుగంలో ఇంటర్‌నెట్ మరియు చరవాణి (మొబైల్) మొదలగువాని సాంకేతిక విప్లవంవలన ప్రకటనల రంగం అధికంగా విస్తరించింది.

కింది తరగతిలో మీరు 'ప్రకటనలు' అను అంశాన్ని గూర్చి నేర్చుకొన్నారు. వాటిలో ప్రకటన భాష, ప్రకటనలోని ముఖ్యాంశము వీటిని గూర్చి నేర్చుకొన్నారు. ఇప్పుడు ఇంకా వివరంగా నేర్చుకోండి.

ప్రజల మనసులలో ఉత్పాదక వస్తువులపట్ల ఇష్టాన్ని కలుగజేయడం, దానివైపు ప్రజల దృష్టినాకర్షించడం ప్రకటనయొక్క ముఖ్య ఉద్దేశం.

- **ప్రకటన తయారుచేస్తున్నపుడు కింది ముఖ్యమైన అంశాలను దృష్టియందుంచుకోవాలి.**

1) 'అతి తక్కువ పదాలతో అత్యధిక ప్రభావవంతమైన భావ వ్యక్తీకరణ' _______ ఇది ఉత్తమ ప్రకటన సూత్రం.
2) ప్రకటనవైపు దృష్టి నాకర్షించునట్లుగా , ఆసక్తికరమైన పదాలలోరచన చేయాలి.
3) ప్రకటన దేనికి సంబంధించినదో స్పష్టంగా మరియు ఆకర్షణీయంగా తెలియ జేయాలి.
4) అలంకారాలు, కవితాత్మకంగా, ప్రభావవంతమైన పదాలనుపయోగించి ప్రకటనను అధిక ఆకర్షణీయంగా తయారుచేయాలి.
5) సతతము మారే వినియోగదారుల ఇష్టాలు, అలవాట్లు, ఫ్యాషన్ దృష్టిలోనుంచుకోవటం అవసరం. ప్రకటనలో ఇవి ప్రతిబింబించాలి.
6) ప్రకటనలోని వస్తువు ఉత్పత్తియొక్క నాణ్యత అత్యంత ముఖ్యం. అందువల్ల తగ్గింపు/రాయితీని ఉల్లేఖించవలసిన అవసరంలేదు.
7) ప్రకటనలో సంప్రదించవలసిన స్థలం, చిరునామా, ఫోను/మొబైల్ నంబర్, ఈ-మెయిల్ఐడీలను స్పష్టంగా ఉల్లేఖించడం అవసరం.

కృత్యపత్రికలో ...

(1) ప్రకటన కలంతో రాయాలి. (2) పెన్సిల్‌నుపయోగించరాదు. (3) చిత్రాలు గీయవలసిన అవసరం లేదు.

- ప్రకటన లేఖనం యొక్క మూల్యాంకన కృత్యం
- అంశాలను బట్టి ప్రకటన రాయడం.

- ప్రకటననిచ్చి దానిపై కృత్యాన్ని సాధించడం.
- ఇచ్చిన ప్రకటనను అధిక ఆకర్షణీయమైన పద్ధతిలో పునర్లేఖనం చేయడం.

ఇవేగాకుండా ఇతర సృజనాత్మక పద్ధతిలో కృత్యాలను పొందుపరచవచ్చు. ఇలాంటి సృజనాత్మక వైవిధ్య పూరితమైన కృత్యాలను శోధించి, అభ్యసించండి.

అభ్యాసం :

కింది ప్రకటన చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.



ప్రశ్నలు :

1) పై ప్రకటన దేనిగురించి ఇవ్వబడింది?
2) ద్వితీయ బహుమతి విలువ ఎంత?
3) వివరాలకు ఎవరిని సంప్రదించవలెను?
4) విజ్ఞానప్రదర్శన ఏయే తేదీలలో జరపబోతున్నారు?
5) విజ్ఞాన ప్రదర్శన అంశములలో నీవు ప్రదర్శించబోయే అంశం ఏమిటి?

5. సంక్షిప్త లేఖనం

'మీరు చెప్పదలచుకొన్నది క్లుప్తంగా చెప్పండి' అనే మాట చాలసార్లు వింటూ ఉంటాము. నేటి ఉరుకుల పరుగుల యుగంలో ఏదేని విస్తృత లేఖనానికి బదులు దానిలోని సంపూర్ణ ఉద్దేశం దృష్టికివచ్చు పద్ధతిలో సంక్షిప్తరూపాన్నివ్వడం అత్యంత నైపుణ్యంతో కూడినది. ఈ నైపుణ్యాన్ని అభివృద్ధి పరచు ఉద్దేశంతో సారాంశలేఖనం అనే అంశాన్ని పాఠ్యప్రణాళికలో పొందు పరచటం జరిగింది.

సారాంశ లేఖన సోపానాలు :

1) ఇచ్చిన పరిచ్ఛేదాన్ని చదవడం :

2) పరిచ్ఛేదంలోని ముఖ్య ఉద్దేశమును గ్రహించడం.

3) గ్రహించిన హేతువును సొంతమాటలలో క్లుప్తంగా చెప్పటం.

4) తక్కువ పదాలలో పరిచ్ఛేదంలోని ఉద్దేశం పూర్తిగా తెలిసేలా రాయడం.

ఇచ్చిన పరిచ్ఛేదంలోని సారాంశాన్ని సొంతమాటల్లో క్లుప్తంగా (తక్కువ పదాలతో) మూడవ వంతుకు కుదించి రాయాలి.

కృత్య పత్రికలో సారాంశలేఖనానికై ఇచ్చిన పరిచ్ఛేదం 100 నుండి 120 పదాలలో ఉంటుంది. పరిచ్ఛేదంలోని సంపూర్ణ ఉద్దేశ్యం దృష్టికివచ్చునట్లు సొంతమాటలలో అతి తక్కువ పదాలలో రాయాలి. పదాలు లెక్కించి నమోదు చేయవలసిన అవసరం లేదు.

అభ్యాసం :

కింది గద్యమును చదివి మూడవ వంతునకు కుదించి రాయండి.

ఒక పెద్ద చెరువు. ఆ చెరువులో దూరదర్శి, కుశాగ్రబుద్ధి, మందబుద్ధి అనే మూడు చేపలు నివసిస్తుండేవి. ఇవి మంచి మిత్రులు, దూరదర్శి చాలా తెలివైనది. దూరదృష్టికలది. కుశాగ్రబుద్ధి సమయస్ఫూర్తి కలది. మందబుద్ధికి తెలివి చాలా తక్కువ. ఇవి కలిసిమెలిసి ఎంతో సరదాగా చెరువులో ఆడుకునేవి. ఒక సంవత్సరం వర్షాలు లేకపోవడంతో చెరువులు, బావులు, గుంటలు ఎండిపోయాయి. ఈ మూడు చేపలున్న చెరువులో కూడా నీరు బాగా తగ్గిపోయింది. అది గమనించిన దూరదర్శి తన స్నేహితులతో ''మిత్రులారా! వర్షాలు లేకుండా చెరువులన్నీ ఎండిపోతున్నాయి. కొద్ది రోజులకు మనం నివసిస్తున్న చెరువు కూడా ఎండిపోతుంది. కాబట్టి మనం వేరొక చెరువుకు వెళ్ళిపోదాం! లేకపోతే జాలర్లు మనల్ని పట్టుకుంటారు'' అని హితబోధ చేసింది. కుశాగ్రబుద్ధి, మందబుద్ధి తన మిత్రుని మాటల్ని ఏమాత్రం పట్టించుకోలేదు. ఆపద వచ్చినప్పుడు చూసుకోవచ్చు అని నిర్లక్ష్యంగా ఊరకుండిపోయాయి.

6. నివేదిక లేఖనం

నివేదిక (రిపోర్టు) అనగా ఒక సంఘటన లేదా కార్యక్రమం జరిగిన విధానాన్ని సంక్షిప్తంగా తెలియజేస్తూ రాయటం.

సూచనలు/గమనించ దగిన అంశాలు :

1) దీనిని ఒక పరిచ్ఛేదంగా మాత్రమే రాయాలి.

2) సంఘటన లేదా కార్యక్రమం జరిగిన తేదీ, రోజు, సంవత్సరం, జరిగిన ప్రదేశం తప్పనిసరిగా ముందు రాయాలి.

3) ఎవరెవరు హాజరయ్యారు, ఏ విధంగా జరిగింది అనే అంశాల వివరణ క్రమంగా రాయాలి.

4) జరిగిన కార్యక్రమ విశేషాలను యథాతథంగా క్రమానుగతంగా రాయాలి. కల్పనలు ఉండరాదు. వ్యావహారిక భాషలో, వాస్తవికత ఉట్టిపడే విధంగా, దృశ్యాలు కళ్ళకు కట్టినట్లుగా రాయాలి.

5) నివేదిక ఎవరికొరకు రాస్తున్నది –

నివేదిక ఉద్దేశ్యం, అది ఎందుకు అవసరం –

నివేదికలో ఉండవలసిన ముఖ్యసమాచారం మొదలగు వానిని దృష్టిలో పెట్టుకొని రాయాలి.

అభ్యాసం :

కింది అంశాల ఆధారంగా మీ పాఠశాల విహారయాత్ర గురించి ఒక నివేదిక రాసి తరగతి ఉపాధ్యాయిని/ఉపాధ్యాయునికి సమర్పించండి.



7. సామెత వివరణ లేఖనం

పెద్దలు అనుభవంతో ఆలంకారికంగా చెప్పిన మాటలే సామెతలు. విషయాన్ని తక్కువ మాటలలో చమత్కారంగా మనస్సుకు సూటిగా తాకేలా చెబుతుంది సామెత.

సామెత వివరించి లేఖనం చేయునపుడు –

- ప్రారంభంలో సామెత అర్థాన్ని/పుట్టు పూర్వోత్తరాలను రాయాలి.
- ఒకవేళ సామెతకు సంబంధించిన కథ ఏదైనా ఉంటే రాయాలి.
- విషయాన్ని తక్కువ మాటల్లో రాయాలి.
- అర్థవంతంగా చక్కగా ముగింపు రాయాలి.

అభ్యాసం :

1. 'ఐకమత్యమే మహాబలం'

- ఇచ్చిన సామెత ఏ విషయాన్ని తెలియజేస్తుంది.
- అర్థ వివరణ
- సామెతకు తగ్గ కథ.
- ముగింపు

2. ''ఇంటి గుట్టు లంకకు చేటు''

- సామెత పుట్టుక
- సామెత అర్థం
- ఏ సందర్భంలో ఉపయోగిస్తారు.
- వివరణ
- ముగింపు









- पाठ्यपुस्तक मंडळाची वैशिष्ट्यपूर्ण पाठ्येत्तर प्रकाशने.
- नामवंत लेखक, कवी, विचारवंत यांच्या साहित्याचा समावेश.
- शालेय स्तरावर पूरक वाचनासाठी उपयुक्त.

पुस्तक मागणीसाठी www.ebalbharati.in, www.balbharati.in संकेत स्थळावर भेट द्या.

साहित्य पाठ्यपुस्तक मंडळाच्या विभागीय भांडारांमध्ये विक्रीसाठी उपलब्ध आहे.

ebalbharati

विभागीय भांडारे संपर्क क्रमांक : पुणे - ☎ २५६५९४६५, कोल्हापूर- ☎ २४६८५७६, मुंबई (गोरेगाव) - ☎ २८७७१८४२, पनवेल - ☎ २७४६२६४६५, नाशिक - ☎ २३९१५११, औरंगाबाद - ☎ २३३२१७१, नागपूर - ☎ २५४७७१६/२५२३०७८, लातूर - ☎ २२०९३०, अमरावती - ☎ २५३०९६५

మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ. పుణె.

तेलुगु कुमारभारती इयत्ता दहावी (तेलुगु माध्यम) ₹ 73.00